సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 297

శనివారం 18-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'




ఇంటింటా లక్ష్మీకళ

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపేవాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడిపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పదిహేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

–ఫ్యామిలీలో

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 297
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'



గర్భిణులకు రూ. 21 వేలు

ఢిల్లీలో అధికారంలోకొస్తే గర్భిణులకు రూ. 21 వేలు, మహిళలకు ప్రతినెలా రూ. 2,500 చొప్పున ఇస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు.

- వివరాలు 6లో▶



31 నుంచి బడ్జెట్ సమావేశాలు

పార్లమెంట్ మొదటి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31న మొదలై ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

- వివరాలు 6లో▶

6 రైల్వే లైన్లతో లింక్

ఆరు ప్రాంతాల్లోని రైల్వే మార్గాలను క్రాస్ చేయనున్న ఔటర్ రింగ్ రైలు



- ఈ ఆరుచోట్లా ఇంటర్‌ఛేంజ్ రైల్ ఓవర్ రైలు వంతెనలు
- హైదరాబాద్ నగరానికి 75 కి.మీ దూరంలో నిర్మాణం దిశగా అడుగులు
- కొత్తగా చేపట్టే ట్రిపుల్ ఆర్‌కు ఆవల 2-4 కి.మీ దూరంగా రింగు రైలు లైన్
- ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి.. లైడార్ ద్వారా ప్రాథమిక అలైన్‌మెంట్ సిద్ధం
- ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంటు తేలాక ఫైనల్ రూటు ఖరారు

ప్రాజెక్టు వ్యయం రూ.13,500 కోట్ల వరకు అవుతుందని ప్రాథమిక అంచనా	జూన్ నాటికి రైల్వే బోర్డుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక.. త్వరలో ఫైనల్ ట్రాఫిక్ సర్వే

సాక్షి, హైదరాబాద్: దేశంలో మరెక్కడా లేనివిధంగా హైదరాబాద్ నగరానికి 75 కి.మీ దూరంలో తొలి ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. కొత్తగా చేపట్టబోయే రీజినల్ రింగు రోడ్డుకు అవతల దీన్ని చేపట్టనున్నారు. ఆరు ప్రాంతాల్లోని రైల్వే లైన్లను ఇది క్రాస్ చేస్తుంది. అంటే ఆరు రైలు మార్గాలు దీనితో అనుసంధానమవుతాయన్న మాట. ఈ ప్రాజెక్టును గతంలోనే ప్రతిపాదించినా సాధ్యాసాధ్యాలను తేల్చటంలో జాప్యం జరిగింది. దీంతో ఈ ప్రతిపాదన నిలిచిపోయిందనే వార్తలు వినిపించాయి. అయితే తాజాగా ఈ ప్రతిపాదనకు సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసిన రైల్వే శాఖ, దాని అలైన్‌మెంటు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ కసరత్తు ప్రారంభించింది. జూన్ నాటికి డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు సమర్పించనుంది. ఫైనల్ లొకేషన్ సర్వేలో భాగంగా ఇప్పటికే లైడార్ (కాంతి కిరణాల) ఆధారిత సర్వే పూర్తి చేసి ప్రాథమిక అలైన్‌మెంటును సిద్ధం చేసింది. దీని ప్రకారం ప్రాజెక్టు మిగతా 15వ పేజీలో ▶

అనుసంధానం ఇక్కడే..



- వలిగొండ వద్ద సికింద్రాబాద్–గుంటూరు రైల్వేలైన్‌ను,
- వంగపల్లి వద్ద సికింద్రాబాద్–వరంగల్ లైన్‌ను,
- గుల్లగూడ వద్ద సికింద్రాబాద్–తాండూరు లైన్‌ను,
- మాసాయిపేట వద్ద సికింద్రాబాద్–నిజామాబాద్ లైన్‌ను,
- బాలానగర్ వద్ద కాచిగూడ–మహబూబ్‌నగర్ లైన్‌ను
- గజ్వేల్ వద్ద సికింద్రాబాద్–సిద్దిపేట లైన్‌ను రింగ్ రైలు మార్గం క్రాస్ చేస్తుంది.
- ఈ ఆరు ప్రాంతాల్లోని రైల్వే లైన్లను ఔటర్ రింగ్ రైలు క్రాస్ చేసే చోట రైల్ ఓవర్ రైల్ బ్రిడ్జీలను నిర్మిస్తారు.

భూసేకరణ పెద్ద సవాల్

ట్రిపుల్ ఆర్‌కు భూములిచ్చేందుకు కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ససేమిరా అంటున్నారు. కొన్నిచోట్ల ప్రజలను అతి కష్టంమీద ఒప్పించారు. ఇప్పుడు ఔటర్ రింగ్ రైల్‌కు కొత్తగా భూసేకరణ అంటే ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమయ్యే అవకాశం ఉంది. రకరకాల ప్రాజెక్టులతో పలు దఫాలుగా భూములు కోల్పోయామని, ఇక కొత్తగా ఏ ప్రాజెక్టుకూ భూములిచ్చేది లేదని చాలా గ్రామాల్లో ప్రజలు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో రింగ్ రైలుకు భూములు సేకరించటం కత్తిమీద సామే అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి 'అర్జున' అవార్డు అందుకుంటున్న దీప్తి



ప్రతిభకు పట్టం..

2024 జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన భారత క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2024 సంవత్సరానికిగాను జాతీయ క్రీడా పురస్కారాలు అందజేశారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన మహిళా స్టార్ షూటర్ మనూ భాకర్ (హరియాణా), ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ (తమిళనాడు), భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (పంజాబ్), పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్ (ఉత్తరప్రదేశ్)లకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' పురస్కారం దక్కింది. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా తెలంగాణ అథ్లెట్ దీప్తి 'అర్జున' అవార్డు అందుకున్నారు. 17లో

బిహార్ గ్యాంగ్ పనేనా?

బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పులపై పోలీసుల అనుమానం

- టికెట్ బుకింగ్ సమయంలో దుండగులు ఇచ్చింది యూపీ నంబర్
- మదీనాలో రెండు ట్రాలీ బ్యాగుల కొనుగోలు
- మూడు రాష్ట్రాల్లో 10 ప్రత్యేక బృందాల గాలింపు



తెలంగాణ సరిహద్దు గ్రామం సుల్తాన్‌పూర్‌లో వాహనంపై వెళ్తున్న దుండగులు

సాక్షి, హైదరాబాద్ : బీదర్‌లో డబ్బు దోచుకోవడానికి.. పట్టుబడతామనే భయంతో అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపిన దుండగులు బిహార్‌కు చెందిన వారై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని బిహార్‌కు చెందిన పాతనేరగాడు మనీశ్‌కుష్వాడగా గుర్తించినట్టు తెలిసింది. గురువారం చోటు చేసుకున్న ఈ ఉదంతాల్లో నిందితులను పట్టుకోవడానికి పోలీసులు పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపగా, శుక్రవారం తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, బిహార్‌ల్లో గాలిస్తున్నా యి. మరోపక్క కర్ణాటక పోలీసులు నగరానికి చేరుకొని కేసు దర్యాప్తులో పాలుపంచుకున్నారు.

ఆటోలో ఎంజీబీఎస్ వైపు నుంచి ..: బీదర్‌లో దుండగులిద్దరూ 'ఏపీ'రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న బైక్‌పై రూ.93 లక్షలున్న అల్యూమినియం డబ్బా ఎత్తుకొని ఉడాయించారు. అక్కడ నుంచి హైదరాబాద్ వైపు వచ్చి మార్గమధ్యలో ఆ డబ్బును బ్యాగ్‌లోకి మార్చుకున్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామమైన సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామంలోని మిగతా 14వ పేజీలో ▶

సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయండి



సబ్‌ప్లాన్ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- ఎస్సీ, ఎస్టీ రైతుల ఆదాయాలు పెంచాలి
- పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలులో భాగంగా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులను నూరు శాతం ఖర్చు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేటగిరీలవారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెలా వెల్లడించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సబ్‌ప్లాన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో ఈ నెల 23న నిర్వహించబోయే సమావేశానికి హాజరు కావాలని శాఖాధిపతులను ఆదేశించారు. బడ్జెటేతర నిధుల వ్యయంలోనూ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం జనాభా దామాషాలో మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఫిబ్రవరిలోనే.. లేదంటే మే, జూన్!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారుల అంచనా



- పబ్లిక్ పరీక్షలు, ఎండల తీవ్రతతో మార్చి, ఏప్రిల్‌లో కష్టమని వెల్లడి.. కేబినెట్ అనుమతిస్తే 15–20 రోజుల్లో ప్రక్రియ పూర్తికి సన్నాహాలు
- ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించిన ఉన్నతాధికారులు

2లో

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 18-1-2025



జెండర్ ఈక్వాలిటీ



ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఇంటింటా లక్ష్మీకళ

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడిపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మీ యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పదిహేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లి నట్లే. అయితే కథ అక్కడితో ముగిసి పోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏయస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు. ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడబిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మీ యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మీ యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మీ యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మీ యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మీ యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్, సాక్షి ప్రతినిధి కరీంనగర్

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా



డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని అంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్తాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.





పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సహజ సిద్ధంగా...

ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ, విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త










• నగధగలు ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

- ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.
- నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.
- ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.
- రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సోషల్ మీడియా

బామ్మ కోసం... ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!





బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్లనీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

> సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా



కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు; టొమాటో ముక్కలు– కప్పు; వెల్లుల్లి రేకలు– 4; అల్లం తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2; జీడిపప్పు– పది పలుకులు; పాలు– అర కప్పు; మీగడ – పావు కప్పు; కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు – టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; వెన్న – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; యాలకులు – 2; లవంగం – 1; దాల్చిన చెక్క – అంగుళం ముక్క;

తయారీ: • పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. • బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. • ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; పచ్చి బఠాణీ– పావు కప్పు; నీరు – 3 కప్పులు; బిర్యానీ ఆకు – ఒకటి; యాలక్కాయ – 1; లవంగం – 1; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి– 1 (నిలువుగా చీరాలి); షాజీరా– టీ స్పూన్.

తయారీ: • బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. • నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 297

శనివారం 18-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గీత దాటితే వాతే!

భారత క్రికెటర్లకు బీసీసీఐ కొత్త ప్రొటోకాల్. పాటించని వారిపై కఠిన చర్యలు -17లో



ఈవీ రంగం @ 8 రెట్లు

2030 నాటికి సాధ్యమన్న ప్రధాని మోదీ భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో మరూ -17లో



స్పేస్‌ఎక్స్ ప్రయోగం విఫలం

'స్పేస్‌ఎక్స్' చేపట్టిన 'స్టార్‌షిప్' ప్రయోగం విఫలమైంది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే రాకెట్ పేలిపోయింది.


- వివరాలు 6లో▶



ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు

అల్ ఖదీర్ ట్రస్ట్ భూ అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు శుక్రవారం 14 ఏళ్ల జైలు శిక్ష పడింది.

- వివరాలు 6లో▶



దుండగుడి కోసం వేట

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడికి పాల్పడిన దుండగుడిని పట్టుకొనేందుకు ముంబై పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

- వివరాలు 6లో▶



ట్రంప్ ప్రమాణానికి ఏర్పాట్లు

ట్రంప్ రెండోసారి శ్వేతసౌధంలో అడుగు పెట్టేందుకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.

- వివరాలు 6లో▶

‘సింగపూర్’ స్కిల్స్

యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీలో సింగపూర్ సంస్థ ఐటీఈ పాఠ్యాంశాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం విదేశీ పర్యటనలో కుదిరిన ఒప్పందం

సంస్థ అందిస్తున్న కోర్సులు, ఉన్న సదుపాయాలు పరిశీలన

20 రంగాలకు చెందిన నిపుణులు, సంస్థ సిబ్బందితో చర్చలు

రాష్ట్ర విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణపై ఎంఓయూ



ఐటీఈ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విదేశీ పర్యటనలో భాగంగా సింగపూర్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం కీలక ఒప్పందం చేసుకుంది. నైపుణ్య అభివృద్ధిలో పరస్పర సహకారం, శిక్షణకు సంబంధించి.. సింగపూర్ ప్రభుత్వ విద్యాసంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ), రాష్ట్రానికి చెందిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీల మధ్య ఈ పరస్పర అవగాహన (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను స్కిల్స్ యూనివర్సిటీలో బోధించనున్నారు.

శుక్రవారం సింగపూర్‌కు చేరుకున్న రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్ టీమ్'కు అక్కడి ప్రవాస తెలంగాణ వాసులు స్వాగతం పలికారు. అనంతరం సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావుతో కూడిన ప్రతినిధి బృందం ఐటీఈ ప్రాంగణాన్ని సందర్శించింది.


కోర్సులు, సదుపాయాల పరిశీలన

ఐటీఈ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులు, అధునాతన సదుపాయాలను రాష్ట్ర బృందం పరిశీలించింది. అక్కడ శిక్షణ ఇస్తున్న సుమారు 20 రంగాలకు చెందిన నిపుణులు, సంస్థ సిబ్బందితో మాట్లాడారు. ఈ నేపథ్యంలో తమ రాష్ట్రంలోని స్కిల్స్ యూనివర్సిటీకి సహకరించాలని ఐటీఈ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి కోరారు. వర్సిటీ

మిగతా 12వ పేజీలో ▶

ఒప్పందంతో లాభం ఇలా..

- ఐటీఈ పాఠాలను స్కిల్స్ వర్సిటీలో బోధిస్తారు.
- టెన్త్ విద్యార్థులు మొదలుకుని చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో ఉద్యోగ నైపుణ్యాలపై సింగపూర్ సంస్థ శిక్షణనిస్తుంది.
- 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్'అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈకి 5 వేల పరిశ్రమలతో భాగస్వామ్య ఒప్పందాలు ఉండగా, ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు.
- ప్రస్తుత ఒప్పందంతో స్కిల్స్ వర్సిటీలో వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్‌తో పాటు క్యాంపస్ శిక్షణ దొరుకుతుంది. పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో జరిగిన రైతు దీక్ష సభలో ప్రసంగిస్తున్న కేటీఆర్. చిత్రంలో కౌశిక్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, సబిత తదితరులు

త్వరలోనే ‘ఆ పది’కి ఉప ఎన్నికలు!

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట ఉప ఎన్నికలు తప్పవు

- ప్రతి రైతుకు రేవంత్ ప్రభుత్వం ఎకరానికి రూ.17,500 బాకీ
- ఒక్కో మహిళకు ఇప్పటికే రూ.30 వేలు బకాయి పడ్డ సర్కారు
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను వీటి కోసం నిలదీయండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బీఆర్ఎస్ రైతు దీక్ష

సాక్షి, రంగారెడ్డి జిల్లా/షాబాద్: బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో త్వరలోనే ఉప ఎన్నికలు రాబోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా ఈ నెల 26 నుంచి రైతులందరికీ ఎకరానికి రూ.17,500, కౌలు రైతులకు రూ.15,000, భూమిలేని రైతు కూలీలకు రూ.12,000 ఇవ్వాలనే డిమాండ్‌తో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన 'రైతు దీక్ష'కు

మిగతా 12వ పేజీలో ▶

దోపిడీ ముఠా తిరుగుతోంది

సీఎం ఏర్పాటు చేసిన ఈ ముఠా కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేస్తోంది : కేటీఆర్ 12లో

న్యూస్‌రీల్

కోర్టు ఆదేశించినా.. ధిక్కరణ!



హైకోర్టు తీర్పుల అమల్లో కొందరు అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. శిక్షలు విధించినా వారిలో మార్పు రావడంలేదు. కోర్టు ధిక్కరణ కేసుల్లో శిక్షలు పడినా అప్పీళ్లలో తప్పించుకుంటున్నారు. దీంతో బాధితులు మరోసారి కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోంది.

- వివరాలు 12లో▶

గ్రూప్-2 పరీక్షల ప్రాథమిక ‘కీ’ విడుదల



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–2 ఉద్యోగాల భర్తీలో భాగంగా గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన అర్హత పరీక్షలకు సంబంధించిన 'కీ'లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో నాలుగు సెషన్లలో జరిగిన పేపర్–1 నుంచి పేపర్–4 వరకు అన్ని ప్రశ్నపత్రాలు, ప్రాథమిక జవాబు పత్రాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

- వివరాలు 2లో▶

డిస్కంలలో 3,260 కొత్త కొలువులు



రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో కొలువుల జాతర ప్రారంభం కానుంది. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లలో మొత్తం 3,260 ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు రెండు డిస్కంలు త్వరలో ఏకకాలంలో నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశాలున్నాయి.

- వివరాలు 15లో▶

స్టార్టప్ కుంభమేళా

ఏప్రిల్ మొదటి వారంలో ఢిల్లీ వేదికగా 'మహాకుంభ్ 5.0'

- 2047 నాటికి భారత్‌లో స్టార్టప్‌లు సాధించాల్సిన లక్ష్యాలపై దిశానిర్దేశం
- దేశంలో 1,54,719 స్టార్టప్‌లు.. 17 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు
- స్టార్టప్‌ల సంఖ్యలో మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక పైచేయి
- దేశంలో మహిళల సారథ్యంలో నడుస్తున్న స్టార్టప్‌లు 48 శాతం

15లో

‘ఆపుకోలేని’ ఆవేదన!

రైలింజన్లలో వాష్‌రూంలు లేక మహిళా లోకోపైలట్ల నరకయాతన

- దీంతో కొందరు నీళ్లు తాగకుండా డ్యూటీకి వస్తున్న వైనం.. మరికొందరైతే అడల్ట్ డైపర్లు వాడుతున్న దుస్థితి..
- ఇలా చేస్తే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు వస్తాయంటున్న వైద్యులు
- ఈ ఇబ్బందులు పడలేక స్టేషన్ డ్యూటీలు కోరుతున్న లోకోపైలట్లు
- వాష్‌రూంల ఏర్పాటుకు 2016లోనే జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం.. అమలు కాని తీరు..
- కమిటీ వేశారు.. ఫలితం లేదు: ఎస్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య

15లో



మిడిలేజీ మహాలేజీ!

కనీస శారీరక శ్రమ చేయటానికీ నిరాసక్తత

- వ్యాయామానికి దూరంగా 45.4 శాతం మంది
- ది లాన్సెట్ జర్నల్ నివేదికలో వెల్లడి..
- మిమ్మల్ని మీరు ఫిట్‌గా ఉంచుకోవడం ఎలా?
- ఈ వయసులో వ్యాయామం ఎలా ప్రారంభించాలి?
- అన్నీ ప్రశ్నలే అయితే... ఈ సమాధానం మీ కోసమే!

2లో

మిడిలేజీ.. మహాలేజీ!

కనీస శారీరక శ్రమ చేయటానికీ నిరాసక్తత.. వ్యాయామానికి దూరంగా 45.4శాతం మంది

ది లాన్సెట్ జర్నల్ నివేదికలో వెల్లడి.. మిమ్మల్ని మీరు ఫిట్‌గా ఉంచుకోవడం ఎలా?

ఈ వయసులో వ్యాయామం ఎలా ప్రారంభించాలి?

అన్నీ ప్రశ్నలే అయితే... ఈ సమాధానం మీ కోసమే!

సాక్షి, హైదరాబాద్: భారతీయులు మరీ బద్ధకిస్తున్నారు. ముఖ్యంగా మధ్య వయస్కులు రోజూ నాలుగు అడుగులు నడిచేందుకూ ఆసక్తి చూపటంలేదట. ప్రముఖ జర్నల్ 'ది లాన్సెట్' గ్లోబల్ హెల్త్‌లో ఇటీవల ప్రచురించిన అధ్యయన నివేదికలో భారతీయుల్లో శారీరక వ్యాయామం తీరుతెన్నుల గురించి వెల్లడించారు. మధ్య వయస్కుల్లో సగం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్దేశించినంత మేర కూడా శారీరక శ్రమ చేయడం లేదని తేలింది. ఈ అధ్యయనాన్ని 197 దేశాల్లో 2000 - 2022 మధ్య నిర్వహించారు. మనదేశంలో 2000 సంవత్సరంలో 22.4 శాతం మంది మధ్య వయస్కులు శారీరక శ్రమకు పూర్తిగా దూరంగా ఉండగా... ఆ సంఖ్య 2022 నాటికి 45.4 శాతానికి పెరగటం ఆందోళన కలిగిస్తోంది. శారీరక శ్రమ చేయకుంటే శరీరం వ్యాధులకు నివాసంగా మారిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎముకలు బలంగా ఉండాలంటే..

వయసు పైబడుతున్న కొద్దీ శారీరకంగా బలహీనంగా మారటం సాధారణమే. వయసు పెరుగుతున్న కొద్దీ ఎముకల్లోని సాంద్రత (బోన్ డెన్సిటీ) తగ్గిపోతూ ఉంటుంది. ఇది ఆర్థరైటిస్‌కు, ఎముకలు బోలుగా మారే ఆస్టియోపోరోసిస్ కండిషన్‌కు దారి తీస్తుంది. దీనివల్ల చిన్నపాటి దెబ్బలకే ఎముకలు విరిగే ముప్పు పెరుగుతుంది. ఎంతో కొంత శారీరక శ్రమ చేస్తూ ఉంటేనే ఎముకల సాంద్రత తగ్గే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఎముకలు దీర్ఘకాలం మంచి సాంద్రతతో ఆరోగ్యంగా ఉంటాయి. చిన్న చిన్న వ్యాయామాలు మొదలుపెట్టి క్రమంగా వాటిని పెంచుకుంటూ పోతే ఫిట్‌నెస్ పెరగడమే కాకుండా.. శ్రమ ఎక్కువైనప్పటికీ అలసట లేకుండా పనులు చేయడం సాధ్యమవుతుంది. మొదట కొద్దిగా నడక వంటి వ్యాయామం చేయండి. క్రమంగా సమయాన్ని పెంచుకుంటూ రోజూ 45 నుంచి 60 నిమిషాలు నడవండి.

సమతులాహారంతో మంచి ఫిట్‌నెస్

శారీరక వ్యాయామంతోపాటు మంచి ఆహారం తీసుకుంటేనే ఫిట్‌నెస్ సాధించటం వీలవుతుంది. అన్ని పోషకాలూ ఉన్న సమతులాహారం తీసుకోవాలి. యవ్వనంలో ఉన్నప్పుడు ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నా పెద్ద తేడా అనిపించదు. మధ్య వయసులో మాత్రం ఆహారం విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. కూరగాయలు, ఆకు కూరలు, ప్రొటీన్లతో కూడిన ఆహారంతోపాటు తాజా పండ్లు తీసుకోవాలి. దీంతో దేహానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు అందుతాయి. ప్రొటీన్ల వల్ల కండరాల్లోని గాయాలు ఎప్పటికప్పుడు రిపేర్ అవుతాయి. పిండి పదార్థాలను దేహశక్తి అవసరాల మేరకు మాత్రమే మితంగా తీసుకోవాలి. వాటికి బదులు బాదం వంటి నట్స్‌ను తీసుకోవడం మేలు. జీర్ణాశయం ఆరోగ్యం బాగుంటేనే నడి వయసులో వ్యాధి నిరోధక శక్తి బాగుంటుంది. అందుకోసం ఆహారంలో పెరుగు, మజ్జిగ తీసుకుంటూ ఉండాలి.

చాలామందికి కష్టపడి పనిచేయడం అంతగా ఇష్టం ఉండదు. కొద్దిసేపు శ్రమచేయగానే దేహం, మనసూ విశ్రాంతి కోరతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాయామం కోసం ఎవరిని వారు ఉత్సాహపరచుకోవడం అవసరం. దీన్నే సెల్ఫ్ మోటివేషన్ అంటారు. కొన్నిసార్లు బోర్‌గా అనిపించడం, అలాగే ఎక్కడికైనా టూర్‌కు వెళ్లడం వంటి చర్యలతో రోజువారీ పనుల్లో ఆటంకాలు వస్తుంటాయి. అలాంటప్పుడు నడక వంటి పనులు చేయాలి. ఎక్కడికి వెళ్లినా నడకకు ఎలాంటి పరికరాలూ, ఉపకరణాలూ అక్కర్లేదు.



మంచి ఫిట్‌నెస్ కోసం ఎంత వర్కవుట్ అవసరమంటే?

- డబ్ల్యూహెచ్‌వో వివరాలను బట్టి యుక్తవయసు దాటిన ప్రతి ఒక్కరూ ప్రతివారం కనీసం 150 నిమిషాల పాటు తేలికపాటి వ్యాయామం లేదా 75 నిమిషాల శ్రమతో కూడిన వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి.
- ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించి, అనువైన వ్యాయామాలు తెలుసుకోవాలి. అవి చేస్తున్న సమయంలో ఏదైనా అసౌకర్యం అనిపిస్తే వెంటనే వ్యాయామం నిలిపివేసి త్వరగా డాక్టర్‌ను సంప్రదించాలి. వైద్యులు సూచించే జాగ్రత్తలు పాటిస్తూ వ్యాయామం ప్రారంభించాలి.
- తేలికపాటి వ్యాయామాలతో మొదలుపెట్టి క్రమంగా తీవ్రత పెంచుకుంటూ పోవాలి. అన్నిటికంటే నడక లేదా ఈత చాలా మంచి వ్యాయామాలు.

భాగస్వామి పాత్ర కీలకం..

ఎవరైనా తోడుంటే జిమ్‌కు లేదా ఆరుబయట నడకకు వెళ్లటానికి ఉత్సాహం వస్తుంది. ఆ తోడు జీవిత భాగస్వామి అయితే మరీ మంచిది. మాట్లాడుకోడానికి కామన్ విషయాలు ఉంటాయి కాబట్టి శ్రమ తెలియకుండా వ్యాయామం చేయవచ్చు. జీవిత భాగస్వామి కాకుంటే.. వ్యాయామం పట్ల ఆసక్తి ఉన్నవారితో పరిచయం పెంచుకొని వ్యాయామ భాగస్వామిగా మార్చుకోవాలి. ఆ స్నేహంతో దగ్గర్లోని ఫిట్‌నెస్ కేంద్రాలు, పార్కులు, ఫిట్‌నెస్ కార్యకలాపాలను అందించే గ్రూపుల్లో కూడా చేరిపోవచ్చు. ఏదైనా అనారోగ్యం కారణంగా కొంతకాలం చురుకుగా ఉండలేని పరిస్థితి వస్తే.. కోలుకున్న తర్వాత మళ్లీ నెమ్మదిగా వ్యాయామం మొదలుపెట్టండి.

వ్యాయామం ఎంపికా ముఖ్యమే..

కాలంతో పాటు ఏజింగ్ జరిగిపోతూ ఉంటుంది. అయితే కొన్ని వ్యాయామాలతో సుదీర్ఘకాలం పాటు యవ్వనంగా కనిపించడం సాధ్యమే. ఏయే వ్యాయామాలు తమలోని ఏజింగ్‌ను ఆపుతున్నాయో గుర్తించి, ఎంపిక చేసుకోవడం కాస్త కష్టమే. కానీ నిత్యం వ్యాయామం చేసేవారికి.. ఏ వ్యాయామం తర్వాత ఉల్లాసంగా ఉంటున్నారో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. అలా ఇష్టంగా చేసుకునే వ్యాయామాలను గుర్తించి, వాటినే కొనసాగిస్తూ పోతే అది ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తుంది.

బ్యాలెన్సింగ్ వ్యాయామాలతో లాభాలు..

వయసు పెరుగుతున్న కొద్దీ కింద పడిపోవడానికి (ఫాల్‌కు) అవకాశాలు ఎక్కువ. దేహాన్ని సాగదీసుకున్నట్లుగా చేసే స్ట్రెచ్చింగ్ వ్యాయామాల్లో దేహాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని ప్రాక్టీస్ చేయడం వల్ల పడిపోవడానికి అవకాశం ఉండదు. దాంతో ఎముకలు విరిగే ప్రమాదమూ తప్పుతుంది. యోగా, స్ట్రెచ్చింగ్ వంటి వ్యాయామాలతో దేహాన్ని బాలెన్స్ చేయడం పెరిగి అది నడకనూ మెరుగుపరుస్తుంది. దాంతో ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది.

కార్డియో వ్యాయామాలతో..

కార్డియో వ్యాయామాలతో గుండెకు మంచి ఆరోగ్యం సమకూరుతుంది. వేగంగా నడవడం (బ్రిస్క్ వాకింగ్), మెట్లు ఎక్కడం, స్విమ్మింగ్ వంటివాటిని మంచి కార్డియో వ్యాయామాలుగా చెప్పవచ్చు. ఇవి గుండె ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ఇలా సమకూరిన 'గుండె బలం'కారణంగా అలసట బాగా తగ్గడంతో నిత్య జీవితంలో అన్ని రకాల పనులు మరింత సులువుగా, చురుగ్గా జరుగుతున్నట్లు అనిపిస్తాయి.

బోన్ డెన్సిటీ బాగుంటే..

వ్యాయామాలు కండరాలను, ఎముకలను దృఢపరుస్తాయి. బోన్ డెన్సిటీ చాలాకాలం పదిలంగా ఉండటంతో శరీరమూ బాగా దృఢంగా మారుతుంది. యోగా, స్ట్రెచింగ్ వల్ల కలిగే బ్యాలెన్సింగ్, ఫ్లెక్సిబిలిటీ వల్ల సుదీర్ఘకాలం పాటు శ్రమ చేయగల సామర్థ్యమూ అలవడుతుంది. వెంటవెంటనే కండరాలు పట్టేయడం వంటి ముప్పుతో పాటు సుదీర్ఘకాలంలో వచ్చే అనారోగ్యాల ముప్పూ తప్పుతుంది. ఇన్ని ప్రయోజనాలున్న వ్యాయామాలకు దూరం కావడం, సమతులాహారం తీసుకోకపోవడంతో ఇప్పుడు నడివయసు వారిలోనూ సమస్యలు కనిపిస్తున్నాయని లాన్సెట్ నివేదిక తేటతెల్లం చేసింది. దాంతో నడివయసువారు ఎక్కువగా అనారోగ్యాలు, ఫిట్‌నెస్ లేమి వంటి సమస్యల బారిన పడుతున్నట్లు వెల్లడించింది.

క్లుప్తంగా...

అర్జున అవార్డు గ్రహీత దీప్తికి సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డును అందుకున్న పారా ఒలింపియన్ దీప్తి జివాంజిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'వేదికగా ముఖ్యమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. తెలంగాణ నుంచి మరింతమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన క్రీడా విధానంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతున్న విషయాన్ని ఆ ట్వీట్‌లో సీఎం రేవంత్ గుర్తు చేశారు.

హైదరాబాద్ నుంచి మదీనాకు నేరుగా విమానం

శంషాబాద్: హైదరాబాద్ నుంచి మదీనాకు నేరుగా విమాన సర్వీసును ఇండిగో ఎయిర్ లైన్స్ త్వరలో ప్రారంభించనుంది. ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వీసు వారంలో సోమ, గురు, శనివారాల్లో ఉంటుంది. రాత్రి 7.35 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరే ఈ సర్వీసు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుంది. హైదరాబాద్ మదీనాకు రాకపోకలు సాగించే యాత్రికుల సౌలభ్యం పెరగనున్నట్లు ఇండిగో వెల్లడించింది. ఇండిగోకు ఇది 38వ అంతర్జాతీయ గమ్యస్థానం.

అడిస్ అబాబా నుంచి హైదరాబాద్

ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ అడిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సర్వీసు ప్రారంభించే ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 16 నుంచి ఈ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో అక్కడి స్థానిక సమయం సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరుతాయి. తిరిగి అవే సర్వీసులు ఇక్కడి నుంచి బయల్దేరుతాయి. వాణిజ్య, పర్యాటక రంగాల్లో పెరుగుతున్న వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ సర్వీసులు పెరగనున్నట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి.

బొగ్గు గని కార్మికుల పింఛన్ నిధి పటిష్టం చేస్తాం

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్



సాక్షి, హైదరాబాద్: పింఛన్ సేవలను మరింత మెరుగుపర్చడంతో పాటు పింఛన్ నిధిని పటిష్టం చేస్తామని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్ చెప్పారు. పింఛన్ నిధిని అత్యంత పారదర్శకంగా, సమర్థంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్‌వో) 183వ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవ్‌దత్ మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశాభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు పింఛన్ నిధి సంస్థ సేవలందిస్తోందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టి కృషి జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, సంయుక్త కార్యదర్శి నిరుపమా కొట్రు, డీడీజీ సంతోష్, సీఎంపీఎఫ్ కమిషనర్ విజయ్‌కుమార్ మిశ్రా, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్‌లతో పాటు బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలోనే.. లేదంటే మే, జూన్!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారుల అంచనా

- పబ్లిక్ పరీక్షలు, ఎండల తీవ్రతతో మార్చి, ఏప్రిల్‌లో కష్టమని వెల్లడి
- కేబినెట్ అనుమతిస్తే 15–20 రోజుల్లో ప్రక్రియ పూర్తికి సన్నాహాలు
- ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించిన ఉన్నతాధికారులు



సాక్షి, హైదరాబాద్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ఫిబ్రవరిలోనే నిర్వహిస్తే మంచిదని.. లేదంటే మే, జూన్ వరకు ఆగాల్సి రావచ్చని ఉన్నతాధికారులు అంటున్నారు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రాథమికంగా ప్రభుత్వానికి తమ సంసిద్ధతను తెలియచేసినట్లు సమాచారం. వచ్చే నెల మొదటివారంలో ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదలచేస్తే.. ఆ తర్వాత 15- 20 రోజుల్లోనే మొత్తం ప్రక్రియను పూర్తి చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్టు చెబుతున్నారు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించకపోతే.. మార్చి నెల ప్రారంభం నుంచే ఇంటర్, పదో తరగతి, ఇతర పరీక్షలు ఉంటాయి కాబట్టి ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అంటున్నారు. ఏప్రిల్, మేలో వేసవి తీవ్రత కారణంగా ఎన్నికల నిర్వహణ కష్టమని పేర్కొంటున్నారు. ఇక మే చివర్లో లేదా జూన్‌లోనే ఈ ఎన్నికల నిర్వహణకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం చేతికి కులగణన డేటా!

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందున త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కులగణన సర్వేలో సేకరించిన డేటా 'టాబ్యులేషన్'కూడా పూర్తయి నివేదిక ప్రభుత్వానికి అందినట్టు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై డెడికేషన్ కమిషన్ కూడా తన రిపోర్టును యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మరో వారం రోజుల్లో నివేదికను ప్రభుత్వానికి సమర్పించవచ్చని సమాచారం. సీఎం ఈ నెల 24న విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే ఈ నివేదికను అందచేస్తారని, ఆ తర్వాత ఫిబ్రవరి మొదటివారంలో జరిగే కేబినెట్ భేటీలో రిజర్వేషన్లపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వర్గాలు తెలిపాయి. మొదట గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత 10–15 రోజుల వ్యవధి ఇచ్చి మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించాయి. ఎన్నికల తేదీలతో సంబంధం లేకుండా ఫ్రీ సింబల్స్‌తో కూడిన బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి కసరత్తును దాదాపు పూర్తి చేసినట్టు పేర్కొన్నాయి.

గురుకుల విద్యార్థులకు సాంకేతిక, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్న ప్యూర్ సంస్థ

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని విద్యార్థులకు సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ (ప్యూర్) సంస్థ ముందుకొచ్చింది. గురుకుల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, నాయకత్వ లక్షణాలు, సమగ్ర అభివృద్ధి తదితర కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ప్యూర్ సంస్థ బీసీ గురుకుల సొసైటీలో వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. ప్రధానంగా టెక్నాలజీ, సాఫ్ట్ స్కిల్స్ ట్రెనింగ్ అందించడంతో పాటు డిజిటల్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనుంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు బృంద చైతన్యం, సామాజిక సేవను పెంచేలా ప్రత్యేకంగా యువజన క్లబ్‌లను ప్యూర్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈమేరకు శుక్రవారం బీసీ గురుకుల సొసైటీతో ప్యూర్ సంస్థ అవగాహన కుదుర్చుకుంది. సొసైటీ కార్యదర్శి బి.సైదులు, ప్యూర్ సంస్థ సీఈఓ శైలా తల్లూరి ఎంఓయూపైన సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ప్యూర్ భాగస్వామ్యంతో విద్యార్థులకు ఉన్నత విద్యా కార్యక్రమాలను అందించే అవకాశాలు పెరుగుతాయని, ప్రపంచంతో పోటీపడే సామర్థ్యాన్ని అందిస్తామన్నారు.



ఎంవోయూతో సైదులు, శైలా తల్లూరి

'తెలంగాణ తల్లి' ముంగిట్లో విద్యుల్లతలు, జలపుష్పాలు

సీఎం సూచనల మేరకు అదనపు ఆకర్షణలు



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం లోపల ఉన్న 'తెలంగాణ తల్లి'విగ్రహం ముందు అదనపు అందాలను చేర్చనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అడుగులు వేస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహం ముగింట్లో విద్యుల్లతలు, కొలనులో వివిధ రకాల రంగురంగుల చేపలు ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా సాయంత్రం ఆరు గంటల నుంచి పది గంటల వరకు తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'వినిపించనున్నారు. శుక్రవారం సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి దాసరి హరిచందన విగ్రహాన్ని పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహం ముందుభాగం మరింత ఆకర్షణగా కనిపించేందుకు ఏం చేయాలో అధికారులకు సూచనలు చేశారు.

90% హాజరు.. స్పెషల్ క్లాసులు

జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణతా శాతం పెంపుపై బోర్డు దృష్టి

- ఇంటర్ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రత్యేక కార్యాచరణ
- విద్యార్థి గైర్హాజరైతే ప్రిన్సిపాల్‌దే బాధ్యత.. అధ్యాపకులకు సెలవుల్లేవు
- తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఉత్తీర్ణతా శాతం పెంచే దిశగా అధ్యాపకులను బోర్డు అప్రమత్తం చేసింది. పరీక్షలు పూర్తయ్యే వరకూ అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించింది. జిల్లా అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేసింది. విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అధ్యాపకులు ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవులు పెట్టొద్దని ఆదేశించింది. అత్యవసరమైతే ఇంటర్ బోర్డు జిల్లా అధికారి అనుమతి తీసుకోవాలని సూచించింది. ముఖ్యంగా కాలేజీల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి తగ్గకుండా జాగ్రత్త తీసుకోవాలని స్పష్టం చేసింది. ప్రతి విద్యార్థి విధిగా తరగతులకు హాజరయ్యేలా చూడాలని పేర్కొంది. గైర్హాజరైతే ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని తెలిపింది.

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి

జూనియర్ కాలేజీల్లో ఈసారి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని బోర్డు కార్యదర్శి నేతృత్వంలో ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ప్రతిఏటా ఉత్తీర్ణత ఎందుకు తగ్గుతుందో సమీక్షించారు. పరీక్షల చివరి దశలో నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమవుతోందని భావించిన అధికారులు, ఈసారి అప్రమత్తంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే.. విద్యార్థి తరచూ కాలేజీకి రాని పక్షంలో తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలని ప్రిన్సిపాల్స్‌కు బోర్డు సూచించింది. రాష్ట్రంలో మొత్తం 428 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. ఈ కాలేజీల్లో ఫస్టియర్, సెకండియర్ కలిపి 1.80 లక్షల మంది చదువుతున్నారు. అయితే గత రెండు నెలల విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలిస్తే సగం మంది క్లాసులకు హాజరు కావడం లేదని తేలింది. అలాగే గత ఏడాది ఉత్తీర్ణతా శాతం 50కి మించలేదు. 2023 ఇంటర్ ఫస్టియర్‌లో 40శాతం మందే ఉత్తీర్ణులయ్యారు. గత మూడేళ్లుగా చూసినా ప్రభుత్వ కాలేజీల్లో సగటు ఉత్తీర్ణత శాతం 45కు మించలేదు. ఈ పరిస్థితులపై బోర్డు దృష్టి సారించింది. అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించింది. అదే సమయంలో కొన్ని సమస్యలు కూడా గుర్తించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26 జిల్లాలకు ఇంటర్ విద్య అధికారులు లేరు. కేవలం ఏడు జిల్లాలకు మాత్రమే ఉన్నారు. ఇది పర్యవేక్షణ లోపానికి దారితీస్తోందనే అభిప్రాయానికి వచ్చిన బోర్డు ప్రస్తుతానికి ఇన్‌చార్జి అధికారుల ద్వారా కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయించింది.

జిల్లా అధికారులు చేయాల్సిన పనులు

- సంక్రాంతి సెలవుల తర్వాత కాలేజీలు మొదలవ్వగానే ప్రతి కాలేజీలోనూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి. విద్యార్థులు చదువులో ఎలా ఉన్నారు? ఎక్కడ లోపాలున్నాయి? అనేది ఆరా తీయడంతో పాటు వాటిని ఎలా సరిదిద్దాలో వివరించాలి.
- వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేపట్టాలి. ఈ క్రమంలో బాగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలి. ఏయే చాప్టర్లలో వారు వెనుకబడ్డారో అంచనా వేయాలి. ప్రత్యేక క్లాసులను నిర్వహించాలి.
- ప్రతి కాలేజీలోనూ అధ్యాపకులను కౌన్సెలింగ్ కోసం నియమించాలి. మానసిక ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. అవసరమైతే సైకాలజిస్టులతో కూడా కౌన్సెలింగ్ ఇప్పించాలి.
- పరీక్షలు అయ్యే వరకూ విద్యార్థులను గమనించేలా కాలేజీల్లో సీసీ కెమెరాలు అమర్చాలి. అవసరమైతే ప్రత్యేక బడ్జెట్‌ను ఇస్తారు.
- ప్రయోగశాలల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రయోగశాలల్లో ప్రాక్టీస్ పరీక్షలు నిర్వహించే విధానం అనుసరించాలి. దీనివల్ల పరీక్షల సమయంలో భయం లేకుండా ఉంటుంది.
- ఆయా అంశాలపై జిల్లా అధికారులు ప్రతిరోజు బోర్డుకు నివేదిక ఇవ్వాలి. బోర్డు ఆదేశాలను బేఖాతరు చేసే అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌పై వీరు చర్యలను సూచించడానికి అవకాశం ఉంది.

గ్రూప్–2 పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదల

22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలకు గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–2 ఉద్యోగాల భర్తీలో భాగంగా గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన అర్హత పరీక్షలకు సంబంధించిన 'కీ'లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో నాలుగు సెషన్లలో జరిగిన పేపర్–1, నుంచి పేపర్–4 అన్ని ప్రశ్నపత్రాలు, ప్రాథమిక జవాబు పత్రాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయ్యాక ప్రశ్నపత్రాల (మాస్టర్ క్వశ్చన్ పేపర్)ను, ప్రాథమిక జవాబు పత్రాలను చూసుకోవచ్చని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రశ్నపత్రాలు, ప్రాథమిక 'కీ'పత్రాలు ఈనెల 22వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ప్రాథమిక 'కీ'లపై అభ్యంతరాలుంటే కమిషన్‌కు వివరించే అవకాశం టీజీపీఎస్సీ కల్పించింది. ప్రాథమిక 'కీ'పట్ల అభ్యంతరాలను పూర్తి ఆధారాలతో కేవలం ఇంగ్లిష్‌లో మాత్రమే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని కమిషన్ సూచించింది. అభ్యర్థులు సమర్పించాలనుకున్న అభ్యంతరాలను కేవలం లాగిన్ ద్వారా మాత్రమే సమర్పించాలని, జీమెయిల్, పోస్టు రూపం, వ్యక్తిగతంగా ఇస్తే పరిగణించబోమని టీజీపీఎస్సీ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 50 శాతంలోపు అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 1,368 కేంద్రాల్లో నాలుగు సెషన్లలో రోజుకు రెండు సెషన్ల చొప్పున ఈ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా దక్కవు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలు కూడా ఆ పార్టీ వెంబడి లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి సత్తా చాటడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అక్కడికి వెళ్లి ప్రచారం చేసినా ఒరగబోయేది ఏమీ లేదన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎన్ని గొప్పలు చెప్పినా కాంగ్రెస్‌ను వారు నమ్మే పరిస్థితి లేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్'ద్వారా అభివృద్ధిపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంటుందన్నారు.

ఉన్నత విద్యలో త్వరలో కొత్త సిలబస్

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో అతి త్వరలో కొత్త సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇది విద్యను మరింత బలోపేతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. మార్కెట్ డిమాండ్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను సవరించడానికి, అమలు చేయడానికి మండలి నేతృత్వంలో కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మండలి చైర్మన్, వైస్ చైర్మన్లు, కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే నిపుణులతో కలసి కొత్త సిలబస్‌ను రూపొందించింది. దీనిపై తాజాగా అన్ని వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించే పనిలో ఉన్నట్టు బాలకిష్టారెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. కొత్త సిలబస్‌లో టెక్నాలజీ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు సంబంధించిన ఇంటిగ్రేషన్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, పరిశోధన, అభివృద్ధి, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు.

ఇంటర్న్‌షిప్‌ల కల్పన: యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు అకడమిక్ లెర్నింగ్, వాస్తవ ప్రపంచ సవాళ్ల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్‌లు కల్పించాలని మండలి నిర్ణయించినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. దీని ద్వారా విధాన నిర్ణయాలు, గవర్నెన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో అనుభవాన్ని అందిస్తామన్నారు.

సీపీఆర్ గురించి తెలుసుకోవడం ముఖ్యం

శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్



సాక్షి, హైదరాబాద్: అత్యవసర సమయాల్లో అందించే సీపీఆర్ వంటి మెడికల్ సాయం గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అన్నారు. బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) కోర్సులో అందించిన జ్ఞానాన్ని సిబ్బంది సక్రమంగా ఆచరించాలని, అలాగే తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ నైపుణ్యాలను నేర్పించి తక్షణ సహాయం అందించగలిగే విధంగా సన్నద్ధం కావాలని సూచించారు. బీఎల్ఎస్ కోర్సు కార్యక్రమం శుక్రవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాంతి భద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా యశోద ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ స్నేహ, డాక్టర్ సుజిత్‌ల బృందం సీపీఆర్ (కార్డియోపల్మనరీ రెససిటేషన్) చేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డీజీపీ కార్యాలయ సిబ్బందికి వివరించారు.



వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పిస్తున్న జూడాల సంఘం ప్రతినిధులు

జూడాల సమస్యలు పరిష్కరిస్తాం

వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

గాంధీఆస్పత్రి (హైదరాబాద్): జూనియర్ డాక్టర్లు (జూడా) ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తా నని వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. తమ సమస్యల పరిష్కా రం కోసం జూడాల సంఘ ప్రతినిధులు శుక్రవారం వైద్య శాఖ మంత్రిని కలసి వినతిపత్రం అందించారు. స్టైపెండ్ బకాయిలు, స్టైపెండ్ పెంపు, ట్యాక్స్ మినహాయింపు, స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్, ఆలస్యం అవుతున్న కాంట్రాక్టు వైద్యుల వేతనాల అంశంపై మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించామని జూడాల సంఘం నేతలు తెలిపారు. స్టైపెండ్ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని, అలాగే పెంపు గురించి హెల్త్ సెక్రటరీతో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు వివరించారు. స్టైపెండ్‌పై పన్ను మినహాయింపు అంశాన్ని సంబంధిత శాఖాధికారులతో చర్చిస్తానని, స్కాలర్‌షిప్ రీయింబర్స్‌మెంట్, కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న అసోసియేట్, అసిస్టెంట్ వైద్యుల వేతనాల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపిస్తానని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని జూడాల సంఘ ప్రతినిధులు రాహుల్ కొమ్ము, ఇసాక్‌న్యూటన్, ఆశీస్‌అంకెమ్, దీపాంకర్, అజయ్‌కుమార్‌లు తెలిపారు.

ఆస్ట్రేలియాలో తెలంగాణ ప్రతినిధి బృందం

సాక్షి, హైదరాబాద్: క్రీడారంగఅభివృద్ధి, మౌలిక వసతులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రతినిధి బృందం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎస్.శివసేనారెడ్డి నేతృత్వంలోని ఈ బృందం శుక్రవారం విక్టోరియా రాష్ట్ర రాజధాని మెల్‌బోర్న్‌లోని స్టేడియంను సందర్శించి అక్కడి అధికారులతో సమావేశమైంది. క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యంపై చర్చించింది. బృందంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ క్రీడా సలహాదారు ఎ.పి.జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాల, హాకీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు. క్రీడాకారులకు అందించే ఆర్థిక సహకారంతో పాటు ఆస్ట్రేలియాలో అత్యాధునిక సాంకేతికతతో శిక్షణ ఇస్తున్న తీరు గురించి ఈ బృందం అధ్యయనం చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



చర్లపల్లి టెర్మినల్‌లో ట్రాన్స్‌జెండర్స్ షాపింగ్ స్టాల్

'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్ కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు కేటాయించిన 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్, ట్రాలీ స్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ స్టాల్‌ను ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన వారు నిర్వహిస్తారు. ఇందులో స్నాక్స్, జూట్ బ్యాగ్‌లు, సబ్బులు, వివిధ రకాల చేతితో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించనున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్ జాస్మిన్ మాట్లాడుతూ, తాము ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, చర్లపల్లి టెర్మినల్‌లో కేటాయించిన స్టాల్ వల్ల తమ కమ్యూనిటీకి చెందిన సభ్యులు చేతి వృత్తుల నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అవకాశం లభించిందని, తద్వారా ఉపాధి కూడా అందుతుందని చెప్పారు. స్టాల్ వల్ల తమకు ఆత్మస్థైర్యం లభిస్తుందని, సృజనాత్మకత ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్‌లో తమ కోసం ఒక స్టాల్ ఉండడం తమకు కల్పించిన గొప్ప అవకాశమని ట్రాన్స్‌మెన్ కిరణ్‌రాజ్ తెలిపారు. దక్షిణమధ్య రైల్వేకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు, నిస్సహాయులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్రం వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో 205 రైల్వే స్టేషన్లలో ఈ స్టాళ్లు ఉన్నాయి. చర్లపల్లి టెర్మినల్ స్టాల్ ట్రాన్స్‌జెండర్‌లకు లభించడం పట్ల దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వారికి అభినందనలు తెలిపారు.

> ఎదుటి వారికి అర్హత లేకున్నా, వారిని గౌరవించు!
> ఎందుకంటే నువ్విచ్చే గౌరవం నీ వ్యక్తిత్వాన్ని ప్రతిఫలిస్తుంది
> కానీ, ఎదుటి వారిది కాదు!!
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 18 జనవరి 2025

ఉద్యోగులకు తీపి కబురు

ఏడాదిగా కేంద్ర ప్రభుత్వోద్యోగులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఎనిమిదో వేతన సంఘం సాకారం కాబోతోంది. ఆ సంఘం రూపురేఖలూ, దాని గడువు, మార్గదర్శకాలు వగైరా వివరాలు ఇంకా తెలియాల్సేవున్నా తమ జీతభత్యాలు పెరగబోతున్నాయన్న కబురు సహజంగానే ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. కేంద్ర వేతన సంఘం సిఫార్సులకు కొంచెం అటూ ఇటూగా రాష్ట్రాల్లో వేతన సవరణ సంఘాలు కూడా సిఫార్సులు చేస్తాయి గనుక రాష్ట్రప్రభుత్వాల సిబ్బందికి సైతం ఇది సంతోషించే సందర్భమే. పదేళ్లకోసారి నియమించే వేతన సంఘాల గురించిన ప్రకటన లెప్పుడూ లోక్‌సభ ఎన్నికల ముందు వెలువడటం రివాజు. అందుకే నిరుడంతా ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఎట్టకేలకు ఇన్నాళ్లకు ప్రకటన వెలువడింది. మరో మూడు వారాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న ఢిల్లీలో గణనీయంగావున్న కేంద్ర సిబ్బంది ఓటుబ్యాంకును దృష్టిలో ఉంచుకునే తాజా ప్రకటన వెలువడిందన్న విమర్శలు లేకపోలేదు. మన దేశంలో ప్రభుత్వోద్యోగులు సంఘటిత శక్తి, పటిష్ఠమైన ఓటుబ్యాంకు కూడా! కనుక వారిని నిరాశపరచాలని ఏ ప్రభుత్వమూ చూడదు. ఇందుకు ఒకే మినహాయింపు వుంది. 2003లో కేంద్రంలో వాజపేయి నేతృత్వంలోని అప్పటి ఎన్డీయే సర్కారు వేతన సంఘం డిమాండ్‌ను తిరస్కరించింది. అటు తర్వాత వచ్చిన యూపీఏ ప్రభుత్వం 2005లో వేతన సంఘం ఏర్పాటు చేసి, ఆ మరుసటి ఏడాది జనవరి 1 నుంచి దాని సిఫార్సులు అమలుచేయటం మొదలుపెట్టింది. అంతేకాదు... 2013లో ఏడో వేతన సంఘం ఏర్పాటును ప్రకటించింది. దేశంలో రక్షణ, రైల్వే విభాగాల సిబ్బందిని కూడా కలుపుకొంటే 49 లక్షల మందికి పైగా కేంద్రప్రభుత్వోద్యోగులున్నారు. వీరుగాక పింఛన్ అందుకునే 65 లక్షల మంది రిటైర్డ్ సిబ్బంది ఉన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలనూ, ప్రభుత్వరంగ సిబ్బందికి ఇచ్చే బోనస్‌నూ వేతన సంఘం సిఫార్సు చేస్తుంది. అలాగే పింఛన్‌దార్లకు నెలనెలా చెల్లించాల్సిన మొత్తం, కరువుభత్యం కూడా నిర్ణయిస్తుంది. అది చేసే సిఫార్సులను యథాతథంగా ఆమోదించటం లేదా ఉద్యోగుల కోర్కె మేరకు దాన్ని మరింత పెంచటం, తనకున్న వనరులను దృష్టిలో ఉంచుకుని ఆ సిఫార్సులకు కోతపెట్టడం కేంద్రం చేసే పని.

కేంద్రంలోనైనా, రాష్ట్రాల్లోనైనా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య రానురాను తగ్గిపోతోంది. కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవటం, తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకోవటం గతంతో పోలిస్తే పెరిగింది. ఏతావాతా, రిటైరవుతున్న సిబ్బంది స్థానంలో కొత్త రిక్రూట్‌మెంట్లు బాగా తగ్గాయి. ఆరో వేతన సంఘం ఏర్పాటు సమయానికి దేశంలో 55 లక్షలమంది కేంద్ర సిబ్బంది ఉన్నారని అంచనా వేశారు. ఇప్పుడు నిండా 50 లక్షల మంది కూడా లేరు. మరో మాటలో – సర్వీసులో ఉన్న సిబ్బంది కన్నా పింఛన్‌దార్లే ఎక్కువున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ విభాగాల్లో సంపూర్ణంగా కంప్యూటరీకరణ జరగటంతోపాటు ఇంటర్నెట్ అందుబాటులోకొచ్చింది కనుక మునుపటితో పోలిస్తే ఎక్కువమంది సిబ్బంది అవసరం ఉండకపోవచ్చన్న వాదనలో నిజముంది. కానీ మనతో పోలిస్తే అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలో ప్రతి లక్షమంది పౌరులకూ దాదాపు ఏడువేల మంది ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. మన దేశంలో అది 1,500 మించదు. అమెరికాలో తమ ఏలుబడి మొదలయ్యాక ప్రభుత్వ సిబ్బంది సంఖ్యలో భారీగా కోత పెడతామని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డోనాల్డ్ ట్రంప్ బాహాటంగానే చెప్పారు. ఫలితాలొచ్చిన వారం రోజుల్లోపునే ప్రభుత్వ సామర్థ్య విభాగం పేరిట వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్‌లతో ఆయన ఒక కమిటీని కూడా నియమించారు. తాము విడివిడిగా ఉరిశిక్షలు వేయబోమని, ఒకేసారి ఊచకోత ఉంటుందని వివేక్ రామస్వామి చమత్కరించారు కూడా! కనుక అక్కడ కూడా ప్రభుత్వ సిబ్బంది తగ్గుతారు. చాలా యూరప్ దేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లలో కోతపెట్టే ప్రయత్నాలు చేయటం, దాన్ని ఉద్యోగులు ప్రతిఘటించటం కనబడుతూనే ఉంది.

ప్రభుత్వ పథకాలను ప్రజానీకానికి చేర్చటంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర కీలకమైనది. గతంతో పోలిస్తే కొత్త సాంకేతికతలు అందుబాటులోకొచ్చి ఉండొచ్చుగానీ అందుకు తగ్గట్టే సూక్ష్మస్థాయి వివరాల సేకరణ పెరిగింది గనుకా, రిటైరవుతున్నవారి స్థానంలో కొత్త నియామకాలు లేవు గనుకా వారి పని భారం పెరిగింది. పని మీద శ్రద్ధలేనివారూ, అవినీతికి పాల్పడేవారూ అన్నిచోట్లా ఉంటారు. వారి వల్ల సహజంగానే అందరికీ చెడ్డపేరు వస్తుంది. ప్రభుత్వోద్యోగులపైనా అలాంటి నింద ఉంది. ఉద్యోగ భద్రత వరకూ చూస్తే ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వరంగంలో అది ఎక్కువ. ఒకసారంటూ ప్రభుత్వ ఉద్యోగం వస్తే చీకూచింతా ఉండబోదని అనుకుంటారు గనుకే అందుకోసం చాలామంది అర్రులు చాస్తారు. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంలో విఫలమవుతున్నందున వేతనాలు పెంచాలన్న ప్రభుత్వ సిబ్బంది డిమాండ్‌కు ప్రభుత్వాలు తలొగ్గక తప్పడం లేదు. కొన్ని లోటుపాట్లున్నా ప్రభుత్వోద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వాలు శ్రద్ధ పెడుతున్నాయి. నిర్ణీత కాలంలో జీతభత్యాలు పెంచుతున్నాయి. కానీ వారితో పోలిస్తే ఎంతో ఎక్కువున్న ప్రైవేటురంగ సిబ్బందినీ, రెక్కాడితే గానీ డొక్కాడని అసంఘటిత రంగ కార్మికులనూ, వారి సంక్షేమాన్నీ విస్మరిస్తున్నాయి. పాశ్చాత్యదేశాల్లో ఇంత చేటు అసమానతలుండవు. ప్రభుత్వ సిబ్బందిలో జవాబుదారీతనాన్ని ఆశించే పాలకులు ఈ రంగాల పట్ల తాము ఎలా వ్యవహరిస్తున్నామో ఆలోచించుకోవాలి. ఈ అసమానతల్ని తగ్గించే ప్రయత్నం చేయాలి.

బౌద్ధ సంస్కృతితోనే వికాసం, ప్రకాశం

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

వేల ఏళ్ల క్రితమే భారతదేశం శాంతి సౌభాగ్యాలను ప్రవచించిన బుద్ధభూమిగా విదేశాల వారికి తెలుసు. ప్రపంచమంతా కత్తులతో సామ్రాజ్య విస్తరణలో తలమునకలైన వేళ అశోక చక్రవర్తి శాంతిమార్గాన్ని ఎన్నుకున్నాడు. అదీ భారత వారసత్వ బలం. ప్రజాస్వామ్యం మన జీవితాల్లో అంతర్భాగం. అది మన జీవనశైలి. బౌద్ధ సూత్రాలు అనేకం మన రాజ్యాంగంలోనూ పొందుపరచారు అంబేడ్కర్. అయితే ఈనాడు తద్విరుద్ధమైన పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. దళితులపై, స్త్రీలపై, మైనార్టీలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయి. దేశంలో అంతర్గత సామాజిక వ్యవస్థ సంక్షోభంలో ఉంది. ప్రజల ఆహార, ఆహార్య అంశాల పట్ల కూడా వివక్ష, హింసలు కొనసాగుతున్నాయి. అందుకే బౌద్ధ పునరుజ్జీవన ఉద్యమం అవసరం.

ఇటీవల భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భువనేశ్వర్‌లో 18వ ప్రవాస భారతీయ దివస్ (పీబీడీ) సదస్సులో ప్రసంగిస్తూ 'మానవుని భవిష్యత్తు యుద్ధంలో కాకుండా బుద్ధునిలో ఉందని' ఉద్ఘాటించారు. ఇది చాలా చరిత్రాత్మకమైన ప్రకటన. అంతర్జాతీయ ప్రాముఖ్యం ఉన్న ప్రకటన అని చెప్పక తప్పదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో మరణించిన వారి గురించి, అలాగే ఇజ్రాయెల్– గాజా మధ్య జరుగుతున్న మానవ హననం గురించిన ఆందోళన ఇందులో లీనమై ఉంది. ఇంకా ఆయన ఈ సందర్భంగా మన దేశానికి ఉన్న సమున్నత సాంస్కృతిక వారసత్వం కారణంగా మన తత్త్వాన్ని అంతర్జాతీయ సమాజానికి చెప్పగలుగుతున్నామనీ, ప్రస్తుతం ప్రపంచం మనం చెప్పే మాటను వింటోందని తెలిపారు.

ఆయన మరొక ముఖ్యమైన ప్రస్తావన కూడా చేశారు. 'ప్రపంచమంతా కత్తులతో సామ్రాజ్య విస్తరణలో తలమునకలైన వేళ అశోక చక్రవర్తి శాంతిమార్గాన్ని ఎన్నుకున్నారు. అదీ భారత వారసత్వ బలం. భారత్ అంటే ప్రజాస్వామ్యానికి తల్లి. ప్రజాస్వామ్యం మన జీవితాల్లో అంతర్భాగం. అది మన జీవనశైలి. భిన్నత్వం గురించి మనకెవరూ చెప్పాల్సిన అవసరం లేదు. మన జీవితాలు దానిపైనే నడుస్తున్నాయి. భారతీయులు ఏ దేశానికి వెళ్లినా ఆ సమాజంలో అంతర్భాగం అవుతారు. ఆ యా దేశాల సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ చిత్తశుద్ధితో పనిచేసి అక్కడి పురోభివద్ధికి దోహదపడుతుంటారు. అదే సమయంలో వారి హృదయాలు భారత్ కోసం తపిస్తుంటాయి. ప్రవాసులను మన దేశ రాయబారులుగా నేను చూస్తాను. నేను ఎక్కడికి వెళ్లినా తలెత్తుకుని తిరుగుతున్నానంటే దానికి వారే కారణం. అన్ని చోట్లా వారు నాకు ఘనస్వాగతం చెబుతుంటారు. భారత్ నుంచి యువత పూర్తి నైపుణ్యాలతో విదేశాలకు వెళ్లేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని అన్నారు.

వాస్తవానికి భారతదేశం అశోకుడు కత్తి దించాక ప్రపంచం అంతా విస్తరించింది. కేవలం సామాజిక, ఆర్థిక రంగాల్లోనే కాదు, తాత్విక సాంస్కృతిక విప్లవం కూడా భారత్ నుండి ప్రపంచానికి విస్తరించింది. భారతదేశం ఉత్పత్తి క్రమం పెరగాలంటే తప్పక బౌద్ధం విస్తృతి ప్రపంచ దేశాలకే కాదు భారతదేశానికీ మరింత అవసరం అని అంబేడ్కర్ అప్పుడే చెప్పారు. ఈ క్రమంలో ప్రసిద్ధ భారతదేశ చరిత్ర పరిశోధకులు రొమిల్లా థాపర్ బౌద్ధం... మరీ ముఖ్యంగా అశోకుని బౌద్ధం స్వీయ జీవిత అనుభవం నుంచి వ్యక్తీకరించబడిందని, అనుసరించబడిందని చెప్తూ అది భారతదేశంలో నూత్న నిర్మాణానికి దారి తీయడానికి ఎన్నో సామాజిక అసమానతలకు సంబంధించిన అమానవ ధర్మాలను త్రోసి పుచ్చిందని అన్నారు. 'దమ్మం అనేది అశోకుని దృష్టిలో ఒక జీవిత విధానం. అది అతనికి పరిచయమున్న తత్త్వవేత్తల నైతిక బోధనల సారం. బహుశా



స్వీయ జీవితానుభవ సారం కూడా అయివుండవచ్చు. ఆ జీవిత విధానం ఉన్నత స్థాయి సామాజిక నీతి మీద, పౌరబాధ్యతల మీద ఆధారపడింది. అంతేగాక అశోకుడు... వర్ణవ్యవస్థను గురించి ఆదర్శప్రాయంగా చిత్రించిన సిద్ధాంతంగా కాక, నిత్యజీవితం దృష్ట్యా తన దమ్మాన్ని రూపొందించార'ని రొమిల్లా థాపర్ విశ్లేషించారు. 'సాధారణంగా పెక్కు సమాజాలలో కన్పించే సాంఘిక దాంబికత్వాన్ని పరిహరించి, మానవత్వ సిద్ధమైన సాంఘిక ప్రవర్తనను అశోకుడు కాంక్షించాడు. స్వర్గ సౌఖ్యం వంటి ఆధ్యాత్మిక భావనలో ప్రజలకు పరిచయముంది. అటువంటి ప్రతిఫలాల ఆశ చూపటం ద్వారా సాంఘిక బాధ్యతను కేవలం సదాచార వర్తనగా గాక, సాత్విక ప్రాధాన్యం ఉండి నిర్వ్యాజంగా అనుసరించే బాధ్యతగా ఉదాత్త స్థానానికి కొనిపోవడానికి అశోకుడు ప్రయత్నించాడ'ని రొమిల్లా థాపర్ అశోకుని పరిపాలనా విధానం గురించి చెప్పారు.

ఈనాడు భారతదేశంలో బౌద్ధ సాంస్కృతిక, ఆర్థిక విప్లవం అవసరం అని నరేంద్ర మోదీ సంఘ్‌పరివార్ శక్తులకు కూడా బోధించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో దళితులపై, స్త్రీలపై, మైనార్టీలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయి. భారతదేశంలో అంతర్గత సామాజిక వ్యవస్థ సంక్షోభంలో వుంది. ప్రజల ఆహార, ఆహార్య అంశాల పట్ల కూడా వివక్ష, హింసలు కొనసాగుతున్నాయి. అందుకే ఈ సందర్భంగా ఆయన అంతర్గత లౌకిక వాదానికి కూడా నడుం కట్టాల్సిన అవసరం ఉంది.

భారతదేశానికి దిగుమతులు పెరుగుతున్నాయి. ఎగుమతులు తగ్గుతున్నాయి. భారతదేశంలో సామాజిక ఆర్థిక ఉత్పత్తులు పెరగాలంటే ఈనాడు తప్పకుండా సామాజిక జీవన సామరస్యాన్ని, శాంతిని, కరుణను, కుల వివక్షేతరమైన ప్రజ్ఞను గుర్తించే కుల నిర్మూలనా భావం పాలకులకు అవసరం. బౌద్ధ సంస్కృతీ వికాసం అవసరం. అశోకుడి పాలనను పునర్వివేచించుకొని సమన్వయించుకోవడం అవసరం.

బౌద్ధాన్ని ఒక మతంగా కాక ఒక ధర్మంగా, ఒక నీతిగా పరివ్యాప్తి చేయవలసిన అవసరం వుంది. సారనాథ్‌లో అశోకుడు నిలిపిన శిలాస్తంభ అగ్రభాగంలోని నాలుగు సింహాల శిల్పాన్ని భారత ప్రభుత్వం అధికార ముద్రగా స్వీకరించింది. కానీ ఈ దేశాన్ని బౌద్ధ భూమిగా ప్రకటించలేకపోయింది. అయితే ఇప్పుడు హిందూ దేశంగా మార్చడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతుండడం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు యుద్ధానికి బదులు శాంతి అవసరం అని చెబుతున్న పాలకులందరూ ఆయుధ సంపత్తికే ఎక్కువ ధనం ఖర్చు బెట్టడం విడ్డూరం. భారత ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలపై చెబుతున్న మాటలను భారతదేశంలో కూడా నిరంతరంగా చెప్పడమే కాక, ఆచరణలోకి తీసుకురావడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌లో భారత రాజ్యాంగకర్త అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడటాన్ని మోదీ ఖండించలేదు. అది బాధాకరమైన విషయం. బుద్ధ–అశోకులంతటి వారు అంబేడ్కర్. భారతదేశంలో ఈనాడు రక్తపాతంలేని సమాజం ఏర్పడిందంటే ఆయనే కారణం.

నిజానికి ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు ఆర్థిక పరిస్థితులు దిగజారడానికి కారణం బౌద్ధ జీవన విధానం ప్రపంచంలో లేకపోవడమే! ప్రపంచమంతా అశాంతిగా ఆర్థిక సంక్షోభంలో ఉండడానికి కారణం ప్రకృతినీ, మనిషి వ్యక్తిత్వాన్నీ కాపాడుకోలేక పోవడమే. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద భావనలు పెరిగి పర్యావరణ విధ్వంసం, యుద్ధకాంక్ష, దోపిడీలు పెరగడం వల్ల ప్రపంచంలో శాంతి అంతరిస్తూ ఉంది.

అంబేడ్కర్ రాజ్యాంగంలో బౌద్ధ ధమ్మంలోని అష్టాంగ సూత్రాలు, పంచశీల వంటి వాటి నుండే భారత రాజ్యాంగాన్ని రూపొందించగలిగారు. నరేంద్ర మోదీ బౌద్ధంతో పాటు ప్రపంచానికి భారత రాజ్యాంగ ప్రశస్తిని చాటవలసిన అవసరం ఉంది. బుద్ధుణ్ణి, అశోకుణ్ణి, అంబేడ్కర్‌ని భారతదేశ పునర్నిర్మాణ కర్తలుగా ప్రకటించాల్సిన అవసరం కూడా ఉంది. ఒక్క మోదీనే కాదు, ప్రతిపక్ష నాయకులు, ఆ యా రాష్ట్రాల ముఖ్యమంత్రులు బౌద్ధ సంస్కృతి వికాసానికి పాటుపడాల్సిన అవసరం ఉంది. ఏపీ సీఎం చంద్రబాబుకి అమరావతిని బౌద్ధ సాంస్కృతిక, తాత్విక, ఆర్థిక కేంద్రంగా నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ చెప్పవలసిన అవసరం ఉంది. చంద్రబాబు నోట బుద్ధుని పేరు గాని, అశోకుని పేరుగాని, అంబేడ్కర్ పేరుగాని రాకపోవడం శోచనీయం. ఈనాడు భారత రాజ్యాంగ సూత్రాల పునాదుల మీద బౌద్ధ జీవన పునరుజ్జీవనానికి ఆచరణాత్మకంగా పూనుకోవాల్సిన చారిత్రక సందర్భంలో మనమున్నాం. ఆ దిశగా నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ మీడియా

ఎగవేతలే వ్యాపారమా!



అనిల్ అంబానీ కంపెనీ 'రిలయన్స్ కమ్యూనికేషన్స్'కు ఉన్న అప్పు రూ.47,251 కోట్లు. అందులో ఆయన తిరిగి చెల్లించింది రూ. 455 కోట్లు. మిగతా రూ. 46,796 కోట్లను బ్యాంకులు మాఫీ చేశాయి. ఇప్పుడు ఆయన మళ్లీ 10 వేల కోట్లను తన 'రిలయన్స్ పవర్'లో పెట్టుబడి పెట్టనున్నారు! జనం చెల్లించే పన్నులు ఎటువైపు వెళుతున్నాయి?

– గీత్. వి, సోషల్ ఎనలిస్ట్

ప్రాణత్యాగాల మాటేమిటి?!



భారత్‌కు 1947లో వచ్చింది నిజమైన స్వాతంత్ర్యం కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ దారుణమైన వ్యాఖ్య చేశారు! పాశ్చాత్య ఫాసిస్ట్ ఉద్యమాల నుంచి ప్రేరణ పొందిన ఆ సంస్థ... స్వాతంత్ర్యోద్యమ విజయంపై నేటికీ అసౌకర్యంగా ఉంది. 52 ఏళ్ల పాటు దాని కార్యాలయంపై త్రివర్ణ పతాకమే ఎగరలేదు!

– సాగరికా ఘోష్, రాజ్యసభ ఎంపీ

ముగిసిన అధ్యాయం



ఎట్టకేలకు ఎన్.సి.ఇ.ఆర్.టి. తన చరిత్ర పాఠ్య పుస్తకం నుండి ఆర్యుల దండయాత్ర పురాణాన్ని తొలగించింది. వామపక్ష చరిత్రకారులు వలసరాజ్యాల కాలం నుంచీ పునరుద్ధరించుకుంటూ వస్తున్న ఒక అబద్ధపు అకృత్యాన్ని కాలువలోకి విసిరేసింది. నిజమైన విముక్తి!

– నబారున్ బరూవా, చరిత్రకారుడు

అలా చేసి ఉండాల్సిందా!



నూపుర్ కనుక హిందూ గ్రంథాన్ని తగలబెట్టి ఉంటే ఆమెకు బీజేపీ టికెట్ ఇచ్చి ఉండేది. (ఢిల్లీ టికెట్‌ను నూపుర్‌కు బదులు... మోదీని దూషించి, మనుస్మృతిని మంటల్లో వేసిన వారితో సంబరాలు జరుపుకొన్న మాజీ 'ఆప్' లీడర్ ప్రియాంకకు టిక్కెట్ ఇవ్వటంపై).

– ఆనంద్ రంగనాథన్, రచయిత

ముందైతే కదలాలి



అసమాన ప్రతిభ, మేధ ఉండి కూడా, ముందడుగు వేసే ధైర్యం కొరవడితే ఎన్నటికీ బయటపడలేని బందిఖానాలో చిక్కుకుపోయినట్లే.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

పోరాడితేనే కాపాడుకోగలం!

మన దేశం ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగస్వామిగా చేరినప్పటి నుంచి రైతాంగం, వ్యవసాయ రంగం పరిస్థితి మరింత వేగంగా క్షీణించడం ప్రారంభమైంది. 2022 నాటికల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫారసుల ప్రకారం వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని నమ్మబలికిన ఎన్డీయే పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గెలిచే వరకు మద్దతు ధర గురించి ఊదరగొట్టి, గెలిచిన తర్వాత సి2 + 50 సూత్రం (ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు అదనంగా అందులో సగభాగం కలిపి ఆ మొత్తంపై లెక్కగట్టటం) ప్రకారం తాము కనీస మద్దతు ధర ఇవ్వలేమని సుప్రీంకోర్టుకు ఎన్డీఏ ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించడం ద్వారా తన రైతు వ్యతిరేక విధానాన్ని బయట పెట్టుకొన్నది.



ఇప్పటికే దేశంలోని 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాయని, వారి నెత్తిపై సగటున 74,121 రూపాయల అప్పు ఉందని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్‌లో పంటల ధరలు గిట్టుబాటు కాక, పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల సుడి గుండంలో చిక్కుకుంటున్న రైతు కుటుంబాల్లో ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. 2013 నుండి 2022 వరకు అధికారిక లెక్కల (ఎన్సీఆర్బీ) ప్రకారమే గత పదేళ్లలో లక్షా ఇరవై వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే రైతాంగం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వ్యవసాయ పంటలపై కార్పొరేట్ శక్తులకు అధికారాన్ని కట్టబెట్టే విధంగా మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉరితాళ్ల వంటి మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు ఢిల్లీ కేంద్రంగా రైతులు వీరోచితంగా పోరాడారు. ఫలితంగా ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టబద్ధత అవకాశాల పరిశీలన కోసం ఉద్యమ నాయకత్వానికి రాతపూర్వక హామీ ఇచ్చింది. అయితే మూడు సంవత్సరాలు దాటినా దీనిపై ఎలాంటి పురోగతి లేకపోగా తిరిగి దొడ్డి దారిన ఆ మూడు నల్ల చట్టాలను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధం అవుతోంది. దానిలో భాగంగానే కొత్త వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది.

అటవీ సంరక్షణ నియమాల పేరుతో 2006 అటవీ హక్కుల చట్టానికి పాతరేయటానికి పూనుకున్నది. అటవీ సంరక్షణ నియమాల బిల్లు ఆమోదం పొందితే అడవులకు, అడవుల్లో నివసించే జన సమూహాల హక్కులకు ముప్పు ఏర్పడుతుందని పార్లమెంట్ సభ్యులకు కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూపు తరఫున 155 మంది మాజీ ఐఏఎస్ అధికారులు తమ సంతకాలతో లేఖ రాశారు. అయినా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా ఆ బిల్లును ఆమోదింప చేసుకుంది. మరోవైపు విద్యుత్ బిల్లు–2020ని చట్టం చేయడానికి మార్గం సుగమం చేసుకుంది. కచ్చితంగా ఇది వ్యవసాయ రంగంపై పెను భారం మోపే బిల్లు అనొచ్చు.

వ్యవసాయ రంగంలో పని చేసే వారంతా రైతులే. వీరిలో కౌలు రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కూలీల పరిస్థితి మరింత దారుణంగా వుంది. రైతును, వ్యవసాయ రంగాన్ని రక్షించుకోలేక పోతే దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం వుంది. ఇప్పటికైనా రైతులు, రైతు సంఘాలు మేల్కొనాలి. ప్రమాదంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాలి. ఉద్యమ శక్తుల ఐక్యత ద్వారానే రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్నీ కాపాడుకోగలుగుతాం. 'అఖిలభారత రైతుకూలీ సంఘం' అనే పేరుతో కొనసాగుతూ వస్తున్న రెండు వేర్వేరు నిర్మాణాలు ఈ నేపథ్యంలోనే 'ఆలిండియా కిసాన్ మజ్దూర్ సభ' (ఏఐకేఎంఎస్)గా ఒకటి అవుతున్నాయి. ఆదివారం మహబూబాబాద్‌లో విలీన సభ జరుపుకొంటున్నాయి.

– గౌని ఐలయ్య,
ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి । 94907 00955

కేంద్రం చేతి కీలుబొమ్మ యూజీసీ!

దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతి కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జనవరి 6న ముసాయిదా డ్రాఫ్టును విడుదల చేసింది. దీనిపై ఫిబ్రవరి 5 లోగా ప్రజాభిప్రాయం సేకరించి, నూతన మార్గదర్శకాలు వెల్లడించనున్నట్లు తెలిపింది. అయితే ఈ ముసాయిదా పూర్తిగా యూనివర్సిటీలను కేంద్రీకరించడానికి, ప్రయివేటీకరణకు మరో ప్రయత్నంగా మాత్రమే కనిపిస్తోంది. ఈ ప్రతిపాదనలు విద్యలో రాష్ట్రాల హక్కులను, నిర్ణయాధికారాన్ని బలహీనపరుస్తాయి. ఇవి మొత్తంగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ మూల సూత్రాలను బలహీన పరుస్తున్నాయి.



ఇప్పటి వరకూ వైస్ ఛాన్సలర్ (వీసీ)ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేస్తూ వస్తోంది. కమిటీలో ముగ్గురు సభ్యులు – యూజీసీ ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదించిన సభ్యుడు, యూనివర్సిటీ కౌన్సిల్ ప్రతినిధి ఉంటున్నారు. ఈ సెర్చ్ కమిటీ సీనియారిటీ, అర్హతలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ముగ్గురు పేర్లను సూచిస్తుంది. ఆ ముగ్గురు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ ఎంపిక చేస్తారు. కానీ ఇప్పుడు సవరించిన నియమాలు వైస్–ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయి. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు వీసీల నియామకంపై గవర్నర్‌లతో విభేదిస్తున్నాయి. పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే వరుసలో ఉన్నాయి.

మొదటిసారిగా వీసీల నియామకాల్లో నాన్ అకడమిక్ వ్యక్తులను నియమించాలని తాజా ముసాయిదా సిఫార్సులు చేసింది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావాలంటే ప్రొఫెసర్‌గా లేదా కీలకమైన పరిశోధనలో లేదా అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో కనీసం పది సంవత్సరాల పాటు పని చేసి ఉండాలి. అయితే తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పరిశ్రమలలో, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో, ప్రభుత్వ లేదా కనీసం ప్రభుత్వ రంగ సంస్థలో కనీసం పది సంవత్సరాల సీనియర్ స్థాయి అనుభవం గడించి ఉంటే సరిపోతుంది.

ముసాయిదాలో రిజర్వేషన్లను మరిచారు. ఇది ఉన్నత విద్యలో పూర్తిస్థాయి కార్పొరేట్ సంస్కృతిని చొప్పిస్తుంది. అలాగే ఉపాధ్యాయులకు నిర్దిష్ట బోధన సమయం ప్రస్తావించలేదు. 'నెట్' అవసరం లేకుండా 'మాస్టర్స్ డిగ్రీ' ఉంటే చాలు అనే విషయమైతే జీర్ణించుకోవటానికే కష్టంగా ఉంటుంది. 55 శాతం మార్కులతో మాస్టర్స్ సాధించిన వారిని యూజీసీ–నెట్‌లో అర్హత సాధించక పోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చని పేర్కొన్నారు.

యూజీసీ చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ. ఇది ఉన్నత విద్యా ప్రమాణాలు, సమన్వయం, నిర్ణయం, నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తుంది. విశ్వవిద్యాలయాలకు డిగ్రీ కళాశాలలో బోధించే అధ్యాపకుల అర్హతలు ఏమి ఉండాలో నిర్ణయిస్తుంది. ఇంత స్వతంత్ర సంస్థగా ఉండాల్సిన యూజీసీని కేంద్రం తన సొంత ఎజెండా అమలుపరిచేందుకు కీలుబొమ్మలా ఆడిస్తోంది.

కరిక్యులమ్, బోధనపరమైన అంశాలలో రాష్ట్రాల నియంత్రణ చాలా ముఖ్యమైనది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతుల నేపథ్యానికి అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించుకోవాలి. కానీ ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్రం ఒకొక్కటిగా తన అధీనంలోకి తీసుకుంటూ రాష్ట్రాలపై తన విధానాలను బలవంతంగా రుద్దుతోంది. వాటిని కాదని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. కేరళ పూర్తిగా వ్యతిరేకిస్తోంది. మన దగ్గర కూడా మేధావులు, విద్యావేత్తలు యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా నడుం బిగించాలి. రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష ప్రభుత్వాలు దీనిపై నోరు మెదపాలి.

– కె. ప్రసన్న కుమార్,
ఆంధ్రప్రదేశ్ ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర అధ్యక్షులు

పరిపక్వం

థోసు ఓ జెన్ గురువు. అంత్యదశలో ఆయన అనేక చోట్ల పర్యటించి జెన్ గురించి తనకు తెలిసినవన్నీ చెప్తూ వచ్చారు. ఆయన ఓ ఆశ్రమంలో ఉన్నప్పుడు తనను కలవడానికి వచ్చిన వారితో ఇక మీదట ఎవరికీ ఏదీ చెప్పబోవడం లేదనీ, ఎవరికి ఏది మంచి అనిపిస్తే అది చేయవచ్చని చెప్పి వెళ్లిపోయారు. మూడేళ్ళ తర్వాత ఆయన ఓ ఊళ్ళో ఓ వంతెన కింద కొందరు



బిచ్చగాళ్ళతో కలిసి రోజులు గడుపుతున్నారని ఆయన పూర్వ శిష్యులలో ఒకరికి తెలిసింది. దాంతో ఆ శిష్యుడు ఆయన దగ్గరకు వెళ్ళి నమస్కరించి తనకేదైనా బోధించమని అడిగాడు. అంతట థోసు 'నేను చేస్తున్నట్టే నువ్వూ ఓ రెండు రోజులు ఇక్కడే మా మధ్యలో ఉంటే నేను నీకు బోధిస్తాను' అన్నారు. సరేనని ఆ శిష్యుడు బిచ్చగాడి వేషధారణలో ఆయనతో పాటు ఓ రోజంతా గడిపాడు. మరుసటి రోజు అక్కడి బిచ్చగాళ్ళల్లో ఒకడు చనిపోయాడు. అప్పుడీ శిష్యుడు స్వయంగా ఆ బిచ్చగాడి మృతదేహాన్ని పూడ్చిపెట్టి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం థోసు 'ఈ రోజు మనం భిక్ష కోసం ఎక్కడికీ వెళ్ళబోవడం లేదు, చనిపోయిన బిచ్చగాడి దగ్గర మిగిలి ఉన్న ఆహారం సర్దుకుందాం' అన్నారు. కానీ శిష్యుడు ఆ ఆహారంలో ఒక్క మెతుకు కూడా తినలేకపోయాడు. అప్పుడు థోసు 'నువ్వు నాలాగా ఉండలేవని నీకు ముందే చెప్పాను. కనుక నువ్వు ఇక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్ళవచ్చు. నా గురించి ఆలోచించక్కర్లేద'ని అన్నారు. ఆ స్వరంలో ఎక్కడా కోపం లేదు. ప్రశాంతంగానే చెప్పారు.

ఈ ఉదంతం వల్ల తెలుసుకోవలసింది... మనసుకు దేన్నయినా వేరు చేసి చూడగల తత్వముంది. అది ఈ ప్రపంచానికి సంబంధించినంతవరకూ సముచితమే. కానీ మనసు నిలకడగా ఉండటం మొదలు పెడితే వేరు చేసి చూడటమనేదీ క్రమంగా మాసిపోతుంది. అప్పుడు పరిపక్వత కలుగుతుంది. ఇటువంటి పరిపక్వం గల మనసు దేనికీ చలించదు. కలత చెందదు. అటువంటి వారికి జనన మరణాలనేవి ఒక్కటే. తేడా ఉండదు.

– యామిజాల జగదీశ్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.పంచమి పూర్తి (24 గంటలు), నక్షత్రం: పుబ్బ ప.3.39 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.11.06 నుండి 12.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.41 నుండి 8.10 వరకు, అమృతఘడియలు: ఉ.8.16 నుండి 10.01 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.38, సూర్యాస్తమయం: 5.43.

రెండో రోజూ ఎదురుకాల్పులు

- కాల్పులతో దద్దరిల్లిన పూజారి కాంకేర్ అడవులు
- 12 మృతదేహాలను బీజాపూర్ తరలించిన పోలీసులు
- కీలక నేతలు తప్పించుకున్నట్లు అనుమానాలు
- భారీగా ఆయుధాలు, రాకెట్ లాంచర్ల స్వాధీనం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ అడవులు రెండో రోజైన శుక్రవారం కూడా కాల్పుల మోతతో దద్దరిల్లాయి. ఊసూరు, పామేడు పోలీస్‌స్టేషన్ల పరిధి పూజారి కాంకేర్, మారేడుబాక, తుమ్మిరేల, సింగంపల్లి, మల్లంపెంట అడవుల్లో మావోయిస్టులు సమావేశమయ్యారన్న సమాచారంతో సుమారు 1,500 భద్రతా బలగాలు బుధవారం రాత్రి నుంచి కూంబింగ్ సాగిస్తుండటం తెల్సిందే. ఇరువర్గాల మధ్య గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎదురుకాల్పులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మళ్లీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో తొలుత 12 మంది, ఆ తర్వాత 17 మంది మావోలు మృతి చెందారని ప్రచారం జరిగింది. అయితే ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రానికి 30 కి.మీ. దూరంలో, మండల శివారు గ్రామం పూసుగుప్పకు 10 కి.మీ. దూరంలోనే ఉంది. అక్కడి కి మీడియా వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే, పోలీసులు 12 మంది మావోల మృతదేహాలనే శుక్రవారం మధ్యాహ్నం బీజాపూర్‌కు తరలించారు. మృతుల్లో ఐదుగురు మహిళా మావోయిస్టులు, ఏడుగురు పురుషులు ఉన్నారు. వారిని గుర్తించాల్సి ఉంది. కాగా, ఎదురుకాల్పుల్లో మృతి చెందిన 17 మందిలో మరో ఐదుగురి మృతదేహాలను మావోలు తీసుకెళ్లి ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇలా ఉండగా, నారాయణపూర్ జిల్లా దర్బా క్యాంపు సమీపాన అటవీ ప్రాంతంలో శుక్రవారం మందుపాతర పేలి బీఎస్ఎఫ్ జవాన్లు తీవ్రగా గాయపడ్డారు. వీరిని నారాయణపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్పీ ప్రభాత్‌కుమార్ తెలిపారు.

పరుగెత్తించి మరీ..: పూజారి కాంకేర్ సమీపాన ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించగా బలగాలు వారిని మారేడుబాక వైపునకు పరుగెత్తించి కాల్చినట్లు సమాచారం. ఈక్రమంలో సుమారు నాలుగైదు కిలోమీటర్ల మేర పరుగెత్తించి కాల్పులు జరిపినట్లుగా తెలిసింది. కాగా, మృతుల్లో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) మొదటి బెటాలియన్‌కు చెందిన వారితో పాటు రెండో సెంట్రల్ రీజినల్ కంపెనీకి చెందిన మావోయిస్టులు ఉన్నారని పోలీసులు భావిస్తున్నారు.

తప్పించుకున్న మోస్ట్ వాంటెడ్స్

పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ చీఫ్, కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మాతో పాటు బాడ్సె దేవా ఈ ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ బెటాలియన్‌కు నేతృత్వం వహిస్తున్న హిడ్మా ఎదురుకాల్పుల్లో పాల్గొన్నా బలగాల నుంచి తప్పించుకుపోయాడని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. హిడ్మాతో పాటు సీఆర్‌సీ 2వ బెటాలియన్‌కు నేతృత్వం వహిస్తున్న బాడ్సె దేవా కూడా తప్పించుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ నేతలు మృత్యువాత పడ్డారనే ప్రచారం జరిగినా శుక్రవారం మృతదేహాలను పరిశీలించగా వారెవరూ లేరని నిర్ధారించినట్లు సమాచారం.



బలగాలు స్వాధీనం చేసుకున్న రాకెట్ లాంచర్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి

తుపాకులు, మందుగుండు సామగ్రి

పూజారి కాంకేర్ అడవుల్లో ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతంలో భారీగా తుపాకీలు, రాకెట్ లాంచర్లు, మందుపాతరలు లభ్యమయ్యాయి. రెండు 303 రైఫిళ్లు, ఒక 315 బోర్ రైఫిల్, నాలుగు నోస్ మజిల్ లోడింగ్ రైఫిళ్లు, 15 రాకెట్ లాంచర్లతో పాటు మూడు టిఫిన్ బాంబులను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అలాగే, విప్లవసాహిత్యం, నిత్యావసర వస్తువులు, టెంట్లు కూడా లభ్యమయ్యాయి.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలిన యువకుడు

- ఆస్పత్రికి తరలించేలోగా మృతి



విజయ్

కూసుమంచి: మైదానంలో క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు కుప్పకూలిపోగా, ఆస్పత్రికి తరలించేసరికి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కూసుమంచి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కూసుమంచి బ్యాటర్ తవసి విజయ్ (26) బ్యాటింగ్ చేస్తూ మైదానంలోనే కుప్పకూలిపోయాడు. దీంతో పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు సీపీఆర్ చేసి స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే విజయ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, విజయ్ తండ్రి రాజశేఖర్ కుటుంబంతో సహా 20 ఏళ్ల క్రితం చెన్నై నుంచి కూసుమంచి వచ్చి బేకరీ నడుపుతున్నారు. విజయ్ సూర్యాపేటలో ఆయన సోదరి వద్ద ఉంటూ సంక్రాంతి సెలవులకు కూసుమంచికి వచ్చాడు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సరిహద్దుల్లో నిఘా ఏర్పాటు చేశాం

- డీజీపీ జితేందర్



మహబూబ్‌నగర్ క్రైం: రెండు రోజుల నుంచి ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఆపరేషన్స్ కొనసాగుతున్న క్రమంలో తెలంగాణలోకి మావోయిస్టులు రాకుండా రాష్ట్ర సరిహద్దులో బలగాలతో పహారా కాస్తున్నామని, నిత్యం మావోయిస్టుల కదలికలపై నిఘా కొనసాగుతోందని డీజీపీ జితేందర్ చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టుల ఉనికి లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణ, కొత్త పోలీస్‌స్టేషన్ల భవనాల నిర్మాణంతో పాటు పాత వాటి మరమ్మతులపై చర్చ నడుస్తోందని, దీనిపై హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాలతో పాటు పగలు, రాత్రి దొంగతనాలు తగ్గించడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లడానికి పోలీస్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలిచ్చినట్లు జితేందర్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023తో పోలిస్తే 2024లో నేరాలు తగ్గుముఖం పట్టాయని, హత్యలు, అత్యాచారాలు, ఇతర ఐపీసీ కేసులను గణనీయంగా తగ్గించడానికి ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ అమలు చేసే చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీలు జానకి, యోగేశ్ గౌతం, ఏఎస్పీలు రాములు, రియాజ్ హుల్‌హక్, సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గిరిబాబు, సుదర్శన్‌రెడ్డి, లింగయ్య, సీఐలు పాల్గొన్నారు.

గోదారమ్మ చెంతకు మెస్రం వంశీయులు



గోదావరిలో పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు

సారంగాపూర్ (జగిత్యాల): ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు గోదావరి నీటిని తీసుకెళ్లేందుకు శుక్రవారం మెస్రం వంశీయులు జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కమ్మునూర్-జన్నారం మండలం కలమడుగు మధ్యన ఉన్న నది వద్దకు చేరుకున్నారు. పాదరక్షలు లేకుండా నిష్టతో 75 కిలోమీటర్లు కాలినడకన నదికి చేరుకున్నారు. ప్రతీ సంవత్సరం ఇక్కడి నుంచే గోదావరి నీటిని తీసుకెళ్లి ఆలయాన్ని శుద్ధి చేస్తారు. నదినీటితో దేవతలకు అభిషేకం నిర్వహించి, ఈనెల 29న అమావాస్య రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. మరుసటి రోజు జాతర ప్రారంభమవుతుంది.

నేలమాళిగలో మావోయిస్టుల ఆయుధాల కేంద్రం

కూంబింగ్‌లో గుర్తించిన బలగాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వరుస ఎన్‌కౌంటర్లతో నష్టపోతున్న మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ.. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భద్రతా దళాలు శుక్రవారం విస్తృతంగా గాలిస్తుండగా మావోయిస్టుల ఆయుధాల తయారీ కేంద్రం బయటపడింది. బయటకు కనిపించకుండా నేలను తవ్వి బంకర్ ఏర్పాటు చేసుకుని అందులోనే లేత్ మిషన్ ద్వారా మావోయిస్టులు ఆయుధాలు తయారు చేస్తున్నట్టుగా అక్కడి పరిస్థితుల ఆధారంగా తెలుస్తోంది. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి తుమిరెల్లి దండకారణ్యంలో తాలిపేరు నది సమీపంలో ఉన్న అడవిలో ఇది బయటపడింది. డీఆర్‌జీ విభాగం జవాన్లు తీసిన వీడియోల ద్వారా శుక్రవారం రాత్రి ఈ విషయం వెలుగుచూసింది. ఈ బంకర్‌లో ఉన్న మెషినరీతో దేశీ రాకెట్ లాంచర్లు, మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నట్టుగా అనుమానిస్తున్నారు. దీనికి సమీపంలోనే బాంబులు పేల్చడానికి ఉపయోగించే సిల్వర్‌వైర్లు కూడా కనిపించాయి. నేలను తవ్వి భూమిలో ఈ వైర్లు పాతిపెట్టి ఆపై ఐరన్‌షీట్లు అమర్చారు. పైనుంచి చూస్తే ఏమీ కనిపించకుండా ఆయుధాల తయారీ కేంద్రాన్ని చేశారు. గతంలో కూడా మావోయిస్టులు ఉపయోగించిన భారీ బంకర్లు బస్తర్ అడవుల్లో భద్రతా దళాల కంటపడ్డాయి.



మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న నేలమాళిగ



మావోయిస్టులు నేలలో దాచిపెట్టిన సిల్వర్ వైర్లు

రోజు గడవడం కష్టమై.. చీరే ఉరితాడై..

- ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య
- నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఘటన

దిలావర్‌పూర్: కడవరకూ కలిసుంటామని పెళ్లినాడు ప్రమాణం చేసిన ఆ దంపతులు.. చివరకు కలిసే తనువు చాలించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై సందీప్, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి భాస్కర్‌రెడ్డి (60), అనసూయ (52) దంపతులు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. రోజుగడవడం కూడా కష్టంగా మారడంతో మనస్తాపం చెందారు. ఇన్నేళ్లు కలిసే జీవించామని, కలిసే చనిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గురువారం ముధోల్‌లోని కంటి ఆస్పత్రికి వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లారు.



భాస్కర్‌రెడ్డి, అనసూయ

భార్య కట్టుకున్న చీరతోనే..

శుక్రవారం తెల్లవారుజామున దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ శివారుకు చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందును కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగారు. అనంతరం భార్యకు ఆచ్ఛాదనగా తన చొక్కాను ఇచ్చిన భాస్కర్‌రెడ్డి.. ఆమె ధరించిన చీరను తీసుకుని చెట్టుకు ఉరితాడుగా కట్టారు. దానికి ఇద్దరూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయం పశువుల కాపరులు గమనించి పోలీసులకు చెప్పారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి, ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యాభర్తల ఆత్మహత్య

- వికారాబాద్‌లో విషాదం

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రంలో భార్యాభర్తలు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పట్టణంలోని కొత్తగడికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి (30), వరుసకు మామ కూతురు అయిన అఖిలారెడ్డి (24)ని ప్రేమించి ఐదేళ్ల క్రితం పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల బాలుడు ఆరుష్‌రెడ్డి ఉన్నాడు. వీరు 25 రోజుల నుంచి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. శ్రీకాంత్‌రెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తుండగా.. అఖిల ఇంటి వద్దే ఉంటోంది. ఆరుష్‌రెడ్డికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో శుక్రవారం సాయంత్రం శ్రీకాంత్‌రెడ్డి తండ్రి గోవర్ధన్‌రెడ్డి మనుమడిని ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఇదే సమయంలో దంపతులు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గోవర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చి చూడగా కొడుకు, కోడలు విగత జీవులుగా కనిపించటంతో బోరున విలపించారు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.



శ్రీకాంత్, అఖిల

మరణంలోనూ వీడని బంధం

- భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి



లచ్చిరాం, లలిత

పాన్‌గల్: దంపతులు ఒకరి కోసం ఒకరు బతకడమే కాకుండా.. మరణంలోనూ తమఅనుబంధాన్ని నిలుపుకున్నారు. ఒకరోజు వ్యవధిలోనే భార్యాభర్తలు మృతిచెందిన విషాదకర సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన కేతావత్ లచ్చిరాం (55) ఈ నెల 15న అనారోగ్యంతో మృతిచెందాడు. అయితే భర్త మరణాన్ని తట్టుకోలేక బెంగతో ఒకరోజు వ్యవధిలోనే భార్య లలిత (52) సైతం గురువారం మృతిచెందింది. లచ్చిరాం దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నకిలీ విత్తనాలను అరికడదాం

- విత్తన కంపెనీలకు రైతు కమిషన్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రైతు సంక్షేమ కమిషన్ అభిప్రాయపడింది. శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని కార్యాలయంలో చైర్మన్ ఎం.కోదండరెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని విత్తన తయారీ కంపెనీల ప్రతినిధులతో కమిషన్ సమావేశమైంది. నకిలీ విత్తనాలను అరికట్టే అంశంతో పాటు నకిలీల విషయంలో సీడ్ కంపెనీలు జాగ్రత్తగా ఉండాలని, వాటిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని కమిషన్ పిలుపునిచ్చింది.

ట్రంప్ ప్రమాణానికి... జోరుగా ఏర్పాట్లు

సోమవారం బాధ్యతల స్వీకరణ ● వేడుకల్లో అధ్యక్షుడు బైడెన్, హారిస్

- ముగ్గురు మాజీ అధ్యక్షులు కూడా
- పలువురు దేశాధినేతలు, వీవీఐపీలు
- భారత్ తరఫున పాల్గొననున్న జైశంకర్
- నేటినుంచి 4 రోజుల పాటు కార్యక్రమాలు

వాషింగ్టన్: అగ్రరాజ్యాధినేతగా డొనాల్డ్ ట్రంప్ (78) రెండోసారి శ్వేతసౌధంలో అడుగుపెట్టేందుకు సర్వం సిద్ధమైంది. అమెరికా 47వ అధ్యక్షునిగా సోమవారం ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా శనివారం నుంచి నాలుగు రోజుల పాటు అట్టహాసంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ప్రమాణస్వీకార కమిటీ ప్రకటించింది. ''శనివారం బాణసంచా నడుమ కార్యక్రమాలు లాంఛనంగా మొదలవుతాయి. అనంతరం ఫ్లోరిడాలోని ట్రంప్ గోల్ఫ్ కోర్స్ బయట, వాషింగ్టన్ డీసీలోనూ పలు వీఐపీ ఈవెంట్లు జరుగుతాయి. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ) పేరిట విజయోత్సవ ర్యాలీలుంటాయి. సోమవారం ట్రంప్ ముందుగా సెయింట్ జాన్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం వైట్ హౌస్‌లో తేనీటి విందు జరుగుతుంది. ఆ తర్వాత కాపిటల్ భవనంలోని వెస్ట్ లాన్‌లో (స్థానిక కాలమానం ప్రకారం) ఉదయం 9.30 నుంచి ప్రధాన కార్యక్రమం ఉంటుంది. సంగీత కార్యక్రమాల అనంతరం ట్రంప్ లాంఛనంగా పదవీ ప్రమాణం చేసి అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారు. తర్వాత జె.డి.వాన్స్ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తారు. అనంతరం తన లక్ష్యాలు తదితరాలను వెల్లడిస్తూ అధ్యక్ష హోదాలో ట్రంప్ తొలి ప్రసంగం చేస్తారు. తర్వాత సెనేట్ చాంబర్లోని ప్రెసిడెంట్ రూమ్‌లో కీలక పత్రాలపై సంతకం చేయడంతో ప్రమాణ కార్యక్రమం ముగుస్తుంది. మధ్యాహ్నం తొలి అధికారిక విందు అనంతరం క్యాపిటల్ హిల్ భవనం నుంచి పెన్సిల్వేనియా అవెన్యూ మీదుగా వైట్‌హౌస్ దాకా ట్రంప్ పరేడ్‌గా వెళ్తారు'' అని వెల్లడించింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచీ ఏకంగా 2 లక్షల మంది సోమవారానికల్లా వాషింగ్టన్ చేరుకుంటారని కమిటీ తెలిపింది. నవంబర్ 6న జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ట్రంప్ ఘనవిజయం సాధించి రెండోసారి అధ్యక్షుడు కానున్నారు. 2017–2021 మధ్య తొలిసారి అధ్యక్షునిగా పని చేయడం తెలిసిందే.



అధికారిక ఫొటోల విడుదల

ప్రమాణస్వీకార సంబంధిత కార్యక్రమాల్లో ఉపయోగించేందుకు ట్రంప్, వాన్స్ అధికారిక చిత్రాలను తాజాగా విడుదల చేశారు. వాన్స్ చేతులు కట్టుకుని సరదాగా చిరునవ్వులు చిందిస్తుండగా ట్రంప్ ఫొటో అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. పెదాలు బిగించి, నుదురు చిట్లించి కెమెరా వైపు తీక్షణంగా చూస్తూ కనిపిస్తున్నారు. ఇది అచ్చం కాపిటల్ హిల్ దాడి కేసులో 2023లో ట్రంప్ న్యాయ విచారణకు హాజరైన సందర్భంగా పోలీసు అధికారులు తీసుకున్న ఆయన మగ్ షాట్‌ను పోలి ఉండటం విశేషం. రెండో టర్ములో సంప్రదాయ పోకడలను మరింతగా ధిక్కరించి తీరతానని ప్రతీకాత్మకంగా చెప్పేందుకు ట్రంప్ కావాలనే ఇలాంటి ఫొటోను ఎంచుకున్నారని భావిస్తున్నారు.

మాజీ అధ్యక్షులంతా హాజరు

సోమవారం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, కమలతో పాటు మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జి డబ్ల్యు.బుష్, బరాక్ ఒబామా కూడా పాల్గొంటారు. వీరిలో ఒబామా మినహా మిగతా వారంతా సతీసమేతంగా వస్తున్నారు. పలువురు దేశాధినేతలు, వీవీఐపీలు, ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా తరఫున ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ ప్రమాణ స్వీకారానికి హాజరవుతున్నారు. అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో పాటు ఐటీ, ఇతర దిగ్గజ సంస్థల అధినేతలు కూడా హాజరవుతున్నారు. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ (ఫేస్‌బుక్), జెఫ్ బెజోస్ (అమెజాన్) రూపంలో ప్రపంచ కుబేరుల్లో ముగ్గురు వేదికపై కనిపించనుండటం విశేషం. ట్రంప్ హయాంలో అమెరికా టెక్ బిలియనీర్ల అడ్డగా మారనుందని బైడెన్ తాజాగా తన వీడ్కోలు సందేశంలో హెచ్చరించడం తెలిసిందే.

హాలీవుడ్ ప్రత్యేక రాయబారులుగా గిబ్సన్ తదితరులు

నటులు జాన్ వొయిట్, మెల్ గిబ్సన్, సిల్వెస్టర్ స్టాలోన్‌లను హాలీవుడ్ ప్రత్యేక రాయబారులుగా నియమిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. నాలుగేళ్లుగా నేలచూపులు చూస్తున్న హాలీవుడ్‌ను బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నాల్లో వారు తనకు సహాయ సహకారాలు అందిస్తారని వెల్లడించారు. వీరిలో వొయిట్ చిరకాలంగా ట్రంప్‌కు మద్దతుదారు కాగా గిబ్సన్, స్టాలోన్ కూడా తాజా ఎన్నికల్లో ట్రంప్‌ను బలపరిచారు.

ప్రమాణస్వీకారానికి... మిషెల్ దూరం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మాజీ ప్రథమ మహిళ మిషెల్ ఒబామా దూరంగా ఉండనున్నారు. ఆమె భర్త, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హాజరవుతున్నా 150 ఏళ్ల సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తూ మిషెల్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవలే జరిగిన మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియలకు కూడా మిషెల్ హాజరు కాని విషయం తెలిసిందే. దాంతో ఒబామా దంపతులకు విభేదాలొచ్చాయని, త్వరలో విడాకులు తీసుకుంటారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అయితే వారి సన్నిహిత వర్గాలు ఈ వార్తలను ఖండించాయి. ఫేక్ నవ్వులు నవ్వలేకే ప్రమాణ స్వీకారానికి మిషెల్ దూరంగా ఉంటున్నారని తెలిపాయి. ఆమెతో పాటు డెమొక్రాట్లు నాన్సీ పెలోసీ, అలెగ్జాండ్రియా ఒకాసియో కోర్టేజ్ తదితరులు కూడా ట్రంప్ ప్రమాణస్వీకారానికి హాజరవడం లేదు. నాలుగేళ్ల కిందట జో బైడెన్ ప్రమాణ స్వీకారానికి ట్రంప్ కూడా గైర్హాజరవడం తెలిసిందే. తద్వారా వైట్‌హౌస్ సంప్రదాయాన్ని ఆయన ఉల్లంఘించారు.

జిన్‌పింగ్‌తో ట్రంప్ చర్చలు

బీజింగ్: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ''వ్యాపారం, వాణిజ్యం, టిక్‌టాక్ తదితర అంశాలపై జిన్‌పింగ్‌తో చక్కటి సంభాషణ జరిగింది. ప్రపంచాన్ని మరింత భద్రంగా మార్చడానికి చేయాల్సిందంతా చేస్తాం'' అని ట్రంప్ ఉద్ఘాటించారు. అధ్యక్షుడిగా రెండో టర్మ్‌లో చైనాతో సంబంధాలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వబోతున్నట్లు ప్రచారం సాగుతోంది.


ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు



ఇస్లామాబాద్: అల్ ఖదీర్ ట్రస్ట్ భూ అవినీతి కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు శుక్రవారం 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఆయన భార్య బుష్రా బీబీకి కూడా ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. ఇటీవలే బెయిల్‌పై విడుదలైన బుష్రాను తీర్పు రాగానే కోర్టు ఆవరణలోనే అరెస్టు చేశారు. ఇక ఇమ్రాన్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉండటం తెలిసిందే. అల్ ఖదీర్ ఉదంతంలో ప్రభుత్వ ఖజానాకు ఇమ్రాన్ దంపతులు కోట్లలో నష్టం కలిగించారంటూ పాక్ ఎన్‌ఏబీ 2023 డిసెంబర్‌లో కేసు నమోదు చేసింది. ఇమ్రాన్ ప్రధానిగా ఉండగా మాలిక్ రియాజ్ హుసేన్ అనే లండన్‌కు చెందిన పాక్ రియల్టీ వ్యాపారి నుంచి వసూలు చేసిన 19 కోట్ల పౌండ్లలో కొంత మొత్తాన్ని ఖజానాకు జమ చేయలేదన్నది, బదులుగా తమ అల్ ఖదీర్ వర్సిటీ ట్రస్టుకు హుసేన్ నుంచి 57 ఎకరాల భూమి తీసుకున్నారని ఎన్‌ఏబీ ఆరోపించింది.



లాంచ్‌ప్యాడ్ చేరుకున్న బూస్టర్



రాకెట్ శకలాలు

స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ రాకెట్... ప్రయోగం విఫలం

నింగిలో పేలిపోయిన పైభాగం ● క్షేమంగా తిరిగొచ్చిన బూస్టర్

టెక్సాస్: అంతరిక్ష ప్రయోగాల్లో దూసుకెళ్తున్న ఎలాన్ మస్క్ సంస్థ 'స్పేస్‌ఎక్స్'కు చేదు అనుభవం ఎదురైంది. స్పేస్‌ఎక్స్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ పునర్వినియోగ రాకెట్ 'స్టార్‌షిప్' ప్రయోగం విఫలమైంది. 123 మీటర్ల (400 అడుగులు) పొడవైన ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన కొద్దిసేపటికే పేలిపోయింది. శకలాలు కరీబియన్ సముద్రంలో పడిపోయాయి. రాకెట్ బూస్టర్ మాత్రం క్షేమంగా భూమిపైకి తిరిగివచ్చింది. టెక్సాస్‌లోని లాంచ్‌ప్యాడ్ హస్తాలు బూస్టర్‌ను చక్కగా ఒడిసిపట్టుకున్నాయి. టెక్సాస్‌లో మెక్సికో సరిహద్దులోని బొకా చికా బీచ్ నుంచి స్థానిక కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 4.37 నిమిషాలకు స్టార్‌షిప్ రాకెట్‌ను ప్రయోగించారు. ఇది 10 డమ్మీ శాటిలైట్లను నింగిలోకి మోసుకెళ్లింది. 8 నిమిషాల తర్వాత రాకెట్‌తో సంబంధాలు తెగిపోయాయి. స్పేస్‌క్రాఫ్ట్‌లోని ఆరు ఇంజన్లు ఒకదాని తర్వాత ఒకటి పనిచేయడం ఆగిపోయింది. రాకెట్ భూమిపైకి తిరిగి వస్తూ గాల్లోనే పేలిపోయింది. శకలాలు నిప్పుల వర్షాన్ని తలపించాయి. కేవలం ప్రయోగాత్మకంగానే స్టార్‌షిప్‌ను ప్రయోగించినట్లు స్పేస్‌ఎక్స్ అధికార ప్రతినిధి డాన్ హౌట్ చెప్పారు. బూస్టర్ క్షేమంగా తిరిగిరావడం సంతోషకరమే అయినప్పటికీ రాకెట్ పేలిపోవడం బాధాకరమని అన్నారు. ప్రయోగం విఫలమైనప్పటికీ ఇది స్టార్‌షిప్ విశ్వసనీయతను మరింత పెంచిందని తెలిపారు. ఇలాంటి వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తవహిస్తామని పేర్కొన్నారు. డమ్మీ శాటిలైట్లను అంతరిక్షంలో ఎలా వదిలిపెట్టాలన్న దానిపై సాధనకోసం స్టార్‌షిప్‌ను ప్రయోగించామని వివరించారు. మరోవైపు రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోతున్న దృశ్యాలను స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. విజయం సంగతి ఏమోగానీ వినోదం మాత్రం లభించిందని చమత్కరించారు. ఇంధనం లీకేజీ వల్లే రాకెట్ ప్రయోగం విఫలమైనట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్దది, శక్తివంతమైనది అయిన స్టార్‌షిప్ రాకెట్‌కు సంబంధించి ఇది ఏడో ప్రయోగం కావడం విశేషం. ఈ రాకెట్ సాయంతోనే అంగారక గ్రహంపై అడుగు పెట్టాలని ఎలాన్ మస్క్ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మరోవైపు చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించడానికి అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' రెండు స్టార్‌షిప్ రాకెట్ల కోసం ఇప్పటికే ఆర్డర్ ఇచ్చింది.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీన మొదలై ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆమెకిది వరుసగా 8వ బడ్జెట్! రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జనవరి 31వ తేదీన ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం ఆర్థిక సర్వేను కేంద్రం సభలో ప్రవేశపెట్టనుంది. సెషన్ రెండో భాగం మార్చి రెండో వారంలో మొదలై ఏప్రిల్ తొలి వారంలో ముగియనుంది.

విరాళంగా సగం సంపాదన

అమెరికా టెక్ దిగ్గజం జెఫ్ అట్‌వుడ్

వాషింగ్టన్: ''అమెరికాలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. ఇది చాలా అన్యాయం. ఆశ్చర్యకరరం'' అని ఆ దేశ టెక్ దిగ్గజం జెఫ్ అట్‌వుడ్ అన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు తన వంతుగా వచ్చే ఐదేళ్ల కాలంలో సగం సంపాదనను విరాళంగా ఇవ్వనున్నట్టు కుటుంబంతో సహా ప్రతిజ్ఞ చేశారు. అయితే ఆ మొత్తం ఎంతో వెల్లడించడానికి ఇష్టపడలేదు.

ఈడీది బాధ్యతారాహిత్యం

ధర్మాసనం ముందే కేంద్రం ఆగ్రహం ● సుప్రీంకోర్టులో అసాధారణ ఘటన

న్యూఢిల్లీ: దర్యాప్తు సంస్థల పనితీరును కొన్నిసార్లు కోర్టులు తప్పుబట్టడం పరిపాటే. కానీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి ప్రఖ్యాత దర్యాప్తు సంస్థ తీరును కేంద్ర ప్రభుత్వమే తప్పుబట్టిన అసాధారణ ఘటనకు సాక్షాత్తూ సుప్రీంకోర్టే వేదికైంది! ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంలో తనకు బెయిల్ ఇవ్వకపోవడాన్ని అరుణ్‌పతి తివారీ అనే ఇండియన్ టెలికాం సర్వీసెస్ ఆఫీసర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ కేసు శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. అయితే ఈ కేసులో తామెవరితోనూ సరైన సంప్రదింపులు చేయకుండా ఈడీ పూర్తి అసమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేసిందంటూ ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. దాంతో ఇది చాలా సీరియస్ అంశమంటూ ధర్మాసనం కూడా అసహనం వెలిబుచ్చింది. ''ఈడీ జవాబుదారీతనంపైనే ఈ ఉదంతం ప్రశ్నలు లేవనెత్తుతోంది. అన్నివిధాలా సరిచూసుకున్న మీదట కౌంటర్ సమగ్రంగా దాఖలు చేయాల్సిన బాధ్యత ఈడీ అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏఓఆర్)దే కదా'' అని వ్యాఖ్యానించింది. ఈ తప్పిదానికి ఏఓఆర్‌ను బాధ్యున్ని చేయలేమని ఏఎస్‌జీ బదులివ్వడంతో అయిష్టంగానే విచారణను చేపట్టింది. కానీ ''దీన్ని మేమింతటితో వదిలేయదలచుకోలేదు. మీ వ్యాఖ్యల నేపథ్యంలో, ఈడీ దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌తో మీకేమీ సంబంధం లేదని చెప్పదలచుకున్నారా?'' అని ఏఎస్‌జీని ప్రశ్నించింది. దాంతో అలాంటిదేమీ లేదని ఆయన బదులిచ్చారు. అఫిడవిట్‌ను ఓసారి సరిచూసుకోవాల్సి ఉందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. ''ఇది కేవలం సమాచార లోపమే. అయితే ఈడీ వంటి దర్యాప్తు సంస్థలో ఇటువంటి తప్పిదం జరగకుండా ఉండాల్సింది. దీనిపై శాఖాపరమైన విచారణ జరిపి బాధ్యుడైన అధికారిని ధర్మాసనం ముందు నిలబెట్టాల్సిందిగా ఈడీ డైరెక్టర్‌ను ఇప్పటికే వ్యక్తిగతంగా కోరాను. దయచేసి విచారణ కొనసాగించండి'' అని అభ్యర్థించారు. ధర్మాసనం మాత్రం విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

దుండగుడి కోసం వేట

- సైఫ్ అలీ ఖాన్‌పై దాడికి కారణం అండర్ వరల్డ్ కాదు: అధికారులు
- ఎవరినీ అరెస్ట్ చేయలేదని వెల్లడి

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడికి పాల్పడిన దుండగుడిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు వేట ముమ్మరం చేశారు. ప్రత్యేకంగా 35 పోలీసు బృందాలు ఆగంతకుడి కోసం గాలిస్తున్నాయి. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందని, ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఉన్నతాధికారులు తెలిపారు. దర్యాప్తుపై హోం శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడారు. 'పోలీసుల దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే చాలా ఆధారాలు లభించాయి. దుండగుడిని త్వరలో వారు పట్టుకుంటారు'అని తెలిపారు. ఇందుకు సంబంధించి వారిస్ అలీ సల్మానీ అనే ఓ కార్పెంటర్‌ను ప్రశ్నిస్తున్నట్లు అంతకుముందు ముంబై పోలీసులు ప్రకటించారు. ఘటనకు ముందు రెండు రోజులపాటు అతడు సైఫ్ ఫ్లాట్‌లోనే పనులు చేశాడన్నారు. విచారణ అనంతరం అతడికి దాడితో సంబంధం లేదని తేలడంతో వదిలేశామన్నారు. ఆగంతకుడికి ఎలాంటి నేర ముఠాలతోనూ సంబంధం లేదని అందిన ఆధారాలను బట్టి తెలుస్తోందని పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని బట్టి అతడు 1.37 గంటల సమయంలో మెట్ల ద్వారా ఇంట్లోకి చేరుకున్నట్లు వెల్లడైందన్నారు. అతడుదొంగతనానికి వెళ్లింది సైఫ్ ఇంట్లోకి అనే విషయం కూడా అతడికి తెలిసుండకపోవచ్చని చెప్పారు. కాగా, సైఫ్‌పై దాడి ఘటనతో అండర్ వరల్డ్ గ్యాంగ్‌లకు సంబంధం లేదని మహారాష్ట్ర హోం శాఖ ఉప మంత్రి యోగేశ్ కదమ్ స్పష్టం చేశారు. బెదిరింపులు వచ్చినట్లుగా సైఫ్ అలీ ఖాన్ సైతం ఎన్నడూ పోలీసులకు చెప్పలేదని, భద్రత కల్పించాలని కోరలేదని కూడా మంత్రి తెలిపారు. ఆయన అడిగితే భద్రత నిబంధనల మేరకు కల్పించి ఉండేవారమన్నారు. దాడి ఘటనకు చోరీ యత్నం మాత్రమే కారణమని వివరించారు. ఇలా ఉండగా, సైఫ్ ఇంట్లో చోరీకి యత్నించిన దుండగుడే ఈ నెల 14వ తేదీన బాలీవుడ్ మరో స్టార్ నటుడు షారుఖ్ ఖాన్ నివాసం వద్ద రెక్కీ కూడా నిర్వహించినట్లు ముంబై పోలీసులు అనుమానిస్తున్నారు.

సైఫ్ కోలుకుంటున్నారు: ఆస్పత్రి వర్గాలు

తీవ్ర కత్తి పోట్లకు గురైన సైఫ్ అలీ ఖాన్ కోలుకుంటున్నారని లీలావతి ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఆయన కొద్దిసేపు నడిచారని, వెన్నెముకకు తీవ్ర గాయమైనందున బెడ్ రెస్ట్ తీసుకోవాలని సూచించామని పేర్కొంది. ఆయనకు ఎలాంటి సమస్యా లేకుంటే మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని న్యూరో సర్జన్ డాక్టర్ నితిన్ డాంగే చెప్పారు. 'ఓ వైపు రక్తమోడుతూనే ఆయన ఆస్పత్రి లోపలికి సింహంలా నడుచుకుంటూ వచ్చారు. పక్కన కుమారుడు ఆరేడేళ్ల తైమూర్ మాత్రమే ఉన్నాడు'' అంటూ గురువారం వేకువజామున సైఫ్ చూపిన గుండెనిబ్బరాన్ని మెచ్చుకున్నారు డాక్టర్ డాంగే.

నేను, సైఫ్ అలీ ఖాన్..

గురువారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో రక్తంతో తడిచిన కుర్తాతో తాను తీసుకెళ్లిన వ్యక్తి నటుడు సైఫ్ అలీ ఖాన్ అనే విషయం లీలావతి ఆస్పత్రికి వెళ్లేదాకా తనకు తెలియదని ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రాణా చెప్పారు. ఆస్పత్రి గేటు వద్దకు వెళ్లాక అక్కడి గార్డుతో.. స్ట్రెచర్ తీసుకురా, నేను.. సైఫ్ అలీ ఖాన్‌ను అని ఆయన చెప్పాకనే ఆ విషయం తెలిసిందని రాణా శుక్రవారం ముంబైలో మీడియాకు తెలిపారు. 'సైఫ్ ఉంటున్న సద్గురు శరణ్ అపార్టుమెంట్ సమీపం నుంచి వెళ్తుండగా ఒక మహిళ, మరికొందరు తన ఆటోను ఆపారు. అనంతరం రక్తంతో తడిచిన కుర్తాతో ఓ వ్యక్తి ఆటోలో కూర్చున్నారు. ఆయనతోపాటు 8 ఏళ్ల బాలుడు, ఓ యువకుడు, మహిళ కూర్చున్నారు. మొదట వాళ్లు హోలీ ఫ్యామిలీ ఆస్పత్రికి వెళ్లాలనుకున్నారు. కానీ, సైఫ్ లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో, అక్కడికే ఆటోను పోనిచ్చాను. అక్కడికెళ్లాక సైఫ్ ఆస్పత్రి గేట్ వద్ద గార్డును పిలిచారు. దయచేసి స్ట్రెచర్ తీసుకురా..నేను, సైఫ్ అలీ ఖాన్ అని అన్నారు. అప్పుడు సమయం దాదాపు మూడైంది. ఏడెనిమిది నిమిషాల్లో అక్కడికి చేరుకున్నాం'అని రాణా వివరించారు. అప్పటి దాకా ఆయన సైఫ్ అలీ ఖాన్ అనే సంగతి గమనించలేదని చెప్పారు.

టిక్‌టాక్‌పై నిషేధం సబబే

అమెరికా సుప్రీంకోర్టు



వాషింగ్టన్: చైనాకు చెందిన సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్‌పై అమెరికాలో నిషేధం విధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం సమర్థించింది. ఈ నిషేధం ఆదివారం నుంచే అమల్లోకి రానుంది. చైనాలోని టిక్‌టాక్ మాతృ సంస్థ టిక్‌టాక్‌ను ఇతరులకు విక్రయించకపోతే నిషేధాన్ని అమల్లోకి తీసుకురావొచ్చని అమెరికా సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఒకవేళ ఇతరులకు విక్రయించిన పక్షంలో నిషేధం అవసరం లేదని వెల్లడించింది. టిక్‌టాక్‌తో చైనాకు సంబంధాలు ఎప్పటిలాగే కొనసాగితే అమెరికా జాతీయ భద్రత ప్రమాదంలో పడుతుందని, అందుకు తాము అనుమతించలేమని న్యాయస్థానం స్పష్టంచేసింది. అమెరికాలో టిక్‌టాక్ యాప్‌ను 17 కోట్ల మంది ఉపయోగిస్తున్నారు. టిక్‌టాక్‌పై నిషేధం విధించి వారి భావప్రకటనా స్వేచ్ఛను హరించవద్దన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, భావప్రకటనా స్వేచ్ఛ కంటే దేశ భద్రతే ముఖ్యమని సుప్రీంకోర్టు ఉద్ఘాటించింది. టిక్‌టాక్‌పై నిషేధం విధిస్తూ జో బైడెన్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న బాధ్యతలు చేపట్టబోతున్నారు. యాప్‌పై ఆంక్షలను 90 రోజులపాటు నిలిపివేసే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. ఈ అధికారాన్ని ట్రంప్ వాడుకొనే అవకాశం కనిపిస్తోంది.

కాల్పుల విరమణకు సై

ఇజ్రాయెల్ కేబినెట్ సిఫార్సు

జెరూసలేం: గాజాలో కాల్పుల విరమణపై సందిగ్ధత తొలగిపోయింది. కాల్పుల విరమణకు హమాస్–ఇజ్రాయెల్ మధ్య కుదిరిన ఒప్పందం అమలు దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఈ ఒప్పందాన్ని ఆమోదించాలంటూ ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ శుక్రవారం సిఫార్సు చేసింది. దీంతో ఈ ఒప్పందం ఫుల్ కేబినెట్ ఆఫ్ మినిస్టర్స్ కోర్టులోకి చేరింది. మంత్రివర్గం ఆమోదముద్ర వేస్తే గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమల్లోకి వస్తుంది. 15 నెలలుగా కొనసాగుతున్న సంక్షోభానికి తెరపడనుంది. హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు విడుదల కానున్నారు. వారంతా స్వదేశానికి చేరుకుంటారు. కాల్పుల విరమణ కోసం ఖతార్, అమెరికా మధ్యవర్తిగా వ్యవహరించాయి. హమాస్‌తోపాటు ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు ఒప్పించాయి. గాజాలో దాడులకు స్వస్తిపలకడానికి ఇజ్రాయెల్, బందీలను విడుదల చేయడానికి హమాస్ అంగీకరించాయి. అయితే, ఒప్పందం కుదిరిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ సైన్యం గాజాపై బాంబుల వర్షం కురిపించింది. కనీసం 72 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. ఒప్పందం అటకెక్కినట్లేనన్న ప్రచారం ఊపందుకుంది. గాజా ప్రజలు, బందీల కుటుంబ సభ్యుల్లో ఉత్కంఠ నెలకొంది. ఒప్పందాన్ని అమోదించాలంటూ ఇజ్రాయెల్ సెక్యూరిటీ కేబినెట్ సిఫార్సు చేయడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

గర్భిణులకు రూ.21 వేలు

మహిళలకు రూ.2,500

- రూ.500కే సిలిండర్
- ఢిల్లీలో బీజేపీ మేనిఫెస్టో విడుదల



నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహిళలపై బీజేపీ వరాల జల్లు కురిపించింది. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు 'మహిళా సమృద్ధి యోజన' కింద ప్రతినెలా రూ.2,500 చొప్పున అందిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా హామీ ఇచ్చారు. గర్భిణులకు రూ.21,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. పేద కుటుంబాలకు పంపిణీ చేసే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇవ్వడంతోపాటు హోలీ, దీపావళి పండుగలకు ఒక్కో సిలిండర్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. జె.పి.నడ్డా శుక్రవారం ఢిల్లీలో బీజేపీ సంకల్ప్ పత్రంలోని(మేనిఫెస్టో) మొదటి భాగాన్ని విడుదల చేశారు. మహిళలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, పేదల కోసం బీజేపీ చేపట్టే పథకాల గురించి వివరించారు. ఢిల్లీలో ప్రస్తుతం అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలన్నింటినీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఆయా పథకాలను మరింత ప్రభావవంతంగా అమలు చేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు అవినీతి నుంచి విముక్తి కల్పిస్తామని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడం ద్వారా పేదల సంక్షేమం, సుపరిపాలన, మహిళల గౌరవం, అభివృద్ధి, యువత, రైతుల సాధికారత, శ్రామిక వర్గాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. 60 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న వృద్ధులకు పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.2,500కు పెంచుతామని, వితంతువులు, వికలాంగులు, 70 ఏళ్లు దాటిని వృద్ధులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఢిల్లీలోనూ అమలు చేస్తామని, దీని ద్వారా 51 లక్షల మంది లబ్ధి పొందుతారని చెప్పారు. ఇందులో, ఢిల్లీ ప్రభుత్వం రూ.5 లక్షల ఆరోగ్య రక్షణను అందించనుండగా... కేంద్ర పథకంలో చేరడం ద్వారా మొత్తం రూ.10 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుంది. అటల్ క్యాంటీన్ యోజన కింద మురికివాడల్లోని పేదలకు రూ.5కే పౌష్టికాహారం అందిస్తామని నడ్డా ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొహల్లా క్లినిక్‌లను నకిలీ ఆరోగ్య సేవగా అభివర్ణించారు. బీజేపీ సంకల్ప్ పత్రంలో తమ పథకాలనే కాపీ కొట్టారని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు.

యువ ఓటర్లకు ఆప్ గాలం

విద్యార్థులకు ఉచిత బస్సు

- మెట్రో చార్జీల్లో 50 శాతం రాయితీ
- వెల్లడించిన ఆప్ చీఫ్ కేజ్రీవాల్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎలాగైనా తిరిగి అధికారం దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) యువతను ఆకట్టుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా కొత్త, విద్యార్థి ఓటర్లను ఆకర్షించేందుకు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అనేక హామీలను గుప్పిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మరో కొత్త హామీని ప్రకటించారు. తిరిగి అధికారంలోకి వస్తే పాఠశాలలు, కళాశాలల్లో చదివే పురుష విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, మెట్రో ఛార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తామని ప్రకటించారు. 'ఆప్ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత నిస్తుంది, డబ్బు లేని పేదలు చదువుకు దూరమయ్యారు, మళ్లీ మా ప్రభుత్వం ఏర్పడితే, పురుష విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ఇప్పటికే బాలికలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం'అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇప్పటికే ఢిల్లీ రవాణా కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న అన్ని ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమల్లో ఉండగా, ఇకపై పురుష విద్యార్థులకు వర్తింపజేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. ఢిల్లీలోని 1.55 కోట్ల ఓటర్లలో యువత 45 లక్షల వరకు ఉన్నారు. గత ఏడాది పార్లమెంట్ ఎన్నికల అనంతరం కొత్తగా ఎన్‌రోల్ చేసుకున్న ఓటర్లు 8.06 లక్షల మంది వరకు ఉన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే తాజా హామీని గుప్పించారని తెలుస్తోంది. విద్యార్థులకు మెట్రో ఛార్జీల్లో 50 శాతం రాయితీ విషయమై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు కేజ్రీవాల్ తెలిపారు. 'ఢిల్లీలోని విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు మెట్రోపైనే ఆధారపడుతున్నారు. సాధారణ విద్యార్థులకు ఇది ఖరీదైన విషయం. మెట్రో ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మధ్య 50:50 ఉమ్మడి ప్రాజెక్ట్. కాబట్టి, దీనికి అయ్యే ఖర్చును ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సమానంగా భరించాలి. రాయితీ తర్వాత వచ్చే ఖర్చును రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమానంగా పంచుకోవాలి. ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం. ఇందులో రాజకీయం లేదు'అని ఆయన పేర్కొన్నారు. గతంలోనే ఢిల్లీలోని దళిత విద్యార్థులకు ఉచిత విదేశీ విద్య కోసం అంబేడ్కర్ స్కాలర్‌షిప్‌ను కేజ్రీవాల్ ప్రకటించిన విషయం తెలిసిందే. విదేశాల్లో వివిధ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రయాణ, వసతి, చదువుకయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు సైతం ఈ పథకానికి అర్హులవుతారని తెలిపారు.

భారీ బ్యాటరీ ప్లాంట్‌ను చుట్టుముట్టిన అగ్ని జ్వాలలు

ఉద్యోగులను ఖాళీ చేయించిన అధికారులు



మోస్ ల్యాండింగ్: అమెరికాలోని కాలిఫోర్నియాలో దావానలం తీవ్రత తగ్గుముఖం పట్టేలా కనిపించడం లేదు. గురు వారం ప్రపంచంలోనే పెద్దదైన మోస్ ల్యాం డింగ్‌లోని బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్‌ను మంటలు చుట్టుముట్టాయి. దీంతో, అధికారులు కాలిఫోర్నియాకు 77 మైళ్ల దూరంలోని ఈ ప్లాంట్‌ను మూసివేశారు. ఆ చుట్టుపక్కల మోస్ ల్యాండింగ్, ఎల్క్‌హార్న్ స్లో ఏరియాల్లోని సుమారు 1,500 మందిని ఖాళీ చేయించారు. సమీపంలోని ఒకటో నంబర్ హైవేలో కొంత భాగాన్ని మూసివేశారు. టెక్సాస్‌కు చెందిన కంపెనీ విస్ట్రా ఎనర్జీకి చెందిన మోస్ ల్యాండింగ్ పవర్ ప్లాంట్‌లో వేలాదిగా లిథియం బ్యాటరీలను నిల్వ ఉంచుతారు. సోలార్ ఎనర్జీని స్టోర్ చేయడానికి ఇవి చాలా అవసరం. ఈ బ్యాటరీలకు మంటలు అంటుకుంటే అదుపు చేయడం ఎంతో కష్టమని అంటున్నారు. అయితే, కాంక్రీట్ భవనంలోని బ్యాటరీలకు మంటలు వ్యాపించడం అంత సులువు కాదని చెబుతున్నారు. ప్లాంట్‌లోని సిబ్బందిని ముందుగానే ఖాళీ చేయించామని విస్ట్రా తెలిపింది.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 18 । జనవరి । 2025



చిన్నారుల పరిరక్షణే ధ్యేయంగా..
బాల్యం నుంచి పక్కదారి పట్టిన పిల్లలను ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించి వారి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. -8లో



ఆ పాత 'మధురం'..
నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని విశాలమైన, విలాసవంతమైన నివాస గృహాలు.. ప్రస్తుతం రెస్టారెంట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0/18.0
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుము కుంటుంది. గరిష్టంగా 28, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

తల్లీకూతుళ్లను బలిగొన్న టిప్పర్

మైలార్‌దేవ్‌పల్లి: మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన టిప్పర్ వాహనం ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తల్లి, ఆమె కుమార్తె దుర్మరణం చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీమ్, రుక్సానాబేగం (29) దంపతులు. వీరికి ముజామిల్, షిఫాబేగం (3) పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో లంగర్‌హౌస్ నుంచి ఫలక్‌నుమా కందికల్‌కు అజీమ్ తన ద్విచక్ర వాహనంపై భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్తున్నాడు. పల్లె చెరువు ప్రాంతానికి చేరుకోగానే పహాడీషరీఫ్‌కు చీరాల శివ టిప్పర్ వాహనంతో వెనక నుంచి అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న నలుగురూ రోడ్డుపై పడిపోయారు. తల్లి రుక్సానా బేగం, కూతురు షిఫాబేగంపై నుంచి టిప్పర్ వాహనం వెళ్లడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్ డ్రైవర్ శివను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.


రేషన్ కార్డుల సర్వేలో పారదర్శకత పాటించాలి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డుల జారీ కోసం ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెహిదీపట్నం మండలం విజయనగర్ కాలనీ, హుమాయున్ నగర్ కాలనీలో ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో తప్పులు లేకుండా బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. అర్హులను ఎవరినీ మిస్ చేయవద్దని, రిమార్కులు సరిగా రాయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్ ఉన్నారు.

ఫైరింగ్‌కు 'ముందు-వెనుక'!



లోపాలు బయటపెట్టిన అఫ్జల్‌గంజ్ ఫైరింగ్ ఉదంతం

- ఉన్న వాటిలోనూ నాణ్యత లేని ఫీడ్ రికార్డు
- 'ఫ్రెండ్లీ' పేరుతో తుపాకులకూ దూరంగా..
- మారకపోతే భవిష్యత్‌లో పెను సవాళ్లే



రోషన్ ట్రావెల్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న దుండగుడు



సరి చేయకుంటే.. సమస్యలెన్నో!



<u>సాక్షి, సిటీబ్యూరో:</u>

అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకున్న కాల్పుల ఉదంతం పోలీసు విభాగంలో ఉన్న కొన్ని లోపాలు ఎత్తి చూపింది. వీటిని సరి చేయకుంటే భవిష్యత్‌లో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తోంది. మొదటి సమస్య సీసీ కెమెరాలది కాగా... రెండోది 'ఫ్రెండ్లీ' పేరుతో ఆయుధాలకు దూరమైన పోలీసులకు సంబంధించింది. నేరగాళ్లు నానాటికీ అప్‌గ్రేడ్ అవుతూ, ఆధునిక ఆయుధాలను సమకూర్చుకుంటున్న ప్రస్తుత రోజుల్లో పోలీసు విభాగంలో ఉన్న లోపాలు సరి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ 'నేత్రాల'తో ఫలితం అంతంతే..

ఏ వేదికపై అవకాశం దొరికినా అధికారుల నుంచి నేతల వరకు అంతా రాజధానిలో ఉన్న సీసీ కెమెరాల అంశాన్ని ఊదరగొడతారు. లక్షల్లో కెమెరాలు ఉన్నాయని, ప్రపంచంలో ఆ స్థానం ఆక్రమించాం... దేశంలో ఈ స్థానంలో ఉన్నాం అంటూ గొప్పలు చెబుతుంటారు. వాస్తవ పరిస్థితులు మాత్రం మరోలా ఉన్నాయి. 2015 నుంచి రాష్ట్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ జోరందుకుంది. వివిధ స్కీంల కింద కొన్నేళ్ల క్రితం నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ప్రస్తుతం అనేకం పని చేయట్లేదు. మరోపక్క పని చేస్తున్న కెమెరాలు సైతం నాసిరకంగా ఉన్నాయి. ఈ కారణంగానే రాత్రి వేళల్లో, లైట్ల వెలుతురులో వాహనాల నంబర్లను ఇవి గుర్తించలేకపోతున్నాయి. ఈ కారణంగానే అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు దుండగుల్ని తీసుకువెళ్లిన ఆటోను గుర్తించడానికి పోలీసులు దాదాపు పది గంటలు శ్రమించాల్సి వచ్చింది. ఈలోపు దుండగులు నగరం నుంచి ఉడాయించారు.

ఆ సాంకేతికత ఉన్నట్లా.. లేనట్లా?

బంజారాహిల్స్ రోడ్ నెం.12 రూ.వందల కోట్ల ప్రజాధనం వెచ్చించి తెలంగాణ స్టేట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్మించారు. ఈ అద్దాల భవనం ప్రతిపాదన, శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సమయంలో అత్యాధునిక టెక్నాలజీకి కేరాఫ్ అడ్రస్ అంటూ ప్రచారం చేశారు. నగరంలోకి అడుగుపెట్టిన నేరగాళ్లు నేరం చేయకముందే చిక్కుతారని, ఓ వాహనం ఏ సమయంలో, ఏ ప్రాంతంలో, ఎన్నిసార్లు తిరిగిందో కేవలం కొన్ని నిమిషాల్లోనే కనిపెట్టేస్తామని.. ఇలాంటి అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. సీన్ కట్ చేస్తే.. 'అఫ్జల్‌గంజ్ ఆటో'ను కనిపెట్టడానికి దాదాపు పది గంటల సమయం పట్టింది. ఈ ఏడాది సీసీ కెమెరాలకు మరమ్మతులు, కొత్త కెమెరాల ఏర్పాటు, అనుసంధానానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు గతంలో ప్రకటించారు. దీంతో పాటు టెక్నాలజీ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆయుధం ఉంటే 'ఫ్రెండ్' కాదా?

నగర పోలీసులే కాదు... రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని విభాగాలు కొన్నేళ్లుగా ఫ్రెండ్లీ పోలీసింగ్ ముసుగు వేసుకుని పని చేస్తున్నారు. ఓపక్క జరగాల్సిన దారుణాలన్నీ జరిగిపోతున్నా... తాము మాత్రం ప్రజలతో సత్సంబంధాల కోసం స్నేహపూర్వక పోలీసింగ్ చేస్తున్నామని అంటున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసులు ఎవరూ తమ వద్ద తుపాకులు ఉంచుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. అందరి వద్దా ఉన్న ఆయుధాలను హఠాత్తుగా దాచేశారు. ఇప్పుడు శాంతిభద్రతల విభాగం మాట అటుంచితే.. చివరకు టాస్క్‌ఫోర్స్ బృందాల వద్దా అవసరమైన ఆధాయుధాలు ఉండట్లేదు. ఓపక్క సిటీలో గన్ కల్చర్ పెరుగుతుండటం, మరోపక్క గతంలో 'సూర్యాపేట', తాజాగా 'అఫ్జల్‌గంజ్' ఉదంతాల నేపథ్యంలో కనీసం ప్రత్యేక బలగాలైనా ఆయుధాలు ధరించకపోతే ప్రజల మాట అటుంచి పోలీసులకే రక్షణ లేకుండాపోయే ప్రమాదం కనిపిస్తోంది.

హక్కులకు విలువ ఇచ్చే దేశాల్లోనూ..

ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులతో స్నేహపూర్వకంగా ఉండటానికి, మానవ హక్కులకు భంగం కలగకూడదనే ఆయుధాలను దూరంగా ఉంచుతున్నామని కొందరు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇక్కడ వీళ్లు గమనించాల్సిన కీలకాంశం ఏమిటంటే... అనేక పాశ్చాత్య దేశాల్లో మానవ హక్కులు, నిబంధనలు, మానవ జీవితాలకు ఎంతో విలువ ఇస్తారు. అలాంటి చోట్ల కూడా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసులు తమ వెంట కచ్చితంగా ఆయుధాలు ఉంచుకుంటారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులతో పాటు స్వీయరక్షణ కోసమూ తుపాకులు వినియోగిస్తుంటారు. ఆయా దేశాల్లో సత్వర న్యాయం, కఠిన చట్టాలు అమలులో ఉన్నా పోలీసులు తుపాకులతో తిరుగుతున్నప్పుడు ఇక్కడ ఎందుకు దూరంగా ఉంచారన్నది అంతుచిక్కని విషయమే. ఈ లోపాలను ఉన్నతాధికారులు వీలైనంత త్వరగా సరి చేసుకోకుంటే భవిష్యత్‌లో పెను సవాళ్లు ఉత్పన్నమవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గుడిమల్కాపూర్ మార్కెట్‌కు సరికొత్త హంగులు

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

గోల్కొండ: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్‌కు సరికొత్త హంగులు చేకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్‌గా తలారి మల్లేష్ ముదిరాజ్ నియమితులు కావడం రైతులకు మేలు చేకూర్చే విషయమన్నారు. మార్కెట్ కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. అంతేకాకుండా రాత్రి పూట వచ్చే రైతుల కోసం విశ్రాంత గదులు ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. కమీషన్ ఏజెంట్లు, మెండేదారులు రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చేవెళ్ల, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 50 ఎకరాల భూమి సేకరించి గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అక్కడికి తరలిస్తే మార్కెట్ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులకూ దూరభారం తగ్గుతుందన్నారు. మార్కెట్ అభివృద్ధికి, రైతుల ప్రయోజనాల కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, కాలె యాదయ్య, కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు కొందరికే!

- సమగ్ర కుటుంబ సర్వే వివరాలతోనే..
- 'ప్రజాపాలన'లో అర్జీ పెట్టుకున్న 5.43 లక్షల కుటుంబాలకు నిరాశేనా?

క్షేత్రస్థాయిలో పరిశీలించేది 83 వేల దరఖాస్తులే..

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి పంపిణీ చేయనున్న కొత్త రేషన్ కార్డులు కొందరికే అందనున్నాయి. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇటీవల నిర్వహించిన ఇంటింటి (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే వివరాల ఆధారంగా రేషన్ కార్డుల్లేని కుటుంబాలు గ్రేటర్ పరిధిలో 83,285 మాత్రమే ఉన్నట్లు అధికారులు లెక్కలు తీశారు. ఆ లెక్క మేరకే క్షేత్రస్థాయి సర్వే జరుపుతున్నారు. క్షేత్రస్థాయిలోనూ అర్హులుగా గుర్తించిన వారికే కొత్త రేషన్ కార్డులివ్వనున్నారు.

ఇదీ షెడ్యూలు..

- ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి సర్వే
- 21 నుంచి 24 వరకు వార్డు సభల్లో లబ్ధిదారుల వివరాల వెల్లడి
- 21 నుంచి 25 వరకు అర్హుల డేటా ఎంట్రీ
- 26 (రిపబ్లిక్ డే) నుంచి రేషన్ కార్డుల జారీ

పాతబస్తీలో ఎక్కువ

ఇంటింటి సర్వే మేరకు పాతబస్తీలోనే రేషన్‌కార్డుల్లేని కుటుంబాలు అధికంగా ఉన్నాయి. గ్రేటర్ పరిధిలోని ఆరు జోన్లలో చార్మినార్ జోన్‌లో, 30 సర్కిళ్లలో కార్వాన్ సర్కిల్‌లో అత్యధికంగా ఉన్నాయి.



జోన్ల వారీగా ఇలా..

జోన్	సర్వే జరగనున్న కుటుంబాలు
ఎల్బీనగర్	11,528
చార్మినార్	21,257
ఖైరతాబాద్	14,967
శేరిలింగంపల్లి	8,520
కూకట్‌పల్లి	12,580
సికింద్రాబాద్	12,959
కంటోన్మెంట్	1,474
మొత్తం	83,285

- సర్కిళ్ల వారీగా అత్యధికంగా కార్వాన్ సర్కిల్‌లో 7,254 కుటుంబాలు, ఆ తర్వాత చాంద్రాయణగుట్టలో 6,275 కుటుంబాలున్నాయి. అత్యల్పంగా అల్వాల్ సర్కిల్‌లో 1,047 కుటుంబాలున్నాయి.

ఎదురు చూస్తున్న వారెందరో?

నిజానికి గ్రేటర్ పరిధిలోని నాలుగు జిల్లాల పరిధిలో దాదాపు పది లక్షల మంది రేషన్ కార్డుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు నిర్వహించిన 'ప్రజాపాలన' కార్యక్రమాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా దాదాపు 5.43 లక్షలున్నారు. మిగతావారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేదు. ఇంటింటి సర్వే సైతం నూరు శాతం జరగలేదు. కొందరు సర్వేను వ్యతిరేకించారు. వారిలో రేషన్‌కార్డుల్లేని వారికి సైతం ఇప్పుడు అవి అందే పరిస్థితి లేకుండాపోయింది. కుటుంబ సర్వే మేరకు రేషన్‌కార్డుల్లేని కుటుంబాలను పరిశీలించి వారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.



పాత మార్గదర్శకాలే

2014లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రేషన్‌కార్డులు లేని వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని కూడా పరిశీలించి కార్డులు జారీ చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కానీ.. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో అంతుచిక్కడంలేదు.
- క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హుల జాబితాను వార్డుసభలో వెల్లడించి చర్చించాకే ఆమోదిస్తారని ప్రభుత్వం పేర్కొంది. అలా ఎంపికైన వారి జాబితాను జీహెచ్ఎంసీ పరిధిలో కమిషనర్ లాగిన్‌కు పంపుతారు. వాటిని పరిశీలించి కమిషనర్ పౌరసరఫాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపుతారు. పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి పేరు ఒక్క రేషన్‌కార్డులో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఒకే వ్యక్తి పేరు ఒకటికి మించి కార్డుల్లో ఉండటానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సభ్యుల చేర్పులు, తొలగింపులు సైతం చేయనున్నట్లు పేర్కొంది.

మూసీ పరిసర భవనాలకు 'స్మారక' గుర్తింపు

- నగరంలోని 5 చారిత్రక కట్టడాలకు డబ్ల్యూఎంఎఫ్ జాబితాలో చోటు
- హైకోర్టు, సిటీ లైబ్రరీ, ఉస్మానియా ఆస్పత్రి, సిటీ కాలేజ్, బ్రిటిష్ రెసిడెన్సీ
- నీటి సంక్షోభం, వాతావరణ మార్పులతో నిర్మాణాలకు ముప్పు
- పర్యావరణ పరిరక్షణ, భవనాలకు పునరుజ్జీవం అత్యవసరం
- వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్- 2025 నివేదిక విడుదల



సిటీ కళాశాల: 1865లో ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ మదర్సా దార్-ఉల్-ఉలూమ్ పేరుతో మొదట సిటీ స్కూల్‌ను ప్రారంభించారు. తర్వాత ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ దీన్ని సిటీ హైస్కూల్‌గా మార్చారు. ఈ పాఠశాలనే 1921లో ప్రస్తుతం ఉన్న భవనంలోకి మార్చి, 1929లో సిటీ కాలేజీగా నామకరణం చేశారు. 16 ఎకరాల్లో ఉన్న ఈ భవనాన్ని ఇండో-సార్సెనిక్ శైలిలో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ విన్సెంట్ ఎస్చ్ నిర్మించారు.

ప్ర'పంచ' సౌరభాలు!

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరికి చారిత్రక భవనాల మణిహారం దక్కింది. మూసీ నది పరిసర ప్రాంతాల్లోని అయిదు చారిత్రక భవనాలు ప్రపంచ స్మారక నిధి (వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్-డబ్ల్యూఎంఎఫ్)- 2025లో చోటు దక్కించుకున్నాయి. హైకోర్టు, సిటీ లైబ్రరీ, ఉస్మానియా ఆస్పత్రి, సిటీ కాలేజీ, బ్రిటిష్ రెసిడెన్సీ భవనాలకు ఈ గుర్తింపు దక్కడం గర్వకారణం. న్యూయార్క్ కేంద్రంగా పని చేస్తున్న లాభాపేక్షలేని సంస్థ డబ్ల్యూఎంఎఫ్ తాజా జాబితాను విడుదల చేసింది. నీటి సంక్షోభం, వాతావరణ మార్పుల కారణంగా ఆయా చారిత్రక భవనాలు ముప్పును ఎదుర్కొంటున్నాయని తెలిపింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదీ పునరుజ్జీవానికి సంకల్పించిన నేపథ్యంలో డబ్ల్యూఎంఎఫ్‌లో చోటు దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గుర్తింపుతో ప్రయోజనమేమిటి?

ప్రపంచవ్యాప్తంగా 200 కంటే ఎక్కువ నామినేషన్లు రాగా.. హైదరాబాద్ నుంచి అయిదు చారిత్రక భవనాలు ఎంపికయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకం, సంఘర్షణ, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న వారసత్వ, చారిత్రక భవనాలు, ప్రదేశాలను డబ్ల్యూఎంఎఫ్ గుర్తిస్తుంది. ఆయా కట్టడాలను సంరక్షించి, పునరుద్ధరిస్తే భావి తరాలకు అమూల్యమైన ఆస్తులుగా నిలపడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. పర్యావరణ క్షీణత, నిర్లక్ష్యం, ఆక్రమణలు, పట్టణ విస్తరణ కారణంగా ఆయా నిర్మాణాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రపంచ దృష్టికి తీసుకురావడమే ప్రధానోద్దేశం. విరాళాలు, నిధుల సమీకరణతో పాటు ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో ఆయా వారసత్వ కట్టడాల పునరుద్ధరణ చేపడుతుంది.

హైకోర్టు: ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ అప్పటి హైదరాబాద్ దక్కన్ సంస్థానానికి హైదరాబాద్ హైకోర్టును స్థాపించారు. తర్వాత 1956 నవంబర్ 5న రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం దీన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా మార్చారు. ఏపీ విభజన సమయంలో 2018 డిసెంబర్ 26న భారత రాష్ట్రపతి తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్‌లోని హైకోర్టును విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూసీ నది దక్షిణ ఒడ్డున ఉన్న హైకోర్టు భవనాన్ని ఎరుపు, తెలుపు రాళ్లతో సార్సెనిక్ శైలిలో నిర్మించారు. జైపూర్‌కు చెందిన శంకర్‌లాల్ హైకోర్టు నిర్మాణానికి ప్లాన్ రూపొందించగా.. స్థానిక ఇంజినీర్ మెహర్ అలీ ఫాజిల్ డిజైన్ చేశారు. 1915 ఏప్రిల్ 15న నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. 1919 మార్చి 31న పూర్తయింది. 1920 ఏప్రిల్ 20న హైకోర్టు భవనాన్ని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రారంభించారు.





బ్రిటిష్ రెసిడెన్సీ: జేమ్స్ అకిలెస్ కిర్క్ పాట్రిక్ నిర్మించిన సంపన్న భవనమే బ్రిటిష్ రెసిడెన్సీ. కిర్క్ పాట్రిక్ 1798-1805 మధ్యకాలంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ నివాసి. ప్రస్తుతం కోఠి మహిళా యూనివర్సిటీలోని భాగమే ఈ బ్రిటిష్ రెసిడెన్సీ. దీన్ని మ్యూజియంగా మార్చారు. ఈ భవనం ఒకప్పుడు హైదరాబాద్ నిజాం కోర్టుకు ఈస్ట్ ఇండియా కంపెనీ రాయబార కార్యాలయంగా ఉండేది. ఈ భవనం పల్లాడియన్ శైలిలో ఉంది.



ఉస్మానియా ఆస్పత్రి: దేశంలోని పురాతన ఆస్పత్రుల్లో ఒకటి అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్). 1919లో హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ దీన్ని స్థాపించారు. రూ.2 కోట్ల వ్యయంతో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ విన్సెంట్ జెరోమ్ ఎస్చ్, నవాబ్ ఖాన్ బహదూర్ మీర్జా అక్బర్ బేగ్‌లు ఇండో సార్సెనిక్ శైలిలో ఈ ఆస్పత్రిని నిర్మించారు.



సెంట్రల్ లైబ్రరీ: 1891లో స్కాలర్ మౌల్వీ సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామి తన వ్యక్తిగత గ్రంథాలయంగా అబిడ్స్‌లో ప్రస్తుతం ఉన్న జనరల్ పోస్ట్ ఆఫీసు స్థలంలో దీన్ని ఏర్పాటు చేశారు. తర్వాత అసఫ్ జాహీ రాజవంశం గౌరవార్థం అసఫియా స్టేట్ లైబ్రరీగా పేరు మార్చారు. 1932లో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ అఫ్జల్‌గంజ్‌లో 2.97 ఎకరాల స్థలంలో రూ.5 లక్షల వ్యయంతో లైబ్రరీని నిర్మించారు. అప్పట్లో దీన్ని కుతుబ్ ఖానా అసఫియా అని పిలిచేవారు. ఇందులో 5 లక్షలకు పైగా పుస్తకాలు, మేగజైన్లు, అరుదైన తాళపత్ర గ్రంథాలున్నాయి.

హెచ్ఎండీఏ భూసేకరణ షురూ

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో 156.02 ఎకరాలకు నోటిఫికేషన్
- భారీ లేఅవుట్‌కు సన్నాహాలు
- గతంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: భూముల అమ్మకాల ద్వారా గతంలో పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించిన హెచ్ఎండీఏ మరోసారి అదే తరహాలో భూ వేలానికి రంగం సిద్ధం చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్, తిమ్మాయిగూడ ప్రాంతంలో సుమారు 156.02 ఎకరాల భూమి సేకరణకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో రైతుల నుంచి భూములను సేకరించి భారీ లేఅవుట్‌లను అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. అదేవిధంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోనూ భారీ లేఅవుట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైతుల నుంచి సేకరించనున్న భూములపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా 30 రోజుల్లో తెలియజేయాలని తాజా నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. గతంలో హెచ్ఎండీఏ భూములతో పాటు, రైతుల నుంచి సేకరించిన భూముల్లోనూ లే అవుట్‌లను వేసి ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించారు. బుద్వేల్, కోకాపేట్, మోకిలా, బాచుపల్లి, ఉప్పల్ భగాయత్, బోడుప్పల్, తొర్రూర్, హయత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కొనుగోలుదార్ల నుంచి అనూహ్య స్పందన లభించిది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భూసేకరణ ముందుకు సాగలేదు. పైగా ఆన్‌లైన్ బిడ్డింగ్‌పైన కూడా అధికారులు వెనుకంజ వేశారు. రియల్‌ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధత దృష్ట్యా భూముల వేలం ప్రతిపాదనను విరమించుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో సేకరణకు చర్యలు చేపట్టడం గమనార్హం. రైతుల నుంచి సేకరించనున్న భూముల్లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి రైతులకు 60 శాతం భూములను తిరిగి ఇవ్వనున్నారు.మిగతా 40 శాతం భూములను హెచ్ఎండీఏ విక్రయించనుంది. అబ్దుల్లాపూర్‌మెట్ అనంతరం దశలవారీగా మిగతా ప్రాంతాల్లోనూ భూముల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎగ్జిబిషన్ సందర్శకులకు అందుబాటులో వైద్య సేవలు



హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ ఏటా నుమాయిష్‌లో సందర్శకులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాత్రి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన హెల్త్‌సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ...... ఈ కేంద్రంలో ఉచితంగా పలు సేవలు అందిస్తున్నారన్నారు. ఏటా వేలాది మంది సందర్శకులకు వైద్య కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎగ్జిబిషన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలతో పాటు వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యశోధ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లింగయ్య, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సీనియర్ సభ్యులు డాక్టర్ వంశీ తిలక్, ఎగ్జిబిషన్ సొసైటీ హెల్త్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ సంజీవ్‌కుమార్, అడ్వైజర్ డాక్టర్ జి.శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- పిల్లల హక్కులు, చట్టాల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- స్ట్రీట్ వెండర్స్ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలో బాల్యం నుంచి పక్కదారి పట్టిన పిల్లలను ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించి వారి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. వారి తల్లిదండ్రులకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి 'కన్వర్జెన్స్ ఆన్ ఆపరేషన్ స్మైల్ గీవ' సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల హక్కులు, చట్టాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులు, వీధి బాలలకు విద్య అందించడంతో పాటు వారి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వారి పరిస్థితి ఇలా మారడానికి కారణాలేమిటో పరిశీలించాలని సూచించారు. హాట్ స్పాట్ ఏరియాల్లో గస్తీ ఏర్పాటు చేసి రోడ్లపైకి వచ్చే పిల్లలను గుర్తించాలని, వారి ఆధార్, ఇతర డాక్యుమెంట్లు సేకరించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, 14 నుంచి 18 ఏళ్ల లోపు బాల కార్మికులను రక్షించి సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి, పిల్లలకు నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. జిల్లాను 28 జోన్లుగా విభజించి ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా పిల్లల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రీట్ వెండర్లు తమ పిల్లలతో వ్యాపారం చేయించడం నేరమని, ఇందులో భాగంగా వారి తల్లిదండ్రులతో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున పనుల్లో ఉన్న పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సూచించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శైలజ, డీసీపీ లావణ్య, ఐసీడీఎస్ పీడీ అక్కేశ్వరరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి జాన్సన్, ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ టెండర్లకు స్పందన కరువు!

పాత పద్ధతిలోనే కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టే యోచన

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా నిర్మించతలపెట్టిన ఇండోర్/ అవుట్ డోర్ సబ్‌స్టేషన్ల టెండర్ల కేటాయింపు ప్రక్రియను పాత పద్ధతిలోనే చేపట్టాలని డిస్కం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మాస్టర్ ప్లాన్ విభాగం హైదరాబాద్, రంగారెడ్డి జోన్ల పరిధిలో సుమారు రూ.175 కోట్ల అంచనాతో నిర్మించతలపెట్టిన 35 కొత్త సబ్‌స్టేషన్లకు నవంబర్ 28న గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. నిజానికి టెండర్ దాఖలు గడువు డిసెంబర్ 20తో ముగిసింది. టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గడువును జనవరి 23 వరకు పొడిగించారు. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచినా బడా కాంట్రాక్ట్ సంస్థల నుంచి ఆశించిన స్పందన లభించక పోవడంతో యాజమాన్యం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. పాత పద్ధతిలోనే కాంట్రాక్టులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. డివిజన్, సర్కిళ్ల వారీగా పనులను విభజించి టెండర్లు పిలవాలని భావిస్తున్నట్లు తెలిసింది. అనుభవం, ఆసక్తిని బట్టి ఒక్కో కాంట్రాక్టర్‌కు ఒకటి లేదా రెండు సబ్‌స్టేషన్లు అప్పగించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గ్లోబల్ టెండర్లను ఆహ్వానించడం ద్వారా పనిలో నాణ్యత లభిస్తుందని ప్రభుత్వం ఆశించింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: రైలు పట్టాలపై పడుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఖాళీ ఖబర్ ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (45) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి అవుషాపూర్-కొండమడుగు ప్రాంతానికి చేరుకున్నాడు. పట్టాలకు దూరంగా చెట్లలో బైక్ నిలిపిన అతను నేరుగా వెళ్లి రైలు పట్టాలపై పడుకున్నాడు. అదే సమయంలో వచ్చిన సికింద్రాబాద్- గుంటూరు ఇంటర్‌సిటీ రైలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- ప్రొఫెసర్ కుంభం మధుసూదన్‌రెడ్డి రచించిన 'మరపురాని జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం నారాయణగూడలోని భారత్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతుంది.
- శ్రీగురు యోగాలయం ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత శిక్షణ కార్యక్రమం జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో గాంధీ శిల్ప మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో ఉదయం 11 గంటలకు గాయకుడు సిఫర్ చే హాశియే జిందగీ కే గీతాలపన, సాయంత్రం 6 గంటలకు కథక్ నృత్య ప్రదర్శన, రాత్రి 8 గంటలకు మహమూద్ సాంగ్స్ అండ్ టాక్స్ కార్యక్రమాలు జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

షేక్‌పేట్ ఆకాశ్ ఇనిస్టిట్యూట్‌లో అగ్ని ప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

గోల్కొండ: షేక్‌పేట్, డ్యిక్స్ ఎవెన్యూ భవనంలో కొనసాగుతున్న ఆకాశ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రత్యక్ష సాక్షులు, అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఇనిస్టిట్యూట్ కిటికీల్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్, మాదాపూర్, లంగర్‌హౌస్ ఫైర్ స్టేషన్‌లకు చెందిన అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. అప్పటికే గ్రౌండ్ ఫ్లోర్‌లో కొనసాగుతున్న రిలయన్స్ ట్రెండ్స్‌లోకి కూడా మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ భవనం లోనుంచి మంటలు రావడంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో ఆకాశ్ ఇనిస్టిట్యూట్‌లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలి బూడిదయ్యాయి.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్..

అగ్నిప్రమాదంపై సమాచారం అందడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుని ఉండవచ్చునని హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే అలర్ట్ చేసే వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని భవన యజమానులకు సూచించారు. నిప్పంటుకున్న వెంటనే హైడ్రా డీఆర్ఎఫ్‌కు సమాచారం చేరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంటలను త్వరగా అదుపులోకి తెచ్చి ప్రమాదాన్ని నివారించిన డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

సినిమా ఛాన్స్ ఇప్పిస్తానని..

- మహిళపై లైంగికదాడి
- సహాయ దర్శకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: సినిమా ఛాన్స్ ఇప్పిస్తానని ఓ మహిళను హోటల్‌కు పిలిచి లైంగిక దాడికి పాల్పడిన సహాయ దర్శకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు..ఏపీకి చెందిన మహిళ (32) భర్తతో విడిపోయి నగరానికి వలస వచ్చింది. మణికొండలో ఉంటూ హౌస్ కీపింగ్ పని చేసేది. 15 రోజుల క్రితం ఆమె అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్ లో చేరింది. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పని చేసేందుకు కృష్ణానగర్ ప్రాంతంలో తెలిసిన వారిని వాకబు చేస్తుండగా సినిమాల్లో డైరెక్షన్ విభాగంలో పనిచేస్తున్న కాటేకొండ రాజుతో పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితం అతను ఆడిషన్స్ ఉన్నాయంటూ కృష్ణానగర్‌లోని హెవెన్ హోటల్‌కు ఆమెను పిలిపించాడు. మొదటి రోజు ఫొటోషూట్ చేసి మర్నాడు రావాలని చెప్పాడు. రెండో రోజు గదికి వెళ్లగా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజావాణికి 3053 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు అందాయి. వీటిలో 2691 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించినవి కావడం గమనార్హం. కొద్ది రోజుల క్రితం వరకూ ధరణి సమస్యలతో భూ వివాదాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువ సంఖ్యలో ప్రజావాణికి వచ్చేవి. శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 111, విద్యుత్ శాఖ కు సంబంధించి 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2691 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.జి చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు.

హెచ్‌సీయూకు ఆసియాలో 496వ స్థానం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆసియాలోనే టాప్ 500 యూనివర్సిటీలలో ఒకటిగా గుర్తింపు సాధించింది. ఆసియాఖండంలోని 24 దేశాలలోని 3,559 యూనివర్సిటీలలో 496వ స్థానం లో నిలిచింది. దీంతో హెచ్‌సీయూలో ఆసియాలోని టాప్ 14 శాతం విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు సాధించినట్లు శుక్రవారం ప్రకటించారు. స్టడీ అబ్రాడ్ ఎయిడ్ సంస్థ ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించింది. ముఖ్యంగా అధికారిక విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ స్థానం, ట్యూషన్ ఫీజు, ప్రవేశాల పరిస్థితి, అవసరమైన ఇంగ్లిష్ ప్రావీణ్యత, గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్ డిగ్రీల కోసం కోర్సుల నిర్వహణ, విదేశీ విద్యార్థుల ప్రవేశాలు వంటి అంశాల్లో ప్రగతి ఆధారంగా స్టడీ అబ్రాడ్‌ఎయిడ్ సంస్థ ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించింది.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరా ముఠా అరెస్ట్



అల్వాల్: మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీగా మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాచకొండ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిషనర్ జి.సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం, జోధ్‌పూర్‌కు చెందిన మహేష్ నేరేడ్‌మెట్ ప్రాంతంలో ఉంటూ చెందిన గ్యాస్ రిపేరీ పనులు చేసేవాడు. అతడికి జోధ్‌పూర్‌కు చెందిన డ్రగ్స్ వ్యాపారి షంసుద్దీన్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అతను ఈ నెల 10న రూ. లక్ష చెల్లించి 200 గ్రాముల హెరాయిన్ కొనుగోలు చేసి రైలులో నగరానికి తీసుకొని వచ్చాడు. సరుకును ఆర్‌కెపురంలోని తన స్నేహితుడు మహిపాల్ నివాసంలో దాచిన అతను స్నేహితుల ద్వారా తెలిసిన వారికి విక్రయిస్తున్నాడు. వినియోగదారుల నుంచి ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకుని ర్యాపిడో తదితర యాప్‌ల ద్వారా సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, నేరేడ్‌మెట్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 190 గ్రాముల హెరాయిన్, ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్లు, ఒక సిమ్‌కార్డు, తూకం వేసే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీబీ వలలో అవినీతి అధికారులు

ఏసీబీ అధికారులు శుక్రవారం ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు కల్యాణ లక్ష్మి చెక్కు మంజూరు చేసేందుకు రూ. 10 డిమాండ్ చేసి పట్టుబడగా, మరొకరు రిటైర్ ఉద్యోగి బెనిఫిట్స్ అందజేసేందుకు రూ. 17 డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే..

కల్యాణ లక్ష్మి చెక్కు కోసం రూ.10 వేలు డిమాండ్..



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌నాయక్

హస్తినాపురం: కల్యాణలక్ష్మి చెక్కు మంజూరు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన నల్లగొండ జిల్లా, డిండి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ నాయక్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిండీ మండలం, పడమటి తండాకు చెందిన పాండునాయక్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అతను తన కుమార్తె పెళ్లికి సంబంధించి కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో అతను ఆర్ఐ శ్యాంనాయక్‌ను కలిసి కల్యాణ లక్ష్మి నిధులు మంజూరు చేయించాలని కోరాడు. అయితే అందుకు ఆర్ఐ రూ. 10 వేలు డిమాండ్ చేశాడు. ఒప్పందం ప్రకారం రూ.5 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగతా మొత్తం ఇస్తేనే చెక్కు మంజూరు చేయిస్తానని ఆర్ఐ చెప్పడంతో అతను నల్లగొండ జిల్లా, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నల్లగొండ ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ సూచన మేరకు పాండునాయక్ శుక్రవారం హస్తినాపురం, ఊర్మిళానగర్‌లోని ఆర్ఐ శ్యాంనాయక్ ఇంట్లో అతడికి నగదు అందజేస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అతని ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. తనిఖీలకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు డీఎస్పీ నిరాకరించారు.

ఒకే రోజు ఇద్దరు ఉద్యోగుల పట్టివేత

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించేందుకు రూ.17 వేలు వసూలు



సంతోష్ తివారీ

సుల్తాన్‌బజార్: రూ. 3 వేలు లంచం తీసుకుంటూ కోఠి ఈఎస్ఐ ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ ఆర్.సంతోష్ తివారీ ఏసీబీకి పట్టుబడ్డాడు. పదవీ విరమణ పొందిన ఓ ఉద్యోగి బెనిఫిట్స్ కోసం సంతోష్ తివారి రూ.20 వేలు డిమాండ్ చేశాడు. రూ.17 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న అతను శుక్రవారం రూ.3 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు సంతోష్ తివారిని అరెస్ట్ చేసి నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: సనత్‌నగర్ 11కెవీ ఫీడర్, ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సౌభాగ్య నగర్, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, కైలాస్ నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలియజేశారు.

శ్రీకృష్ణ దేవరాయల పాలనను అనుసరించాలి

లిబర్టీ: నేటి పాలకులు శ్రీకృష్ణ దేవరాయల పాలనను అనుసరించాలని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కే.బి.శ్రీధర్ కోరారు. సుభిక్షమైన జన రంజకమైన పాలన సాగించి శ్రీ కృష్ణ దేవరాయలు చరిత్రలో మిగిలిపోయారని గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి పురస్కరించుకొని లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయల కాలంలో వజ్రాలు, రత్నాలు రాశులు పోసి అమ్మేవారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజలకు కావాల్సిన అవసరాలను అందించి గొప్ప చక్రవర్తిగా మిగిలిపోయారని అన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని ఆనాడు తెలుగు భాష గురించి ఆయన గొప్పగా చెప్పడం భాష పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ల నవీన్ కుమార్, పుష్పాంజలి, నంది కొండలరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ తదితరులు

ఖైరతాబాద్: రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సైఫాబాద్ పోలీసులు నెక్లెస్ రోడ్డులో వాహనదారులకు లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ఏసీపీ, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎస్. ఆనంద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరబోతుంది.. స్వరాష్ట్ర ఏర్పాటు తరువాత కొత్త రేషన్‌కార్డులు పేదలను ఊరిస్తూ ఇప్పటి వరకు చేతికంద లేదు. దీంతో చాలామంది పేదలు ప్రభుత్వ పథకాల్లో తెల్లరేషన్ ప్రామాణికం కావడంతో అనేక సంక్షేమ పథకాలకు నోచుకోలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కొత్తకార్డులు జారీ చేస్తామనే హామీ మేరకు కార్డుల జారీ ప్రక్రియ ముమ్మరం చేసి లబ్ధిదారులకు 26వ తేదీన కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని కసరత్తు చేస్తుంది. దీంతో ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని లబ్ధిదారులు చర్చించుకుంటున్నారు.



◆ గత ఏడాది నిర్వహించిన సమగ్ర కుటుంబ కుల గణన సర్వేలో వచ్చిన అప్లికేషన్లను 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌లో ఫిల్టర్ చేసి సర్కిల్‌–7 పరిధిలో 6,093 మందిని గుర్తించారు.

సర్వే ప్రక్రియ ప్రారంభం

- ఖైరతాబాద్‌లో కొత్తగా 6,093 రేషన్ దరఖాస్తులు
- 21లోపు సర్వేను పూర్తి చేయాలని ఆదేశం

బంజారాహిల్స్: రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్‌–7 పరిధిలో కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి సర్వే ప్రారంభమైంది. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, కులగణన సర్వే నివేదిక ఆధారంగా రాష్ట్రస్థాయి నుంచి పేర్లను హైదరాబాద్ జిల్లాకు పంపించగా జిల్లా నుంచి ఖైరతాబాద్ సర్కిల్‌–7 పరిధిలో ఉన్న రేషన్ షాపుల పరిధిలో దరఖాస్తుదారులను గుర్తించారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్‌–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 6,093 దరఖాస్తులను గుర్తించగా వీరి సర్వే ప్రారంభమైంది. ఖైరతాబాద్ సర్కిల్‌–7 పరిధిలో ప్రారంభమైన కొత్త రేషన్‌కార్డుల సర్వేను ఈ నెల 21లోగా పూర్తి చేయనున్నారు. ఈ పేర్లను డివిజన్ల వారీగా విభజించి ప్రత్యేక బృందాలతో సర్వే చేయిస్తున్నారు.

◆ ప్రతి డివిజన్‌కు మూడు బృందాలను ఏర్పాటు చేశారు.

◆ ఒక్కో బృందంలో ముగ్గురు ఎంక్వైరీ ఆఫీసర్లు ఉంటారు.

◆ ఇందులో జీహెచ్‌ఎంసీ నుంచి ఒకరు, రెవెన్యూ నుంచి ఒకరు, సివిల్ సప్‌లై ఆఫీసు నుంచి ఒకరు ఉంటారు.

స్థితిగతుల ఆధారంగానే...

ఖైరతాబాద్‌సర్కిల్‌–7 పరిధిలో ప్రస్తుతం 83,013 రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ ప్రజలు సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం నిర్వహించే సర్వేలో సిబ్బంది గుర్తించిన వారి ఇంటికి వెళ్లి వివరాలు ఆరా తీయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడు రేషన్‌కార్డు పొందడానికి అర్హుడా..కాదా..అని ఆరా తీస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఏడాది వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉంటే అర్హతగా తేల్చారు. దరఖాస్తుదారుడి పేరిట కారు ఉంటే ఆ వివరాలు నమోదు చేయాలని సూచించారు.

ఖైరతాబాద్‌లో తాజా కార్డుల పరిస్థితి..

మొత్తం రేషన్‌షాపులు	81
తెల్లరేషన్‌కార్డులు	79,531
అంత్యోదయ అన్న యోజన కార్డులు	3,481
అన్నపూర్ణ కార్డులు	1
మొత్తం కార్డులు	83,013
మొత్తం యూనిట్లు	2,92,882
నెలకు బియ్యం సరఫరా	18,19,011 కిలోలు..

బస్తీ సభల్లో జాబితా ప్రదర్శన

◆ సర్వే తరువాత ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే బస్తీ సభల్లో అర్హుల పేర్లను ప్రదర్శిస్తారు. అభ్యంతరాలు లేకుంటే అధికారులు అప్పుడే నమోదు చేస్తారు. ఈ నెల 20వ తేదీన ఉన్నతాధికారులు లాగిన్ నుంచి సంబంధిత అధికారులకు దరఖాస్తులు పంపిణీ తర్వాత లబ్ధిదారుల పేర్లు ఉన్నతాధికారులకు చేరనున్నాయి. ఈ నెల 26వ తేదీన కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేస్తారు.

◆ చాలామంది రేషన్ లబ్ధిదారుల పిల్లల పేర్లు రేషన్‌కార్డులో నమోదు కాలేదు. ప్రస్తుతం కొత్త కార్డుల జారీ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ప్రభుత్వ ఆదేశాలు వస్తే కుటుంబ సభ్యుల పేర్లు కార్డులో చేర్చనున్నారు.

◆ కుటుంబాల విభజనతో కొత్త కార్డులు కావాలని దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇప్పుడు చేస్తున్న సర్వే తర్వాత పాత కార్డుల్లో నుంచి తొలగిస్తారు.

◆ ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో ఆధార్ సంఖ్య ఆధారంగా కొనసాగుతుంది. కొత్త ఆశావహులే కాకుండా వివరాలు, మార్పులు (మ్యుటేషన్) చేయాలని కొన్నేళ్లుగా వేలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

◆ వీరి దరఖాస్తులకు ఇప్పుడు మోక్షం లభించనుంది.

ప్రభుత్వ స్థలంలో అక్రమ వ్యాపారాలు..!

నర్సరీ నిర్వహణపై పలు ఆరోపణలు



మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి స్థలంలో అక్రమంగా నర్సరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–14లోని శబ్దాలయ వెనుక మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెండునెలల క్రితం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు కూల్చివేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొంతమంది కబ్జాదారులు ఆ స్థలంలో అక్రమంగా షెడ్లు వేసి ప్రతినెలా అద్దెలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రాగా వాటిని కూడా నేలమట్టం చేశారు. అయితే ఇదే స్థలంలో ఓ నర్సరీని కొనసాగిస్తూ నెల నెలా అద్దె చెల్లిస్తున్నారు. ఈ నర్సరీని మాత్రం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు తొలగించలేదు. దీంతో నర్సరీకి ఒక రూల్, మాకో రూలా..? అంటూ ఇక్కడ వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు రెవెన్యూ అధికారుల తీరుపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన తర్వాత కూడా ఇక్కడ నర్సరీ ఎలా కొనసాగుతుందని ప్రశ్నిస్తున్నారు. దీనిపై షేక్‌పేట మండల అధికారులు మాత్రం తలాతోక లేని సమాధానాలు చెబుతూ కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నర్సరీ వ్యాపారి ప్రతినెలా కిరాయి ఎవరికి చెల్లిస్తున్నారనే దానిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కన్యగారి నర్సింహారెడ్డి

లిబర్టీ: ఆకాశాన్నంటే అందమైన భవనాలు నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగు లేదని తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కన్యగారి నర్సింహారెడ్డి అన్నారు. నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు చనిపోయిన నిర్మాణ కార్మికుల కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలో పని చేస్తూ వికలాంగుడైన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లించి ఆదకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల విద్యాభ్యాసం కోసం స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. అలాగే కార్మికుల హక్కుల కోసం రూపొందించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

బంజారాహిల్స్‌లో స్థల ఆక్రమణకు యత్నం

బంజారాహిల్స్: తమ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు ఆక్రమణను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–14లోని విష్ణు నివాస్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి విమల్‌కుమార్‌సింగ్‌కు బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–5లో మౌంట్ మేరు అపార్ట్‌మెంట్ పక్కన 1300 గజాల స్థలం ఉంది. 2012లో రెండో అదనపు చీఫ్ జడ్జి ఇచ్చిన డిక్రీ ఆధారంగా స్థలం యజమానులైన సయ్యద్ ఇబ్రహీం హసన్ కాజ్మీ అలియాస్ అస్లాం కాజ్మీ వద్ద నుంచి ఈ స్థలాన్ని 2013లో ఆయన కొనుగోలు చేశారు. అనంతరం తన భార్య సునీతాసింగ్ పేరుతో జీపీఏ చేశారు. అప్పటి నుంచి స్థలం వారి ఆధీనంలో ఉంది. కాగా ఈ స్థలంలోని 611 గజాలు తనదంటూ కెనడాలో ఉండే షకీర్ పేరుతో కొంతమంది స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. విమల్‌కుమార్ గతంలో షకీర్‌పై, అతని అనుచరులపై నగర పోలీసు కమిషనర్‌కు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కబ్జాదారులు వెనక్కి తగ్గారు. ఇదిలా ఉండగా శుక్రవారం తెల్లవారుజామున స్థానికంగా నివాసం ఉంటున్న అక్బర్‌పాటు సుమారు 15 మంది స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి స్థలం చుట్టూ ప్రహరీ పనులతోపాటు గేటు ఏర్పాటు చేసి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయడంతో స్థల యజమాని విమల్‌కుమార్‌సింగ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకోగా కొంతమంది పారిపోయారు. పనులు చేసేందుకు వచ్చిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విమల్‌కుమార్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ అడిగి బైక్, ఫోన్‌తో ఉడాయించాడు..

ఫిలింనగర్: ర్యాపిడో డ్రైవర్‌ను లిఫ్ట్ అడిగి బైక్‌తో పాటు సెల్‌ఫోన్‌తో ఉడాయించిన నిందితుడి కోసం ఫిలింనగర్ పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీకి చెందిన ఎం. హరిప్రసాద్ (26) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం సరూర్‌నగర్ నుంచి ఓ వ్యక్తిని తన ర్యాపిడో బైక్‌పై సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దింపి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆపి మీరు ర్యాపిడో డ్రైవరా..? అని అడిగాడు. ఔను అని చెప్పగానే తాను టోలిచౌకి వెళ్లాల్సి ఉందని, అక్కడి వరకు దింపితే తగిన డబ్బులు ఇస్తానని చెప్పడంతో హరిప్రసాద్ ఆ వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–12లోని ఎమ్మెల్యే కాలనీకి రాగానే టోలిచౌకి వెళ్లే దారి ఇరుకుగా, అడ్డదిడ్డంగా ఉంటుంది.. మలుపులు ఉంటాయి..నువ్వు కన్ఫ్యూజ్ అవుతావు..నేను బైక్ నడుపుతాను..వెనుక కూర్చోమని చెప్పాడు. నమ్మిన హరిప్రసాద్ ఆ వ్యక్తికి బైక్ ఇవ్వగా టోలిచౌకి వెళ్లిన తర్వాత పోడియం మాల్ ఎక్కడ ఉందో ఆ పాన్ డబ్బాలో కనుక్కో అంటూ హరిప్రసాద్‌కు చెప్పగా దిగి అడ్రస్ అడుగుతుండగానే సదరు వ్యక్తి బైక్‌తో ఉడాయించాడు. ఆ బైక్‌కు ర్యాపిడో ఆర్డర్లు బుక్ చేసుకోవడానికి సెల్‌ఫోన్ కూడా అమర్చి ఉందని, బైక్‌తో పాటు సెల్‌ఫోన్ కూడా పోయిందంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడి జాడ కోసం గాలిస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

క్రైమ్ పోలీసులను అభినందించిన బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి



దాసరి రక్షక్‌రాజ్..



తిరుమలరెడ్డి..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–2లోని ఇందిరానగర్‌లో ఇంటి తాళాలు పగులగొట్టి రూ.25 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనలో నిందితులు దాసరి రక్షక్‌రాజ్, వి.తిరుమలరెడ్డిలను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇందిరానగర్‌లో నివసించే లోవకుమారి కుటుంబంతో కలిసి ఈ నెల 12న సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామమైన రాజమండ్రికి వెళ్లింది. ఆమె ఇంట్లో కిరాయికి ఉంటున్న తిరుమలరెడ్డికి మూడు రోజుల క్రితమే 'గే' యాప్‌లో కార్మికనగర్‌కు చెందిన రక్షక్‌రాజ్ పరిచయం కాగా ఇద్దరూ కలిసి 13వ తేదీ రాత్రి మద్యం సేవించారు. తిరుమలరెడ్డి మద్యం మత్తులో ఉండగా రక్షక్‌రాజ్ ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, నగలతో ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా బంజారాహిల్స్ పోలీసులు ఆరు గంటల్లోనే దొంగతనానికి పాల్పడిన నిందితుడిని గుర్తించారు. 12 గంటల్లోనే మిస్టరీని ఛేదించి కార్మికనగర్‌లో ప్రధాన నిందితుడు రక్షక్‌రాజ్‌ను అరెస్టు చేశారు. మొత్తం సొత్తు రికవరీ అయ్యింది. సీసీ ఫుటేజీల ఆధారంగానే నిందితుడిని గుర్తించగలిగామని బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులను గుర్తించడంలో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర, డీఐ ఎస్‌ఎం బషీర్ అహ్మద్, క్రైమ్ పోలీసులు ఎండీ ముజఫర్ అలీ, వి.వెంకటేష్, కే సాయికుమార్‌లను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గంటల వ్యవధిలోనే మొత్తం సొత్తును రికవరీ చేయడం అభినందనీయమని ఆయన వీరి చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఫిలింనగర్‌లో బంగారు ఆభరణాల చోరీ

ఫిలింనగర్: సంక్రాంతికి ఊరెళ్లిన వారి ఇంటిని లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీలో నివసించే జి.రాధిక ఈ నెల 11వ తేదీన సంక్రాంతి పండుగ సందర్భంగా తన కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ జిల్లా పెద్దాముపురానికి వెళ్లారు. 12వ తేదీన ఆమె ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసించే లక్ష్మి ఫోన్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని రాధికకు చెప్పింది. వెంటనే అప్రమత్తమైన రాధిక ఒకసారి ఇల్లు చూసి రావాల్సిందిగా తన బంధువుకు తెలిపింది. వారు ఇంటికి వెళ్లి చూడగా అల్మారా తాళం కూడా పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి అదే విషయాన్ని తెలిపారు. దీంతో 13వ తేదీన ఇంటికి వచ్చిన రాధిక ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడమే కాకుండా అల్మారా తెరిచి ఉండి అందులోని బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించింది. దీంతో ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ స్కాంపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు నిధులు, అవినీతి ఒప్పందాలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త, మాజీ ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందు మేఘా, రాఘవ సంస్థలు ఎలక్టోరల్ బాండ్లు ఎవరికీ తెలియని ఇతర మార్గాల ద్వారా కాంగ్రెస్ పార్టీకి రూ. 148 కోట్లు అందించాయని జడ్సన్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయా కంపెనీలకు అనుకూలంగా ఉంటామన్న హామీ మేరకు ఈ విరాళాలు అందించాయన్నారు. అధికారంలోకి రాగానే ఈ రెండు కంపెనీలు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వ్యయం విపరీతంగా పెంచి ఎంతో లబ్ధిపొందారన్నారు. ఓ మంత్రి కుటుంబానికి చెందిన సంస్థకు ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు అప్పగిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా వీటిపై పూర్తి దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైన ఇత్తడి పూత.. లోపల ఇనుప కడ్డీలు

నకిలీ బంగారంతో మోసానికి యత్నం



ఇనాముల్ హసన్

ఫిలింనగర్: నకిలీ బంగారం బిస్కెట్లను అంటగట్టాలని చూసిన వ్యక్తిని ఓ వ్యాపారి ఫిలింనగర్ పోలీసులకు అప్పగించిన సంఘటన ఫిలింనగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... టోలిచౌకి అరవింద్‌నగర్‌లో నివసించే అబ్దుల్లా ఇబ్రహీం అనే వ్యాపారికి ఈ నెల 6వ తేదీన ఇనాముల్ హసన్ ఫోన్ చేసి తాను రాజస్థాన్ నుంచి వచ్చానని, ఎనిమిది కిలోల బంగారం తన వద్ద ఉందని చెప్పాడు. ఇబ్రహీం తనకు బంగారం అవసరం లేదని, ఇంకోసారి ఫోన్ చేయవద్దని చెప్పాడు. ఆ తర్వాత నాలుగైదుసార్లు హసన్ ఫోన్లు చేసి ఇబ్రహీంను బంగారం కొనాలని తీవ్రంగా ఒత్తిడి చేశాడు. ఈ నెల 16వ తేదీన మరోసారి ఇనాముల్ హసన్ తన వద్ద రెండు బంగారు బిస్కెట్లు ఉన్నాయని, కావాలంటే చెక్ చేసుకో అంటూ ఇబ్రహీంకు ఇచ్చాడు. వాటిని చెక్ చేయగా పైన ఇత్తడితో పూతపూసి లోపల ఇనుప కడ్డీ ఉన్నట్లుగా తేలడంతో వెంటనే నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ

జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్



బంజారాహిల్స్: వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ ఏర్పడుతుందని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు గోపి, నర్సింహ్మారావు, అశోక్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్‌–17 బరోడా బ్యాంక్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొదటి రోజున అవగాహన కలిగించిన ట్రాఫిక్ పోలీసులు రెండో రోజు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని కూడా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాలు నడిపితే ప్రాణాలు పోతాయని, తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకుని వాహనాలు నడుపుతామంటూ ఉల్లంఘనులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటికి భద్రంగా వెళ్లాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్నచిన్న తప్పిదాలతో పెద్ద ప్రమాదాలు జరుగుతాయని వాహనాలు నడిపే సమయంలో అలర్టుగా ఉండాలన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిని గుర్తించి అవగాహన కలిగించారు.

అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్‌–3లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు శుక్రవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, ఎస్‌ఐ సుమన్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేసుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని, దీని వల్ల ఎవరికీ నష్టం ఉండదని పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఇక్కడ ఇష్టానుసారంగా వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్ సజావుగా సాగకుండా అక్రమ పార్కింగ్‌లతో అడ్డంకులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇకముందు ఇలాంటివి జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని హితవు పలికారు.

నైపుణ్యాల మెరుగుతోనే ఉజ్వల భవిష్యత్

హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రాజేష్ ధర్మాని



కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రాజేష్

బంజారాహిల్: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నప్పుడే భవిష్యత్ మంచిగా ఉంటుందని హిమాచల్‌ప్రదేశ్ సాంకేతిక విద్య, వృత్తి విద్య, పారిశ్రామిక శిక్షణ శాఖ మంత్రి రాజేష్ ధర్మాని అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా, ఉపాధి రంగంలో నైపుణ్యాభివృద్ధి అనేది ఎంతో కీలకమైనదని విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు శోధనా సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌ను సందర్శించవచ్చునని తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఫిలింనగర్: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఫిలింనగర్ ఎస్‌ఐ వి.అంజనమ్మ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది పేకాటరాయుళ్లు రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడ్డారు. అయితే పోలీసుల విచారణ మారుతీనగర్‌లోని తన అపార్ట్‌మెంట్‌లో జి.గంగరాజు కొంతమందితో కలిసి పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గంగరాజుతో పాటు పల్లెల గోపాలకృష్ణ, సి.కిరణ్‌ప్రకాష్, కాసాల శివశంకర్, ఎం.ఐలేష్ యాదవ్, వేముల రాము, అలూరి రమేష్, చీరాల రాజు, గుర్రం వేణుగోపాల్, ఆర్.జగదీష్, సంగప్ప తదితరులను గేమింగ్ యాక్ట్ కింద అరెస్టు నుంచి వీరి వద్ద నుంచి రూ. 85,180 స్వాధీనం చేసుకున్నారు. 11 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శనివారం, 18, జనవరి, 2025



- ప్రముఖ స్పోర్ట్స్ బ్రాండ్‌తో శ్రీకాంత్ భాగస్వామ్యం
- ఇండోనేషియా మాస్టర్స్-2025 టోర్నీ నేపథ్యంలో కీలక ప్రకటన

హండ్రెడ్‌తో కిడాంబి..

సాక్షి, సిటీబ్యూరో: క్రీడలు విజయాలను సాధించడం, లక్ష్యాలను చేరుకోవడానికి మాత్రమే కాదు.. జీవన ప్రయాణాన్ని మరింత అద్భుతంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్ అన్నారు. అంతర్జాతీయ వేదికగా ప్రముఖ స్పోర్ట్స్ బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన హండ్రెడ్ స్పోర్ట్స్ సంస్థకు కిడాంబి శ్రీకాంత్ భాగస్వామిగా చేరారు. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా శుక్రవారం నిర్వహించారు. మరి కొద్ది రోజుల్లో జరగనున్న ప్రతిష్టాత్మక ఇండోనేషియా మాస్టర్స్ 2025 టోర్నీకి ఈ భాగస్వామ్యం అరంగేట్రం సంతోషకరమని అన్నారు. హండ్రెడ్ స్పోర్ట్స్‌తో భాగస్వామ్యంలో భాగంగా షూస్, బ్యాడ్మింటన్ రాకెట్స్ తయారీలో, డిజైన్ల రూపకల్పనలో తన సూచనలు సహాయపడవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ తరంలో క్రికెట్ తరువాత అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా బ్యాడ్మింటన్ చేరిందని, ఈ నేపథ్యంలో ఈ రంగానికి తనవంతు కృషి అందించడంలో భాగంగా ఈ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నానని తెలిపారు. ఇండోనేషియా మాస్టర్స్ అనంతరం థాయ్‌లాండ్ టోర్నీకి కూడా ప్రాక్టీస్ చేస్తున్నానని వివరించారు. భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దే అకాడమీపై ఇప్పుడే ఆలోచన లేదని, రిటైర్ అయ్యాక ఆలోచిస్తానని చెప్పారు. హండ్రెడ్‌తో శ్రీకాంత్ చేతులు కలపడం సంతోషకరమని హండ్రెడ్ ఇండియా డైరెక్టర్ విశాల్ జైన్ పేర్కొన్నారు. ఇవి మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులని, విదేశాల్లోనూ ఆదరణ పొందుతున్నప్పటికీ భారతీయ మూలాలలో హండ్రెడ్ ప్రారంభించామని తెలిపారు.

'ఇదిగో.. ఈ బార్ చూశావా ఇక్కడే నేను సినిమాలు చూసేవాడిని.. హేయ్.. ఈ పర్సనల్ క్యాబిన్స్.. మా బెడ్‌రూమ్..' ఇలా చెప్పకుంటూ చవులూరించే వంటకాలతో కలిపి తమ జ్ఞాపకాలను నెమరేసుకునే వారిలో పలువురు సంపన్న వ్యాపారులతో పాటు సినిమా సెలిబ్రిటీలు కూడా ఉండడం విశేషం. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని విశాలమైన, విలాసవంతమైన నివాసగృహాలు.. రెస్టారెంట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. వీటి గురించిన మరిన్ని వివరాలు.. - సాక్షి, సిటీబ్యూరో



- రుచికరమైన వంటకాలకు కేరాఫ్ అడ్రస్‌గా
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కొత్త ట్రెండ్
- రానా దగ్గుబాటి వంటి సినీతారల నివాసాలు సైతం అదేబాటలో
- అతిథులకు హోమ్లీ టచ్, ప్రశాంతమైన వాతావరణం



ఆ పాత మధురం..

కేఫ్స్, రెస్టారెంట్స్‌గా మారుతున్న సంపన్నుల నివాసగృహాలు

ప్రస్తుతం స్పెయిన్‌లో నివసిస్తూ ఫుడ్ అండ్ ట్రావెల్ బ్లాగర్‌గానూ పాపులర్ అయిన ఆశ్రిత ప్రముఖ నటుడు వెంకటేష్ కుమార్తె. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటితో కలిసి ఆశ్రిత దగ్గుబాటి ఇటీవల తాము సందర్శించిన ఓ రెస్టారెంట్ గురించి తన యూట్యూబ్ ఛానెల్‌లోని కొత్త వీడియోలో పంచుకున్నారు. అది గతంలో తమ దగ్గుబాటి కుటుంబానికి చెందిన పాత నివాసగృహం కాగా ఇప్పుడు రెస్టారెంట్‌గా మారింది. నాటి దగ్గుబాటి నివాసం.. ఇప్పుడు సరికొత్త ఇంటీరియర్‌లతో శాంక్చురీ బార్ అండ్ కిచెన్ అనే అత్యాధునిక రెస్టారెంట్‌గా మారిన తర్వాత ఆ ఇంటిని సందర్శించడం ఇదే తొలిసారి అని ఆశ్రిత తెలిపారు. కళాశాలలో చదువుతున్న సమయంలో ఆ పాత ఇంటిలో నివసించినట్లు ఆమె గుర్తు చేసుకున్నారు.





ప్రకృతి మధ్యకు..

ఇళ్లను రెస్టారెంట్లుగా మార్చడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. తమ పిల్లలు విదేశాల్లో నివసిస్తూ ఉండడంతో తాము ఇక్కడ ఒంటరిగా లంకంత ఇళ్ల నిర్వహణ చూడలేక లీజ్‌కి ఇస్తున్నట్టు కొందరు సంపన్న తల్లిదండ్రులు చెబుతున్నారు. మరోవైపు ఈ రెస్టారెంట్లు.. పన్నులు విద్యుత్ బిల్లులతో సహా ఎంత అద్దె అయినా సరే చెల్లించడానికి వెనుకాడడం లేదు. రెసిడెన్షియల్ ప్రాపర్టీ అన్వేషకులు అద్దె బదులు ఇఎమ్ఐలు చెల్లించడానికి ఇష్టపడతారు. కానీ ఈ కేఫ్స్ అద్దెలు ఎక్కువైనా సై అంటాయి. 'అని ఓ ప్రాపర్టీ యజమాని చెప్పారు. కరోనా తర్వాత కొన్ని కుటుంబాలు తమ ఆస్తులను లీజుకు ఇచ్చేసి నగరం నడిబొడ్డు నుంచి కాలుష్య రహిత ప్రాంతాలకు, శివార్లలోని విల్లాలకు తరలివెళ్లారు. 'నా జీవితాంతం కష్టపడి పనిచేశాను. ఇప్పుడు నేను ప్రకృతి నీడలో నివసించాలని కోరుకుంటున్నాను. అందుకే గండిపేటలోని మా అర ఎకరం స్థలంలో చిన్న ఇంటిని నిర్మించుకుని అక్కడకు మారాను' అని ఐదేళ్ల క్రితం జూబ్లీహిల్స్‌లో నివసించిన వ్యాపారి దినకర్ చెబుతున్నారు. మరికొందరు సినిమా సెలబ్రిటీలు.. గచ్చిబౌలి చుట్టుపక్కల ప్రాంతాలకు తమ నివాసాలను మారుస్తూ.. హిల్స్‌లోని తమ ఇళ్లను రెస్టారెంట్స్‌కి అద్దెకు ఇవ్వడం లేదా తామే రెస్టారెంట్స్, బ్రూవరీ.. వంటివి ఏర్పాటు చేయడం కనిపిస్తోంది.







నాటి ఇంట్లో.. నేటి రెస్టారెంట్లో..

'మా ఇంటికి స్వాగతం. నేను 20 సంవత్సరాల పాటు ఇక్కడే నివసించాను' అంటూ రానా సైతం గుర్తు చేసుకున్నారు. రానా, ఆశ్రిత ఆ రెస్టారెంట్లో తిరుగుతున్నప్పుడు గోడలపై రంగురంగుల కళాఖండాలు కనిపించాయి. కుటుంబ సభ్యులకు చెందిన వేర్వేరు గదుల్లో కలియ తిరిగారు. ఆ తర్వాత ఇద్దరూ తాము చాలా కాలం క్రితం నడిచిన బ్లాక్ రైలింగ్‌తో కూడిన స్పైరల్ చెక్క మెట్ల మీద నడిచారు. ఇంటి మొదటి అంతస్తు' అని రానా గుర్తు చేసుకున్నారు. మొదటి అంతస్తులో చాలా గాజు తలుపులు కనిపించాయి. ఇప్పుడు బార్‌గా ఉన్న ఆ ప్రదేశం గురించి చెబుతూ 'ఈ బార్ ఉన్న ప్లేస్‌లోనే అప్పట్లో నేను సినిమాలు చూసేవాడిని' అని రానా చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తన పాత బెడ్‌రూమ్‌లో బ్లాక్ షాండ్లియర్లు, రెస్టారెంట్ అతిథుల కోసం సీటింగ్స్ ఏర్పాటు చేశారు. రానాకు ఇష్టమైన బాల్కనీ ఇప్పుడు 'పిజ్జా ప్లేస్' గా మారింది.

హిల్స్‌లో.. ఇవే ట్రెండ్స్..

ఒక్క దగ్గుబాటి కుటుంబానికి చెందిన ఇల్లు మాత్రమే కాదు జూబ్లీహిల్స్‌లోని పలు ఇండిపెండెంట్ ఇళ్లు రెస్టారెంట్స్‌గా మారిపోతున్నాయి. రోడ్డు నెం.1, 10, 36, 45, 92లు మినహాయిస్తే మిగిలినవన్నీ నివాసప్రాంతాలే అయినప్పటికీ.. దాదాపు 350 దాకా వ్యాపార సంస్థలు నడుస్తున్నాయి. వాటిలో ఎక్కువ భాగం పబ్‌లు, బార్‌లు, కాఫీ హౌస్‌లు కాగా కొన్ని మాత్రం బొటిక్స్. జూబ్లీ హిల్స్‌లోని అనేక నివాసాలు ఇప్పుడు భారతీయ, ఇటాలియన్ జపనీస్ తదితర దేశ విదేశీ రుచికరమైన వంటకాలకు కేరాఫ్ అడ్రెస్. నగరంలో విశాలమైన స్థలంలో విలాసవంతంగా నిర్మించిన పలు నివాసాలకు ఒకేఒక చిరునామా జూబ్లీహిల్స్ అని చెప్పాలి. మరెక్కడా అంత చల్లటి, ప్రశాంతమైన వాతావరణం కనిపించదు.రెస్టారెంట్స్‌తో పాటు కేఫ్స్ సందర్శకులు, కేఫ్స్‌లో ఆఫీస్ వర్క్ చేసుకునే కార్పొరేట్ ఉద్యోగులు తరచూ ప్రశాంతమైన, హోమ్లీ వాతావరణాన్ని కోరుకుంటారు. అందుకే ఇక్కడ ఏర్పాటు చేస్తున్న కెఫేలు బాగా సక్సెస్ అవుతున్నాయి. ఐదారేళ్ల క్రితం ఒకటో రెండో కేఫ్స్ ఉండే పరిస్థితి నుంచి పదుల సంఖ్యకు విస్తరించడానికి ఈ పీస్‌ఫుల్ వాతావరణమే దోహదం చేసింది.



ఇళ్లను మారుస్తున్నారు..

గత కొంత కాలంగా ఈ ట్రెండ్ ఊపందుకుంది. మా రెస్టారెంట్ సైతం అలా ఏర్పాటు చేసిందే. మాలాంటి కొందరు పూర్తిగా రూపురేఖలు మారుస్తుంటే.. మరికొందరు మాత్రం స్వల్ప మార్పులకు మాత్రమే పరిమితమై ఇంటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా చూస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ని ఎంజాయ్ చేయడానికి జూబ్లీహిల్స్ ఒక మంచి ప్లేస్.
– సంపత్, స్పైస్ అవెన్యూ రెస్టారెంట్



31 నుంచి హైలైఫ్ ప్రదర్శన

హెచ్ఐసీసీలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి రెండు వరకూ వరుసగా మూడు రోజుల పాటు హైలైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మిస్ తెలంగాణ 2024 ప్రకృతి కంబం, నటి రితిక చక్రవర్తిలు శుక్రవారం ప్రకటించారు. ఫ్యాషన్ వేర్స్, జ్యువెలరీస్, యాక్సెసరీస్ ప్రదర్శనలో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
- సాక్షి, సిటీబ్యూరో



టెక్నాలజీ యుగంలో చేతిలో సెల్ ఫోన్ వాడుతున్న రోజుల్లో కలంతో దోస్తీ చేయిస్తూ.. చేతితో అక్షరాలను అందంగా రాయిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చేతిరాత శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ వంపు మల్లయ్య. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తూ ముందుకు సాగుతున్నాడు. జగద్గిరిగుట్ట, గాజుల రామారం, సూరారం, చింతల్ , షాపూర్ నగర్, జీడిమెట్ల ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేతిరాత నేర్చుకో.. మార్కులు పెంచుకో.. అనే నినాదంతో ఇంగ్లిష్ ల్యూసిడా, కర్సివ్ రైటింగ్, తెలుగులో పదాలు ఎలా రాయాలో సూచిస్తూ బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు సునాయస పద్ధతిలో, అందమైన చేతిరాతను నేర్పిస్తూ ప్రోత్సహిస్తున్నాడు. - జగద్గిరిగుట్ట



నగరంలోని జగద్గిరిగుట్టలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ల్యూసిడా, కర్సివ్ హ్యాండ్ రైటింగ్ శిక్షణను ప్రారంభించారు. విద్యార్థుల్లో మార్పు కనిపించడంతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లన్నను సంప్రదించడం, విద్యార్థులకు ఉచితంగా మెళకువలు నేర్పించడం మెదలుపెట్టాడు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు, ఇటీవలె ఓ ప్రభుత్వ పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్న మల్లయ్యను కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెమినీ కుమారి అక్కడికి వచ్చి అభినందించి సత్కరించారు.

ప్రాణ స్నేహితుడి పేరుతో..

మరణించిన ప్రాణ స్నేహితుడు జితేందర్ పేరుతో అకాడమీ స్థాపించి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెళకువలు నేర్పుతున్నారు. ఉచితంగా అనేక చేతిరాత శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇతనికి సహకారం అందిస్తున్నారు.

చేతనైనంత మేర..

చేతిరాత మారుస్తూ..

ఎక్కడ పోగొట్టుకున్నాడో.. అక్కడే వెతుక్కుంటూ..

సాంఘిక, గురుకుల సంక్షేమ పాఠశాలల్లో తెలుగు మీడియంలో చదవడంతో పాటు ఇంగ్లిష్‌లో దారాలంగా మాట్లాడలేక పోవడం వల్ల అనేక ఉద్యోగ అవకాశాలు వదులుకోవడంతో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత ఉన్నత చదువులు చదివి 'ఎక్కడైతే పోగొట్టుకొన్నామో అక్కడే వెతుక్కోవాలి అన్న పట్టుదలతో అదే ఆంగ్లంలో ల్యూసిడా, కర్సివ్ హ్యాండ్ రైటింగ్ శిక్షణ పొందారు. ఇప్పుడు ఆకర్షణీయమైన టెక్నిక్స్‌తో విద్యార్థుల చేతిరాతను మారుస్తున్నాడు. 'నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ దన్యవాదాలు. విద్యార్థులు చేతిరాతను నిర్లక్ష్యం చేయవద్దు. ఆసక్తి ఉన్న విద్యార్థులు శిక్షణ కోసం 9182989283 సంప్రదించవచ్చు' అని వంపు మల్లయ్య చెబుతున్నారు.

- ల్యూసిడా, కర్సివ్ హ్యాండ్ రైటింగ్ శిబిరాలు
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ
- విద్యార్థులలో ఆసక్తి పెంచుతూ.. చేతిరాతలో మెళకువలు
- ఆదర్శంగా నిలుస్తున్న జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ
- విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు



ఆత్మ స్థైర్యం పెరిగింది..

చేతిరాత శిక్షణ నాలో ఆత్మ స్థైర్యాన్ని పెంచింది. రానున్న పదో తరగతి పరీక్షలకు ఇప్పుడు సిద్ధంగా ఉన్నాను. గతంతో పోలిస్తే నా చేతిరాత మెరుగుపడింది.
– శ్వేత, 10వ తరగతి విద్యార్థిని



ఆకట్టుకుంటున్న కాలిగ్రఫీ ప్రదర్శన

పంజగుట్ట: మనం రాసే అక్షరాలు మన మనసుకు అద్దం పడతాయి. మన వ్యక్తిత్వం ఏమిటో మన చేతి రాతలో తెలుస్తుందంటారు. అలాంటి చేతిరాతను ఉర్దూ, ఇంగ్లిష్‌లో ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై శిక్షణ ఇస్తుంటారు. అదే కేంద్ర ఉన్నత విద్య, ఉర్దూ భాష జాతీయ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్రమంజిల్ లోని ఇదారే ఇ అదబియాత్ ఇ ఉర్దూ సెంటర్‌లోని కాలిగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్ ట్రెనింగ్ సెంటర్. ఈ సెంటర్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా కాలిగ్రాఫీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో 2022–2024 బ్యాచ్ విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రపంచ పురాతన కాలపు అక్షరాలు, ఇస్లామ్ పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్‌ను లిఖించిన అక్షరాలు, అరబిక్, ఉర్దూ, ఇంగ్లిష్ వివిధ ఫాంట్స్‌తో కాగితం, బియ్యం గింజ, మేక చర్మం, కోడిగుడ్డు, బాదాం గింజపై అద్భుత చిత్రాలను, ఖురాన్‌లో చెప్పిన ప్రవచనాలను ప్రదర్శించారు. దీంతో ఇంగ్లిష్ చేతిరాత ఎలా పెంపొందించుకోవాలి, ఒక లెటర్, పెళ్లి పత్రిక, చెక్‌బుక్‌పై ఎలా రాయాలి అన్న అంశాలను కూడా ఇక్కడ నేర్పుతారని నిర్వాహకులు ఎ.షుకుర్, సయ్యద్ రఫియుద్దీన్ ఖాద్రీ తెలిపారు.



వారం రోజుల శిక్షణ..

జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ మా పాఠశాలలో వారం రోజుల పాటు చేతిరాత శిక్షణా తరగతులను నిర్వహించింది. దీని వల్ల ల్యూసిడా రైంటిగ్‌పై ఆసక్తి పెరిగింది. రానున్న వార్షిక పరీక్షల్లో అధిక మార్కులు సాధిచగలననే నమ్మకం కలిగింది.
– దక్షిత, 10వ తరగతి విద్యార్థిని, జెడ్‌పీహెచ్ఎస్

సాక్షి రియల్టీ
శనివారం
18-01-2025

హాటెస్ట్ ట్రెండ్.. స్కై విల్లాస్!

ఆకాశమే హద్దుగా స్కై విల్లాల నిర్మాణం

- హెచ్ఎన్ఐ, ప్రవాసుల నుంచి ఆదరణ
- విస్తీర్ణత, వసతులు, భద్రత, ప్రైవసీ.. వీటి ప్రత్యేకత
- నగరంలో పెరుగుతున్న విల్లామెంట్ల నిర్మాణాలు
- ఒక్కో ఫ్లాట్ 6–16 వేల చదరపు అడుగుల విస్తీర్ణం





హైడ్రా భయం వద్దు

రెరా, నిర్మాణ అనుమతులు ఉంటే నిర్భయంగా కొనొచ్చు

జీపీ లేఔట్లు, అనధికారిక భవనాలతో ఎప్పటికైనా ముప్పే | ట్రిపుల్ ఆర్‌తో శివారు ప్రాంతాల్లో భూముల ధరల వృద్ధి | గృహ కొనుగోళ్లకు ఇదే సరైన సమయం

తక్కువ రేటు, నచ్చిన ప్రాంతాన్ని ఎంపిక చేసుకునే వీలు



'సాక్షి రియల్టీ'తో వాసవి గ్రూప్ సీఎండీ యెర్రం విజయ్ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, జలాశయాలను కాపాడాలన్న లక్ష్యంతో ఏర్పాటైనదే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా). నిర్మాణ అనుమతులు ఉన్న నివాస భవనాలను హైడ్రా కూల్చివేయదని ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు, రెరా నమోదిత ప్రాజెక్ట్‌లలో కొనుగోలుదారులు నిరభ్యంతరంగా కొనుగోలు చేయవచ్చని వాసవి గ్రూప్ సీఎండీ యెర్రం విజయ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ లేఔట్లు, అనధికారిక భవనాలు ఎప్పటికైనా ముప్పేనని, తక్కువ ధరకు వస్తుంది కదా అని వీటిల్లో కొనుగోలు చేస్తే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లేనని ఆయన స్పష్టం చేశారు. 'సాక్షి రియల్టీ' ఇంటర్వ్యూలోని మరిన్ని అంశాలివిగో..

- చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాతో దీర్ఘకాలంలో ప్రయోజనాలు చేకూరతాయి. వరదలు, నీటి కొరత, భూగర్భ జలాల తగ్గుదల వంటి ఇబ్బందులు తలెత్తవు. భావితరాలకు సమృద్ధిగా జల వనరులు, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది. బ్యాంక్‌లు, బీమా సంస్థలు ఎలాగైతే 'నో యువర్ కస్టమర్' (కేవైసీ) నిర్ధారించిన తర్వాతే సేవలు అందిస్తాయో.. అచ్చం అలాగే గృహ కొనుగోలుదారులు 'నో యువర్ లొకాలిటీ' (కేవైఎల్) ఆయా ప్రాంతం గురించి తెలుసుకున్న తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోవాలి.

కొనుగోళ్లకు ఇదే సరైన సమయం..

కొన్ని నెలలుగా మార్కెట్ ప్రతికూలంలో ఉండటంతో బిల్డర్లు రేటు తగ్గించి విక్రయిస్తున్నారు. గృహ కొనుగోళ్లకు ఇదే సరైన సమయం. దీంతో కస్టమర్లకు నచ్చిన ప్రాంతంలో, నచ్చిన ధరకు ఇళ్లు కొనుగోలు చేసే అవకాశం ఉంది. మూడు నెలలుగా మేజర్ వెంచర్లు ఉన్న ప్రాంతాల్లో విక్రయాలు బాగానే సాగుతున్నాయి. ఈ ఏడాది 10 వేల యూనిట్లను హ్యాండోవర్ చేయడంతో పాటు ముంబైలో 20 లక్షల చ.అ.ల్లో మూడు ప్రాజెక్ట్‌లను ప్రారంభించనున్నాం. రెసిడెన్షియల్, ఆఫీస్, కమర్షియల్ మూడు ప్రాజెక్ట్‌లను ఈ ఏడాది ప్రారంభించేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

ఎఫ్ఎస్ఐపై సీలింగ్..

ఐటీ హబ్‌తో పశ్చిమ హైదరాబాద్ మార్కెట్ ఎప్పుడూ బాగుంటుంది. ప్రస్తుతం ఈస్ట్ హైదరాబాద్ మార్కెట్‌కు ఆదరణ పెరుగుతోంది. మెట్రో కనెక్టివిటీ ఉండటమే ఈస్ట్‌కు కలిసొచ్చే అంశం. దీంతో పాటు అందుబాటులో భూములు, అపార్ట్‌మెంట్ల ధరలున్నాయి. పెద్ద ప్రాజెక్ట్స్ లేకపోవడంతో ధరలు నియంత్రణలోనే ఉన్నాయి. హైరైజ్ ప్రాజెక్ట్‌లతో డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుండటంతో భవన ఎత్తును పరోక్షంగా కట్టడి చేయాలి. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)పై ఆంక్షలు పెట్టే బదులు సీలింగ్ పెడితే బాగుంటుంది. ప్రస్తుతం రోడ్డు వెడల్పును బట్టి ఎంత బిల్టప్ ఏరియా వరకైనా నిర్మాణానికి అనుమతి ఇస్తున్నారు. అలా కాకుండా ఎకరానికి 2–3 లక్షల చ.అ. వరకే అనుమతి ఇవ్వాలి.

మూసీతో గ్లోబల్ సిటీ..

గ్లోబల్ సిటీగా బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకున్న హైదరాబాద్‌లో కంపుకొట్టే మూసీ నది ఉండటం శోచనీయం. విదేశీ పర్యాటకులు, పెట్టుబడులను ఆకర్షించాలంటే మూసీ సుందరీకరణ అనివార్యం. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయం. అయితే మూసీ పరివాహక ప్రాంతంలోని నివాసితులను ఒప్పించి ఆయా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. మూసీ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. అలాగే రెండో దశ మెట్రో విస్తరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మెరుగైన రవాణాతో నగరం సమాంతరంగా అభివృద్ధి చెందడంతో పాటు కొత్త మార్గాలు, ప్రాంతాల్లో రియల్ అవకాశాలు మెరుగవుతాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయి. రీజినల్ రింగ్ రోడ్డుతో శివారు ప్రాంతంలో భూముల ధరలు పెరగడంతో పాటు ఫ్యూచర్ సిటీతో శ్రీశైలం హైవే అభివృద్ధి చెందుతుంది.



అవును.. హైదరాబాద్ నిర్మాణ రంగం ట్రెండ్ మారింది. అపార్ట్‌మెంట్, విల్లా రెండింటినీ మిక్స్ చేస్తూ స్కై విల్లాస్ హాట్ కేక్‌లుగా అవతరించాయి. ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లోర్‌కు ఒక్క ఫ్లాట్ మాత్రమే, అది కూడా 6 వేల నుంచి 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. పైగా విలాసవంతమైన వసతులు, భద్రత, ప్రైవసీలతో కట్టిపడేస్తున్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్ఎన్ఐ), ప్రవాసులు స్కై విల్లాస్ కొనుగోలుకు ఆసక్తి చూపిస్తుండటంతో నగరంలో వీటి నిర్మాణాలు జోరందుకున్నాయి. గతంలో విలాసవంతమైన ఇళ్లలో నివసించాలనుకునేవారి కోసం విల్లాలు, బంగ్లాలు నిర్మించేవారు. వీటికి కొంత పరిమితులున్నాయి. భూమి ధర విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో డెవలపర్లకు ప్రధాన నగరంలో విల్లాలు, బంగ్లాలు నిర్మించడం సాధ్యం కాదు. దీంతో ఎత్తయిన అపార్ట్‌మెంట్లలో స్కై విల్లాలను నిర్మిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని పచ్చదనం, సిటీ వ్యూ అనుభూతిని కలిగిస్తుండటంతో ఎత్తయిన భవనాల్లో నివసించాలనే కోరిక పెరిగింది. దీంతో మల్టీ లెవల్ స్కై విల్లాలు నివాస సముదాయ విభాగంలో హాటెస్ట్ ట్రెండ్‌గా మారింది. జీవనశైలి పట్టణ వినియోగదారుల్లో ప్రజాదరణ పొందుతోంది.

– సాక్షి, సిటీబ్యూరో

Sky Villas

ప్రయోజనాలివీ

- విల్లామెంట్ ప్రయోజనాల్లో ప్రధానమైనది విల్లాలాంటి అనుభూతి. నివాసితులు విడిగా ఉన్న గేటెడ్ కమ్యూనిటీలో ఉండే వసతులు, సౌలభ్యాలను ఆస్వాదించవచ్చు. ఇందులో స్విమ్మింగ్ పూల్, జిమ్, పార్క్‌లు వంటి భాగస్వామ్య సౌకర్యాలతో పాటు భద్రత, నిర్వహణ సేవలు ఉంటాయి.
- డూప్లెక్స్ డిజైన్ బెడ్ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, లివింగ్, డైనింగ్ ఏరియాలతో పాటు ప్రైవేట్ టెర్రస్ లేదా గార్డెన్ ఉంటాయి. అదనంగా విల్లామెంట్లలో ప్రైవేట్ లిఫ్ట్, విశాలమైన కార్ పార్కింగ్ సౌకర్యాలుంటాయి.



- స్కై విల్లాస్ సాంప్రదాయ అపార్ట్‌మెంట్ కంటే ఎక్కువ స్థలం, ప్రైవసీని అందిస్తాయి.
- విల్లామెంట్ కాంప్లెక్స్‌లు సెక్యూరిటీ గార్డులు, సీసీటీవీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. నివాసితులకు సురక్షితమైన జీవనం, మనశ్శాంతిని అందిస్తాయి.
- విల్లాలాగే ప్రాపర్టీ మొత్తం నిర్వహణ వ్యయం యజమాని భరించాల్సిన అవసరం లేదు. విల్లామెంట్ల నిర్వహణ కమ్యూనిటీలోని అందరూ పాలుపంచుకుంటారు. దీంతో నివాసితులకు వ్యయం, సమయం ఆదా అవుతుంది.

స్కై విల్లాస్ అంటే?

విల్లాలు, అపార్ట్‌మెంట్ల డిజైన్, వసతులు ఒకే భవనంలో కలిపి ఉండేవే స్కై విల్లాలు లేదా విల్లామెంట్లు. సాధారణంగా విల్లాలు పెద్ద ఫ్లోర్ ప్లాన్, ఎక్కువ స్థలం కలిగి ఉండే స్వతంత్ర గృహాలు. వీటిల్లో లగ్జరీ వసతులు, ఔట్‌డోర్ స్పేస్ ఎక్కువగా ఉంటుంది. ఇక, అపార్ట్‌మెంట్లు చిన్నగా, సమూహంగా ఉంటాయి. వీటిల్లో నివాసితులు కామన్ ఏరియాలను షేరింగ్ చేసుకుంటారు. ఈ రెండు కాన్సెప్ట్‌లు కలిపి.. విల్లాలోని విశాలమైన స్థలం, లగ్జరీ, ప్రైవసీ, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని సౌకర్యాలు, భద్రత కలిపి డిజైన్ చేసేవే స్కై విల్లాస్. సరళభాషలో చెప్పాలంటే ఇదొక డూప్లెక్స్ అపార్ట్‌మెంట్.

ప్రైవసీ, ఆధునిక వసతులు..

- ఒక స్వతంత్ర బంగ్లా మాదిరి కాకుండా స్కై విల్లాలు భవనం మొత్తం అంతస్తులో విస్తరించి ఉంటాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ అంతస్తులో విస్తరించి ఉండే విశాలమైన బహుళ స్థాయి గృహాలే స్కై విల్లాలు. ఈ ప్రాజెక్ట్‌లలో జన సాంద్రత తక్కువగా ఉంటుంది కాబట్టి ప్రైవసీ, భద్రత ఎక్కువ. ఇంటి పరిమాణాన్ని బట్టి స్కై విల్లాలను ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఆటోమేషన్, టెక్నాలజీతో విలాసవంతంగా తీర్చిదిద్దవచ్చు.
- స్కై విల్లాల్లో చాలా వరకు నాలుగు వైపులా ఓపెన్ ప్లేస్ ఉంటుంది. దీంతో సూర్యరశ్మి, గాలి, వెలుతురు ధారాళంగా వస్తాయి. మంచి వెంటిలేషన్ ఉంటుంది. స్కై విల్లాలలో ప్రైవేట్ లాన్, సన్‌డెక్‌తో కూడిన ప్రైవేట్ పూల్, ప్రత్యేక లిఫ్ట్, సెంట్రల్ ఎయిర్ కండీషనర్, హోమ్ థియేటర్, లగ్జరీ బెడ్ రూమ్స్, కిచెన్, స్టాఫ్ క్వార్టర్స్ వంటివి ఉంటాయి. అలాగే బ్యాడ్మింటన్ కోర్ట్, గోల్ఫ్ కోర్స్‌లు, విశాలమైన పిల్లల ఆట స్థలాలు, విలాసవంతమైన క్లబ్‌హౌస్, కాఫీ షాప్, స్విమ్మింగ్ పూల్‌తో పాటు ల్యాండ్ స్కేప్ గార్డెన్, వాకింగ్ ట్రాక్స్ వంటి వాటితో ప్రశాంత వాతావరణం ఉంటుంది.

ఎక్కడ వస్తున్నాయంటే?

స్కై విల్లాస్ ధరలు అపార్ట్‌మెంట్ల కంటే 30–40 శాతం ఎక్కువగా, విల్లా కంటే 20–30 శాతం తక్కువగా ఉంటాయి. ఈ ప్రాజెక్ట్‌లోని ఫ్లాట్లు భారీ విస్తీర్ణంతో పాటు సకల సౌకర్యాలు ఉండటంతో వీటి ప్రారంభ ధర రూ.6 కోట్ల నుంచి ఉంటాయి. కొల్లూరు, ఉప్పల్, కోకాపేట, కొండాపూర్, నార్సింగి, పుప్పాలగూడ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఈ తరహా ప్రాజెక్ట్‌లు వస్తున్నాయి. 30–50 అంతస్తుల భవనాల్లో ఇలాంటి స్కై విల్లాలు నిర్మిస్తున్నారు. ఆకాశహర్మ్యాల్లో ఎత్తుకు వెళ్లే కొద్దీ నిర్మాణ వ్యయం పెరుగుతుంది. అందుకే ఖర్చును తగ్గించుకునేందుకు 6 వేల నుంచి 16 వేల చ.అ. విస్తీర్ణంలో ఒకటే ఫ్లాట్ ఉండేలా ప్రత్యేకంగా డిజైనింగ్ చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లోని పైఅంతస్తులో ఈ తరహా స్కై విల్లాలను కడుతున్నారు. సౌకర్యాలకు లోటు లేకుండా ఆకాశహర్మ్యాల్లో ప్రతీ గేటెడ్ కమ్యూనిటీల్లో ఉన్నట్లే క్లబ్‌హౌస్‌తో పాటు అన్ని రకాల ఆధునిక వసతులను కల్పిస్తున్నారు. ఒక్కో క్లబ్‌హౌస్ 50 వేల చ.అ.విస్తీర్ణంలో ఉంటుంది.





జూబ్లీహిల్స్‌లో బంగ్లా.. రూ.40 కోట్లు!

రూ.80 కోట్ల ఖరీదైన రెండు గృహాల విక్రయం | గతేడాది 59 అల్ట్రా లగ్జరీ యూనిట్ల అమ్మకం

వీటి విలువ రూ.4,754 కోట్లు: అనరాక్ ప్రాపర్టీ

సాక్షి, సిటీబ్యూరో: కరోనా తర్వాత నుంచి లగ్జరీ గృహాలకు ఆదరణ పెరిగింది. జూబ్లీహిల్స్‌లో రూ.80 కోట్ల ఖరీదైన రెండు బంగ్లాలు, ఒక్కోటి రూ.40 కోట్ల చొప్పున అమ్ముడుపోయాయి. గతేడాది దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో రూ.40 కోట్లకు పైగా విలువైన 59 అల్ట్రా లగ్జరీ గృహాల విక్రయాలు జరిగాయని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది. వీటి విలువ రూ.4,754 కోట్లు. వీటిలో 53 అపార్ట్‌మెంట్లు కాగా.. 6 బంగ్లాలు ఉన్నాయి.

- 2023లో సుమారు రూ.4,063 కోట్ల విలువైన 58 లగ్జరీ గృహాలు విక్రయించారు. మొత్తం అమ్మక విలువలో వార్షిక పెరుగుదల 17 శాతంగా ఉంది. 2024లో అమ్ముడైన అల్ట్రా లగ్జరీ గృహాలలో రూ.100 కోట్ల విలువైన యూనిట్లు 17 ఉన్నాయి. వీటి విలువ రూ.2,344 కోట్లు. గతేడాది 88 శాతం వాటాతో అత్యధికంగా ముంబైలో 52 అల్ట్రా లగ్జరీ యూనిట్లు సేల్ అయ్యాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో మూడు, బెంగళూరు, హైదరాబాద్‌లో రెండేసి గృహాలు అమ్ముడయ్యాయి.



అల్ట్రా లగ్జరీ గృహ విక్రయాలు	సంవత్సరం	యూనిట్ల సంఖ్య	(విలువ) అపార్ట్‌మెంట్లు	బంగ్లాలు
	2023	58	రూ.3,743 కోట్లు	రూ.320 కోట్లు
	2024	59	రూ.3,910 కోట్లు	రూ.844 కోట్లు

హెచ్ఎన్ఐ, ప్రవాసుల డిమాండ్

గత రెండేళ్లలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 130 అల్ట్రా లగ్జరీ గృహాలు విక్రయమయ్యాయి. వీటి విలువ రూ.9,987 కోట్లు. 2022లో రూ.1,170 కోట్ల విలువైన 13 యూనిట్లు అమ్ముడుపోయాయి. వీటిలో 10 అపార్ట్‌మెంట్లు కాగా మూడు బంగ్లాలు ఉన్నాయి. 2023లో రూ.4,063 కోట్ల విలువైన 58 యూనిట్లు అమ్ముడయ్యాయి. హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ), ప్రవాసులు వ్యక్తిగత వినియోగం, పెట్టుబడుల కోసం అల్ట్రా లగ్జరీ గృహాలను కొనుగోలు చేస్తున్నారు. ఇన్‌పుట్ వ్యయం పెరుగుదల, బలమైన కొనుగోలుదారుల డిమాండ్ కారణంగా మెట్రో నగరాలలో ఈ తరహా ఇళ్ల పెరుగుతున్నాయి. దీంతో గ్రేడ్–ఏ డెవలపర్లు అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలకు మొగ్గు చూపుతున్నారు.

టైర్–2 జోరు

విశాలమైన ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి

- రూ.2 కోట్లకు పైబడి ప్రాపర్టీలకు పెరిగిన శోధన

సాక్షి, సిటీబ్యూరో: కరోనా నేపథ్యంలో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ నేటికీ కొనసాగుతుండటంతో 'టైర్–2' ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని ప్రాపర్టీలకు డిమాండ్ ఏర్పడింది. ప్రధాన నగరంలో ఇరుకు ఇళ్ల మధ్య ఉండటం బదులు శివారు ప్రాంతాలకు, హరిత భవనాలు, విస్తీర్ణం ఎక్కువగా ఉండే గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు. కరోనా రెండో దశ ఉధృతి నేపథ్యంలో సూరత్, జైపూర్, పాట్నా, మొహాలీ, లక్నో, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఆన్‌లైన్‌లో ప్రాపర్టీల శోధన గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయని హౌసింగ్.కామ్ ఇండియన్ రెసిడెన్షియల్ ఇండెక్స్ ఫర్ ఆన్‌లైన్ సెర్చ్(ఐఆర్ఐఎస్) తెలిపింది. ఆయా ద్వితీయ శ్రేణి పట్టణాల్లో గృహ కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. నోయిడాలోని నోయిడా ఎక్స్‌టెన్షన్, ముంబైలోని మీరా రోడ్ ఈస్ట్, అంధేరి వెస్ట్, బోరివలీ వెస్ట్, బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతాలు ఈ ఏడాది దేశీయ నివాస సముదాయ మార్కెట్‌ను లీడ్ చేస్తాయని తెలిపింది.

మారిన అభిరుచులు..

ఆన్‌లైన్‌లో రూ.2 కోట్లకు పైబడిన ప్రాపర్టీల శోధన ఒకటిన్నర శాతం వృద్ధి చెందిందని పేర్కొంది. గతంలో ప్రాపర్టీ కొనుగోలు చేయాలంటే ధర, వసతులు ప్రధాన అంశాలుగా ఉండేవి. కరోనా తర్వాత నుంచి గృహ కొనుగోలుదారుల ఎంపికలో మార్పులొచ్చాయి. వైద్య సదుపాయాలకు ఎంత దూరంలో ఉంది? భద్రత ఎంత? అనే వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వైద్య సదుపాయాలు, భద్రత, ఓపెన్ స్పేస్ ఎక్కువగా ఉన్న ప్రాజెక్ట్‌లకు డిమాండ్ ఉంటుందని హౌసింగ్.కామ్ గ్రూప్ సీఈఓ ధ్రువ్ అగర్వాలా తెలిపారు. 3 బీహెచ్‌కే, ఆపై పడక గదుల గృహాల్లో అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే 2021లో 15 శాతం వృద్ధి నమోదయ్యిందని పేర్కొన్నారు. అదే సమయంలో గతేడాది పెద్ద సైజు ఫ్లాట్లలో 42 శాతం పెరుగుదల కనిపించింది.

అద్దెలకు గిరాకీ..

ప్రాజెక్ట్‌ల ఆలస్యం, దివాలా డెవలపర్లు వంటి ప్రతికూల వాతావరణంలోనూ నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో ప్రాపర్టీ శోధనలు గణనీయమైన స్థాయిలో పెరిగింది. నోయిడా ఎక్స్‌టెన్షన్ ప్రాంతం ఆన్‌లైన్ ప్రాపర్టీ సెర్చింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది.



కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు ఈ రీజియన్‌లో పలు మౌలిక సదుపాయ ప్రాజెక్ట్‌లను ప్రకటించడం, ధరలు అందుబాటులో ఉండటం వంటివి ఈ రీజియన్‌లో ప్రాపర్టీల వృద్ధికి కారణమని తెలిపింది. ఐటీ, ఫార్మా కంపెనీలు ఉద్యోగ నియామకాలను పెంచడంతో ముంబై, బెంగళూరు, ఢిల్లీ మార్కెట్లలో అద్దెలకు గిరాకీ పెరిగిందని పేర్కొంది. ఈ ఏడాది దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ వృద్ధికి మరీ ముఖ్యంగా నివాస సముదాయ మార్కెట్లో ముంబై, బెంగళూరు, హైదరాబాద్ అత్యంత కీలకంగా కానున్నాయని అంచనా వేసింది.

క్లుప్తంగా...

నేడు ఏసీబీ విచారణకు ఏస్‌నెక్స్ట్‌జెన్‌కో, గ్రీన్‌కో ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కారు రేసు కేసు దర్యాప్తులో భాగంగా శనివారం ఏసీబీ అధికారుల ఎదుట ఏస్‌నెక్స్ట్‌జెన్, గ్రీన్‌కో ప్రతినిధులు విచారణకు హాజరుకానున్నారు. ఫార్ములా ఈ రేసు నిర్వహణకు సంబంధించిన ఒప్పందాలు ఫార్ములా ఈ–ఆపరేషన్ లిమిటెడ్ (ఎఫ్‌ఈఓ), ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేటు లిమిటెడ్, పట్టణాభివృద్ధిశాఖ మధ్య జరిగాయి. ఇందులో సీజన్ 9కి ఏస్‌నెక్స్ట్‌జెన్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఏస్‌నెక్స్ట్‌జెన్ సంస్థకు మాతృ సంస్థ అయిన గ్రీన్‌కో నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో కొన్ని లావాదేవీలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ రెండు సంస్థల కార్యాలయాల్లో ఇటీవల సోదాలు నిర్వహించారు. ఆ సందర్భంగా స్వాధీనం చేసుకున్న కొన్ని పత్రాలు, ఇప్పటి వరకు దర్యాప్తులో గుర్తించిన అంశాల ఆధారంగా మరింత సమాచారాన్ని ఈ సంస్థల ప్రతినిధుల నుంచి సేకరించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రజల దృష్టి మరల్చేందుకే కేటీఆర్ ఎత్తుగడలు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: అవినీతి కేసుల్లో తాను ఎదుర్కొంటున్న విచారణ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ దీక్షలు చేస్తేనే కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా అమలు చేస్తోందని చెప్పుకునేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే దేశంలోనే ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమం కోసం పాటుపడుతోందని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సన్నధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ లాంటి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ మర్చిపోయిన ఇళ్లు, రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. రైతాంగానికి ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు.

లక్ష డప్పులతో యుద్ధం చేస్తాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



తొర్రూరులో చెప్పులు కుడుతున్న మంద కృష్ణ

తొర్రూరు: సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఎస్సీ వర్గీకరణ అమలుపై తాత్సారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై లక్ష డప్పులతో యుద్ధం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన 'వేల గొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో మాదిగలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అమలు చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మాలల ఒత్తిడితో జాప్యం చేస్తున్నారన్నారు. వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న సీఎం.. 11 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసి మాదిగ జాతికి ద్రోహం చేశారన్నారు. వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు, హరియాణా తొలి వరుసలో నిలిచాయని, ప్రస్తుతం రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయిందని పేర్కొన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగ డప్పు కొట్టడంతో పాటు చెప్పులు కుట్టారు. ఈ కార్యక్రమంలో మాదిగ నాయకులు సోమారపు ఐలయ్య, మంగళపల్లి శ్రీనివాస్, రామచంద్రయ్య, పాటమ్మ రాంబాబు, గిద్దె రాంనర్సయ్య, బరిగెల బాబు పాల్గొన్నారు.

పోలీసు విచారణకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



విచారణకు హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నాంపల్లి(హైదరాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించారన్న కేసులో శుక్రవారం మాసబ్ ట్యాంక్‌లో జరిగిన విచారణకు హాజరైన అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పోలీసులు తనను గంటపాటు విచారించారని, అడిగిన 32 ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్టు చెప్పారు. తానిచ్చిన స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలపై ప్రశ్నిస్తూనే ఉంటానని చెప్పారు.

ఎస్‌ఐకి జరిమానా..

'కోర్టు వద్దని చెప్పినా అరెస్టు చేస్తారా? న్యాయస్థానం ఉత్తర్వులంటే లెక్కలేదా? 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసి ఉద్దేశపూర్వకంగానే ధిక్కరణకు పాల్పడ్డారు. సదరు సబ్ ఇన్‌స్పెక్టర్ క్షమాపణ చెప్పినా ఆమోదయోగ్యం కాదు. వారం పాటు జైలుతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తున్నాం. అంతే కాదు.. బాధితుడికి రూ.50 వేలు పరిహారం చెల్లించాలి.'

– ఒక ఎస్‌ఐ తీరుపై హైకోర్టు ఆగ్రహం.

ఎంపీకి నోటీసులు..

'న్యాయవ్యవస్థపై నిరాధార ఆరోపణలు చేయడం క్షంతవ్యం కాదు. మీడియా సమావేశాల్లో ఇష్టం వచ్చినట్లు ఎలా మాట్లాడతారు? దీనిపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయండి.'

– ఒక ఎంపీకి కోర్టు ఆదేశం.

కలెక్టర్‌కు జైలు..

'ఆరోగ్య కార్యకర్తల వేతనాల చెల్లింపులకు సంబంధించి కోర్టు ఉత్తర్వులను 15 రోజుల్లో అమలు చేయని పక్షంలో కలెక్టర్ నెలరోజులు జైలుకు వెళ్లాల్సిందే. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలి. అలాగే మున్సిపల్ కమిషనర్‌కు 15 రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నాం.'

ఒక కలెక్టర్ తీరుపై న్యాయస్థానం మండిపాటు.

కోర్టు ఆదేశించినా ధిక్కరణ!

ఏటా పెరుగుతున్న కంటెంప్ట్ కేసులు


కోర్టుల సున్నితత్వాన్ని అలుసుగా తీసుకుంటున్న అధికారులు

తీర్పులు అమలుచేయకపోవటంతో బాధితుల ఇబ్బందులు

పెండింగ్‌లో 13,885 కోర్టు ధిక్కరణ కేసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు మెట్లెక్కాలంటేనే ప్రజలకు భయం.. తీర్పు కోసం ఎన్నేళ్లు ఎదురు చూడాలో అని. అలాంటిది ట్రయల్ కోర్టులో తీర్పు వచ్చి, అక్కడి నుంచి హైకోర్టుకు చేరిన పిటిషన్లలోనూ తీర్పు వచ్చిన తర్వాత కూడా.. దాని అమలులో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే ఎలా ఉంటుంది? అవును.. న్యాయస్థానాల ఉత్తర్వులను లెక్క చేయడం లేదు కొందరు అధికారులు. శిక్షలు విధించినా వారిలో మార్పు రావడంలేదు. కోర్టు ధిక్కరణ కేసులో శిక్షలు పడినా అప్పీళ్లలో తప్పించుకుంటున్నారు. దీంతో బాధితులు మరోసారి కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోంది. కోర్టు ధిక్కరణ కేసుల్లో న్యాయమూర్తులు అతిగా ఆవేశానికి లోను కావొద్దని.. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని సుప్రీంకోర్టు చేసిన సూచనలతో కింది కోర్టులు మానవతా దృక్పథంతో శిక్షలను మాఫీ చేస్తుండటంతో అధికారులు అదే అలుసుగా తీసుకుంటున్నారు. కోర్టు తీర్పు ఇస్తే అమలు చేసి తీరాలా? అని ప్రశ్నిస్తున్నారు. ఏటా పెరుగుతున్న కోర్టు ధిక్కరణ కేసుల గణాంకాలే అందుకు నిదర్శనం.

కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్స్ యాక్ట్ –1971 ప్రకారం కోర్టు ధిక్కరణ రెండు రకాలు. సివిల్, క్రిమినల్. ఈ చట్టంలోని సెక్షన్ 1 (15) ప్రకారం.. క్రిమినల్ కంటెంప్ట్ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు నేరుగా చర్యలు తీసుకోవచ్చు. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో దాఖలయ్యే ధిక్కరణ కేసుల్లో సివిల్‌వే ఎక్కువ. ఏదైనా కోర్టు తీర్పు, ఆదేశం లేదా ఇతర కోర్టు ప్రక్రియలను ఉద్దేశపూర్వకంగానే విస్మరించటాన్ని సివిల్ కంటెంప్ట్ ఆఫ్ కోర్టుగా పరిగణిస్తారు. క్రిమినల్ కంటెంప్ట్‌లో మూడు రకాలున్నాయి. ప్రచురణ రూపంలో, వ్యాఖ్యల రూపంలో, సంజ్ఞల రూపంలో కోర్టుల ఆదేశాలను ఉల్లంఘించినా, కోర్టులను అగౌరవపరిచినా, న్యాయ ప్రక్రియకు అడ్డుపడినా క్రిమినల్ కంటెంప్ట్ కిందికి వస్తుంది.



15 ఏళ్లయినా పరిష్కారం కాలేదు..

మా భూమిని ప్రభుత్వ భవనాలు నిర్మించడం కోసం దాదాపు ఒకటిన్నర దశాబ్దాల క్రితం నల్లగొండ జిల్లా కలెక్టర్ తీసుకున్నారు. పరిహారం తర్వాత అందిస్తామని చెప్పారు. ఇప్పటివరకు పరిహారం అందలేదు. కోర్టు చుట్టూ తిరిగి ఆదేశాలు తెచ్చుకున్నా స్పందన లేదు. ఇప్పుడు ధిక్కరణ పిటిషన్ వేశా. విచారణ కొనసాగుతోంది. 70 ఏళ్ల దాటిన వృద్ధుడిని. ఇంకా ఎన్నాళ్లు తిరగాలో..

– భువనగిరికి చెందిన ఓ బాధితుడు

కఠిన చర్యలు తీసుకుంటేనే తీర్పుల అమలు సాధ్యం



న్యాయం ఆలస్యమైతే న్యాయాన్ని నిరాకరించినట్లే.. అన్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ అయ్యర్ మాట న్యాయవ్యవస్థలో నేడు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కోర్టు మెట్లెక్కిన సామాన్యుడికి వీలైనంత త్వరగా న్యాయం అందించాలి. కోర్టు తీర్పులను కూడా అధికారులు అమలు చేయకపోతే ప్రజలు ఎక్కడికి పోవాలి? ఎన్నిసార్లు కోర్టులను ఆశ్రయించాలి? కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుంటే ఉద్యోగాలు పోతాయి అంటే తప్ప అధికారులు అమలు చేయరు. తీర్పులను అమలు చేయనివారికి కఠిన శిక్షలు విధించాలి.

– చిక్కుడు ప్రభాకర్, హైకోర్టు న్యాయవాది

రాష్ట్రంలో దోపిడీ ముఠా తిరుగుతోంది

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

- సీఎం రేవంత్ ఏర్పాటు చేసిన ఈ ముఠా కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేస్తోంది
- అక్రమ వసూళ్లకు పాల్పడుతోంది.. కబ్జాలు, భూదందాలు చేస్తోంది
- ఇవన్నీ బయటపడతాయనే తప్పుడు కేసులతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- ఎన్ని కేసులు పెట్టుకున్నా ప్రజల తరఫున ప్రశ్నించడాన్ని ఆపబోమని స్పష్టీకరణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'రాష్ట్రంలో ఆరుగురు సభ్యులతో కూడిన దోపిడీ ముఠా తిరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఈ ముఠా కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతోంది. ఈ అక్రమ దందాలు బయటపడతాయనే భయంతోనే మాపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ (పక్కదోవ రాజకీయాలు)కు పాల్పడుతున్నారు. మాపై ఎన్ని కేసులు పెట్టినా ప్రజల తరఫున ప్రశ్నించడాన్ని మాత్రం మేం ఆపం. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేసేంతవరకు వెంటాడుతూనే ఉంటాం..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన రైతుదీక్షలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆ తర్వాత మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

అలీబాబా అరడజన్ దొంగల ముఠా

'రాష్ట్రంలో తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, రోహిన్‌రెడ్డి, ఫహీం ఖురేషి, ఏవీ రెడ్డిలతో కూడిన అలీబాబా అర డజన్ దొంగల ముఠా తిరుగుతోంది. బ్లాక్‌మెయిళ్లు, అక్రమ వసూళ్లతో పాటు కబ్జాలు, భూ దందాలు చేస్తోంది. ఇవన్నీ బయటపడతాయనే తప్పుడు కేసులు పెడుతున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు.

పైసా లాభం లేకుండా క్విడ్ ప్రోకో ఎక్కడిది?

కొన్ని రోజులు కాళేశ్వరం, మరికొన్ని రోజులు ఫోన్ ట్యాపింగ్ కేసుల పేరుతో ప్రభుత్వం టైం పాస్ చేసింది. ఇప్పుడు ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణపై ఏమీ లేనటువంటి ఏసీబీ కేసును ప్రజలను డైవర్ట్ చేసేందుకు వాడుకుంటోంది. ఏసీబీ, ఈడీ విచారణలో ఎలాంటి అవినీతి లేదని స్పష్టమైంది. గ్రీన్ కో కంపెనీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వల్ల ఒక రూపాయి అయినా లాభం జరిగిందా? ఆ కంపెనీకి ఎలాంటి లబ్ధి చేయనప్పుడు క్విడ్ ప్రో కో అనే మాట ఎలా వర్తిస్తుంది? ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.46 కోట్లలో నయా పైసా అయినా మాకు వచ్చిందా? మాకు జైళ్లు, ప్రభుత్వ వేధింపులు కొత్త కాదు. బీజేపీ–కాంగ్రెస్, ఈడీ–ఏసీబీ కలిసి ఎన్ని కేసులు పెట్టుకున్నా..నేను ప్రజల తరఫున ప్రశ్నించడాన్ని ఆపబోను. నాపై కేసుల్ని న్యాయపరంగానే ఎదుర్కొంటా. మేం గతంలో చేసిన పెట్టుబడి ప్రయత్నాల ఫలితంగానే రాష్ట్రంలో ఈ రోజు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. కానీ కాంగ్రెస్ హయాంలో పైసా పెట్టుబడి రాలేదు..' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌వి ప్రతిచోటా మోసాలే..

'కాంగ్రెస్ పార్టీ గెలిచిన ప్రతిచోటా మోసాలకు పాల్పడుతోంది. గ్యారంటీల పేరుతో ఓట్ల గారడీ చేస్తోంది. కర్ణాటకలో ఇప్పటికే 15 శాతం బస్సు చార్జీలను పెంచారు. ఇక్కడ స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతు భరోసా పేరుతో మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల తర్వాత భరోసాను ఎత్తేస్తారు. కాంగ్రెస్‌ను ఢిల్లీ ప్రజలు కూడా ముమ్మాటికీ తిరస్కరిస్తారు. అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది.

రాష్ట్రంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ఊరుకోం. బడుగు, బలహీన వర్గాల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం. సాగునీటిని అందజేయడంతో పాటు వివిధ పథకాలతో రైతులకు, వ్యవసాయానికి కేసీఆర్ చేసినంత సేవ దేశ చరిత్రలో ఎవరూ చేయలేదు. మా పార్టీకి ఆయువు పట్టుగా ఉన్న రైతన్నల కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తూనే ఉంటాం. విచారణల పేరుతో పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినా మా పోరాటం ఆపబోం..' అని కేటీఆర్ స్పష్టం చేశారు.



పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి షాబాద్ రైతు దీక్ష కార్యక్రమానికి ర్యాలీగా వస్తున్న కేటీఆర్

త్వరలోనే 'ఆ పది'కి ఉప ఎన్నికలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'చేవెళ్ల సహా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన ఆ పది నియోజకవర్గాల్లోనూ త్వరలోనే ఉప ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పు కూడా ఉంది. అప్పట్లో కాంగ్రెస్ తరఫున వాదించిన న్యాయవాది ఆర్య సుందరం ఈ ఉప ఎన్నికలపై కూడా వాదిస్తున్నారు. కచ్చితంగా ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పేందుకు ఆ స్థానాల్లో పోటీకి బీఆర్‌ఎస్‌లో అనేక మంది సిద్ధంగా ఉన్నారు' అని తెలిపారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు గల్లాపట్టి నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ సహా సీఎం రేవంత్‌రెడ్డిపై 420 కేసు నమోదు చేయాలని అన్నారు. ఇక్కడ ఏ ఒక్క హామీ అమలు చేయకుండానే.. అన్నీ చేసినట్లు ఢిల్లీలో సీఎం గప్పాలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ నాట్లప్పుడు ఇస్తే.. రేవంత్ ఓట్లప్పుడు ఇస్తామంటుండు

కాంగ్రెస్ అభయహస్తం తెలంగాణ ప్రజల పాలిట భస్మాసుర హస్తంలా మారిందని కేటీఆర్ విమర్శించారు. 'నాడు కేసీఆర్ రైతులకు నాట్లు వేసేటప్పుడు పైసలు ఇస్తే.. నేడు రేవంత్ ఓట్లప్పుడు మాత్రమే ఇస్తా అంటుండు. అధికారంలోకి రాకముందు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి..తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా ఇవ్వలేక పోయిండు. 1.60 కోట్ల మంది మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.2 వేల చొప్పున ఇప్పటివరకు ఒక్కొక్కరికి రూ.30 వేలు బాకీ పడింది. ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నేతలను ముందు తమ బాకీ తీర్చాలని అడగండి' అని పిలుపునిచ్చారు. 21న నల్లగొండలో రైతు ధర్నా నిర్వహిస్తామని, ఆ తర్వాత ఇతర జిల్లాల్లోనూ ఈ దీక్షలు కొనసాగుతాయని కేటీఆర్ ప్రకటించారు.

సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిధుల ఖర్చు జరిగిందా? లేదా? అనే సంపూర్ణ సమాచారం అందించాలని సూచించారు. సబ్‌ప్లాన్ అమలుకు సంబంధించి గత ఎనిమిదేళ్లలో క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసి సెస్ రూపొందించిన నివేదికపై ఈ సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

అటవీ భూముల్లో వాణిజ్య పంటలు: అటవీ భూముల్లో వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్తు వినియోగించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఆయా భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాణిజ్య పంటలతోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పంటలతో ఆదివాసీ, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మూసీ పునర్జీవనం పథకంలో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి, వారికి వడ్డీ లేని రుణాలు అందించాలని సూచించారు. స్వయం ఉపాధి కింద పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, దాన కిషోర్, ఎస్.శ్రీధర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

'సింగపూర్' స్కిల్స్

▶ మొదటి పేజీ తరువాయి


ద్వారా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నిర్వహిస్తున్న కోర్సులను మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. చర్చల అనంతరం ఐటీఈ, స్కిల్స్ యూనివర్సిటీల మధ్య ఎంఓయూ కుదిరింది. ఒప్పంద పత్రాలపై స్కిల్స్ వర్సిటీ వీసీ సుబ్బారావు, ఐటీఈ అకడమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు.

సింగపూర్ విదేశాంగ మంత్రితో భేటీ

ఐటీఈతో భాగస్వామ్యం.. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పునరుత్పాదక వనరులు, పర్యాటకం, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో దీర్ఘకాలిక సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సీఎం రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కాగా ఐటీఈ ప్రతినిధి బృందం త్వరలో హైదరాబాద్‌ను సందర్శిస్తుందని అధికారులు ప్రకటించారు. పర్యటనలో భాగంగా సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం భేటీ అయ్యింది.

నీటి వాటాల్లో అన్యాయం.. బీఆర్‌ఎస్ వైఫల్యమే!

రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పదేళ్లుగా కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. న్యాయమైన నీటి వాటా దక్కించుకోవడంలో బీఆర్‌ఎస్ సర్కారు ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తాజా తీర్పుపై బీఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆయన సుదీర్ఘ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కృష్ణా నదీ జలాల వివాదంలో తెలంగాణలో ఉన్న పరీవాహక ప్రాంతం, ఆయకట్టు ఆధారంగా వాటాలు పెరగాలని తొలినుంచి కాంగ్రెస్ పార్టీనే పోరాటం చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన కొద్ది నెలలకే 2015 జూన్‌లో అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పటి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీల నీటిని వాడుకునేలా ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను బీఆర్‌ఎస్ తాకట్టు పెట్టిందని మండిపడ్డారు. ఆ చీకటి ఒప్పందంతోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల్లో ఏపీకి 70 శాతం, తెలంగాణకు 30 శాతం వాటా మేరకు ఒప్పుకుని బీఆర్‌ఎస్ అన్యాయం చేస్తే.. తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ 3 అంశం తెరపైకి వచ్చిందని చెప్పారు. గత ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్ర ప్రభుత్వం టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)కు ఓకే చెప్పింది తప్ప.. ఇందులో బీఆర్‌ఎస్ గొప్పతనమేమీ లేదని అన్నారు. నదీ జలాల వాటాలను తేల్చకుండా జాప్యం జరగడంలో బీఆర్‌ఎస్ ప్రధాన దోషి అని నిందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బ్రిజేశ్ ట్రిబ్యునల్ ద్వారా నీటి కేటాయింపులు చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచామని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్‌ఎస్‌కు ఆయన పలు ప్రశ్నలు సంధించారు.

ఉత్తమ్ సంధించిన ప్రశ్నలివే..

- పోతిరెడ్డిపాడు నుంచి అదనంగా నీళ్లు తరలిస్తుంటే అప్పుడు అధికారంలో ఉన్న హరీశ్‌రావు ఎందుకు మౌనంగా ఉన్నారు?
- బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అవార్డు కాకుండానే ఏపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాల్వ విస్తరణ పనులు చేపడితే ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అపెక్స్ మీటింగ్‌కు అప్పటి సీఎం కేసీఆర్ డుమ్మా కొట్టింది నిజం కాదా?
- ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు వీలుగా ఏర్పాటైన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ గడువును కేంద్రం పలుమార్లు పొడిగించింది. నిర్దిష్ట కాల వ్యవధిలో ఈ కేటాయింపులు జరిగేలా గడిచిన పదేళ్లలో ఎందుకు ఒత్తిడి చేయలేదు?
- మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులు నష్టపోతుంటే కళ్లప్పగించి ప్రేక్షక పాత్ర పోషించింది ఎవరు?
- గోదావరి జలాలను రాయలసీమ దాకా తీసుకెళ్లి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పింది కేసీఆర్ కాదా?
- పోలవరం ప్రాజెక్టుకు అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే గోదావరి నుంచి కృష్ణాకు తరలించే నీటిలో నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు నీటి హక్కులు సంక్రమిస్తాయని 1978లో గోదావరి రివర్ బోర్డు అవార్డు చెబుతోంది. ఎగువ రాష్ట్రం తెలంగాణే అయినందున 45 టీఎంసీల నీటి వాటా తెలంగాణకు దక్కాలి. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఏపీకి తరలిస్తున్న 80 టీఎంసీల్లో 45 టీఎంసీలు రావాలి కదా? అప్పుడు బీఆర్‌ఎస్ పట్టుబడితే, నిజంగా పోరాడితే తెలంగాణ నీటి వాటా 90 టీఎంసీలకు పెరిగేది కదా? ఆ నీటి వాటాలు ఎందుకు తెచ్చుకోలేదు? ఇది ఎవరి వైఫల్యం?

న్యాయమైన వాటా దక్కేంత వరకూ పోరాటం

- కృష్ణా జలాలపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాలు కేసీఆర్ ప్రభుత్వ విజయమే
- కృష్ణా జలాల అంశంలో తెలంగాణకు కాంగ్రెస్ వల్లే అన్యాయం : మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు హక్కుగా రావాల్సిన నదీజలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ వెనుకాడేది లేదని మాజీమంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తాజా ఉత్తర్వులు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు కేసీఆర్ పోరాటం చేసి సాధించిన విజయంగా పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని, కేసీఆర్ పోరాట ఫలితాన్ని కాంగ్రెస్ పార్టీ ఘనతగా మంత్రి ఉత్తమ్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కృష్ణా జలాల కేటాయింపులు రాష్ట్రాల వారీగా ఉండాలే తప్ప..ప్రాజెక్టుల వారీగా ఉండకూడదని మొదటి నుంచి కేసీఆర్ చేసిన వాదనతో ట్రిబ్యునల్ ఏకీభవించిన నేపథ్యంలో తెలంగాణకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని హరీశ్‌రావు వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అన్యాయాన్ని సరిదిద్దేందుకు పదేళ్లు

ఏపీ పునర్విభజన చట్టంలో సెక్షన్ 89ను నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెట్టిందని హరీశ్‌రావు అన్నారు. ఫలితంగా కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పదేళ్లు పట్టిందని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులు సాధించేందుకు బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు సీఎం హోదాలో కేసీఆర్ స్వయంగా హాజరై వాదనలు వినిపించారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించేందుకు 2015లోనే నాటి కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని తెలిపారు. ఎన్నో వేదికల ద్వారా బీఆర్‌ఎస్ చేసిన పోరాట ఫలితమే తాజాగా సెక్షన్ 3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేష్ ట్రిబ్యునల్ మధ్యంతర ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని ట్రిబ్యునల్ ప్రకటించిన నేపథ్యంలో నిష్ణాతులైన న్యాయవాదులను ఎంపిక చేసుకోవాలని హరీశ్ సూచించారు.

మిడ్‌మానేరులో తెప్పల పోటీలు



మిడ్‌మానేరులో తెప్పల పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహణ

వేములవాడ అర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం రుద్రవరం పాత గ్రామం మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లోని బ్యాక్‌వాటర్‌లో శుక్రవారం తెప్పల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రుద్రవరం ముదిరాజ్ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వేములవాడ, నాంపల్లి, రుద్రవరం, సంకెపల్లి, అనుపురం, చింతల్‌ఠాణా, చీర్లవంచ గ్రామాల్లోని ముదిరాజ్ మత్స్యకారులు గ్రామానికి ఆరుగురు చొప్పున పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన తునికి రఘుకు రూ.10,116, రెండో స్థానంలో నిలిచిన కూన కుమార్‌కు రూ.5,116, మూడోస్థానంలో నిలిచిన పండుగ వంశీకి రూ.3,116 అందించారు. విజేతలకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఏప్రిల్ కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఏప్రిల్ కోటాను జనవరి 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం జనవరి 18 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జనవరి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. అలాగే 21న కల్యాణోత్సవం, సహస్రదీపాలంకార సేవల టికెట్లు, వర్చువల్ సేవల కోటా, 23న అంగప్రదక్షిణం టోకెన్లు, శ్రీవాణి ఏప్రిల్ నెల ఆన్‌లైన్ కోటా, వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా, 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, గదుల కోటాను విడుదల చేయనుంది. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

వైకుంఠ ద్వార దర్శన ఎస్ఎస్‌డీ టోకెన్లు పూర్తి

తిరుమల: తిరుపతిలో జనవరి 20న దర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు ఇవ్వరని టీటీడీ ప్రజా సంబంధాల విభాగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం జనవరి 19వ తేదీ చివరి రోజు కోసం జారీ చేసే సర్వదర్శనం టోకెన్ల జారీ శుక్రవారం (జనవరి 17)తో పూర్తయింది. జనవరి 20న శ్రీవారి దర్శనం కోరే భక్తులు సర్వ దర్శనం క్యూలోకి చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకోవాల్సి ఉంటుందని టీటీడీ విజ్ఞప్తి చేసింది. జనవరి 20వ తేదీ దర్శనానికి గాను ముందు రోజు అనగా 19న ఆఫ్‌లైన్‌లో శ్రీ వాణి టికెట్లు జారీ చేయరని పేర్కొంది. అదేవిధంగా, జనవరి 20న ప్రోటోకాల్ మినహా బ్రేక్ దర్శనాలు రద్దు చేసింది.

నిర్ణీత సమయంలో వైకుంఠ దర్శనం

తిరుమల శ్రీవారి వైకుంఠ దర్శనం నిర్ణీత సమయంలోనే లభిస్తోంది. గురువారం తిరుమల శ్రీవారిని 67,115 మంది దర్శించుకోగా.. 16,115 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు వచ్చాయి. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు కలిగిన భక్తులు మాత్రమే టీటీడీ దర్శనానికి అనుమతిస్తోంది.

నేడు దక్షిణ మండలి న్యాయమూర్తుల సదస్సు

విశాఖ చేరుకున్న ఐదు రాష్ట్రాల న్యాయమూర్తులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్: దక్షిణ మండలి–2 న్యాయమూర్తుల ప్రాంతీయ సదస్సు శనివారం ప్రారంభం కానుంది. సదస్సును ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారు. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లోని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయమూర్తులు, జూనియర్ సీనియర్ న్యాయమూర్తులు హాజరుకానున్నారు. జాతీయ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అనురుద్ధ్‌బోస్ ప్రధాన ప్రసంగం చేస్తారు. ఈ సదస్సు ఆదివారం సాయంత్రంతో ముగుస్తుంది. వివిధ అంశాలపై న్యాయమూర్తులు, న్యాయ కోవిదులు ప్రసంగిస్తారు.

'అక్కసుతోనే కేటీఆర్ అడ్డగోలు మాటలు'

సాక్షి, హైదరాబాద్: తాను చేసిన తప్పులు బయటపడుతున్నాయని, అధికారం పోయిందన్న అక్కసుతో మాజీ మంత్రి కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఫార్ములా–ఈ రేస్ కేసులో ఏసీబీ, ఈడీలు ఒకే రకమైన ప్రశ్నలు అడుగుతున్నాయంటూ ఆయన మాట్లాడటం అవివేకమని, ఒకే అంశంపై రెండు దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విచారణ కేటీఆర్‌పై జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి లైడిటెక్టర్ టెస్టుకు ఎందుకు హాజరు కావాలని ప్రశ్నించారు. కేటీఆర్‌కు చేయాల్సింది లైడిటెక్టర్ పరీక్షలు కాదని, డ్రగ్స్ పరీక్షలని ఎద్దేవా చేశారు.

'ఢిల్లీలో రేవంత్ హామీలు దిగజారుడు రాజకీయం'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..ఢిల్లీలో కాంగ్రెస్ హామీలు అమలు చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టి పెట్టుకొని ప్రజలను మభ్యపెట్టేందుకు సీఎం రేవంత్ మరోమారు బోగస్ హామీలు ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

ఐఐటీ ప్లేస్‌మెంట్లలో క్షీణత

- ఆర్థిక అనిశ్చితి, జాబ్ మార్కెట్‌లో పెరిగిన పోటీ వల్ల తగ్గుతున్న ప్లేస్‌మెంట్లు
- కంపెనీలు ఇచ్చే ప్యాకేజీల్లోనూ హెచ్చుతగ్గులు
- ఢిల్లీ ఐఐటీలో మాత్రమే స్థిరంగా ప్లేస్‌మెంట్ల కల్పన
- ఐఐటీ నుంచి బయటకు వచ్చే వారిలో 5 శాతం మంది సివిల్స్ వైపు మొగ్గు
- తొలి తరం ఐఐటీల డేటా పరిశీలనలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో ఇంజనీరింగ్ విద్యకు అత్యుత్తమ విద్యా సంస్థలుగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో క్షీణత కనిపిస్తోంది. సాంకేతిక రంగంలో మారుతున్న టెక్ ల్యాండ్‌స్కేప్, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, జాబ్ మార్కెట్‌లో పోటీ పడుతున్న ఐఐటీ గ్రాడ్యుయేట్ల సంఖ్య పెరుగుతుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. దేశంలోని తొలి తరం ఐఐటీల్లో 2018–19 నుంచి 2023–24 వరకు ప్లేస్‌మెంట్ డేటాను విశ్లేషిస్తే అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ఉద్యోగ ఆఫర్లు పొందుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. కాన్పూర్, ఖరగ్‌పూర్, రూర్కీ ఐఐటీల్లో ఏకంగా 5 నుంచి 16 శాతం ప్లేస్‌మెంట్లు తగ్గాయి. ఐఐటీ ఢిల్లీ ఒక్కటే ప్లేస్‌మెంట్ల కల్పనలో నిలకడగా ఉంది. ఐఐటీల్లో చదువుతున్న వారిలో దాదాపు 80 శాతం మంది ఉద్యోగాలను పొందుతున్నారు. కేవలం 1.6 శాతం మంది మాత్రమే స్టార్టప్‌లను ప్రారంభిస్తున్నారు. దాదాపు 10 శాతం మంది ఉన్నత చదువుల కోసం, 5 శాతం మంది సివిల్ సర్వీసుల వైపు వెళుతున్నట్లు ఐఐటీ గౌహతి నిపుణులు వెల్లడించారు.

ప్యాకేజీల్లోనూ తగ్గుదల...

ఐఐటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు పొందినవారికి ఇచ్చే ప్యాకేజీల్లో తగ్గుదల కూడా విద్యార్థులను కలవరపెడుతోంది. ఐఐటీ కాన్పూర్‌లో సగటు వార్షిక జీతం 2020–21లో రూ.22.10 లక్షల నుంచి 2022–23లో రూ.25.90 లక్షలకి పెరిగింది. అయితే 2023–24లో రూ.23.70 లక్షలకు తగ్గింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 2020–21లో వార్షిక సగటు వేతనం రూ.14 లక్షల నుంచి 2022–23లో రూ.18 లక్షలకు పెరిగింది. అయితే, 2023–24లో మళ్లీ రూ.17 లక్షలకు తగ్గింది. అదే ఐఐటీ బాంబేలో 2021–22లో రూ.21.50 లక్షలు నుంచి 2022–23లో రూ.21.82 లక్షలకు పెరిగింది.

తొలితరం ఐఐటీల్లో ప్లేస్‌మెంట్ల పరిస్థితి ఇలా..

ఐఐటీ	2022-23		2023-24	
	నమోదు	ఉద్యోగాలు పొందినవారు	నమోదు	ఉద్యోగాలు పొందినవారు
బాంబే	1,845	1,516 (82 శాతం)	1,979	1,475 (75 శాతం)
ఢిల్లీ	1,513	1,270 (84 శాతం)	1,531	1,287 (84 శాతం)
కాన్పూర్	1,382	1,210 (88 శాతం)	1,430	1,111 (78 శాతం)
రూర్కీ	1,410	1,126 (80 శాతం)	1,628	1,108 (68 శాతం)
గౌహతి	1,425	1,112 (78 శాతం)	1,584	1,124 (71 శాతం)
ఖరగ్‌పూర్	2,490	1,675 (67 శాతం)	2,668	1,662 (62 శాతం)

గ్రామీణ బడుల్లో సౌకర్యాలు



దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత దశాబ్దకాలంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బడుల్లో ఎన్నో వసతులు, సౌకర్యాలు సమకూరాయి. 2013–14లో గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 47 శాతం బడుల్లో విద్యుత్ సదుపాయం.. అదీ పక్కాగా పనిచేసేది ఉంటే.. 2023–24 నాటికి 88 శాతం బడుల్లో ఉంది. కంప్యూటర్లు, ఇంటర్నెట్, పిల్లలు ఆడుకోవడానికి క్రీడీ మైదానాలు, అమ్మాయిలకూ అబ్బాయిలకూ వేర్వేరుగా టాయిలెట్లు.. ఇవన్నీ ఈ దశాబ్ద కాలంలో చాలా పెరిగాయి.

అంశం	2013–14	2023–24
	(బడుల శాతం)	
విద్యుత్ సౌకర్యం	47	88
కంప్యూటర్	19	53
టాయిలెట్	86	95
అబ్బాయిల టాయిలెట్	78	89
అమ్మాయిల టాయిలెట్	81	93
ఇంటర్‌నెట్	5	50
మైదానం	66	81
మెడికల్ చెకప్	63	76


ఆధారం: యుడైస్ ప్లస్ నివేదికలు

క్యాప్టివ్ మైన్స్, సెయిల్‌లో విలీనం, ప్రైవేటీకరణ రద్దు

3 డిమాండ్లపైనా మౌనమే

ప్రైవేటీకరణ ఆగుతుందని స్పష్టమైన ప్రకటన చేయని కేంద్ర ప్రభుత్వం

- సొంత గనులు లేకుండా ప్లాంటు మనుగడ ఎలా సాధ్యం?
- సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనాన్ని పట్టించుకోని కేంద్రం
- రూ.11,440 కోట్ల ప్యాకేజీ బకాయిలకే సరిపోతుందని కార్మిక సంఘాల ఆందోళన
- అయినా ఏదో ఘనత సాధించినట్లు చంకలు కొట్టుకుంటున్న చంద్రబాబు
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నది జగన్ సర్కారే..



ప్రైవేటీకరణను జగన్ వ్యతిరేకించారు..

''2021 జనవరిలో దీపం పథకం కింద విశాఖ ఉక్కును 100 శాతం ప్రైవేటీకరించాలని నిర్ణయించాం. అయితే ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్మానం చేశారు''

– శుక్రవారం ఢిల్లీలో మీడియాతో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కార్మికుల పోరాటమంతా.. ప్లాంటు ప్రైవేటీకరణను పూర్తిగా నిలిపివేయడం.. క్యాపిటివ్ మైన్స్‌ను కేటాయించడం.. సెయిల్‌లో విలీనం చేయడం..! మరి విశాఖ ఉక్కుకు ఊరట దక్కాలంటే ఇందులో ఒక్కటైనా నెరవేరాలి కదా? తమ ఆందోళనను ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్రం నుంచి రూ.వేల కోట్ల ప్యాకేజీని సాధించినట్లు సీఎం చంద్రబాబు ప్రభుత్వం గొప్పలు ప్రచారం చేసుకోవడంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఆ ప్యాకేజీతో ఒరిగేదేమీ లేదని.. ముడి సరుకు సరఫరాదారుల బకాయిల చెల్లింపు, బ్యాంకు రుణాలు, ఉద్యోగుల పెండింగ్ వేతనాలు, ఇతర బెనిఫిట్స్, స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలుకే అది చాలదని కార్మిక సంఘాలు పెదవి విరుస్తున్నాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ప్రకటన చేయాలని, అప్పటివరకు తమ పోరాటం ఆగదని సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

భారీగా బకాయిలు..: విశాఖ స్టీలు ప్లాంటు ఇప్పటికే రూ.25 వేల కోట్ల మేర నిధుల లోటు ఎదుర్కొంటోంది. ముడి సరుకు సరఫరా చేసిన వెండర్స్‌తో పాటు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీ, ఉద్యోగులకు బకాయిపడ్డ వేతనాలు, వివిధ రకాల బెనిఫిట్స్, వీఆర్ఎస్ అమలు.. ఇలా మొత్తం రూ. 25 వేల కోట్ల మేర స్టీలు ప్లాంటు లోటు బడ్జెట్‌లో ఉంది. ఉద్యోగులకు సెప్టెంబరు నుంచి పెండింగ్ వేతనాలు, పీఎఫ్ ఇతర బకాయిలు కలిపి రూ.1,600 కోట్ల మేర ఉన్నాయి. ప్రైవేటీకరణలో భాగంగా అమలు చేస్తున్న వీఆర్ఎస్ కోసం రూ.1,000 కోట్ల మేర అవసరం. ముడి సరుకు సరఫరా చేసిన వెండర్స్‌కు ఏకంగా రూ.7 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. విశాఖ ఉక్కుకు ప్రస్తుతం ఏకైక రైల్వే లైన్ ద్వారా ఆరు ర్యాకులు (దాదాపు వంద టన్నులు) బొగ్గు సరఫరా అవుతుండగా పూర్తి స్థాయిలో ఉత్పత్తి కావాలంటే రోజూ తొమ్మిది ర్యాక్‌లు అవసరం. నక్కపల్లి ప్రైవేటు స్టీలు ప్లాంటులో కూడా ఉత్పత్తి ప్రారంభమైతే మరో 4–5 ర్యాకులు బొగ్గు అవసరం అవుతుంది. రోజుకు 13–14 ర్యాక్‌ల బొగ్గును ఒక్క రైల్వే లైను ద్వారా తీర్చడం సాధ్యం కాదు. ప్రైవేట్ సంస్థతో పోటీపడి బొగ్గు సమస్యను పరిష్కరించుకునే అవకాశం విశాఖ స్టీలుకు ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ప్రస్తుతం ఉన్న 12 వేల మంది ఉద్యోగుల్లో నాలుగు వేల మంది పదవీ విరమణ పొందుతున్నారు. మరో 1,000 మందిని వీఆర్ఎస్ ద్వారా తొలగించాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేవలం 7 వేల మందితో 7 మిలియన్ టన్నుల ప్లాంటులో పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు.

వైఎస్సార్‌సీపీ ఉక్కు సంకల్పం..

విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ 2021 ఫిబ్రవరి 6వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారు. ఈమేరకు అసెంబ్లీలో 2021 మే నెలలో తీర్మానం కూడా చేశారు. పార్లమెంటులో సైతం వైఎస్సార్ సీపీ తన గళాన్ని వినిపించింది. ఇదే విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి సైతం తాజాగా స్వయంగా చెప్పారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దంటూ వైఎస్ జగన్ కేంద్రానికి పలు దఫాలు వినతిపత్రాలు సమర్పించారు. ఆంధ్రా యూనివర్శిటీ మైదానంలో 2022 నవంబరు 12న జరిగిన ప్రధాని మోదీ సభలో కూడా వైఎస్ జగన్ దీన్ని ప్రస్తావించారు. ఎంపీ వి.విజయసాయిరెడ్డి విశాఖలో భారీ పాదయాత్రను కూడా చేపట్టారు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లోనూ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు విశాఖ స్టీలు ప్లాంటు ఆర్థిక సమస్యలతో పాటు ప్రైవేటీకరణ అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు.

తాత్కాలిక ఉపశమనం..



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. రుణాలు, పెండింగ్ బకాయిలు కలిపితే సుమారు రూ.25 వేల కోట్ల బకాయిలున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలి.

– నీరుకొండ రామచంద్రరావు, చీఫ్ పేట్రన్, స్టీల్ ఐఎన్‌టీయూసీ

సొంత గనులు కేటాయిస్తేనే..



ప్యాకేజీ వల్ల తాత్కాలిక ఉపశమనం మాత్రమే. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. వీఆర్ఎస్‌ను ఉపసంహరించుకోవాలి. సొంత గనులు ఇవ్వడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయాలి.

– యు.రామస్వామి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ సీఐటీయూ

అంతా బూటకం..



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో సమస్య పరిష్కారం అయిపోతుందని ప్రకటన చేయడం బూటకం. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు ఉన్నప్పుడు విశాఖ ప్లాంట్‌కు మాత్రం ఎందుకు ఇవ్వరు? స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవాలంటే సొంత గనులు కేటాయించి ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలి.

– సీహెచ్ నరసింగరావు, సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సొంత జాగా లేని వారి జాబితానూ రూపొందించాలి

ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో సొంత జాగా ఉన్న వారికే ఇళ్లను మంజూరు చేస్తున్నప్పటికీ, సొంత జాగా లేని అర్హుల వివరాలను కూడా గ్రామ సభల్లో ఉంచాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. ఈ పథకం నిరంతర ప్రక్రియ అయినందున, తదుపరి విడతలో సొంత జాగా లేని అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తామన్న విషయాన్ని మదిలో ఉంచుకుని ఈ కసరత్తు చేయాలని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి సమీక్షించారు. గ్రామ సభల్లో అర్హుల వివరాలను ఉంచే అంశంతోపాటు పథకం నిర్వహణకు కావాల్సిన సిబ్బందిని సమకూర్చుకునే విషయంపై పొంగులేటి చర్చించారు. ప్రస్తుతం గృహనిర్మాణ సంస్థలో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని, మరో 400 మంది అవసరమని అధికారులు వెల్లడించారు. ఇతర విభాగాల్లో ఉన్న ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఎలా వినియోగించుకోవచ్చో గుర్తించాలని మంత్రి వారికి సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో పథకం నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని, దాన్ని రూపొందించాలని ఆదేశించారు. విలేజ్ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమించనున్నందున వీఆర్ఏ, వీఆర్వోల నుంచి అర్హులైన వారిని గుర్తించి ఎంపిక పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా వేయి మంది సర్వేయర్ల అవసరం ఉన్నందున వారి ఎంపిక ప్రక్రియకు ప్రణాళికను రూపొందించాలని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్, గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంగళూరు బ్యాంకులో రూ.12 కోట్ల నగల దోపిడీ



మంగళూరు: కర్ణాటకలోని మంగళూరులో దోపిడీ దొంగలు పట్టపగలే రెచ్చిపోయారు. ఖరీదైన ఫియట్ కారులో దర్జాగా వచ్చిన ఆగంతకులు కొటెకర్‌లోని సహకారి సంఘ బ్యాంకులో రూ.12 కోట్ల విలువైన నగలను ఎత్తుకెళ్లారు. సీఎం సిద్ధరామయ్య పర్యటనలో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల మధ్యలో నీలం రంగు ఫియట్ కారులో ముసుగులు ధరించిన ఆరుగురు దుండగులు బ్యాంకులోకి ప్రవేశించారు. సుమారు 25–35 మధ్య వయస్కులైన వీరు పిస్టల్, కత్తి, చాకు పట్టుకుని బ్యాంకులోని నలుగురు ఉద్యోగులను బెదిరించారు. బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులను భద్రపరిచే బీరువాను తెరవాలని హెచ్చరించారు. అనంతరం అందులోని రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల విలువైన ఆభరణాలను తీసుకుని తమ కారులో పరారయ్యారు. దోపిడీకి గురైన సొత్తు విలువను అధికారులు అంచనా వేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఘటన సమయంలో బ్యాంకులో భద్రతా సిబ్బంది లేరన్నారు. సాంకేతిక, ఇతర ఆధారాల ఆధారంగా నిందితులను కనిపెట్టే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటన తెలిసిన సీఎం సిద్ధరామయ్య వెంటనే ఉన్నతాధికారులతో మంగళూరులో సమావేశమయ్యారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు జాతీయ, రాష్ట్ర రహదారులపై తనిఖీలను ముమ్మరం చేశారు.

'బ్లాక్ బెర్రీ' బుకింగ్స్ ప్రారంభం



బ్లాక్ బెర్రీలో గుడారాలు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మొండ్యాల తోగు సమీపంలోని అటవీ ప్రాంతంలో టూరిస్ట్ స్పాట్‌గా తీర్చిదిద్దిన బ్లాక్ బెర్రీ సందర్శన కోసం శుక్రవారం నుంచి బుకింగ్ ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు వచ్చిన పర్యాటకులు ఉదయం 11 గంటలకు వెళ్లాల్సి ఉంటుంది. పిల్లలకు రూ.1,099, పెద్దలకు రూ.2,599 ప్యాకేజీలు ఉన్నాయి. సాయంత్రం వచ్చిన పర్యాటకులకు స్నాక్స్, టీ, రాత్రికి భోజన సదుపాయం ఉంటుంది. మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. సాయంత్రం వినోదపు ఆటలు, రాత్రి వేళ క్యాంప్‌ఫైర్ కూడా ఉంటుంది. పర్యాటకులు www.oliveelements.com వెబ్‌సైట్‌లో, ఫోన్, వాట్సాప్ (99518 44668) ద్వారా కూడా బుకింగ్ చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఎంతో చేశామని చెప్పండి

మంత్రులు, ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

నేనొక్కడినే ఎంతో చేస్తున్నా.. మీరు పట్టించుకోవడం లేదు

- ఇకపై ప్రభుత్వ ప్రచారాన్ని బాగా పెంచాలి
- స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు
- సమర్థవంతుడైన సీఈవోను నియమిస్తాం
- ఏడు నెలల్లోనే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు
- అమరావతికి ఎనిమిది లైన్లతో అవుటర్ రింగ్ రోడ్డు
- 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని స్పష్టీకరణ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీలో పేదల ఇళ్లకు ఎసరు

- గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలపై కన్నేసిన కూటమి సర్కారు
- ఇళ్లు కట్టుకోని నిరుపేదల స్థలాల కేటాయింపులు రద్దు
- 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై ప్రభుత్వం దృష్టి.. 13.59 లక్షల ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు వాడుకునే యోచన
- వచ్చే కేబినెట్ నాటికి ఇన్‌చార్జీ మంత్రులు ప్రతిపాదనలతో రావాలని ఆదేశం.. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న చోట్ల క్రమబద్ధీకరణ
- హేతుబద్ధీకరణ పేరుతో సచివాలయాలు, సిబ్బంది కుదింపు
- 2,500లోపు జనాభా ఉన్న సచివాలయాల్లో ఇక ఆరుగురే ఉద్యోగులు.. మిగతా వారు ఇతర శాఖలకు.. కేబినెట్ నిర్ణయం

బిహార్ గ్యాంగ్ పనేనా?

▶ మొదటి పేజీ తరువాయి

హనుమాన్ టెంపుల్ వద్ద గల సీసీ ఫుటేజీల్లో దుండగులు కనిపించారు. సుల్తాన్‌పూర్, డప్పూర్, హత్నూర్, న్యాల్‌కల్ మీదుగా హైదరాబాద్ వెళ్లారు. అయితే ఆ డబ్బా, బైక్ ఎక్కడ వదిలేశారన్నది ఇంకా తేలలేదు. ఒకరు ఈ పెద్ద బ్యాగ్ పట్టుకొని, మరొకరు బ్యాక్ ప్యాక్ తగిలించుకొని గురువారం సాయంత్రానికి రోషన్ ట్రావెల్స్ వద్దకు వచ్చారు. ఈ ద్వయం ఎంజీబీఎస్ వైపు నుంచి ఆటోలో వచ్చి ట్రావెల్స్ వద్ద దిగినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

ఉత్తరప్రదేశ్ ఫోన్ నంబర్ ఇచ్చి...

రాయ్‌పూర్ వెళ్లడానికి అమిత్‌కుమార్ పేరుతో రెండు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ సెల్‌నంబర్ ఇచ్చారు. బస్సు, సీట్ల నంబర్లు ఎస్ఎంఎస్ రూపంలో వస్తాయని, సరిచూసుకోవాలని ట్రావెల్స్ నిర్వాహకులు చెప్పారు. దీంతో ఓ దుండగుడు తన ఫోన్ స్విచ్చాఫ్ అయ్యిందని, ఇక్కడే ఉండి మీతోనే వచ్చి బస్సు ఎక్కుతామని వారికి చెప్పాడు. ఆ బస్సు ప్రయాణించే మార్గం, మార్గమధ్యలో దాని స్టాప్స్ ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలు ట్రావెల్స్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

మదీనాలో రెండు బ్యాగ్స్ ఖరీదు....

రూ.93 లక్షలతో కూడిన బ్యాగ్‌ను చేత్తో పట్టుకొని మోయడం కష్టంగా ఉండటంతో ట్రాలీ బ్యాగ్ ఖరీదు చేయాలని భావించారు. అవి ఎక్కడ దొరుకుతాయంటూ ట్రావెల్స్ నిర్వాహకులను అడిగారు. మదీనా ప్రాంతంలో దుకాణాలు ఉన్నాయని చెప్పగా, అక్కడకు వెళ్లి రెండు ట్రాలీ బ్యాగ్స్ ఖరీదు చేశారు. మూసీనది సమీపంలో లేదా పబ్లిక్ టాయిలెట్‌లోకి వెళ్లి పెద్ద బ్యాగ్‌లో ఉన్న నగదును ఓ ట్రాలీలోకి మార్చారు. మరో దాంట్లో కొన్ని వస్త్రాలతోపాటు హెల్మెట్ పెట్టారు. బ్యాక్ ప్యాక్‌లో మాత్రం తుపాకీ దాచి ఉంచారు.

కాల్పులు జరిపింది మినీ బస్సులోనే...

రోషన్ ట్రావెల్స్ కార్యాలయం అఫ్జల్‌గంజ్ బస్టాప్‌లోనే ఉంటుంది. అక్కడ మినీ బస్సుల్ని ఆపడానికి అవకాశం ఉండదు. దీంతో తమ ప్రయాణికుల్ని ట్రావెల్స్ బస్సుల వరకు చేర్చే మినీ బస్సుల్ని సమీపంలో ఉన్న మెట్రో ట్రావెల్స్ వద్ద ఆపుతారు. గురువారం సైతం ఇలానే ఆగడంతో..రోషన్ ట్రావెల్స్ నుంచి మిగిలిన ప్రయాణికులు, బీదర్ పోలీసులతో కలిసి ఇద్దరు దుండగులూ ఆ బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణికుల లగేజీ తనిఖీ చేస్తున్న ట్రావెల్స్ ఉద్యోగి జహంగీర్ దుండగుల ఓ ట్రాలీని తెరిచి చూసి హెల్మెట్, వస్త్రాలు గుర్తించారు. రెండోది తెరవడానికి ప్రయత్నిస్తుండగా, అందులో నగదు ఉండటంతో ఓ దుండగుడు తన బ్యాక్ ప్యాక్ నుంచి తుపాకీ బయటకు తీసి ఒక రౌండ్ కాల్చాడు. ఈ శబ్దం విన్న బస్సు డ్రైవర్ తొలుత టైరు పగిలిందని భావించి కిందకు దిగాడు. అదే అదనుగా ఇద్దరు దుండగులూ తమ ట్రాలీలతో సహా కిందకు దిగి ట్రాఫిక్‌కు రాంగ్ సైడ్‌లో నడుచుకుంటూ వెళ్లారు.

పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆటో ఎక్కి...

అదే మినీ బస్సులో ఉన్న ఇద్దరు బీదర్ పోలీసు కానిస్టేబుళ్లు వీరిని పట్టుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సమీపం వరకు నడుచుకుంటూ వెళ్లిన దుండగులు ఓ ఆటో ఎక్కి ఎంజే మార్కెట్ మీదుగా ఉడాయించారు. ఠాణా సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను బట్టి రాత్రి 7.09 గంటలకు దుండగులు ఆటో ఎక్కారు. దీని ప్రకారం కాల్పులు 7 గంటల ప్రాంతంలో జరిగినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. క్షతగాత్రుడు మినీ బస్సు దగ్గర నుంచి రోషన్ ట్రావెల్స్ వరకు వచ్చి, వారికి విషయం చెప్పి, పోలీసులకు సమాచారం ఇచ్చేసరికి సమయం దాదాపు రాత్రి 7.30 గంటలైంది.

సికింద్రాబాద్ మీదుగా పరారీ...

దుండగులు ప్రయాణించిన ఆటో ఎంజే మార్కెట్, అబిడ్స్, ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ వరకు వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆటో నంబర్, దాని ద్వారా డ్రైవర్‌ను గుర్తించిన అధికారులు శుక్రవారం సాయంత్రం ప్రశ్నించారు. తాను ఇద్దరినీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఆల్ఫా హోటల్ వరకు తీసుకెళ్లానని చెప్పాడు. దీంతో సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైలులో ఛత్తీస్‌గఢ్ లేదా బిహార్‌కు పారిపోయి ఉంటారని భావిస్తున్నారు.

‘ఆపుకోలేని’ ఆవేదన

రైలింజన్లలో వాష్‌రూంలు లేక మహిళా లోకోపైలట్ల యాతన

ఒక్కసారి ఊహించుకోండి.. మీరు బిజీ సెంటర్లో ఉన్నారు. చాలా అర్జెంటు.. ఎక్కడా వెళ్లే పరిస్థితి లేదు. మీకెలా అనిపిస్తుంది? నరకయాతన కదూ.. ఒక్క రోజుకే మన పరిస్థితి ఇలా ఉంటే.. దేశంలో రైళ్లను నడిపే మహిళా లోకోపైలట్లు రోజూ ఈ నరకయాతనను అనుభవిస్తున్నారు. అదీ ఎన్నో ఏళ్లుగా..

భారతీయ రైల్వే.. గతంతో పోలిస్తే ఎంతో మారింది. మన రైళ్లలోనూ ఎన్నో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ అదే రైళ్లను నడిపే లోకోపైలట్‌లకు కనీస సదుపాయమైన వాష్‌రూం మాత్రం నేటికీ అందుబాటులోకి రాలేదు. వీటిని ఏర్పాటు చేయాలని 2016లోనే జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించినా.. నేటికీ అది సాకారం కాలేదు. దీంతో చేసేది లేక.. కొందరు మహిళా లోకోపైలట్లు అడల్ట్ డైపర్లు వాడుతున్నారు.. మరికొందరు డ్యూటీకెళ్లేటప్పుడు నీళ్లు తాగడం మానేస్తున్నారు. ఫలితంగా మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతున్నారు.

మా సమస్యను పట్టించుకునేవారేరి?

➤ వాష్‌రూం లేకపోవడం వల్ల స్త్రీ, పురుష లోకోపైలట్లు ఇద్దరికీ ఇబ్బంది అయినా.. తమ సమస్యలు వేరని తమిళనాడుకు చెందిన సీనియర్ మహిళా లోకోపైలట్ ఒకరు చెప్పారు. ‘మెయిన్ జంక్షన్లలో తప్పితే.. చాలా స్టేషన్లలో 1–5 నిమిషాలు మాత్రమే రైలును ఆపుతారు. ఆ టైంలోనే వెనుక ఉన్న బోగీకి లేదా స్టేషన్‌లోని వాష్‌రూంకు వెళ్లి.. పని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సమయానికి తిరిగి రాకపోతే.. ట్రైన్ నిర్ణీత సమయం కన్నా ఎక్కువ సేపు ఆగితే.. వివరణ ఇచ్చుకోవాలి. దాని కన్నా.. వెళ్లకపోవడమే బెటరని చాలామంది భావిస్తారు’ అని ఆమె చెప్పారు. ఇలాంటి పరిస్థితుల వల్ల తాను కూడా మూత్రనాళ సంబంధిత ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డానని.. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నానని తెలిపారు. తమ సమస్యలను పట్టించుకునేవారేరి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పైగా.. ఒకసారి ఇంజన్ క్యాబిన్‌లోకి ప్రవేశిస్తే విధులు ముగిసేవరకు బయటకు వెళ్లడం సాధ్యం కాదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లవలసి వస్తే వాకీటాకీల్లో పై అధికారులకు సమాచారం అందజేయాలి. ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటుందని మహిళా లోకోపైలట్లు చెబుతున్నారు. పైగా కొన్ని చోట్ల స్టేషన్లు చాలా ఖాళీగా ఉంటాయి. అలాంటి స్టేషన్లలో వాష్‌రూంను వినియోగించడమంటే తమ భద్రతను పణంగా పెట్టడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ‘ఎనిమిది గంటల డ్యూటీ అంటారు. కానీ ఒక్కసారి బండెక్కితే పదకొండు గంటలు దాటిపోతుంది.అప్పటి వరకు ఆపుకోవాల్సిందే’ అని దక్షిణ మధ్య రైల్వేలో విధులు నిర్వహిస్తున్న ఒక సహాయ మహిళా లోకోపైలట్ ఆవేదన వ్యక్తం చేశారు. మూత్రాన్ని ఆపుకోవడం లేదా నీళ్లు తక్కువగా తాగడం వల్ల మహిళల్లో మూత్రనాళం, కంటి సంబంధిత ఇన్‌ఫెక్షన్లు వస్తాయని, ఇది ప్రమాదకరమని ప్రముఖ గైనకాలజిస్ట్ శాంతి రవీంద్రనాథ్ హెచ్చరించారు.



దేశవ్యాప్తంగా..

లోకోపైలట్‌లు	86,000	మహిళలు	3,000
దక్షిణమధ్య రైల్వేలో	12,000	మహిళలు	500

కమిటీ వేసినా.. ముందడుగు పడలేదు..

రైలింజన్లలో వాష్‌రూంలు, సరైన విశ్రాంతి గదులు వంటి సదుపాయాలు కల్పించాలని ఇప్పటికి అనేక సార్లు రైల్వేబోర్డుకు విన్నవించాం. 3 నెలల క్రితమే రైల్వే బోర్డు ఒక కమిటీని వేసింది. అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అధ్యయనం చేయలేదు.

– మర్రి రాఘవయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్(ఎన్‌ఎఫ్‌ఐఆర్)



రైలు నడుపుదామనుకున్నా.. కానీ..


➤ ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో చాలా మంది లోకో పైలట్ అవ్వాలని వచ్చి.. డెస్క్ జాబ్‌లో సర్దుకుంటున్నారు. ‘చిన్నప్పటి నుంచి రైలు నడపాలన్నది నా కల. కఠినమైన పరిస్థితులు ఉండే వెస్ట్రన్ ఘాట్స్ రైల్వే లైన్‌లో నడిపి.. నా నైపుణ్యాన్ని నిరూపించుకోవాలని ఉండేది. లోకో పైలట్ క్వాలిఫై అయి ఐదేళ్లయింది. వాష్‌రూం లేని చోట పనిచేయడం ఇబ్బందని.. డెస్క్ జాబ్ చేస్తున్నాను’అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ మహిళ చెప్పారు. తాను లోకోపైలట్ అయినప్పుడు చాలా గర్వంగా ఫీలయ్యానని.. అయితే మహిళలు శానిటరీ న్యాప్కిన్లు ధరించి డ్యూటీకి రావాల్సిన దుస్థితిని కల్పిస్తున్న ఇలాంటి పని వాతావరణంలోకి రావడానికి ఎందరు ఇష్టపడతారని ఓ లోకోపైలట్ ప్రశ్నించారు. నెలసరి సమయంలో మరిన్ని ఇబ్బందులు పడలేక.. సెలవు పెట్టడమే బెటరని భావిస్తున్నట్లు చెప్పారు. రన్నింగ్ డ్యూటీలు చేయలేని వాళ్లకు స్టేషన్‌డ్యూటీలు అప్పగించే వెసులుబాటు ఉంది. కానీ అధికారులు అంతగా ఇవ్వడం లేదు. ప్రెగ్నెన్సీతో విధులకు హాజరయ్యే మహిళలకు మాత్రమే ఈ వెసులుబాటు ఇస్తున్నారు. ‘గతంలో చాలాసార్లు స్టేషన్ డ్యూటీ ఇవ్వాలని అధికారులను వేడుకున్నా కానీ పట్టించుకోలేదు. ఇప్పుడు నేను ప్రెగ్నెంట్ కావడం వల్ల స్టేషన్ డ్యూటీ ఇచ్చారు’అని సికింద్రాబాద్‌కు చెందిన రేవతి చెప్పారు.

రైలింజన్లలో వాష్‌రూంలు లేకపోవడంపై ద ఇండియన్ రైల్వే లోకో రన్నింగ్ మెన్స్ ఆర్గనైజేషన్ మాజీ అధ్యక్షుడు అలోక్ వర్మ అప్పట్లో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో ప్రతి ఇంజన్ క్యాబిన్‌లో ఏసీ సదుపాయంతో పాటు వాష్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని హక్కుల కమిషన్ 2016లో ఆదేశించింది. దీనికి సమాధానంగా అన్ని రైళ్లలో వాష్‌రూంను ఏర్పాటు చేస్తామని రైల్వే చెప్పింది. కానీ ఆ దిశగా ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోలేదు.

చేస్తామని చెప్పి.. చేయలేదు

దేశంలో కొన్ని డివిజన్లలోని ఇంజన్లలో వీటిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినప్పటికీ.. క్లీనింగ్ తదితర నిర్వహణ సమస్యలతో పాటు ఇంజిన్‌లోకి లోకోపైలట్ మినహా ఎవరినీ అనుమతించరాదనే నిబంధనలు వంటి కారణాలతో దాన్ని అమలు చేయలేదని అధికారులు చెబుతున్నారు. ఇది లోకోపైలట్ల కనీస హక్కులను హరించడమేనని అలోక్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రస్తుతం వస్తున్న వందేభారత్‌లలో ఈ సమస్య పెద్దగా లేదని చెప్పారు. మిగతావాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అమెరికా, యూరప్, బ్రిటన్‌లలో లోకోపైలట్లకు ప్రతి 4 గంటలకు 20–25 నిమిషాల బ్రేక్ ఉంటుందని చెప్పారు. – సాక్షి, హైదరాబాద్/సాక్షి, సెంట్రల్‌డెస్క్

డిస్కంలలో 3,260 కొత్త కొలువులు



2,812 జేఎల్‌ఎం, 330 సబ్ ఇంజనీర్, 118 ఏఈ పోస్టుల భర్తీకి నిర్ణయం

త్వరలోనే నోటిఫికేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో కొలువుల జాతర ప్రారంభం కానుంది. వరంగల్ కేంద్రంగా పనిచేసే ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్)లో 2,212 జేఎల్‌ఎం (జూనియర్ లైన్‌మెన్), 30 సబ్ ఇంజనీర్, 18 అసిస్టెంట్ ఇంజనీర్‌ల (ఎలక్ట్రికల్, సివిల్)తో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో 600 జూనియర్ లైన్ మెన్ (జేఎల్‌ఎం), 300 సబ్ ఇంజనీర్, 100 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ సంస్థలు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించిన నివేదికలో తెలిపాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ బిజినెస్, వీలింగ్ టారిఫ్ వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్‌ఆర్) పిటిషన్లలో విద్యుత్ సంస్థలు ఈ కొత్త నియామకాల అంశాన్ని ప్రస్తావించాయి. కాగా, ఐటీఐ చేసిన వారు జేఎల్‌ఎం ఉద్యోగాలకు, పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన వారు సబ్ ఇంజనీర్, బీఈ/బీటెక్ అభ్యర్థులు అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు అర్హులు. ఈ మేరకు పోస్టుల భర్తీ కోసం రెండు డిస్కంలు త్వరలో ఏకకాలంలో నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశాలున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఉద్యోగాల భర్తీ ఉంటుందని సమాచారం.

కిలిమంజారోపై తొమ్మిదేళ్ల చిన్నోడు

5,756 మీటర్లు ఎక్కిన విహాన్‌రాం



మద్దూరు (హుస్నాబాద్): అనుకూలించని వాతావరణం.. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా సిద్దిపేట జిల్లాకు చెందిన తొమ్మిదేళ్ల చిన్నోడు కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి ఔరా అనిపించాడు. ధూళ్మిట్ట మండలం కొండాపూర్ గ్రామం హనుమతండాకు చెందిన విహాన్‌రాం జాటోత్ ఈ నెల 15న ‘సే నో టు డ్రగ్స్’నినాదంతో టాంజానియాలోని కిలిమంజారో పర్వత శ్రేణిని అధిరోహించాడు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా ఉహురు (5,895 మీటర్లు)శిఖరానికి చేరుకోలేక, గిల్మన్ పాయింట్ అయిన 5,756 మీటర్ల ఎత్తుగల శిఖరాన్ని తన కుమారుడు అధిరోహించాడని విహాన్‌రాం తండ్రి తిరుపతినాయక్ తెలిపారు. మరో ప్రయత్నంలో కిలిమంజారో ప్రధాన శిఖరాగ్రాన్ని అధిరోహిస్తానని విహాన్ తెలిపాడన్నారు. విహాన్ 2024 అక్టోబర్‌లో హిమాచల్ ప్రదేశ్‌లోని 4,250 మీటర్ల ఎత్తు గల పర్వతాన్ని అధిరోహించాడని ఆయన చెప్పారు.



13 కిలోమీటర్లు.. స్టేషన్లు.. నిమిషాలు..

ఎల్బీనగర్ నుంచి ఖైరతాబాద్‌కు మెట్రో రైల్‌లో గుండె తరలింపు.. గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఎల్బీనగర్ నుంచి ఖైరతాబాద్‌కు గ్రీన్‌చానల్ ద్వారా మెట్రో రైల్‌లో గుండెను తరలించారు. కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 34 ఏళ్ల వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయినట్టు ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. అవయవాలను దానం చేసేందుకు బంధువులు అంగీకరించడంతో ఆ మేరకు జీవన్‌దాన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే గుండె పనితీరు పూర్తిగా దెబ్బతిని, ఖైరతాబాద్ గ్లెనిగల్ గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 35 ఏళ్ల వ్యక్తికి బ్రెయిన్‌డెడ్ వ్యక్తి గుండెను అమర్చేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్టర్ అజయ్‌జోషి నేతృత్వంలోని వైద్య బృందం శుక్రవారం సాయంత్రం కామినేని ఆస్పత్రికి చేరుకుని, దాత శరీరం నుంచి గుండెను సేకరించారు. ప్రత్యేక అంబులెన్స్‌లో దీన్ని తీసుకుని ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వైద్య బృందం రాత్రి 9.30 గంటలకు ఎల్బీనగర్ నుంచి మెట్రోలో బయలుదేరి 9.43 గంటలకు ఖైరతాబాద్ చేరుకుంది. పోలీసులు, మెట్రో అధికారులు, జీవన్‌దాన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రీన్‌చానల్ ఏర్పాటు చేశారు. ఈ సమయంలో కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, మూసారాంబాగ్, మలక్‌పేట్, ఎంజీబీఎస్, నాంపల్లి, అసెంబ్లీ, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్లను మూసివేసి, ప్రయాణికుల రాకపోకలను నిలిపివేశారు. 13 కిలోమీటర్లు, 13 స్టేషన్లు దాటుకుని, 13 నిమిషాల్లో రైలు గమ్యస్థానానికి చేరుకుంది.

సుస్థిర వ్యవసాయ పద్ధతులు అవసరం

హెచ్‌ఐఎల్ సీఎండీ కుల్దీప్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: సుస్థిర వ్యవసాయ పద్ధతులు, విధానాలు నేటి అవసరమని హిందుస్తాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ (హెచ్‌ఐఎల్) సీఎండీ కుల్దీప్‌సింగ్ పేర్కొన్నారు. ఈ దిశలో తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ఆసియాలో పర్యావరణహిత పంటల పరిరక్షణ చర్యలు, సేంద్రీయ కాలుష్యాలు (పెర్సిస్టెంట్ ఆర్గానిక్ పొల్యుటెంట్స్), అత్యంత ప్రమాదకరమైన పురుగుమందుల (హైలీ హాజర్డస్ పెస్టిసైడ్స్)ను తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలియజేశారు. శుక్రవారం సీఎస్‌ఐఆర్‌–ఐఐసీటీ ఆధ్వర్యంలో డా.యు.టి.భలేరావు ప్రథమ స్మారక ఉపన్యాసం సందర్భంగా ఆయన చిత్రపటానికి కుల్దీప్‌సింగ్, భలేరావు కుటుంబసభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భలేరావుతో తనకున్న అనుబంధాన్ని సీఎస్‌ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాసరెడ్డి గుర్తుచేసుకున్నారు.

ఆరు రైల్వే లైన్లతో అనుసంధానం

▶ మొదటి పేజీ తరువాయి

వ్యయం రూ.13,500 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేసింది.



ఆరు రైల్వే లైన్ల అనుసంధాన ప్రాథమిక అలైన్‌మెంట్ ఇదే..

గూడ్స్ రైళ్లన్నీ ‘ఔటర్’ నుంచే..

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు నగరంలోకి రావాల్సిన అవసరం లేకుండా, వెలుపలి నుంచే వెళ్లిపోయేలా ట్రిపుల్ ఆర్‌ను నిర్మించనున్న విషయం తెలిసిందే. అదే తరహాలో వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల రైళ్లలో కొన్ని నగరంలోని ప్రధాన స్టేషన్లలోకి వచ్చేలా, సరుకు రవాణా లాంటి రైళ్లు వెలుపలి నుంచే వెళ్లిపోయేలా ఔటర్ రింగు రైలు ప్రాజెక్టుకు ప్రణాళిక సిద్ధం అయ్యింది. ప్రతిపాదిత ట్రిపుల్ ఆర్‌కు అవతలి వైపు 2 కి.మీ నుంచి 4 కి.మీ దూరంలో దీన్ని నిర్మించేలా.. తాజాగా హెలీకాప్టర్ ద్వారా లైడార్‌తో ఓ ప్రాథమిక అలైన్‌మెంటును రైల్వే శాఖ రూపొందించింది. రింగు రోడ్డుకు అవతలి వైపు రింగ్ రైలు మార్గం నిర్మించాల్సి ఉన్నందున, ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంటు కూడా తేలాక దీని అలైన్‌మెంటు ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం లైడార్ ఆధారంగా పూర్తి మ్యాప్ సిద్ధం చేశారు. ఆ మ్యాపు ఆధారంగా తదుపరి కచ్చితమైన అలైన్‌మెంటును రూపొందించనున్నారు. ఫైనల్ లొకేషన్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం రూ.12.64 కోట్లను గత బడ్జెట్‌లో మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాగా హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థకు కన్సల్టెన్సీ బాధ్యతలు అప్పగించారు.

394- 420 కి.మీ నిడివితో సింగిల్ లైన్

➤ ఔటర్ రింగ్ రైలు నిడివి 394 కి.మీ నుంచి 420 కి.మీ వరకు ఉండనుంది. ఇందుకు 70 నుంచి 80 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరిస్తారు. భూసేకరణ ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించనున్నాయి. భూసేకరణకు దాదాపు రూ.7 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

➤ ప్రస్తుతానికి సింగిల్ లైన్ మాత్రమే నిర్మించాలని నిర్ణయిస్తున్నందున, దాని నిర్మాణ వ్యయం రూ.6,500 కోట్లుగా ఉంటుందని భావిస్తున్నారు.

➤ ఈ మార్గంలో దాదాపు 23 నుంచి 25 వరకు రైల్వేస్టేషన్లు ఉండే అవకాశం ఉంది. ఇంకా స్టేషన్లను గుర్తించలేదు.

➤ కీలక ప్రాంతాల్లో గూడ్సు రైళ్ల కోసం సరుకు రవాణా యార్డులు నిర్మిస్తారు. ఆయా ప్రాంతాల్లో ఒక మెయిన్ లైన్, 2 లూప్ లైన్లు, సరుకు రవాణా పరిమాణం ఆధారంగా ఒకటి నుంచి రెండు గూడ్సు లైన్లు ఏర్పాటు చేస్తారు.

➤ రైలు మార్గంతో పాటే విద్యుదీకరణను కూడా పూర్తి చేస్తారు. ఆరు ఇంటర్‌ఛేంజ్ ఆర్‌ఓఆర్ వంతెనలతో పాటు నదులపై ఐదు వంతెనలు, రోడ్లను, కాలువలను దాటేందుకు 400 చిన్న వంతెనలు నిర్మించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

➤ రేట్ ఆఫ్ రిటర్న్స్ 10 శాతానికి పైగా ఉండాలని నిర్ధారించారు. అంటే ప్రాజెక్టుకు పెట్టే పెట్టుబడిపై ఖర్చులు పోను కనీసం 10 శాతానికి పైగా అదనపు ఆదాయం ఉండాలన్నమాట.

➤ గతంలో నిర్వహించిన ప్రిలిమినరీ ఇంజినీరింగ్ అండ్ ట్రాఫిక్ సర్వేలో సానుకూల ఫలితమే వచ్చింది. త్వరలో డీటెయిల్డ్ ట్రాఫిక్ సర్వే నిర్వహించి దీనిపై కచ్చితమైన అంచనాను తేల్చనున్నారు.

లైడార్ సర్వే అంటే..

పెద్ద రైల్వే లైన్ల విషయంలో ఇటీవలి కాలంలో రైల్వే శాఖ లైడార్ (లై డిటెక్షన్ అండ్ రేంజింగ్) సర్వే నిర్వహిస్తోంది. ఇది కూడా రాడార్ సర్వే లాంటిదే. అయితే రేడియో తరంగాలకు బదులు లేజర్ (కాంతి కిరణాలు)ను భూమిపైకి ప్రసరింప జేయడం ద్వారా ప్రతిపాదిత మార్గంలో ఉండే ఎత్తు పల్లాలను, అడ్డంకులను సులభంగా గుర్తిస్తారు. వాటిని తప్పిస్తూ మార్గాన్ని రూపొందిస్తారు. హెలీకాప్టర్‌లో లైడార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుని.. ప్రతిపాదిత మార్గంలో 300 మీటర్ల నుంచి 500 మీటర్ల వెడల్పుతో చిత్రాలు తీసి మ్యాపింగ్ చేస్తారు. తర్వాత దాన్ని 3డీ మ్యాపింగ్‌గా మారుస్తారు. జలవనరులు, నీటి కాలువలు, అడవులు, గుట్టలు, పరిశ్రమలు, జనావాసాలు తదితరాలను గుర్తిస్తారు. గ్రేడియంట్ ఆధారంగా స్టేషన్ల పాయింట్లను కూడా గుర్తిస్తారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అనువైన మార్గంలో అలైన్‌మెంటును నిర్ధారిస్తారు.

స్టార్టప్ కుంభమేళా

ఏప్రిల్ మొదటి వారంలో ఢిల్లీ వేదికగా ‘మహాకుంభ్ 5.0’..	స్టార్టప్‌లు.. 1,54,719
2047 నాటికి భారత్‌లో స్టార్టప్‌లు సాధించాల్సిన లక్ష్యాలపై దిశానిర్దేశం	ప్రత్యక్ష ఉద్యోగాలు.. 17,00,000



సాక్షి, హైదరాబాద్: దేశంలో స్టార్టప్‌ల వాతావరణాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ‘స్టార్టప్ మహాకుంభ్ 2025’పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఢిల్లీలోని భారత్ మండపంలో ఏప్రిల్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. దీనిద్వారా వాణిజ్యవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి భాగస్వామ్యాల ద్వారా కొత్త లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ద్వారా ‘స్టార్టప్ మహాకుంభ్ 5.0’నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2047 నాటికి భారత్‌లో స్టార్టప్‌లు సాధించాల్సిన లక్ష్యాలపై ఇందులో చర్చించి, దిశానిర్దేశం చేస్తారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా పాలసీలు, ప్రోగ్రామ్‌లు

దేశంలో స్టార్టప్‌ల వాతావరణానికి ఊతమిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక పాలసీలు, ప్రోగ్రాములను అమలు చేస్తోంది. నేషనల్ మెంటార్‌షిప్ ప్లాట్‌ఫామ్, సీడ్ ఫండ్ సపోర్ట్, ఫండ్ ఆఫ్ ఫండ్ ఫర్ స్టార్టప్స్, స్టార్టప్ ఇండియా యాత్ర, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ వంటివి చేపట్టింది. ఈ క్రమంలోనే భారతీయ స్టార్టప్‌లు అంతర్జాతీయ స్థాయికి తమ కార్యకలాపాలను విస్తరించేలా స్టార్టప్ మహాకుంభ్ 2025ను కేంద్ర ప్రభుత్వ అనుబంధ విభాగం డీపీఐఐటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

దేశంలో ప్రస్తుతం 1.54 లక్షల స్టార్టప్‌లు

డీపీఐఐటీ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 2016లో 502 స్టార్టప్‌లు ఉండగా.. 2024 నవంబర్ 24 నాటికి 1,54,719 స్టార్టప్‌లకు చేరాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 17 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. స్టార్టప్‌లలో అత్యధికంగా 17,618 స్టార్టప్‌లు ఐటీ సేవలు, 14,285 స్టార్టప్‌లు ఆరోగ్య రక్షణ, 9,047 స్టార్టప్‌లు విద్యా రంగానికి చెందినవి ఉన్నాయి. మొత్తంగా చూస్తే మహారాష్ట్ర (27,459 స్టార్టప్‌లు), కర్ణాటక (16,335), ఢిల్లీ (15,851) దేశంలో టాప్ మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణలో 5,157 స్టార్టప్‌లు ఉన్నాయి. భారత్‌లోని స్టార్టప్‌లలో నాయకత్వ స్థాయిలో 48 శాతం మందికిపైగా మహిళలే ఉండటం గమనార్హం.

ఫలితాలను ఇస్తున్న పథకాలు

భారతీయ స్టార్టప్‌ల రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు ఫలిస్తున్నాయి. స్టార్టప్‌ల ఆవిష్కరణలు, వాణిజ్య భాగస్వామ్యాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. స్టార్టప్ ఐడియాలను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన ‘స్టార్టప్ యాత్ర’236 జిల్లాలు, 23 రాష్ట్రాల మీదుగా సాగుతూ... 143 బూట్ క్యాంపులను, 300 చోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. స్టార్టప్ బ్రిడ్జెస్ కార్యక్రమంలో భాగంగా 21 దేశాలతో భారతీయ స్టార్టప్‌లను అనుసంధానం చేశారు. ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2024 నాటికి 1,165 స్టార్టప్‌లలో 21,221 కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమమైంది.

యూనికార్న్‌ల వైపు అడుగులు..

కొద్దిపాటి పెట్టుబడులతో వినూత్న ఆవిష్కరణలతో ప్రారంభమైన సంస్థలు స్వల్పకాలంలో ఒక బిలియన్ డాలర్లకుపైగా (సుమారు రూ.8,629 కోట్లు) విలువ కలిగిన సంస్థగా ఎదిగితే యూనికార్న్‌లుగా పిలుస్తారు. 2016 నాటికి భారత్‌లో 11 యూనికార్న్‌లు ఉండగా.. 2014 నాటికి వాటి సంఖ్య 118కి చేరింది. ఎడ్‌టెక్ రంగంలో అన్ అకాడమీ, వేదాంత.. ఫిన్‌టెక్‌లో పేటీఎం, ఫోన్‌పే, జెటా.. ఈ–కామర్స్‌లో ఫ్లిప్‌కార్ట్, ఫస్ట్ క్రై.. హెల్త్ టెక్‌లో ఫార్మ్ ఈజీ వంటి సంస్థలు భారతీయ యూనికార్న్‌ల జాబితాలో ఉన్నాయి. ఇలా భారతీయ స్టార్టప్‌ల నుంచి మరిన్ని యూనికార్న్‌లు ఎదిగేందుకు ‘స్టార్టప్ మహాకుంభ్’దోహదం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

సైబర్ నేరాల కట్టడికి సంచార్ సాథీ యాప్

మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన సమాచార శాఖ

అనుమానాస్పద లావాదేవీలపై రిపోర్ట్ చేసేందుకు అవకాశం

మొబైల్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఫిర్యాదు చేసే వీలు

యాప్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య




సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల కట్టడిలో భాగంగా కేంద్ర సమాచార శాఖ పరిధిలోని టెలీ కమ్యూనికేషన్స్ విభాగం ‘సంచార్ సాథీ మొబైల్ యాప్’ను అందుబాటులోకి తెచ్చింది. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు, వెబ్ లింక్‌లను ఈ మొబైల్‌యాప్ ద్వారా రిపోర్ట్ చేయొచ్చు. అలాంటి ఫోన్ నంబర్లు, వెబ్‌సైట్లను ఈ విభాగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌ను వాడి మోసపూరితమైనదిగా నిర్ధారిస్తే.. ఆ ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడుతుంది. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సీటీఓ బిల్డింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంచార్ సాథీ మొబైల్ యాప్‌ను, నేషనల్ బ్రాడ్‌బాండ్ మిషన్ 2.0, ఇంట్రా సర్కిల్ రోమింగ్ సేవలను కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మొబైల్ వినియోగదారుడి వ్యక్తిగత సమాచార గోప్యతను, భద్రతను కాపాడేలా సురక్షితమైన సేవలందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఫోన్ పోయినా రిపోర్ట్ చేయొచ్చు

సంచార్ సాథీ మొబైల్ యాప్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని టెలీ కమ్యూనికేషన్స్ విభాగం స్పెషల్ డీజీ ప్రశాంత్‌పాటిల్ తెలిపారు. మన ఆధార్ నంబర్‌తో ఎన్ని ఫోన్ నంబర్లు లింక్ అయ్యాయనేది కూడా ఇందులో తెలుసుకోవచ్చని చెప్పారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే ఈ యాప్ ద్వారా రిపోర్ట్ చేసేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. నేషనల్ బ్రాడ్‌బాండ్ మిషన్ 2.0 కింద ఇంటర్నెట్ సేవలను గ్రామీణ స్థాయికి విస్తరించడంతోపాటు నెట్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలోనూ 80 శాతం గ్రామాలకు కనెక్టివిటీ పూర్తయిందని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్) కింద ఇంట్రా సర్కిల్ రోమింగ్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. అందుకోసం 4జీ సేవలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే ఈ ప్రాజెక్టు కింద 164 ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ టవర్లను ఏర్పాటుచేసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టెలీ కమ్యూనికేషన్స్ విభాగం అధికారులు వై శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆనంద్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ మేధావుల సదస్సులో వక్తల డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, ఎస్.మధుసూదనాచారి, గుజ్జ సత్యం, డాక్టర్ వకుళాభరణం తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని బీసీ మేధావుల సదస్సులో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీసీ కమీషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజకీయ వాటా సాధించే వరకు దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి బీసీల హక్కులను సాధిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కత్తి వెంకటస్వామి, మల్లేశ్, వెంకటేశ్, రామకృష్ణ, నందగోపాల్ పాల్గొన్నారు.

హాబీస్.. హ్యాపీస్

కొంతమంది చిన్న చిన్న విషయాలకే ఆందోళన పడిపోతుంటారు. కొందరు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. సంతోషంగా ఉండటమనేది పూర్తిగా మన వ్యక్తిత్వం, అలవాట్ల పైనే ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటారు. వీళ్లు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషాన్ని దూరం చేసుకోరు. అదెలా సాధ్యం? సంతోషంగా ఉండే వారి అలవాట్లు ఏంటో తెలుసుకుందామా?





సంతోషంగా ఉండేవారు కుటుంబం తోనూ, స్నేహితులతోనూ ఎక్కువ సమయం గడపడటానికి ఇష్టపడతారని, వీరిని కష్టాలు, బాధలు చుట్టిముట్టిన ప్పుడు తమ కుటుంబం, స్నేహితు లతోనే వాటిని పంచుకుంటూ మనసు తేలిక చేసుకుంటారన్నది హ్యాపీ పీపుల్ హ్యాబిట్స్‌లో బయట పడిన విషయం. వీరు తాము సంతోషంగా ఉంటూ, తమ కుటుంబాన్ని, స్నేహి తులనూ కూడా సంతోషంగా ఉండేలా చూస్తారు.

పొద్దున్నే నిద్రలేవడం

సంతోషంగా ఉన్న వ్యక్తులు ఉదయాన్నే నిద్రలే స్తారు. పని ఉన్నా... లేకున్నా పొద్దున్నే లేవడం మానుకోరు. తమకు తాముగా కొన్ని నిబంధనలు, పరిమితులు విధించుకుని తమ రోజును ప్రారంభిస్తారు. అలాగే వ్యాయామం, ఆధ్యాత్మిక చింతన, కొత్త విషయాలను తెలు సుకోవడం, పరిశోధనలు, అధ్య యనం వంటి వాటితో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు.

ధ్యానం

సంతోషంగా ఉన్నవారు ధ్యానంలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. ధ్యానం తోనే తమ ప్రతికూల ఆలోచనలను నియంత్రి స్తారు. సానుకూలతను పొందడానికి ప్రయత్నిస్తారు. సంతోషకర మైన, స్వీయ-అవగాహన ఉన్న వారికి ధ్యానం ఒక ముఖ్యమైన అలవాటు.

ప్రకృతిలో గడపడం



ఎప్పుడూ సంతోషంగా ఉండే వారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తిన డంతోపాటు ప్రకృతితో మంచి సమ యాన్ని గడపడాన్ని ఇష్టపడతారు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. మన స్సును నిర్మలంగా ఉంచుతుంది. నకారాత్మక ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడు తుంది. అలాగే తమతో తాము మరింతగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం

సంతోషంగా ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినడానికి ప్రయత్నిస్తారు. అలాగే ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ తో పాటు తగినన్ని నీటిని తాగుతారు.

కంటినిండా నిద్ర



మన శరీరానికి నిద్ర చాలా చాలా అవసరం. ఒక వ్యక్తి ఆరో గ్యంగా ఉండాలంటే రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల రాత్రి నిద్ర చాలా అవసరం. నాణ్యమైన నిద్ర మనసును సంతోషం గా ఉంచుతుంది. తగినంత నిద్ర లేనివారు చికాకు పడుతూ చిర్రుబుర్రులాడటం చూస్తూనే ఉంటాం.

కనీస వ్యాయామం

ఎప్పుడు చూసినా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండే వారు శరీరానికి, మెదడుకూ కూడా తగినంత వ్యాయామం కల్పిస్తారని పరిశోధనలలో తేలింది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ కనీసం వాకింగ్, రన్నింగ్, జాగింగ్, తేలికపాటి బరువులు ఎత్తడం, లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లెక్కడం, గార్డెనింగ్ వంటి శారీరక వ్యాయామం తోపాటు మెదడును పదును పెట్టే చెస్, బిజినెస్, క్రాస్‌వర్డ్స్ పూరించడం, సుడోకు వంటి వాటిలో పాల్గొనడం వల్ల సంతోషంగా ఉండగలరు.

అంటే మన అలవాట్లు... అదేనండీ.. హాబీసే... హ్యాపీస్ అన్నమాట. కాబట్టి మంచి అలవా ట్లతో మరింత సంతోషంగా జీవిద్దాం.

లైఫ్@360

● ప్లీజ్ క్లీన్

వాడర్ బాటిల్



ఒకప్పుడు ప్రయాణాలలో మాత్రమే వెంట తీసుకెళ్లే వాటర్ బాటిల్స్‌ని ఇప్పుడు మనం పని చేసే సిస్టమ్ పక్కన లేదా మంచం పక్కన పెట్టుకోకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేం దుకు వీలుగా వాటర్ బాటిల్స్‌ని దగ్గర పెట్టుకోవడం వరకు తప్పేం లేదు కానీ, వాటిని సరిగా శుభ్రం చేయకపో వడం వల్ల వాటి మీద మిలియన్లకొద్దీ సూక్ష్మజీవులు పేరుకుని పోయి రకరకాల జబ్బులు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య, ఆరోగ్య పరిశోధకులు.

తాళం చెవులు, సెల్‌ఫోన్, మనీపర్స్, హ్యాండ్ బ్యాగ్‌లాగే వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకునిపోయే అవస రంగా మారింది. అయితే కొన్ని పరి శోధనల ప్రకారం తేలిందే మిటంటే, వాటర్ బాటిల్‌ను సరిగా శుభ్రం చేయక పోవడం వల్ల టాయిలెట్ సీట్ మీద కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు సూక్ష్మజీవులు, బాటిల్ మీద, లోపల, మూత మీద బ్యాక్టీరియా పేరు కుపోతుందట. మనం ఇప్పుడు చెప్పుకోబోయే విషయాలు వినడానికి కొంచెం వింతగా... మరి కొంచెం బాధాకరంగా కూడా ఉండచ్చు. అయినా, చెప్పుకోక తప్పదు మరి!

స్ట్రా ద్వారా తాగే బాటిల్స్, సిప్పర్ బాటిల్స్, అలాగే నోటికి కరిపించు కుని తాగే బాటిల్స్... ఈ మూడు రకాల బాటిల్స్‌లోనూ రెండు రకాలైన బ్యాక్టీరియాను కనుగొన్నారు పరిశోధకులు. ఈ బ్యాక్టీరియా టైఫాయిడ్‌ను కలిగిస్తుంది. అందువల్ల తిరిగి వాడే వాటర్ బాటిల్స్‌ను తీరుబడిగా వారాని కోసారి కాకుండా ప్రతిరోజూ సబ్బునీటితో, వేడి నీటితో శుభ్రంగా కడిగి ఉపయోగించడం చాలా మంచిది లేదంటే వ్యాధుల బారిన పడటం ఖాయం మరి!

● యోగా

వెన్నునొప్పి నివారణకు గోముఖాసన



ఆవు ముఖ భంగిమను పోలి ఉంటుంది కాబట్టి దీనికి గో ముఖాసన అని పేరు. శరీరం మొత్తం స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు ఒకదానికి మీద ఒకటి చేరే ఈ ఆసనం చూడ్డానికి ఆవు ముఖంలా కనిపి స్తుంది. చేతులు ఆవు ముఖం చెవు లను సూచిస్తాయి.

ఇలా చేయాలి..

- ముందుగా సౌకర్యంగా చాప మీద కూర్చోవాలి. ఎడమ కాలును మోకాలి వద్ద వంచుతూ కుడి తుంటి భాగానికి దగ్గరగా తీసుకువెళ్లాలి.
- మోకాళ్లు ఒకదానిపై ఒకటి ఉండేలా సెట్ చేయాలి.
- కుడి చేతిని పైకి లేపి, మోచేయి వద్ద వంచి, వీపు కిందకు ఉంచాలి.
- ఎడమ చేతిని వీపు వెనక కు తీసుకువెళ్లి, కుడి చేతిని పట్టుకోవడానికి ప్రయ త్నించాలి.
- రెండు చేతులు కలవకపోతే ఆ ఖాళీని భర్తీ చేయడానికి టవల్ లేదా స్కార్ఫ్‌ను ఉపయోగిం చాలి.
- వెన్నెముకను నిటారుగా ఉంచి, కూర్చోవాలి.
- దీర్ఘ శ్వాస తీసుకొని, వదు లుతూ సౌకర్యంగా అనిపించేంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- మెల్లగా కాళ్లు, చేతులు విడదీసి యథా స్థితికి రావాలి. రెండోవైపు పై విధంగానే చేయాలి.

ప్రయోజనాలు..

డెస్క్ ఉద్యోగాలు చేసేవారిలో బ్యాక్ పెయిన్, హిప్ స్ట్రెస్ సాధారణంగా గమని స్తుంటాం. వెన్నెముక స్ట్రెచ్ అవ్వడం వల్ల బ్యాక్‌పెయిన్ సమస్య తగ్గుతుంది. తుంటి, రక్తప్రసరణ, కీళ్ల కదలి కలు మెరుగవుతాయి. దీర్ఘ శ్వాసలు తీసు కొని, వదలడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

వెన్ను, మోకాలు గాయాలు ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవాలి. కింద కూర్చోనేట ప్పుడు కుషన్‌ను కాలు మడత ల్లో ఉంచవచ్చు. తుంటి నొప్పి వస్తుంటే సాధారణ సుఖాసనలో కూర్చొని కూడా ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

చెప్పుకోదగ్గ విశేషం



పాద రక్షలు సురక్షితమైన నడకకు అత్యవసరాలు. పాద రక్షల ప్రయోజనం అక్కడికే పరి మితం కాలేదు. ఫ్యాషన్‌రంగం లోనూ పాదరక్షల పాత్ర పెరుగుతూ వస్తోంది. ఫ్యాషన్ స్థాయిని దాటిన అల్ట్రాలగ్జరీ పాదరక్షలు లేటెస్ట్ ట్రెండ్. ఈ పాదరక్షలు ప్రపంచంలోనే అత్యంత ఖరీ దైనవిగా రికార్డులకెక్కాయి. వీటిని కొనాలంటే, ఒక మోస్తరు సంపన్నుల ఆస్తులు కూడా చాలవు. ఇవి 'మూన్ స్టార్ షూస్'. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గౌర వార్థం ఇటాలియన్ డిజైనర్ ఆంటోనియో వీట్రీ వీటికి రూపకల్పన చేశారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపించేలా రూపొందించిన ఈ పాదరక్షల ఖరీదు 19.9 మిలియన్ డాలర్లు. అంటే, రూ.164 కోట్లు. ఈ పాదరక్షల జత తయారీకి బంగారం, వజ్రాలతో పాటు గ్రహాంతర పదార్థాన్ని కూడా ఉపయోగించారు. అందుకే వీటి ధర అంతరి క్షాన్ని తాకే స్థాయిలో ఉంది. ఈ పాదరక్షల అడుగుభాగాన్ని తెల్లబంగారంతో తయారు చేశారు. పైభాగాన్ని పూర్తిగా మేలిమి బంగారంలో 30 కేరట్ల వజ్రాలను పొదిగి తయారు చేశారు. వీటి తయారీ లో క్రీస్తుశకం 1576లో అర్జెంటీనాలో రాలిపడిన ఉల్క నుంచి సేకరించిన పదార్థాన్ని కూడా ఉపయోగించడం విశేషం.

సాక్షి సినిమా



● 'దిల్' రాజు, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్ రావిపూడి, శిరీష్

ఇది తెలుగు ప్రేక్షకుల విజయం

- వెంకటేశ్

''కష్టపడి పని చేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయమే కాదు.. ఇంత గొప్పగా సపోర్ట్, లవ్ చేసిన తెలుగు ఆడియన్స్, ఫ్యాన్స్ సక్సెస్. ఇది తెలుగు ప్రేక్షకుల విజయం'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పొంగల్ బ్లాక్ బస్టర్ జాతర సెలబ్రేషన్స్'లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ అనిల్, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు, సినిమా యూనిట్‌కి థ్యాంక్స్. ఫిల్మ్ ఇండస్ట్రీలోని అందరూ మనస్ఫూర్తిగా ఫోన్ చేసి సినిమా బాగుందని అభినందిస్తున్నందుకు ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లా డుతూ– ''మేము ఊహించినదానికంటే సినిమాని ఎక్కువ స్థాయికి తీసుకెళ్లిన తెలుగు ప్రేక్షకు లకు నా పాదాభివందనాలు. ఈ సినిమాతో నా కెరీర్‌లో ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు... ఆడియన్స్ సపోర్ట్ లేకపోతే నాకు ఈ విజయం వచ్చేది కాదు'' అన్నారు. ''వెంకటేశ్‌గారు నిర్మాతల బాగు కోరుకుంటారు. కాబట్టే ఇప్పటికీ కాలర్ ఎగరేస్తూ ముందుకు వెళ్తున్నారు'' అని శిరీష్ పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అనిల్, వెంకటేశ్‌గారి కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'' అని చెప్పారు. ''నేను చేసిన భాగ్యం పాత్ర క్రెడిట్ అంతా అనిల్‌గారికే దక్కుతుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేశ్. ఈ వేడుకలో నటులు అవసరాల శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్లమాని, మురళీధర్ గౌడ్, కెమెరామేన్ సమీర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, రచయితలు అజ్జు మహాకాళి, నాగ్, సాయి కృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆహా ఏమి రుచి...






● చేపల కూర వండుతున్న నాగ చైతన్య

కట్టెల పొయ్యి వెలిగించారు నాగ చైతన్య. ఎందుకంటే చేపల పులుసు వండటానికి. వండాక అందరికీ వడ్డించారు కూడా. అందరూ 'బాగుంది' అని మెచ్చు కుంటూ, ఫుల్లుగా లాగించేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ చైతన్య ఇలా చేపల కూర వండ టానికి కారణం ఏంటంటే... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికే. 'తండేల్' చిత్రంలో ఈ హీరో మత్స్యకారుడి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. విశాఖపట్నం, శ్రీకాకుళం తీర ప్రాంతాల్లోనూ ఈ చిత్రం షూటింగ్ జరిపారు. కాగా, 'మీ స్టయిల్‌లో చేపల కూర వండి పెడతా' అని విశాఖలో చిత్రీకరణలో పాల్గొన్నప్పుడు నాగచైతన్య అన్నారట. అన్నట్లుగానే చేపల కూర వండారు. కూర వండాక, అర చేతిలో కాస్త పులుసు వేసుకుని, రుచి చూసి, పక్కనే ఉన్న అమ్మాయికి ఇస్తే, 'బాగుందండి...' అని ఆమె అనడం, ఆ తర్వాత చైతు అక్కడ ఉన్నవారికి పులుసు వడ్డించి తాను కూడా తినడం వంటివన్నీ చిత్రీకరించి, ఆ వీడియోను షేర్ చేసింది చిత్రబృందం. ఇక ఆ వీడియోలో 'బాగుందా' అని చైతన్య అడగ్గా... ఆహా ఏమి రుచి అనే టైపులో 'బాగుంది.. చాలా బాగుంది' అంటూ అక్కడివాళ్లు తింటుంటే... 'పక్కానా... బాగోకపోతే ఏమీ అనుకోమాకండి... ఫస్ట్ టైమ్' అంటూ, వాళ్లతో కలిసి తానూ తిన్నారు చైతన్య. ఇక శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల జీవిత కథతో రూపొందుతున్న 'తండేల్'లో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది.

మంచి మాట వినాలి



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి.. ' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి... మాట వినాలి... మంచి మాట వినాలి...' అంటూ సాగే ఈ పాటని పవన్ కల్యాణ్ పాడారు. ఈ పాటను పెంచల్ దాస్ రాశారు. ఈ చిత్రం ఐదు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ వెర్షన్‌లోనూ రిలీజ్ చేశారు.



● ప్రియాంకా చోప్రా

లాస్ ఏంజెల్స్ టు హైదరాబాద్

ప్రముఖ హీరోయిన్ ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. అందులో విషయం ఏముందీ అనుకోవచ్చు. సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌తో పెళ్లి తర్వాత అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు ప్రియాంక. ఇప్పుడు ఇలా హైదరాబాద్‌లో అడుగుపెట్టడానికి కారణం ఏంటి? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసమే ఆమె భాగ్యనగరానికి చేరుకున్నారని టాక్. ఈ చిత్రంలో మహేశ్‌బాబుకి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో ప్రియాంకా చోప్రా, కియారా అద్వానీ, ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ప్రియాంకా చోప్రాని కథానాయికగా ఫిక్స్ చేశారని భోగట్టా. ప్రియాంకా చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి హైదరాబాద్‌కి చేరుకోవడంతో ఈ మూవీ చిత్రీకరణ కోసమే ఆమె వచ్చారనే రూమర్లు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్త ఎంతవరకూ నిజమో తెలియాల్సి ఉంది.

శివరాత్రికి థ్రిల్



● ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగు లోనూ రిలీజ్ కానుంది. తెలుగు విడుదల హక్కు లను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. గతంలో శివరాజ్ కుమార్ హీరోగా నటించిన 'వేద' చిత్రాన్ని ఆయన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లా డుతూ– ''హారర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రాక్షస'. మా సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు.

వెరైటీ యాక్షన్



● సత్య

సత్య వినుగొండ, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ పై సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ ఆవిష్కరించారు. సత్య వినుగొండ మాట్లాడుతూ– ''వెరైటీ యాక్షన్ నేపథ్యంలో సాగే ఫన్ ఎంటర్ టైనర్ మూవీ ఇది. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు.

నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా...



● సోనూగా... లైలాగా విశ్వక్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'చూసుకో... అయ్యయ్యో నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా', 'మనకు తెల్లగ జేసుడే కాదు... తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ సేన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''రొమాంటిక్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'లైలా'. ఈ మూవీలో మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా విశ్వక్ సేన్ కనిపించే రెండు డిఫరెంట్ లుక్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి'' అని యూనిట్ పేర్కొంది.

సుకృతి నటన చూసి షాక్ అయ్యాను

- సుకుమార్



● నవీన్, రవిశంకర్, సుకుమార్, సుకృతి, తబితా సుకుమార్, పద్మావతి, శేష సింధూరావు

''నా కుమార్తె సుకృతికి చిన్నప్పటి నుంచి పాడటం అంటే చాలా ఇష్టం. కానీ, నటన మీద పెద్దగా ఆసక్తి లేదు. తను నటిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు కలిసి సుకృతిని నటించేందుకు ఒప్పించారు. 'గాంధీ తాత చెట్టు'లో సుకృతి నటన చూసిన తర్వాత షాక్ అయ్యాను.. అంత బాగా నటించింది'' అని డైరెక్టర్ సుకుమార్ తెలిపారు. ఆయన కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ భార్య తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం సుకృతి లైఫ్‌లో మంచి జ్ఞాపకంలా మిగిలిపోతుంది. వినోదం, సందేశం ఉన్న 'గాంధీ తాత చెట్టు'ని అందరూ ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ పిల్లలతో కలిసి చూడాలి'' అన్నారు యలమంచిలి రవిశంకర్. ''ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. ''షూటింగ్‌లో తొలి రోజు సుకృతి నటన చూసి హ్యాపీ ఫీలయ్యాను'' అని తబితా సుకుమార్ పేర్కొన్నారు. ''ఒక చెట్టుకు, మనిషికి మధ్య ఉన్న అనుబంధంతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పద్మావతి మల్లాది. ''ఈ సినిమా కోసం నాన్న (సుకుమార్) ఎటువంటి సలహాలు ఇవ్వలేదు'' అని సుకృతి బండ్రెడ్డి తెలిపారు.

సాక్షి బిజినెస్
శనివారం
18-1-2025

స్టాక్ మార్కెట్లు				
దేశీ సూచీలు				
సెన్సెక్స్ ▽	423	76,619		
నిఫ్టీ ▽	109	23,203		
విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)				
నాస్‌డాక్	19,663	△	324	అమెరికా
డోజోన్స్	43,624	△	471	అమెరికా
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,505	△	113	బ్రిటన్
డాక్స్	20,903	△	248	జర్మనీ
షాంఘై	3,236	▽	6	చైనా
నికాయ్	38,451	△	121	జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	79,239 △	55
బంగారం (99.5 స్వచ్ఛత)	78,922 △	55
వెండి (కిలో)	90,820 ▽	964

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		86.20	87.22
£	బ్రిటన్ పౌండ్		104.30	107.10
€	యూరో		87.92	90.53
¥	జపాన్ ఎన్ (100)		54.21	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.76	54.95
S$	సింగపూర్ డాలర్		60.95	65.62
SAR	సౌదీ రియాల్		22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్		22.62	24.41
¥	చైనా యువాన్		10.91	12.73

షో షురూ



ఈవీ రంగం @ 8 రెట్లు..!

- 2030 నాటికి సాధ్యమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రారంభమైన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో

న్యూఢిల్లీ: ఈ దశాబ్దం చివరినాటికి ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) పరిశ్రమ దేశంలో ఎనిమిది రెట్లు దూసుకెళ్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. దశాబ్ద కాలంలో ఈవీల విక్రయాలు 640 రెట్లు పెరిగాయని అన్నారు. 10 ఏళ్ల క్రితం ఏటా 2,600 యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయని, గత ఏడాది ఈ సంఖ్య 16.8 లక్షల యూనిట్లు దాటిందని వివరించారు. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025ను ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం ఆయన ప్రసంగించారు. ఏడాదికి 2.5 కోట్ల వాహనాల అపూర్వ అమ్మకాలను చూసిందని, కేవలం నాలుగు సంవత్సరాలలో ఈ పరిశ్రమ 36 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించిందని వెల్లడించారు. పర్యావరణ అనుకూల సాంకేతికత, ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారత్ దృష్టి సారిస్తోందని మోదీ అన్నారు.

మేక్ ఇన్ ఇండియా చొరవతో..

మొబిలిటీ రంగంలో భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతి పెట్టుబడిదారుడికి అత్యుత్తమ గమ్యస్థానంగా భారత్ నిలుస్తుందని ప్రధాని తెలిపారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా చొరవ దేశ ఆటో పరిశ్రమ వృద్ధి అవకాశాలకు ఆజ్యం పోస్తోందని, ఈ రంగం అభివృద్ధిలో భారీ పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థకు, పర్యావరణానికి తోడ్పడే మొబిలిటీ వ్యవస్థ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. భారతీయ ఆటో రంగం వృద్ధికి, మధ్యతరగతి కుటుంబాల కలలను నెరవేర్చడంలో రతన్ టాటా, ఒసాము సుజుకీ సహకారం ఎంతో ఉందని మోదీ అన్నారు.

కొత్తగా 1.5 లక్షల మందికి..

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం వెన్నుదన్నుగా నిలిచిందని, తద్వారా పరిశ్రమకు అదనంగా రూ.2.25 లక్షల కోట్ల అమ్మకాలు తోడయ్యాయని నరేంద్ర మోదీ అన్నారు. వాహన రంగంలో కొత్తగా 1.5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను ఈ పథకం తెచ్చిపెట్టిందని వెల్లడించారు. శిలాజ ఇంధనాల దిగుమతిపై దేశ వ్యయాలను తగ్గించే వ్యవస్థను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణ సౌలభ్యం భారత్‌కు అతిపెద్ద ప్రాధాన్యతగా ఉందని, గత బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.11 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించామన్నారు. భారత ఆటోమొబైల్ రంగం గత ఏడాది 12% వృద్ధి చెందిందని వివరించారు. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో జనవరి 22 వరకు కొనసాగనుంది. ఆటోమొబైల్, విడిభాగాలు, సాంకేతికతల్లో 100కుపైగా నూతన ఆవిష్కరణలకు ఎక్స్‌పో వేదిక కానుంది.





సుజుకీ ఈ-యాక్సెస్ 95 కిలోమీటర్లు

టాటా.. 32 కొత్త వాహనాలు

టాటా మోటార్స్ ఆటో ఎక్స్‌పో వేదికగా ప్యాసింజర్, కమర్షియల్ విభాగంలో 32 కొత్త వాహనాలతో పాటు వివిధ ఇంటెలిజెంట్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించింది. వీటిలో ఆరు ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. టాటా సియర్రా ఎస్‌యూవీ, హ్యారియర్ ఈవీతోపాటు అవిన్యా కాన్సెప్ట్ ఈవీ సైతం కొలువుదీరింది. అవిన్యా శ్రేణిలో తొలి మోడల్ 2026లో రంగ ప్రవేశం చేసే అవకాశం ఉంది.

సుజుకీ తాజాగా భారత్ వేదికగా అంతర్జాతీయ మార్కెట్లో యాక్సెస్ ఎలక్ట్రిక్ వర్షన్‌ను ఆవిష్కరించింది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణించడం ఈ-యాక్సెస్ ప్రత్యేకత. 3.07 కిలోవాట్ అవర్ ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ ప్యాక్‌ను పొందుపరిచారు. గరిష్ట వేగం గంటకు 71 కిలోమీటర్లు. చార్జింగ్ పూర్తి కావడానికి 240 వాట్ పోర్టబుల్ చార్జర్‌తో 6 గంటల 42 నిముషాలు, ఫాస్ట్ చార్జర్‌తో 2 గంటల 12 నిమిషాలు పడుతుంది. పండుగ సీజన్ మార్కెట్లోకి రానుంది. కాగా, యాక్సెస్ 125 అప్‌గ్రేడెడ్ వెర్షన్‌తో పాటు జిక్సర్ ఎస్ఎఫ్ 250 ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడళ్లను పరిచయం చేసింది.

ఇక జేఎస్‌డబ్ల్యూ బ్రాండ్ వాహనాలు

విభిన్న రంగాల్లో ఉన్న జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సొంత బ్రాండ్‌లో కార్స్, ట్రక్స్, బస్‌ల తయారీలోకి ప్రవేశించనున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు చేయనున్నట్టు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా డైరెక్టర్ పార్థ్ జిందాల్ వెల్లడించారు. సాంకేతిక భాగస్వామ్యం కోసం వివిధ కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు జిందాల్ చెప్పారు. జేఎస్‌డబ్ల్యూ బ్రాండ్ తొలి వాహనం 2027–2028లో రోడ్లపైకి వస్తుందన్నారు.




మారుతీ ఈ-విటారా రేంజ్ 500 కి.మీ

మారుతీ సుజుకీ ఇండియా నుంచి ఎట్టకేలకు తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారా కొలువుదీరింది. 49, 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్స్‌లో ఇది లభిస్తుంది. 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్లకుపైగా పరుగుతీయనుందని కంపెనీ వెల్లడించింది. ఫ్లోటింగ్ డ్యూయల్ స్క్రీన్స్, లెవెల్-2 అడాస్, ఏడు ఎయిర్‌బ్యాగ్స్ పొందుపరిచారు. 300 ఎన్ఎం టార్క్ అందించే ఆల్ వీల్ డ్రైవ్ వర్షన్ సైతం ఉంది. ప్రపంచ మార్కెట్‌కు ఈ-విటారా కార్లను మారుతీ సుజుకీ వచ్చే 10 ఏళ్లపాటు ప్రత్యేకంగా సరఫరా చేయనుండడం విశేషం. ఈ-విటారా తయారీ, ప్రత్యేకంగా ఈవీ ప్రొడక్షన్ లైన్ కోసం రూ.2,100 కోట్లకుపైగా పెట్టుబడి చేసినట్టు మారుతీ సుజుకీ ఇండియా ఎండీ హిసాటీ టాకేయూచీ వెల్లడించారు. కాగా, 'ఈ ఫర్ మీ' పేరుతో పూర్తిస్థాయిలో ఈవీ వ్యవస్థ ఏర్పాటుకు మారుతీ శ్రీకారం చుట్టింది. టాప్-100 నగరాల్లోని డీలర్‌షిప్స్ వద్ద ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి తెస్తారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఉండాలన్నది కంపెనీ లక్ష్యం. అలాగే 1,000కిపైగా నగరాల్లో ఈవీల కోసం ప్రత్యేకంగా 1,500ల పైచిలుకు సర్వీస్ సెంటర్లను నెలకొల్పుతారు.



ఈ-విటారాను ఆవిష్కరిస్తున్న మారుతీ సుజుకీ ఎండీ హిసాటీ టాకేయూచీ (ఎడమ)



పోర్షె 911 జీటీ3 ఆర్ఎస్

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

హీరో మోటో 4 కొత్త మోడల్స్
మరిన్ని ఆటో ఎక్స్‌పో వార్తలు

టెక్ మహీంద్రా లాభం హైజంప్

ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ నష్టం 423 పాయింట్లు

ముంబై: ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీల మూడురోజుల లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 423 పాయింట్లు పతనమై 76,619 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు కోల్పోయి 23,203 వద్ద నిలిచింది. అయితే ఫార్మా, ఇంధన, మెటల్, ఇండస్ట్రియల్ షేర్లు రాణించడంతో కొంత మేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. డిసెంబర్ క్వార్టర్ ఫలితాల ప్రకటన తర్వాత ఇన్ఫోసిస్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈలో 6% పతనమై రూ.1,815 వద్ద స్థిరపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు రెండున్నర శాతానికి పైగా రాణించి సూచీల భారీ పతనాన్ని అడ్డుకుంది.



విప్రో లాభం జూమ్

- క్యూ3లో రూ. 3,354 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 24% జంప్‌చేసి రూ. 3,354 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్రంగా 0.5% పుంజుకుని రూ. 22,319 కోట్లకు చేరింది. క్యూ4లో ఐటీ సర్వీసుల ఆదాయం 260.2–265.5 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదుకాగలదని (గైడెన్స్) తాజాగా ప్రకటించింది. వెరసి ఆదాయ వృద్ధిని మైనస్ 1% నుంచి +1% మధ్య అంచనా వేసింది. వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లింపునకు కంపెనీ బోర్డు అనుమతించింది.



మూడేళ్లపాటు లాభాల్లో 70%వరకూ వాటాదారులకు చెల్లించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

బిలియన్ డాలర్లు: తాజా సమీక్షా కాలంలో 17 భారీ డీల్స్ ద్వారా బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లను అందుకున్నట్లు విప్రో వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో కొత్తగా 10,000–12,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించనున్నట్లు తెలియజేసింది. క్యూ3లో నికరంగా 1,157మంది ఉద్యోగులు తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,32,732కు చేరింది.

విప్రో షేరు 2.2% క్షీణించి రూ. 282 వద్ద క్లోజైంది.

సాక్షి స్పోర్ట్స్

'చాంపియన్స్'కు టీమిండియా ఎంపిక నేడే

వచ్చే నెలలో పాకిస్తాన్–యూఏఈలో జరిగే 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ' కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును శనివారం ఎంపిక చేయనున్నారు. స్పీడ్‌స్టర్ బుమ్రా ఫిట్‌నెస్, యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ స్థానం ఈ రెండు సందిగ్ధాలు మినహా జట్టు ఎంపికలో అతి అంచనాలు, సంచలన నిర్ణయాలైతే ఉండే అవకాశాలు లేవు.

గీత దాటితే వాతే!

వన్డే, టి20 ఫార్మాట్లలో జట్టు పర్లేదు. సంప్రదాయ ఐదు రోజుల ఆటలోనే భారత్ గతి తప్పుతోంది. ఈ మధ్య అయితే మరింతగా గాడి తప్పింది. ఫలితం... పాక్, శ్రీలంకల్లో చిత్తుగా ఓడిన న్యూజిలాండ్ చేతిలో మనం మన సొంతగడ్డపై క్లీన్‌స్వీప్ అయ్యాం. జట్టు ఎంతలా గాడి తప్పిందో ఇదొక్క నిదర్శనం చాలు! గత రెండు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లలో (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరిన టీమిండియా ఈసారి ఫైనల్ బెర్త్‌ను చేజార్చుకుంది. అందుకే టెస్టుల్లో భారత ఆటగాళ్ల బరువు బాధ్యతలు పెంచేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నడుం బిగించింది. కోచ్ గౌతమ్ గంభీర్ సిఫార్సులను కేవలం పరిగణించడమే కాదు... దిక్సూచిగా మలిచేందుకు పది పాయింట్ల ప్రొటోకాల్‌ను సిద్ధం చేసింది.

గంభీర్ దిక్సూచికి బోర్డు సై

- భారత క్రికెట్లో ప్రక్షాళన
- క్రికెటర్లకు కొత్త ప్రొటోకాల్



రిషభ్ పంత్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, విరాట్ కోహ్లి, హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ (ఫైల్)

న్యూఢిల్లీ: స్టార్లు... సీనియర్లు... దిగ్గజాలు... ఇలా జట్టులో ఎంత పేరు మోసిన క్రికెటర్లున్నా సరే... ఇకపై అంతా టీమిండియా సహచరులే! పెద్దపీటలు, ప్రాధాన్యాలంటూ ఉండవు. అందరూ ఒక జట్టే! ఆ జట్టే భారత జట్టుగా బరిలోకి దిగాలని బలంగా బోర్డు నిర్ణయించింది. హెడ్ కోచ్ గంభీర్ సూచనల్ని పరిశీలించడమే కాదు... అమలు చేయాల్సిందేనని కృతనిశ్చయానికి వచ్చిన బీసీసీఐ ఇకపై 'పటిష్టమైన జట్టుకు పది సూత్రాలు' అమలు చేయబోతోంది. ఈ సూత్రాలను పాటించని క్రికెటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారి మ్యాచ్ ఫీజుల్లో కోత లేదంటే కాంట్రాక్ట్ స్థాయిల్లో మార్పులు, చివరగా ఐపీఎల్‌లో పాల్గొనకుండా దూరం పెట్టేందుకూ వెనుకాడబోమని బీసీసీఐ హెచ్చరించింది.

దేశవాళీ మ్యాచ్‌లు ఆడాల్సిందే

'స్టార్ హోదాతో దేశవాళీ క్రికెట్‌ను అటకెక్కించిన ఆటగాళ్లు ఇకపై బరిలోకి దిగాల్సిందే. టీమిండియాకు ఎంపిక కావాలంటే రంజీ మ్యాచ్‌లు, ఇతర దేశవాళీ టోర్నీల్లో ఆటగాళ్లంతా వారి వారి రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండాలి. సహేతుక కారణం ఉంటే తప్ప... తప్పుకోవడానికి యువ ఆటగాళ్లకే కాదు సీనియర్లకు ఇకపై వీలుండదు'

బ్రాండ్–ఎండార్స్‌మెంట్లు కుదరవు

టోర్నీలు, సిరీస్‌లు జరుగుతుంటే ఇకపై 'బ్రాండింగ్' షూటింగ్‌ల్లో పాల్గొనడం కుదరదు. ఆటగాళ్లు కుదుర్చుకున్న ఎండార్స్‌మెంట్ ఒప్పందాల కోసం సిరీస్ మధ్యలో ఫొటో షూట్స్ నిషిద్ధం.

కుటుంబసభ్యుల అనుమతికి ఓ పరిమితి

విదేశీ పర్యటనలకు వెళ్లినపుడు ఆ ద్వైపాక్షిక సిరీస్ 45 రోజులకు మించి సుదీర్ఘంగా సాగితే క్రికెటర్ల కుటుంబసభ్యులు కూడా ఆసాంతం ఉంటామంటే ఉండనివ్వరు. 45 రోజులు ఆ పైన పర్యటనల కోసం ఇకపై రెండు వారాలపాటే కుటుంబసభ్యుల్ని అనుమతిస్తారు. స్వల్పకాల పర్యటనలకు మాత్రం వారం పరిమితే ఉంటుందిక!

జట్టుతో పాటే పయనం

ఇప్పటి వరకు ఆటగాళ్లు విడతల వారీగా, పర్యటన షెడ్యూల్‌కు ఉన్న సమయానికి అనుకూలంగా ఆటగాళ్లు ఆయా దేశాలకు వేర్వేరుగా పయనమయ్యేవారు. కానీ ఇక మీదట ఓ జట్టుగా సహచరులతో పాటే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. తద్వారా జట్టులో అను'బంధం' బలపడేందుకు దోహదం చేస్తుంది. అనివార్య కారణాలు లేదంటే తప్పనిసరై ఫ్యామిలీతో ప్రయాణించాలంటే మాత్రం బోర్డు నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి!

వ్యక్తిగత సిబ్బందికి కట్టుబాట్లు

జట్టులో ఎంత సీనియరైనా, దిగ్గజమైనా తమ వెంట వ్యక్తిగత సిబ్బందిని తీసుకెళ్తామంటే అనుమతించరు. సదరు సిబ్బంది అవసరమనుకుంటే ఆ ఆటగాడు కచ్చితంగా బోర్డు ఆమోదం పొందాల్సి ఉంటుంది.

'అదనపు' లగేజీ ప్లేయర్లపైనే...

విమాన ప్రయాణానికి సంబంధించి ఇప్పటి వరకు ఆటగాళ్ల లగేజీపై ఎలాంటి ఆంక్షలు, పరిమితుల్లేవు. ఎన్ని కేజీలు తీసుకెళ్లినా ఆ భారాన్ని బోర్డే భరించేది. కానీ ఇకపై ఒక ఆటగాడు 150 కేజీలకు మించి లగేజీ తీసుకెళితే ఆ భారం ఆటగాళ్లే మోయాలి.

కలసికట్టుగా ప్రాక్టీస్

సన్నాహాలకు ఆటగాళ్లంతా సమయానికి అందుబాటులో ఉండాలి. నెట్స్‌లో శ్రమించేందుకు వెళ్లే సమయంలో తమకు వీలుచిక్కిన సమయంలో స్టేడియానికి చేరకుండా... అంతా కలిసి ఒకే బస్సులో ప్రాక్టీసుకు బయలు దేరాలి.

బోర్డు కార్యక్రమాలకు హాజరు

బీసీసీఐ నిర్వహించే సమావేశాలు, ఈవెంట్లు, కార్యక్రమాలకు భారత ఆటగాళ్లంతా అందుబాటులో ఉండాలి. ఇది క్రికెట్ వృద్ధికి మరింత దోహదం చేస్తుందని బోర్డు భావిస్తోంది.

మ్యాచ్‌లు ముగిశాక...

ఏదైనా పర్యటన, సిరీస్, టోర్నీల్లో మ్యాచ్ ముగిసిన అనంతరం ఇష్టారీతిన ఎవరికివారు హోటల్ గదులకు వెళతామంటే కుదరదు. అందరు కలిసి జట్టుగా వెళ్లాలి. జట్టుతో పాటే పయనించాలి.

గదుల్లోనూ కలిసిమెలిసే బస

స్టార్ ఆటగాళ్లకు విడిగా ప్రత్యేక గదులిస్తున్నారు. ఇకపై రెండు వారాలు, ఒక వారం కుటుంబసభ్యుల పరిమితికి లోబడి మాత్రమే ప్రత్యేక గదుల్ని కేటాయిస్తారు. మిగతా సమయంలో సహచర ఆటగాళ్లతో గదుల్ని పంచుకోవాల్సి ఉంటుంది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'ఖేల్ రత్న' అవార్డులు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేశ్ (ఎడమ నుంచి)

ప్రతిభకు పట్టం... క్రీడాకారులకు అందలం

- 'ఖేల్ రత్న' అవార్డు అందుకున్న మను, గుకేశ్, హర్మన్‌ప్రీత్, ప్రవీణ్
- 32 మందికి 'అర్జున' పురస్కారం
- జాతీయ క్రీడా పురస్కారాలు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: ఆటల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన భారత క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2024 సంవత్సరానికిగాను జాతీయ క్రీడా పురస్కారాలు అందజేశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అవార్డులు బహూకరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన మహిళా స్టార్ షూటర్ మనూ భాకర్ (హరియాణా), ప్రపంచ చెస్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ (తమిళనాడు), భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (పంజాబ్), పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రవీణ్ కుమార్ (ఉత్తరప్రదేశ్)లకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' పురస్కారం దక్కింది. పారా స్విమ్మర్ మురళీకాంత్ పేట్కర్‌కు అర్జున అవార్డు (జీవిత సాఫల్య) అందిస్తున్న సమయంలో సెంట్రల్ హాల్ చప్పట్లతో మారుమోగింది. స్వతంత్ర భారత దేశంలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన తొలి అథ్లెట్‌గా రికార్డు సృష్టించిన 22 ఏళ్ల షూటర్ మనూ భాకర్ మాట్లాడుతూ... 'దేశ అత్యున్నత క్రీడా పురస్కారం అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. నిదానమే ప్రధానం అని నేను నమ్ముతా. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొంది. 'కల నిజమైంది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఖేల్ రత్న అవార్డు అందుకున్న రెండో చెస్ ప్లేయర్‌ను కావడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి మరెన్నో ఘనతలు అందుకునేందుకు ఇది మరింత స్ఫూర్తినిస్తుంది' అని 18 ఏళ్లకే చదరంగ విశ్వ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్ అన్నాడు. 32 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా... వారిలో 17 మంది పారాథ్లెట్‌లు ఉండటం విశేషం. 'అర్జున అవార్డు' దక్కిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన జ్యోతి యర్రాజీ (ఆంధ్రప్రదేశ్), జివాంజి దీప్తి (తెలంగాణ) కూడా ఉన్నారు. జ్యోతి దక్షిణాఫ్రికాలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో ఉండటంతో ఈ అవార్డుల కార్యక్రమానికి హాజరుకాలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన దివ్యాంగ క్రీడాకారులకు అవార్డులు అందజేస్తున్న సమయంలో రాష్ట్రపతి సంప్రదాయాన్ని పక్కనపెట్టి... పారాథ్లెట్లకు సౌకర్యవంతంగా ఉండేందుకు తన స్థానం నుంచి ముందుకు రావడం ఆహుతులను ఆకర్షించింది. 'ఖేల్ రత్న' అవార్డు గ్రహీతలకు రూ. 25 లక్షలు... అర్జున, ద్రోణాచార్య పురస్కారాలు పొందిన వారికి రూ. 15 లక్షల చొప్పున నగదు బహుమతి లభిస్తుంది.



దివ్యాంగ ఆర్చర్ రాకేశ్ కుమార్‌కు 'అర్జున' అవార్డు అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అవార్డీల వివరాలు

'ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డు: గుకేశ్ (చెస్) హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా అథ్లెటిక్స్), మనూ భాకర్ (షూటింగ్).

'అర్జున' అవార్డులు: జ్యోతి యర్రాజీ, అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతు, స్వీటీ (బాక్సింగ్), వంతిక (చెస్), సలీమా టిటె, అభిషేక్, సంజయ్, జర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ (హాకీ), రాకేశ్ కుమార్ (పారా ఆర్చరీ), ప్రీతి పాల్, జివాంజి దీప్తి, అజీత్ సింగ్, సచిన్ సర్జేరావు, ధరమ్‌వీర్, ప్రణవ్ సూర్మా, హొకాటో సెమా, సిమ్రన్, నవ్‌దీప్ సింగ్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్, తులసిమతి, నిత్యశ్రీ, మనీషా (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోనా అగర్వాల్ (పారా షూటింగ్), రుబీనా (పారా షూటింగ్), స్వప్నిల్ కుసాలే, సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ (రెజ్లింగ్). **'అర్జున' అవార్డు (లైఫ్‌టైమ్):** సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ పేట్కర్ (పారా స్విమ్మింగ్).

'ద్రోణాచార్య' అవార్డు: సుభాశ్ రాణా (పారా షూటింగ్), దీపాలి దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ (హాకీ), మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో కొలాకో (ఫుట్‌బాల్).

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫలితాలు | ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫలితాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


WINDSOR EV
LIVE BUSINESS CLASS
IT'S A
HAT TRICK!
INDIA'S BEST-SELLING EV FOR 3 MONTHS IN A ROW
IS ALSO THE WINNER OF
GREEN CAR AWARD 2025 BY ICOTY
GREEN CAR AWARD 2025 By ICOTY
WINDSOR EV
BaaS PRICE STARTS AT
₹9.99* LAKH+
BATTERY RENTAL @ ₹ 3.9*/km
BOOK NOW ON MGMOTOR.CO.IN
INDUSTRY-FIRST INITIATIVES
BaaS Battery-as-a-Service
LIFETIME WARRANTY on battery for first owner*
3-60 BUYBACK PLAN
Assured buyback of 60%* after 3 years
ICOTY JURY: AutoToday autoX CarDekho car carwale evo MOTORING OVERDRIVE POWERDRIFT ThePrint TIMES DRIVE TOI AUTO turbocharged
i-SMART
80+ CONNECTED FEATURES with Anti-Theft Immobilisation*
35+ Standard Safety Features
3 YEARS UNLIMITED km WARRANTY*
3 YEARS ROADSIDE ASSISTANCE
3 YEARS LABOUR FREE SERVICES*
470+ MG TOUCHPOINTS
SCAN FOR BROCHURE
VISIT WWW.MGMOTOR.CO.IN OR CALL 1800 100 6464
*Ex-showroom price India for base variant under BaaS unique ownership programme. *Source - Industry Data for the claim. Product shown is for representation purposes only and may vary from actual product due to print paper quality. Accessories, features and specifications shown in the pictures may not be a part of standard equipment and will differ according to the variant. In view of our policy of continuously improving our products, JSW MG Motor India Pvt. Ltd. reserves the right to discontinue any variant or to alter any specifications, features and designs without prior notice and without liability. Contact your nearest MG dealer for specific details. T&C apply. For other disclaimers, visit the website - https://www.mgmotor.co.in/vehicles/windsor-ev-electric-car-in-india/terms-and-condition

సాక్షి ప్లస్
శనివారం ।18-1-2025

చుట్టుముట్టి... మట్టుబెట్టి

మావోయిస్టులపై దూకుడు పెంచిన భద్రత బలగాలు | **తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోల హతం** | **ఎదురుదాడి కంటే ఆత్మరక్షణకే మావోయిస్టుల ప్రాధాన్యం**



'ఆపరేషన్ కగార్'మావోయిస్టులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు ఆత్మరక్షణకే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. సాయుధ పోలీసు బలగాలు భారీ ఎత్తున మావోయిస్టుల ఏరివేతకు దిగడంతో వారికి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఈనెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్–మారేడుబాక అడవుల్లో భద్రత బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర పోరులో 12 మంది మావోయిస్టులు మృతి చెందడమే ఇందుకు నిదర్శనం. గతేదాది మేలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్–దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో జరిగిన ఒకే ఒక్క ఎన్‌కౌంటర్‌లో 40 మంది మావోయిస్టులను భద్రతబలగాలు మట్టుపెట్టాయి. 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారు. గతానికి భిన్నంగా ఒక్కో ఆపరేషన్‌లో వందల మంది సాయుధ బలగాలు పాల్గొంటున్నాయి. - సాక్షి, హైదరాబాద్

సేఫ్‌జోన్లకు సైతం వెళుతూ...

మావోయిస్టులకు శత్రు దుర్భేద్యంగా ఉన్న అబూజ్‌మడ్ సైతం భద్రత బలగాల గుప్పిట్లోకి వెళ్లడం మావోయిస్టు నాయకత్వాన్ని మరింత కలవర పరుస్తోంది. తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న ఒక్కో స్థావరాన్ని మావోయిస్టులు కోల్పోతున్నారు. మావోయిస్టులకు పట్టున్న ఛత్తీస్‌గఢ్‌నే భద్రత బలగాలు ప్రధానంగా టార్గెట్ చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో స్థానిక, కేంద్ర బలగాలు మరింత మధ్య సమన్వయం మరింత పెరిగినట్టయ్యింది. సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్)కు సరిహద్దున తెలంగాణ గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాలు ఉండటంతో దిక్కుతోచని స్థితిలో మావోయిస్టు నాయకత్వం పడిందన్న చర్చ జరుగుతోంది.



ఇటీవల జరిగిన ప్రధాన ఘటనల్లో కొన్ని...

- డిసెంబర్ 12, 2024లో ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.
- డిసెంబర్ 2, 2024లో ములుగు జిల్లా పొలకమ్మ వాగు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు–గ్రేహౌండ్స్ బలగాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కురుసం మంగు సహా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.
- తెలంగాణలో 2024 సెప్టెంబర్ మొదటివారంలో కర్కగూడెం గ్రామానికి అతి సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీసభ్యుడు లచ్చన్న, ఆయన భార్య తులసి అలియాస్ పునెం లక్కీ, పాల్వంచ మణుగూరు ఏరియా కమాండర్ కామ్రేడ్ రాము, పార్టీ సభ్యులు కోసి, సీనియర్ సభ్యులు గంగాల్ , కామ్రేడ్ దుర్గేశ్ ఎదురు కాల్పుల్లో హతమయ్యారు.
- జూన్ 15, 2024లో ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు, ఒక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జవాన్ మృతి చెందారు.
- 2024 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు సహా మావోయిస్టు అగ్రనేత సుగులూరి చిన్నన్న అలియాస్ విజయ్ మృతి చెందారు.

కేంద్ర హోంశాఖ నివేదిక ఏం చెబుతోందంటే...

- 2004–14 వరకు 14,862 మావోయిస్టుల హింసాత్మక ఘటనలు చోటు చేసుకోగా..2014–2023 వరకు 7,128 ఘటనలు మాత్రమే నమోదయ్యాయి.
- దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు 2010లో 96 ఉండగా, ప్రస్తుతం 45 జిల్లాలకు తగ్గింది.
- ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో దాదాపు 250 మంది వరకు మావోయిస్టులు హతమయ్యారు. 200 మందికి పైగా సరెండర్ కాగా, 390 మంది అరెస్టు అయినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.
- తెలంగాణలోనూ 2024లో మొత్తం నాలుగు ప్రధాన ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు చనిపోయారు. 85 మందిని అరెస్టు చేయగా, 41 మంది సరెండర్ అయ్యారు.



క్యారెట్ గణేశ్



గణేశుడి ఆకారంలో ఉన్న క్యారెట్ అబ్బుర పరుస్తోంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో ముత్తవ్వ అనే మహిళ మార్కెట్లో క్యారెట్లను కొనుగోలు చేసింది. వాటిలో ఒక క్యారెట్ గణేశుని ఆకారంలో దర్శనమిచ్చింది. ఈ విషయం బయటకు తెలియడంతో గణేశుని ఆకారంలో ఉన్న ఈ క్యారెట్‌ను తిలకించడానికి జనం ఉత్సాహం చూపడం విశేషం.

-మిరుదొడ్డి (దుబ్బాక)

బతుకమ్మ కుంటపై సివిల్ కోర్టులో తేల్చుకోండి

సుధాకర్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మకుంట భూ వివాదాన్ని సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. రాజ్యాంగంలోని అధికరణ 226 కింద హైకోర్టు జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదంది. సివిల్ వివాదాలపై ఉన్నత న్యాయస్థానాలు కల్పించుకోలేవని, సివిల్ కోర్టులే వాటిని పరిష్కరించాలని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లోనూ జోక్యం చేసుకోలేమని తేల్చిచెబుతూ.. సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. అంబర్‌పేట మండలం బాగ్‌అంబర్‌పేట గ్రామంలోని సర్వే నెం 563/1లోని 7 ఎకరాల భూమిని రిజిస్టర్ కాని విక్రయ ఒప్పందం ద్వారా సయ్యద్ అజాం నుంచి కొనుగోలు చేశామని, అంబర్‌పేట తహసీల్దార్, జీహెచ్‌ఎంసీ, హైడ్రా దీనిపై జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలంటూ సుధాకర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ భూమికి చెరువుకు సంబంధం లేదని, ఇది ఇళ్ల నిర్మాణాల స్థలాల భూమి అని, ఎలాంటి ఆధారాలు లేకుండానే చెరువు భూమి అని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. అది ప్రైవేట్ భూమి అని చూపేందుకు పిటిషనర్ వద్ద ఎలాంటి పత్రాలు లేవని, వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలని తీర్పునిచ్చారు. దీనిపై సుధాకర్ రెడ్డి అప్పీల్ దాఖలు చేశారు. అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. సివిల్ కోర్టులోనే హక్కులు తేల్చుకోవాలంటూ, అప్పీల్‌ను కొట్టివేసింది.

ఢిల్లీలో మాదే విజయం: డీకే అరుణ

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) హయాంలో పరిపాలన గాడి తప్పిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విమర్శించారు. అక్కడి ప్రజల అవసరాలు తీర్చడం, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో ఆప్ విఫలమైందన్నారు. అందువల్లే అక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ఢిల్లీలో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోవడమే కాకుండా సీఎంగా ఉంటూ ఆయన జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. పార్టీ గెలుపు కోసం తాను కూడా ఢిల్లీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తానని తెలిపారు. తెలంగాణలో పథకాల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ పాత పాటే పాడుతున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో చెప్పినట్లే ఢిల్లీ ఎన్నికల్లోనూ అవే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ ప్రజలు రేవంత్ అబద్ధాలు, కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరోసారి గుణపాఠం తప్పదని అరుణ హెచ్చరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ దేశాన్ని అవమానిస్తున్నారు

మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. నిండు సభలో అంబేడ్కర్‌ను అవమానపరిస్తే, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ దేశాన్నే అవమానపరుస్తున్నారని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వస్తే.. అయోధ్యలో రామమందిరం కట్టిన రోజు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టని భాగవత్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ భగత్‌సింగ్, వల్లభాయ్‌పటేల్, గాంధీ లాంటి నేతలు పోరాడి తెచ్చిన దేశ స్వాతంత్ర్య చరిత్రను వక్రీకరించేందుకు సంఘ్ ప్రయత్నిస్తోందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని రాహుల్ గాంధీ తప్పు పడితే ఆయనే దేశాన్ని అవమానిస్తున్నారంటూ వక్రీకరించి ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆరు గ్యారంటీల గురించి మాట్లాడారని, కేటీఆర్‌కు దమ్ముంటే ఢిల్లీ వెళ్లి తనకు నచ్చిన పార్టీని గెలిపించాలని అక్కడి ప్రజలను కోరాలే తప్ప రేవంత్‌ను విమర్శించడం సరైంది కాదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ధర్నా చౌక్ గుర్తురాని కేటీఆర్, ఇప్పుడు అక్కడే ధర్నాలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

లైడిటెక్టర్ కాదు.. ముందు డ్రగ్స్ టెస్ట్ చేయించుకో

టీపీసీసీ అధికార ప్రతినిధులు సత్యం శ్రీరంగం, లింగం యాదవ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేయించుకోవాల్సింది లైడిటెక్టర్ టెస్టు కాదని, ఆయన ముందు నార్కోటిక్ డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. కేటీఆర్ మాట్లాడిన మాటల్లో ఆయన భయం అర్థమవుతోందని, తప్పు చేసిన ఆయనకు శిక్ష తప్పదని, దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తామని ఆ పార్టీ అధికార ప్రతినిధులు సత్యం శ్రీరంగం, లింగం యాదవ్ వ్యాఖ్యానించారు. లొట్టపీసు కేసుకే వణికిపోతున్న కేటీఆర్‌కు సీఎం రేవంత్ గురించి మాట్లాడే అర్హత లేదని శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వారు పేర్కొన్నారు. అవినీతిని ఒప్పుకుని జైలుకు వెళ్లడమే కేటీఆర్ ముందున్న ఏకైక మార్గమని, ఆయన తలకిందులుగా తపస్సు చేసినా తెలంగాణ ప్రజలు నమ్మరని వ్యాఖ్యానించారు. రైతుల పేరు మీద కేటీఆర్ దొంగదీక్ష చేస్తున్నాడని, అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజూ రైతులు గుర్తు రాలేదని మండిపడ్డారు. బీజేపీ తెచ్చిన నల్లచట్టాలకు మద్దతిచ్చి పదేళ్ల తెలంగాణను దివాళా తీయించిన బీఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజాప్రభుత్వానికి సహకరించాలని వారు హితవు పలికారు.

వెంకన్న లోగిలి.. రాజోలి



- 12వ శతాబ్దం నాటి వైకుంఠ నారాయణస్వామి ఆలయం
- ఆకట్టుకునే అద్భుత కళా శిల్పాలు
- తిరుమల శ్రీనివాసుడిని దర్శించినంత ఫలితం
- గజేంద్ర మోక్షం ఆధారంగా గుడి నిర్మితం



వైకుంఠ నారాయణస్వామి ఆలయం



అద్భుత శిల్ప సంపద

రాజోలి: పురాతన ఆలయం, చెక్కు చెదరని శిల్పకళా సౌందర్యం, ఆహ్లాదకరమైన తుంగభద్ర నదీతీరం.. వెరసి ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే రాజోలి వైకుంఠ నారాయణస్వామి నిలయం. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో కల్యాణి చాళుక్య రాజు త్రిభువన మల్ల సోమేశ్వరుడు నిర్మించారని ఆధారాలు చెబుతున్నాయి. వైకుంఠ నారాయణస్వామి ఆలయం ముందు భాగంలో గరుత్మంతుని గుడి ఉంది. గుడికి ఎడమ భాగాన ధ్వజపీఠం, ఆ వెనుక బలిపీఠాలు ఉన్నాయి. వైకుంఠంలో వెలసిన శ్రీమన్నారాయణుడే రాజోలిలో కొలువైనట్లు భక్తుల విశ్వాసం. ఇక్కడున్న శ్రీమన్నారాయణుడు చతుర్భుజుడు. మూడున్నర అడుగుల దివ్య మంగళుడు. అన్నిచోట్లా దర్శనమిస్తున్నట్లు కాకుండా.. ఇక్కడ చక్ర హస్తంలో గధ, గధ హస్తంలో చక్రం ధరించి ఉంటాడు. ఇలాంటి స్వామివారి దర్శనం ఎక్కడా ప్రాచుర్యంలో లేదు. నారాయణుడికి ఇరువైపులా శ్రీదేవి, భూదేవి ఉన్నారు. స్వామి నెలకొన్న పీఠం రెండు అడుగుల ఎత్తు, అడుగున్నర వెడల్పు ఉంది. ఒకటిన్నర ఎత్తు ఉన్న అమ్మవారి విగ్రహాలు అందంగా, కళాత్మకంగా ఉన్నాయి. పక్కగుడిలోని అమ్మవారు కూర్చున్న పీఠం అడుగు కాగా, ఆమె మూర్తి ఒకటిన్నర అడుగుల ఎత్తు ఉంది. దేవాలయం బయట పురాణ, మాయణ, గవత, వైష్ణవ పురాణగాథలు, జలభూభాగాల్లోని జంతు జాలాలను అద్భుత శిల్ప కళానైపుణ్యం ఉట్టి పడేలా మలిచారు. ఈ శిల్ప కళను చూడాలంటే రెండు కళ్లు చాలవు.

ఇప్పటి రాజోలి.. ఒకప్పుడు అడవి

గజేంద్ర మోక్షం ఆధారంగా ఆలయ నిర్మాణం జరిగిందని ఇక్కడి ప్రజల విశ్వాసం. ప్రస్తుతం రాజోలి గ్రామం ఉన్న ప్రదేశమంతా అడవి. దీనికి కొద్ది దూరంలో రాంపాడు అనే గ్రామం ఉండేది. ఈ అడవిలో ఏనుగులు విపరీతంగా సంచరిస్తుండేవి. వేసవి కాలంలో ఏనుగులు తాగునీటికి చాలా ఇబ్బంది ఉండేవి. అక్కడికి కొద్దిదూరంలో అంటే.. ప్రస్తుతం తూర్పు గార్లపాడు గ్రామం దగ్గర దేవమ్మ మడుగు ఉండేది. ఏనుగులు అక్కడికి వెళ్లి దాహం తీర్చుకునేవి. ఒకరోజు ఏనుగులు దాహం తీర్చుకోవడానికి వెళ్లగా ఆ మందకు పెద్దదిక్కైన ఒక ఏనుగును మడుగులో ఉన్న మొసలి పట్టుకుంది. ఎంతకూ అది వదలకపోవడంతో ఆ ఏనుగు నారాయణుడిని ప్రార్థించిందని.. ఆ మొర విన్న స్వామి వైకుంఠం నుంచి ఏనుగును కాపాడేందుకు వచ్చారని భక్తుల నమ్మకం. శరణు వేడుకున్న వారిని కాపాడాలనే తొందరలో శంఖు, చక్ర, గధ, పద్మధరుడైన మహా విష్ణువు, చక్ర హస్తంలో గధ, గధ హస్తంలో చక్రం ధరించి వచ్చారంటారు. ఆ విషయం అమ్మవార్లు చెప్పాక స్వామివారు గమనించారని.. శరణు కోరిన ఏనుగును చక్రంతో కాపాడారని.. దాని ఆధారంగా ఇక్కడ గుడి నిర్మాణం జరిగిందని స్థానికులు చెబుతారు.

తిరుమల వెంకన్నను దర్శించినంత ఫలితం

అప్పట్లో కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతీయులు, వేంకటేశ్వర స్వామి దర్శనానికి తిరుమలకు వెళ్లారు. వారిని అక్కడి వారు ఎక్కడినుంచి వచ్చారని పలకరించగా.. తాము తుంగభద్ర నదీతీరంలోని రాజోలి ప్రాంతం వారిమని సమాధానమిచ్చారు. అందుకు వారు ఆశ్చర్యానికి లోనై.. సాక్షాత్తు వైకుంఠ నారాయణస్వామి కొలువైన ఆ దేవాలయాన్ని వదిలి ఇంత దూరం వచ్చారా? ఇక్కడి శ్రీనివాసుడే అక్కడి వైకుంఠ నారాయణుడని, అది సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి సన్నిధని.. కలియుగ వైకుంఠమని స్పష్టం చేసినట్టు ఒక కథనం ప్రాచుర్యంలో ఉంది. ఈ ఆలయానికి సమీపంలోనే తుంగభద్ర నదిలో రాంపాటి ఈశ్వరాలయం ఉంది. శ్రీమదలం పురీక్షేత్ర మహత్మ్యమ్ (స్థల పురాణం)లో ఒక శ్లోకం ఉంది. అందులో 'తుంగా నారాయణస్సాక్షాత్ భద్రాదేవోమహేశ్వరః ఉభయోసంగమే యత్ర ముక్తిస్తత నసంశయః'.. అంటే తుంగ, భద్ర అనే రెండు నదులు పశ్చిమ కనుమల్లో వేర్వేరు చోట్ల ద్వారా ఒకచోట రెండు కలుస్తాయి. ఉంగానది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు కాగా భద్రా నది పరమేశ్వరుడిగా చెబుతారు. ఈ నదులు ఎక్కడ ప్రవహిస్తాయో.. అక్కడ స్నానం చేస్తే మోక్షం సిద్ధిస్తుంది. అంతటి పవిత్రమైన వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది రాజోలి. ఇక్కడ వైకుంఠనారాయణ ఆలయంతో పాటు ఎడమవైపు శ్రీలక్ష్మి ఆలయం, వాయవ్య దిశలో అంజనేయ స్వామి, వేణుగోపాలస్వామి ఆలయం, నవగ్రహాలయం, ఈశ్వరాలయం, భువనేంద్రస్వామి ఆలయం ఉన్నాయి. ప్రతి ఆలయానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ఇలా ఎంతో చరిత్ర కలిగిన ఈ వైకుంఠ నారాయణస్వామి ఆలయం నిరాదరణకు గురవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖలో విలీనమైనా.. ఆలయానికి మాన్యాలున్నా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయాన్ని వెలుగులోకి తెస్తే ముక్కోటి ఏకాదశి రోజు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తిరుపతి దాకా వెళ్లనవసరం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆలయం ఒక్క రాజోలికే కాక తెలంగాణకు, దేశానికే తలమానికమని వారు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పట్టించుకోకపోయినా.. ప్రత్యేక రాష్ట్రంలోనైనా ఆలయాన్ని అభివృద్ధిలోకి తెచ్చి చరిత్రను కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికే ముక్కోటి ఏకాదశికి జిల్లా నలుమూలలతో పాటు, కర్నూల్ జిల్లా నుంచి భక్తులు వస్తుంటారు. అమావాస్య రోజు, వైకుంఠ ఏకాదశి రోజు స్థానికులు దాతల సహాయంతో వేలాది మంది భక్తులకు అన్నదానం, అల్పాహారం, తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. పుష్కరాల సమయాల్లో తుంగభద్ర నదీ పరీవాహక గ్రామాల్లో ఈ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడితే ఆలయం మరింత అభివృద్ధిలోకి నోచుకుంటుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాలి



రాజోలిలోని వైకుంఠ నారాయణస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ప్రభుత్వం ఈ ఆలయంపై శ్రద్ధ పెట్టాలి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఇది చాలా మందికి తెలియక ఎన్నో వ్యయ ప్రయాసలతో దూరాన ఉన్న క్షేత్రాలకు వెళ్తున్నారు. ఈ ఆలయం విశిష్టత తెలిసినట్లయితే భక్తులు ఎక్కువగా దర్శించుకుని, ఆలయాభివృద్ధి జరిగే అవకాశముంది.

– సురేశ్, శాంతినగర్

చరిత్ర కలిగిన ఆలయం



గజేంద్ర మోక్షం ఆధారంగా నిర్మించిన వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో ప్రతి ముక్కోటి ఏకాదశికి ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. చరిత్ర కలిగిన ఈ ఆలయం వివక్షకు గురవుతోంది. ప్రత్యేక రాష్ట్రంలోనైనా ఆలయం ప్రాచుర్యంలోకి తీసుకురావాలని స్థానికంగా ఎంతో కృషి చేస్తున్నాం. ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమాలు, భజనలు చేస్తూ ఆధ్యాత్మికత భావనను పెంచుతున్నాం. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.

– అంజి, రాజోలి

క్లుప్తంగా...

రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు

సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు గాలికొదిలేశారని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు విమర్శించారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేశారు. విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని చంద్రబాబు ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

పీఆర్సీని నియమించండి

ఏపీ ఎస్టీయూ డిమాండ్

సాక్షి, అమరావతి/చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. 11వ వేతన సవరణ కమిషన్ గడువు 2023, జూలై ఒకటో తేదీతో ముగిసిందని, అయినా కొత్త కమిషన్‌ను నియమించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చాలి: ఎస్టీయూ

ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరెండర్ లీవులు, డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, ఏపీజీఎల్ఐ పాలసీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ.32వేల కోట్లు ఉంటే, సంక్రాంతికి కేవలం 10 శాతమే చెల్లించారని, మిగిలిన 90 శాతం సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు.

షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ గడువు పెంచాలి

ప్రభుత్వానికి కేవీపీఎస్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాల సోషల్ ఆడిట్ గడువు పెంచాలని, సమగ్రంగా రీ సర్వే చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ జి.రఘురామ్‌ను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, సహాయ కార్యదర్శి జి.నటరాజ్ తదితర ప్రతినిధి బృందం శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీపీఐ డిమాండ్

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటానికి సొంత గనులు కేటాయించి, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,500 కోట్ల ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఉండాలంటే దానికి క్యాపిటివ్ మైన్స్ కేటాయించాలని కోరారు.

ఉపాధిహామీపై అవగాహన

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం చెంచుగూడేల్లో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవోల) ప్రతినిధులకు ఉపాధి హామీ పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ఉద్దేశాలు, చేయదగిన పనులు, కూలీల హక్కుల గురించి అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ వివరించారు.

ప్రభుత్వానికి 'సహకారం' అందిస్తాం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌తో కలసి పని చేయడానికి తాము సిద్ధమని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ఐఎస్‌జీ) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ తెలిపారు. ప్రభుత్వ శాఖలకు కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము సుముఖంగా ఉన్నామన్నారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో ఎన్ఐఎస్‌జీ సంస్థ ప్రతినిధుల బృందం ప్రభుత్వాధికారులతో సమావేశమైంది.రాజీవ్ బన్సల్ మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ కార్యకలాపాల గురించి వివరించారు. ఆయా రాష్ట్రాలకు వారి అవసరాలను బట్టి ఈ–గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న సరికొత్త టెక్నాలజీలను ప్రభుత్వాలు సమర్థంగా వినియోగించుకోవడానికి అవసరమైన సహకారం తాము అందిస్తామన్నారు.

జంతు ప్రపంచం... దత్తత మీ ఇష్టం..!





తెల్ల పులులు



నీటి ఏనుగు



చింపాంజీ



కనుజులు



ఏనుగులు

ఆరిలోవ : విశాఖలోని ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణుల సంరక్షణకు తోడ్పాటు అందించడానికి దాతలు ముందుకు వస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను జూ అధికారులు దత్తత ఇస్తున్నారు. ఇందుకు దాతలు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. దాతల పేరుతో జూ సిబ్బంది వాటికి ఆహారం అందిస్తారు. జూలో ఏ జంతువు, ఏ పక్షిని దత్తత తీసుకొంటే వాటి ఎన్‌క్లోజరు వద్ద వాటి ఫొటోతో పాటు దాతల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అవి సందర్శకులకు స్పష్టంగా కనిపించే విధంగా ఎన్‌క్లోజరు వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పలువురు దాతల పేర్లతో కూడిన బోర్డులను వారు దత్తత తీసుకొన్న వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సిద్ధం చేశారు.

ఆకర్షణీయంగా దాతల పేర్లతో బోర్డులు

జూ పార్కులో వివిధ జాతులకు చెందిన జంతువులు, రకరకాల పక్షులు, తాబేళ్లు, మొసళ్లు, పాములు జూకి వెళుతున్న సందర్శకులను అలరిస్తుంటాయి. ఆయా ఎన్‌క్లోజర్ల వద్ద దాతల బోర్డులు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయి. జూలో వందల కొలది వన్యప్రాణులు, పక్షులు ఉన్నాయి. వాటిపై ప్రేమ, వాత్సల్యం చూపుతూ జూ అధికారులకు సహకరిస్తున్నారు. వాటిని దత్తత తీసుకుని నెలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి ఆహారం అందించడానికి బాధ్యతగా తీసుకొని సహాయపడుతున్నారు. ఇక్కడ తెల్ల పులి, ఖడ్గమృగం, జిరాఫీ తదితర పెద్ద జంతువులను పలు కంపెనీలు ఏడాది పాటు దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చాయి. మరికొన్ని చిన్న జంతువులు, పక్షులను కూడా కొందరు నెల, ఆరు నెలలు పాటు దత్తత తీసుకొని ఆహారం అందిస్తున్నారు.

- ఫ్లూయంట్ గ్రిడ్ లిమిటెడ్ జిరాఫీని ఒక ఏడాది పాటు దత్తత తీసుకొంది. దీంతో ఆ కంపెనీ పేరు, జిరాఫీ చిత్రపటంతో దాని ఎన్‌క్లోజరు వద్ద బోర్డు ఏర్పాటు చేశారు..
- ఎన్‌క్లోజరు వద్ద ఐటీసీఎల్ కంపెనీ ఖడ్గమృగాన్ని ఏడాది కాలం దత్తత తీసుకొన్నారు. దాన్ని మళ్లీ మరో ఏడాది దత్తత కొనసాగించడానికి ఆ కంపెనీ ముందుకు వచ్చింది. ఖడ్గమృగం ఉన్న చిత్రపటంపై లిమిటెడ్ పేరుతో బోర్డును దాని ఎన్‌క్లోజరు వద్ద ఏర్పాటు చేశారు.
- ఆర్సిలోర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎన్/ఎంఎస్) తెల్ల పులిని ఒక సంత్సరం పాటు దత్తత తీసుకొంది. తెల్లపులుల ఎన్‌క్లోజరు వద్ద ఆ కంపెనీ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు.
- వీటితో పాటు మరికొందరు ఏడాది, ఆరు నెలలు, మూడు నెలలు, నెల, ఒక్కరోజు కూడా ఇక్కడ వన్యప్రాణులకు ఆహారం అందించడానికి దత్తత తీసుకొన్నవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

ఆహారం ఇలా...

సింహం, పులికి పశు మాంసం, చికెన్ **ఆహారంగా వేస్తున్నారు**. ఏనుగుకు రాగి సం**గటి, చెరకు,** గ్రాసం, అరటి దవ్వ, బెల్లం, **కొబ్బరి కాయలు** అందిస్తున్నారు. చింపాం**జీలకు పళ్లు, కాయ**లు, పాలు ఆహారంగా వేస్తారు. జింకలు, కణుజులు, కొండ గొర్రెలు తదితర వాటికి గ్రాసం వేస్తారు. అన్ని పక్షులకు పలు రకాల పళ్లు ముక్కలు కోసి వేస్తారు. కోతులకు పళ్లు, వేరుశెనగ పిక్కలు వేస్తారు. నీటి ఏనుగుకు పళ్లు, కూరగాయలు, ఆకు కూరలు వేస్తారు. ఇలా ఇక్కడ వన్యప్రాణులన్నింటికీ వాటి ఆహారం కోసం రోజుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ఆదాయం పన్ను మినహాయింపు..

ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి వ్యక్తులు, సంఘాలు, పరిశ్రమలు వారి శక్తి మేరకు సహకారం అందించవచ్చు. ఏనుగు నుంచి చిన్న పక్షి వరకు ఎవరైనా ఎంత కాలానికైనా దత్తత తీసుకోవచ్చు. వాటి కోసం ఒక రోజు, నెల, ఏడాది వారిగా అయ్యే ఖర్చు చెల్లించవచ్చు. జూలో వన్యప్రాణులను దత్తత తీసుకొన్నవారికి ఆదాయం పన్నులో మినహాయింపు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ దత్తత పద్ధతి 2011లో ప్రారంభించారు. అప్పటి నుంచి పలువురు దాతలు ముందుకొచ్చి ఇక్కడ పులులు, సింహాలు, ఏనుగులు, పక్షులకు ఆహారం అందిస్తున్నారు.



ఆస్ట్రిచ్



జీబ్రా

దాతలు ముందుకు రావాలి

జూలో వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలి. వాటికి ఆహారం అందించడంలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే కొందరు దాతలు సంస్థల పరంగా, వ్యక్తిగతంగా ముందుకు వచ్చి కొన్ని జంతువులను, పక్షులను వారం, నెల, ఏడాది కాలానికి ఆహారం అందించడానికి వన్యప్రాణులను దత్తత తీసుకొన్నారు. ఎక్కువ మంది దాతలు స్పందించి ఇక్కడ వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తే మూగజీవాలకు సహకరించినవారవుతారు. దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

– మంగమ్మ, జూ క్యూరేటర్

ఎంత మొత్తం చెల్లించాలంటే..

జంతువు / పక్షి దత్తతకు చెల్లించాల్సిన మొత్తం

జంతువు/ పక్షి	రోజుకు	ఏడాదికి
ఏనుగు	రూ.1200	రూ.4,30,000
ఖడ్గమృగం	రూ.820	రూ.3,00,000
నీటి ఏనుగు	రూ.600	రూ. 2,00,000
సింహం	రూ.600	రూ.1,90,000
పెద్ద పులి	రూ.600	రూ.1,90,000
జిరాఫీ	రూ.500	రూ.1,80,000
చిరుత పులి	రూ.400	రూ.1,25,000
ఎలుగుబంటి	రూ.300	రూ.1,10,000
చింపాంజీ	రూ.210	రూ.75,000
అడవి దున్న	రూ.200	రూ.73,000
జీబ్రా రెండింటికి	రూ.330	రూ.60,000 (ఒక జీబ్రాకు)
తోడేళ్లు రెండింటికి	రూ.300	రూ.55,000 (ఒక తోడేలుకు)
రేచుకుక్క	రూ.135	రూ.50,000
చుక్కల దుప్పి	రూ.100	రూ.36,500
రింగ్‌టైల్డ్ లెమూర్‌కు	రూ.100	రూ.36,500

ఇవి కాకుండా...

మొసలి/ఘరియల్ రెండింటికి రోజుకు	రూ.150	రూ.24,000 (ఏడాదికి ఒకదానికి)
హంసలు (రెండింటికి 2 రోజులకు)	రూ.100	రూ.18,000 (ఒక హంస)
నక్షత్ర తాబేళ్లు (పదింటికి ఐదు రోజులకు)	రూ.150	రూ.11,000
సారస్ కొంగ/నిప్పుకోడి/ పాములు (నాలుగు రోజులకు)	రూ.100	రూ.10,000 (ఒకదానికి)
గుడ్లగూబలు (నాలుగింటికి ఒకరోజుకు)	రూ.100	రూ.9,500 (ఒక దానికి)
మకావ్‌లు (నాలుగింటికి మూడు రోజులకు)	రూ.100	రూ.3,000 (ఒక దానికి)
పీజియన్/నెమళ్లు (నాలుగింటికి నాలుగు రోజులకు)	రూ.100	రూ.2,200 (ఒక దానికి)
ఆఫ్రికన్ చిలుకలు/రామచిలుకలు (ఐదు రోజులకు)	రూ.100	రూ.1500 (ఒకదానికి)
లవ్ బర్డ్స్ (పదింటికి ఐదు రోజులకు)	రూ.100	రూ.1,000 (ఒకదానికి)

సంచార పశువైద్య సేవా రథాలపై కన్ను

- 340 వాహనాల నిర్వహణకు టెండర్లు
- అస్మదీయులకు దక్కేలా టెండర్ డాక్యుమెంట్‌ల రూపకల్పన
- అడ్డగోలుగా నిబంధనలు మార్చేసిన కూటమి ప్రభుత్వం

సాక్షి, అమరావతి: పాడి రైతుల గుమ్మం వద్దకే నాణ్యమైన పశువైద్యసేవలు అందాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంచార పశువైద్య రథాల నిర్వహణకు టెండర్ల జారీలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం నిబంధనలకు తూట్లు పొడిచింది. వాహనాల కొనుగోలుతో పాటు నిర్వహణ కోసం ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవడం, జ్యుడీషియల్ ప్రివ్యూకు అప్పగించడమే కాదు.. రివర్స్ టెండరింగ్ ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదా చేయగలిగింది. దేశంలో మరెక్కడా లేని విధంగా నియోజకవర్గానికి రెండు చొప్పున రూ.240.69 కోట్ల వ్యయంతో 340 సంచార పశువైద్య ఆరోగ్య సేవా రథాలను రెండు విడతల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి సేవల కోసం ప్రత్యేకంగా 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 8.50 లక్షల జీవాలకు నాణ్యమైన వైద్యసేవలందించగా, 6.50 లక్షల మంది పాడి రైతులు లబ్ధి పొందారు.

రివర్స్ టెండరింగ్‌తో రూ.14.85 కోట్లు ఆదా

వాహనాల కొనుగోలు కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు పిలిచింది. గరిష్ఠంగా ఒక్కో వాహనానికి రూ.32,19,905 చొప్పున కోట్ చేయగా, రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడంతో టాటామోటార్స్ రూ.28,17,417 చొప్పున సరఫరాకు ముందుకొచ్చింది. ఫలితంగా ఒక్కో వాహనం పై రూ.4 లక్షల చొప్పున రూ.13.69 కోట్లు ఆదా చేయగలిగారు. ఇక వీటి నిర్వహణ కోసం రూ.159.60 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా, తొలుత ఒక్కో వాహనానికి నెలకు రూ.1.85 లక్షల చొప్పున కోట్ చేయగా, రివర్స్ టెండరింగ్ వెళ్లడంతో జీవీకే–ఈఎంఆర్ఐ సంస్థ రూ.1.51 లక్షల చొప్పున నిర్వహించేందుకు ముందు కొచ్చింది. ఆ విధంగా ఒక్కో వాహనంపై రూ.34 వేల చొప్పున 340 వాహనాలపై రూ.1.16 కోట్లు ఆదా చేయగలిగారు. వెరసి కొనుగోలు, నిర్వహణ కోసం రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా రూ.14.85 కోట్లు ఆదా అయ్యింది.

నేడు నిబంధనలకు తిలోదకాలు

జీవీకే సంస్థ ఆధ్వర్యంలోని 340 అంబులెన్స్‌ల నిర్వహణ కాలం ఫిబ్రవరి నెలాఖరుతో ముగియనుంది. వాటి నిర్వహణ కోసం ప్రభుత్వం ఈనెల 10న టెండర్లు పిలిచింది. రూ.201.96 కోట్ల అంచనాతో పిలిచిన ఈ టెండర్లు ప్రక్రియలో పేర్కొన్న నిబంధనలు చూస్తుంటే తమ అనుయాయులకు కట్టబెట్టడమే లక్ష్యంగా జారీ చేసినట్టు పలు అనుమానాలకు తావిస్తోంది. రూ.100 కోట్లు దాటితే టెండర్లు జ్యుడీషియల్ ప్రివ్యూకు వెళ్లాలన్న నిబంధనకు తిలోదకాలు ఇచ్చారు. గతంలో రెండేళ్ల కాలానికి టెండర్లు పిలిస్తే... ప్రస్తుతం మూడేళ్లకు టెండర్లు పిలిచారు. పైగా మరో ఏడాది పొడిగించుకునే వెసులుబాటు కల్పించారు. టెండర్లలో పాల్గొనే సంస్థ టర్నోవర్ గతంలో ప్రాజెక్టు విలువలో 50 శాతం ఉండాలని నిబంధన విధిస్తే, దాన్ని 17 శాతానికి, నెట్‌వర్త్ విలువ 35 శాతం నుంచి 11 శాతానికి తగ్గించారు. బిడ్ ప్రాసెసింగ్ ఫీజు నిబంధనల ప్రకారం గరిష్ఠంగా రూ.25 వేలకు మించి పెట్టకూడదు.. కానీ బయట వాళ్లు ఎవరు టెండరింగ్‌లో పాల్గొన కూడదన్న ఆలోచనతో ఏకంగా రూ.2 లక్షలకు పెంచారు. ఇది నాన్ రిఫండబుల్ అమౌంట్.. కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎంఎస్‌ఎంఈలకు బిడ్ సెక్యూరిటీ నుంచి మినహాయింపు నిచ్చారు. గైడ్‌లైన్స్ ప్రకారం వీటికి ఎలాంటి మినహాయింపులు, రాయితీలు ఇవ్వడానికి వీల్లేదు. రాష్ట్రానికి చెందిన సంస్థలకు 5 మార్కులు, ఐదేళ్ల అనుభవం కలిగిన కంపెనీలకు మరో 5 మార్కులు, ప్రజంటేషన్‌కు 30 మార్కులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధం. 2021 గైడ్‌లైన్స్, క్యూసీబీఎస్ ప్రకారం టెక్నికల్‌గా 30 శాతం, ఫైనాన్షియల్‌గా 70 శాతం మార్కులు వస్తే సరిపోతుంది. కానీ ఇక్కడ మాత్రమే కన్సల్టెన్సీ టెండర్‌లో టెక్నికల్ 70, ఫైనాన్షియల్‌లో 30 శాతం వెయిటేజ్ నిబంధన తీసుకొచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ లెక్కన బిడ్‌లో పాల్గొన్న బి–1కు టెక్నికల్‌గా 70 శాతం అర్హతతో రూ.1.30 లక్షలకే కోట్ చేసినా, టెక్నికల్‌గా 90 శాతం అర్హతతో ఉన్న బి–2 కాంట్రాక్టర్ రూ.1.50లక్షలకే కోట్ చేస్తే ఆయనకే టెండర్ దక్కే అవకాశం ఉంటుంది. ఇలా ఇష్టానుసారంగా నిబంధనలకు తూట్లు పొడిచి తమ తాబేదార్లకు ఈ కాంట్రాక్టును కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్రకు తెరతీసినట్టు స్పష్టమవుతోంది.

నీతిఆయోగ్, కేంద్ర మార్గదర్శకాలకు తూట్లు

ఎలాంటి తప్పులనైనా అరికట్టి, టెండర్లు పారదర్శకంగా ఉంచేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం జ్యుడీషియల్ ప్రివ్యూ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ వ్యవస్థను పక్కన పెట్టేసింది. గతంలో జారీ చేసిన జీవోలను పట్టించుకోలేదు. నీతి ఆయోగ్, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సీవీసీ నిబంధనలకు పాతరేసింది. కేవలం తమకు నచ్చిన వారికి కట్టబెట్టడమే లక్ష్యంగా టెండర్లలో నిబంధనలు మార్చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్టు కన్పిస్తోంది. గతంలో జారీ చేసిన జీవోలను కానీ, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఎక్కడా పాటించలేదు.

– తలకోల రాహుల్‌రెడ్డి, ఈ ప్రొక్యూర్‌మెంట్ లీగల్ ఎక్స్‌పర్ట్

నీలగిరి.. నింగినంటి..

- హార్సిలీహిల్స్‌పై 1859లో నాటిన మహా నీలగిరి వృక్షం ఎత్తు, మొదలు పెరిగింది
- 1995లో కేంద్రమహావృక్ష పురస్కారం
- ఏపీలోనే పురాతన నీలగిరి వృక్షంగా రికార్డు
- 1995లో దీని ఎత్తు 40 మీటర్లు, చుట్టు కొలత 4.7మీటర్లు
- తాజాగా చుట్టు కొలత 6.36మీటర్లు.. ఎత్తు 43 మీటర్లు

బి.కొత్తకోట: 1859లో బ్రిటీష్ పాలనలో ఓ కలెక్టర్ నీలగిరి నాటిన మొక్క ఇంతై..ఇంతింతై అన్నట్టు ఎదుగుతోంది. 1995లో మహావృక్ష పురస్కారంతో పాటు రూ.50వేల నగదు బహుమతి పొందిన ఈ మహావృక్షం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉంది. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ మహానీలగిరి వృక్షం తాజా లెక్క ప్రకారం ఎత్తు, మొదలు అమాంతం పెరిగింది. ఇదీ ఇంకా పెరుగుతుందని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఈ ఆసక్తికర నీలగిరి మహావృక్షం వివరాల్లోకి వెళ్తే...బ్రిటీష్ పాలనలో ఉమ్మడి కడపజిల్లా కలెక్టర్‌గా డబ్ల్యూడీ హార్సిలీ పని చేస్తున్న కాలంలో ఆయన హార్సిలీహిల్స్‌ను కనుగొన్న విషయం అందరికి తెలిసిందే. కొండపై విడిది చేసుకుని ఓ అతిథిగృహం నిర్మించుకున్న ఆయన ఆ గది పక్కనే ఓ నీలగిరి మొక్కను 1959లో నాటారు. ఆయన నాటిన ఆ మొక్క ఇంతై..ఇంతింతై అన్నట్టుగా ఎదిగి రికార్డులకెక్కుతుందని అనాడు భావించి ఉండరేమో. ఇప్పుడిది రికార్డును సృష్టిస్తోంది. వయసు పెరిగేకొద్దీ తరిగిపోతారు. అయితే ఈ నీలగిరికి ఏళ్లు పెరిగేకొద్దీ అందరూ తలెత్తి చూసేలా ఎత్తుకు ఎదుగుతూ శాఖోపశాఖలుగా విస్తరిస్తూ ఆకర్షిస్తోంది. 1995 నాటికి ఉమ్మడి ఏపీలో పురాతన, అతి ఎత్తయిన వృక్షంగా గుర్తింపు పొంది రికార్డును సొంతం చేసుకుంది. 2000 మార్చి 16న అప్పటి కేంద్ర ప్రభుత్వం దీనికి మహా వృక్ష పురస్కారం అవార్డును, రూ.50వేల నగదును బహుమతిగా అందించారు. దీనిని అప్పటి చిత్తూరు డీఎఫ్ఓ, మదనపల్లె ఎఫ్ఆర్‌ఓలు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. 2000లో అప్పటి లెక్క ప్రకారం ఈ మహానీలగిరి వయసు 141 ఏళ్లు, ఎత్తు 40 మీటర్లు, చుట్టు కొలత 4.7 మీటర్లు (15.6 అడుగులు). తాజా లెక్కల ప్రకారం ఈ లెక్క మారింది. ఇప్పుడు దీని వయసు 165 ఏళ్లు. ఎదిగిన ఎత్తు 43 మీటర్లు (అంచనా), అంటే మూడు మీటర్ల ఎత్తు పెరిగింది. కాగా ప్రస్తుతం చుట్టు కొలత 6.32 మీటర్లు. అంటే 20.10 అడుగుల చుట్టు కొలత ఉంది. 2000 ఏడాది నుంచి ఇప్పటి వరకు పెరిగింది 1.66 మీటర్లు, అంటే 5.44 అడుగులు పెరిగింది. ఇదే కొలత ఛాతీ ఎత్తులో అయితే చుట్టు కొలత 6.25 మీటర్లు. అంటే 20.6 అడుగులు అవుతుంది. ఈ లెక్క తీసుకున్నా 1.55 మీటర్లు పెరిగింది. అంటే 5.08 అడుగులు పెరిగినట్టు లెక్క స్పష్టం.





శాఖోపశాఖలుగా విస్తరించిన 165 ఏళ్ల మహానీలగిరి వృక్షం (ఇన్‌సెట్) నీలగిరి వృక్షం మొదలు (ఫైల్)

కొండ నిండా నీలగిరి


హార్సిలీహిల్స్‌పై అత్యధికంగా కనిపించేది యూకలిప్టస్ (నీలగిరి) వృక్షాలే. ఈ కొండపై ఏపుగా పెరిగిన నీలగిరి వృక్షాల సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇక్కడ విశేషంగా ఎదిగిన ఈ వృక్షాలపై అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డుపై ఎత్తయిన నీలగిరి వృక్షాలు అలరిస్తాయి. హార్సిలీహిల్స్‌ను అధికారిక విడిదిగా చేసుకునేందుకు కడప కలెక్టర్ హార్సిలీ లేఖ పంపగా మద్రాసు ప్రభుత్వం దీనికి ఆమోదం తెలుపుతూ 1869 మే 4న జీవోఎంఎస్ నంబర్ 11579ను జారీ చేసింది. అంతకుముందు గుర్రంపై కొండపైకి వచ్చిన హార్సిలీ మొక్కను నాటారు. తర్వాత అతిథి గృహం నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరగా రిజర్వ్ ఫారెస్ట్‌లో బంగ్లా నిర్మించుకునేందుకు 1869 జూన్ 9న జీవోఎంఎస్ నంబర్ 4162ను జారీచేసింది.

ఇంకా విస్తరిస్తూ..



2000లో మహావృక్ష పురస్కారం అందుకున్న అప్పటి డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ (ఫైల్)

మహానీలగిరి వృక్షం గతంలో కంటే ప్రస్తుతం శాఖోపశాఖలుగా విస్తరించింది. వృక్షం కొద్దిగాపైన అటుఇటు సాగిన కొమ్మల్లో కొన్ని ఎండి రాలిపోయినప్పటికి పైకి వెళ్లే కొమ్మలు, అంచున చిగురిస్తూ ఎత్తుకు ఎదుగుతున్నాయి.



• మహనీయులు

శ్రీనివాస రామానుజన్

మనలో చాలామందికి లెక్కలంటే భయం ఉంటుంది. అంకెల్ని కలపడం, తీసేయడం, గుణించడం, భాగించడం, ట్రిగ్నోమెట్రీ, ఆల్జీబ్రా... పేరు ఏదైనా గణితంలోని అంశాలంటే చెప్పలేనంత భయంగా ఉంటుంది. అయితే చిన్నవయసు నుంచే లెక్కల మీద ఇష్టాన్ని పెంచుకుని, పెద్దయ్యాక గొప్ప గణిత మేధావిగా పేరు తెచ్చుకున్న ఒకరి కథ మీకు తెలుసా?

ఆయన తమిళనాడులో పుట్టారు. వాళ్ల నాన్న ఓ బట్టల దుకాణంలో గుమాస్తా. అమ్మ గృహిణి. అతనికి ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడు తమ్ముడు పుట్టాడు. అయితే మూడు నెలల్లోనే అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆ కుటుంబం చాలా బాధపడింది. మిగిలిన కొడుకుపైనే తల్లిదండ్రులు ఆశలన్నీ పెట్టుకొని పెంచారు. 12 ఏళ్ల వయసులో అతనికి మశూచి సోకింది. ఆ రోజుల్లో ఆ వ్యాధితో చాలామంది చనిపోయారు. ఇతను కూడా చనిపోతాడని అంతా అనుకున్నారు. కానీ చికిత్స తీసుకుని కోలుకున్నాడు.

ఆ తర్వాత ఆ కుటుంబం అప్పటి మద్రాసు నగరానికి వచ్చింది. అక్కడికి వచ్చాక అతని తల్లికి మరో ఇద్దరు పిల్లలు పుట్టారు. కానీ అంతలోనే ఆ కుటుంబాన్ని విషాదం వెంటాడి, ఆ ఇద్దరు పిల్లలు కూడా మరణించారు. దీంతో ఆ అబ్బాయి మాత్రమే మిగిలాడు.

చిన్ననాటి నుంచే ఆ అబ్బాయి చదువులో చాలా చురుగ్గా ఉండేవాడు. తమిళం, ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టుల్లో అందరికంటే ఎక్కువ మార్కులు సాధించేవాడు. 13 ఏళ్లకే అతి కష్టమైన మ్యాథమేటికల్ సమస్యలను పరిష్కరించేవాడు. 14 ఏళ్ల వయసులో లెక్కల్లో అందరికంటే ప్రతిభ చూపి సర్టిఫికెట్ పొందాడు. ఉపాధ్యాయులు అతని తెలివిని ఎంతో మెచ్చుకునేవారు. ఒకసారి స్కూల్ మొత్తానికి గణిత శాస్త్రంపై పరీక్ష పెడితే, ఇచ్చిన సమయంలో సగం సమయానికే సమాధానాలు రాసి, అందరి చేతా శభాష్ అనిపించుకున్నాడు ఆ అబ్బాయి.

అతనికి 23 ఏళ్ల వయసు వచ్చేసరికి మద్రాసు నగరంలోని ప్రముఖులకు అతని గురించి, అతని గణిత శాస్త్ర ప్రతిభ గురించి తెలిసింది. అతి క్లిష్టమైన గణిత సమస్యలకు సమాధానాలు ఇచ్చే వ్యక్తి అని అతను పేరు పొందాడు. పలు గణిత జర్నల్స్‌కి వ్యాసాలు రాయడం మొదలు పెట్టాడు. సరికొత్త థియరీలు కనుగొన్నాడు. దేశంలోని గణిత శాస్త్రవేత్తలే కాకుండా, లండన్ వెళ్లి చదువుకునే సమయంలో ఆ దేశపు గణిత మేధావులు కూడా అతని ప్రతిభకు అబ్బురపడేవారు. అయితే అనారోగ్యం ఆయన్ని చాలాకాలం వెంటాడింది. ఎన్నో సమస్యలు తెచ్చింది. క్షయ, శారీరక బలహీనత వంటి ఇబ్బందులతో సతమతమయ్యేవారు. అలా అనారోగ్యంతో 32 ఏళ్ల వయసులోనే కన్నుమూశారు. ఆయనే గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. ఆయన మరింత కాలం బతికి ఉంటే ఇంకా ఎన్నెన్ని ఘనతలు సాధించేవారో కదా! ఆయన స్ఫూర్తితో మీరు కూడా గణిత శాస్త్రంపై పట్టు సాధించి, బాల మేధావులుగా ఎదగండి.

• వండర్ కిడ్

మెమొరీ పవర్

మీ ఇంటి గుమ్మానికి ఎన్ని మెట్లున్నాయి? నిన్న స్కూల్‌కి వెళ్లే దారిలో ఏమేం కనిపించాయి? ఇవన్నీ మీకు గుర్తున్నాయా? అన్నీ గుర్తుపెట్టుకోవడం కొంచెం కష్టం కదా! అయితే బెంగళూరుకు చెందిన తన్వికి అన్నీ గుర్తుంటాయి. ఆ చిన్నారి జ్ఞాపకశక్తి అమోఘం. 100 వస్తువులను వేగంగా గుర్తించినందుకు ఆ పాపకు ప్రపంచ రికార్డు కూడా వచ్చింది. ఇంతకీ తన వయసెంతో తెలుసా? రెండేళ్లు. ఆ వయసులో 10 నిమిషాల 33 సెకన్లలో 100 వస్తువులను గుర్తించింది. గిన్నెలు, స్పూన్లు వంటి ఇంట్లో వాడే వస్తువుల నుంచి రూబిక్స్ క్యూబ్, బొమ్మల విమానం వరకు అన్ని వస్తువులూ చూసి, వాటి పేర్లను చెప్పేసింది. అంత చిన్నవయసులో అంత జ్ఞాపకశక్తి ఉండటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. దీంతో 'వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తను స్థానం సంపాదించుకుంది. మరిన్ని రికార్డులు సాధించేందుకు సాధన చేస్తోంది.







ఆకులతో బొమ్మలు చేద్దామా

మన ఇంటిలో స్కూల్లో చుట్టుపక్కలా ఎక్కడ చూసినా ఏవో మొక్కలు, చెట్లు కనిపిస్తాయి. వాటికి బోలెడన్ని ఆకులు. ఆ ఆకులతో మన క్రియేటివిటీని సాధన చేస్తే? ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలు అలాంటివే. దీనిని 'గ్రీన్‌లీఫ్ ఆర్ట్' అంటారు. పచ్చి ఆకులతో రకరకాల ఆకారాలు సృష్టించడమే ఆ కళ. నిజానికి క్రాఫ్ట్ అంటే నైపుణ్యం. కావలసిన రూపం కోసం ఆకులు కాని కొన్ని పదార్థాలను అంటే కాగితం ముక్కు, షర్ట్ బటన్ కళ్లు... ఇలా అన్నమాట. మంచి గమ్, కత్తెర వాడి ఇలాంటి బొమ్మలు తయారు చేయవచ్చు. అయితే కత్తెర వాడే సమయంలో జాగ్రత్త. ఆకులు తెంచుకుని వచ్చే సమయంలో పెద్దవాళ్లను తోడు తీసుకెళ్లాలి. సరేనా. ఇలాంటి బొమ్మలు చేసి థ్రిల్ అనుభవించండి.



• సినిమా చూద్దామా?

ది అల్టిమేట్ సూపర్ పవర్ సోనిక్



కిడ్స్... ఈ వీక్ ఓ సూపర్ ఫాంటసీ మూవీ గురించి చెప్పుకుందాం. అదే సోనిక్ ది హెడ్జ్ హాగ్. ఇది ఓ ఏలియన్ మూవీ. ఏలియన్ అనగానే భయపడకండి. ఇది ఫ్రెండ్లీ ఏలియన్. దీనికి సూపర్ పవర్స్ ఉంటాయి. ఇది నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమ్ అవుతోంది. ఈ మూవీ ఓ గేమ్ సిరీస్ ఆధారంగా 2020 లో తీశారు. ఇప్పుడు ఈ సినిమ నెట్ ఫ్లిక్స్ లో ట్రెండింగ్ లో ఉంది. జెఫ్ ఫ్లవర్ అనే డైరెక్టర్ ఈ సినిమా చేశారు. ఇంకో గొప్ప విషయం ఏమిటంటే ఇదో అడ్వెంచరస్ కామెడీ ఫాంటసీ మూవీ. అదెలాగంటారా అయితే లెట్స్ స్టార్ట్ విత్ ద మూవీ స్టోరీ. సోనిక్ అనేది ఓ బ్లూ ఆకారంలో ఉండే ఏలియన్. ఈ సోనిక్‌కి వాళ్ళ ఫ్యామిలీ లోని లాంగ్ క్లా ఓ బ్యాగ్ ఆఫ్ రింగ్స్ ఇస్తాడు. ఆ రింగ్స్ సహాయంతో ఇది ఎర్త్ కి వస్తుంది. ఎర్త్‌లో టామ్ అనే షరీఫ్ దగ్గరకు చేరుతుంది. దీని మెయిన్ పవర్ ఏంటంటే సూపర్ స్పీడ్. కరక్ట్ గా చెప్పాలంటే ఇది సౌండ్ కన్నా లైట్ కన్నా బంచ్ ఆఫ్ టైమ్స్ స్పీడ్ గా ట్రావెల్ చేయగలదు. ఇవి కాకుండా దీనికి ఇంకా ఎన్నో పవర్స్ ఉన్నాయి. అయితే సోనిక్ తో పాటు దాని పవర్స్ అండ్ రింగ్స్ కోసం ఓ బ్యాడ్ సైంటిస్ట్ హంట్ చేస్తుంటాడు. మరి ఆ సైంటిస్ట్ ని టామ్ తో పాటు సోనిక్ ఎలా ఫేస్ చేస్తుందనేదే ఈ సోనిక్ ది హెడ్జ్ హాగ్. సోనిక్ తన పవర్స్ తో పాటు సూపర్ కామెడీ చేస్తుంది. సో కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ టు ట్రావెల్ విత్ సోనిక్ ఆన్ నెట్ ఫ్లిక్స్.



• మన ఇన్‌డోర్ గేమ్

వామన గుంటలు



ఇప్పుడంటే మీ అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు వచ్చేశాయి. ఖాళీ దొరికితే రకరకాల వీడియో గేమ్స్ ఆడుతుంటారు. కానీ మన ఇంతకు ముందు పిల్లల కోసమని చాలా ఆటలు ఉండేవి. అవి సొంతంగా మన ఆటలు. ఆడితే మీకు వాటిలో ఉండే మజా తెలుస్తుంది. అలాంటి ఓ ఆటే 'వామన గుంటలు'. కొన్ని చోట్ల దీన్ని 'వామన గుంతలు', 'ఒనగండ్లు', 'బద్దీలాట' అని కూడా అంటారు. ఇది ఎలా పుట్టింది, ఎవరు కనిపెట్టారు అనే విషయాల గురించి స్పష్టత లేదు. రామాయణంలో సీతాదేవి వామనగుంటలు ఆడినట్లు ఒక జానపద గీతంలో ఉంది. వాగ్గేయకారుడు త్యాగరాజు ఒక కీర్తనలో ఓమనగుంటలు అన్న పదం ఉపయోగించారు. దీన్ని బట్టి వందల ఏళ్ల నుంచి తెలుగువారి ఇళ్లల్లో ఈ ఆట ఆడుతున్నట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. వామన గుంటలు కూర్చుని ఆడే ఆట. ఈ ఆట కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పీట కావాలి. అందులో అటు ఏడు, ఇటు ఏడు గుంటలు ఉంటాయి. అంటే మొత్తం 14 గుంటలు. ఏడు అవతలి వారికి, ఏడు ఇవతలివారికి అని పంచుకుంటారు. కొన్నిసార్లు అటు ఐదు, ఇటు ఐదు కూడా ఉంటాయి. పీట లేక పోతే నేల మీదో, బండ మీదో గుంటలను గీసి కూడా ఆడుకోవచ్చు. ఒక్కొక్క ఐదు లేదా అంతకంటే ఎక్కువ చింతగింజలు వేయాలి. అవి లేక పోతే రాళ్లు, శనగలు కూడా వేయొచ్చు. ఆ తర్వాత ఒక గుంటలోని మొత్తం గింజలని తీసుకొని కుడివైపు గుంటతో ప్రారంభించి వరుసగా ఒక్కొక్క గుంటకు ఒక గింజ చొప్పున వేయాలి. గింజలన్నీ అయిపోతే ఆ తరువాత గుంట ఎవరిదైనా సరే, అందులోని గింజల్ని తీసి మళ్లీ గుంటల్లో వేస్తూ పోవాలి. చివరిగా ఖాళీ గుంట వస్తే, ఆ తరువాత గుంటలో ఉన్న గింజలన్నీ పంచిన వ్యక్తి గెలుచుకుంటాడు. ఒకవేళ ఆ గుంట ఖాళీగా ఉంటే ఏమీ రానట్టే. గుంటలన్నీ ఖాళీ అయ్యి, ఆఖర్లో ఎక్కువ గింజలు గెలుచుకున్నవారే విజేతలు. ఈ ఆట సరదాగా ఉండటంతోపాటు ఏమాత్రం శ్రమ లేకుండా ఏ కాలంలోనైనా ఆడుకోవచ్చు. అందుకే వామనగుంటల్ని ఎక్కువగా ఆడవాళ్లు, చిన్నపిల్లలు ఆడతారు. మీకూ ఈ ఆట ఆడాలని ఉందా? అయితే మొదలుపెట్టండి మరి!

భోగి చేపలు



పంట చేతికి రావడం అంటే వ్యవసాయ పనులు ముగియడం అని అర్థం. మన దగ్గర పంట చేతికొచ్చే సమయాన్ని 'సంక్రాంతి'గా జరుపుకుంటాం. అస్సాంలో 'మాఘ్ బిహు'గా జరుపుకుంటారు. వ్యవసాయం ముగిసిన వెంటనే వారు కూడా భోగి మంటలు వేసుకొని సుష్టుగా వొండుకుని తిని సంబరాలు జరుపుకుంటారు. ఆ సమయంలో వారు చేసే మరోపని గుంపుగా వెళ్లి చేపలు పట్టడం. తమిళనాడులో జల్లికట్టు, మన దగ్గర కోళ్ల పందేలు లాగానే ఈ చేపలు పట్టడానికి కూడా ప్రభుత్వ అనుమతి ఉండదు. అయినా జనం చెరువుల్లో, నదుల్లో దిగి ఇలా చేపలు పడతారు. ఇక్కడ కనిపిస్తున్న ఫోటో జనవరి 13, 2005న అస్సాంలోని కామరూప్ జిల్లాలో పన్‌బరి అనే పల్లెలోని చెరువు దృశ్యం.

• బాలల గేయం

అంకెలు చెప్పే నీతి

ఒకటి ఒకటి ఒకటి మానవులంతా ఒకటి
రెండు రెండు రెండు మంచి, చెడులు రెండు
మూడు మూడు మూడు మన జెండా రంగులు మూడు
నాలుగు నాలుగు నాలుగు వేదాలు మనకి నాలుగు
ఐదు ఐదు ఐదు చేతికి వేళ్ళు ఐదు
ఆరు ఆరు ఆరు రుతువులు మనకి ఆరు
ఏడు ఏడు ఏడు వారానికి రోజులు ఏడు
ఎనిమిది ఎనిమిది ఎనిమిది దిక్కులు
తొమ్మిది తొమ్మిది తొమ్మిది గ్రహాల కూటమి తొమ్మిది
పది పది పది పాపలు పాడే పాట ఇది



• కథ

నిజాల వేట



మహారాజు సింహాసనం అధిష్ఠించి పది సంవత్సరాలు పూర్తి అయింది. దాంతో తన పరిపాలన ఎలా వుందో తెలుసుకోవాలనుకున్నాడు. సమావేశం ఏర్పాటు చేశాడు. 'నా పాలనలో రాజ్యమంతా ఎలా వుందో తెలుసుకోవడానికి ఈ సభ ఏర్పాటు చేశాను. బాగుంటే బాగుందనండి. లేదంటే లేదనండి. సలహాలు ఇవ్వండి' అన్నాడు రాజు.

ఒక పది నిమిషాలు అక్కడ మౌనం తాండవించింది. 'మహారాజా... మీరు మాకు దేవుడిచ్చిన వరం. ఎన్ని జన్మలైనా మీరే మాకు రాజుగా ఉండాలి. అదే మా అందరి కోరిక' అంటూ నోరిప్పారు సామంతులు.

'మీ పాలనలో ఎటువంటి తిరుగుబాట్లు లేవు. రాజ్యమంతా ప్రశాంతంగా సుఖసంతోషాలతో నిండి వుంది' అన్నారు సైన్యాధికారులు.

'వ్యాపారాలు పుష్కలంగా జరుగుతున్నాయి. గల్లాపెట్టెలు గలగలలాడుతున్నాయి' అన్నారు వ్యాపారస్తులు.

'రాజ్యంలో ఎక్కడ చూసినా సభలు, సమావేశాలు, నాటక ప్రదర్శనలు, కవితా పఠనాలు, కొత్త గ్రంథాల ఆవిష్కరణలు, పురస్కారాలు, సన్మానాలతో ఆ శ్రీకృష్ణదేవరాయలే మళ్లీ జన్మించాడా అన్నట్టుంది ప్రభూ మాకు' పొగిడారు కళాకారులు.

ఒక్కొక్క మాటకు రాజు ఛాతి ఒక్కొక్క అంగుళం సంతోషంతో పెరిగిపోసాగింది. వచ్చిన వారందరికీ విందు భోజనం ఏర్పాటు చేసి కానుకలతో సత్కరించి పంపించాడు. రాత్రి అంతఃపురంలో తూగుటుయ్యాల మీద ఊగుతూ మహారాణితో 'చూశావా రాణీ... నా పరిపాలనలో రాజ్యం ఎలా సుభిక్షంగా కళకళలాడిపోతున్నదో. అందరూ మంచి కితాబులిస్తున్నారు' అన్నాడు సంబరంగా.

రాణి చిరునవ్వుతో 'రాజా... మీ ముందు నిలబడి మీకు వ్యతిరేకంగా మీ కింద పనిచేసే అధికారులు నోరు విప్పగలరా. మనసులో మాట చెప్పగలరా. మీరు మంచి పనులు చేసినా, పిచ్చి పనులు చేసినా ఆహా... ఓహో... అని ఆకాశానికి ఎత్తేసేటోళ్ళే తప్ప విమర్శించేటోళ్లు ఎవరు?' అంది.



రాజు ఆలోచనలో పడ్డాడు. ఈ సంగతి నిగ్గుదేల్చాలని భావించాడు. అతనికి చిత్రకళ ఏ మాత్రం రాదు. అయినా వారం రోజుల్లో వంద చిత్రాలు పూర్తి చేసి వాటన్నింటినీ ప్రదర్శనకు పెట్టాడు.. సామంతులను, అధికారులను, పుర ప్రముఖులను, వ్యాపారవేత్తలను, కళాకారులను అందరినీ ప్రదర్శనకు ఆహ్వానించాడు.

ప్రదర్శనా ప్రాంగణమంతా నగర ప్రముఖులతో నిండిపోయింది. దేనిలో ఏముందో, అందులో భావమేమో ఎంత ఆలోచించినా ఎవరికీ అంతు చిక్క లేదు. ఎందుకైనా మంచిదని 'ఆహా' అన్నారు కొందరు. 'ఓహో' అన్నారు మరికొందరు. 'అద్భుతం. మీకు మీరే సాటి' అంటూ అందుకొన్నారు ఇంకొందరు.



ఒకరిని చూసి మరొకరు పొగడ్తలలో పోటీపడ్డారు. వాళ్ళలా పొగడ్తల వర్షం కురిపిస్తా వుంటే మహారాజు తన పక్కనే ఉన్న మహారాణికి మొహం చూపించలేక సిగ్గుతో చితికిపోయాడు. ప్రదర్శన పూర్తయి అందరూ వెళ్ళిపోయాక 'అర్థమైంది కదా రాజా ప్రముఖుల సంగతి. మీ పాలన గురించి నిజానిజాలు తెలియాలంటే ధనవంతులను కాదు కలవాల్సింది పేద ప్రజలను. వాళ్లలో ఒకరిగా మారిపోవాలి. అప్పుడే మీ లోటుపాట్లు తెలుస్తాయి. సరిదిద్దుకోవలసినవి అర్థమవుతాయి' అంది.

మహారాజు చిరునవ్వు నవ్వి మహారాణి నుదుటిపై చిరుముద్దు పెట్టాడు. తర్వాత రోజే సాధారణ పల్లెమనిషిగా మారువేషం వేసుకొని కాలినడకన నగర సంచారానికి బయలుదేరాడు. నిజాల వేటకై.

- డా.ఎం.హరికిషన్

ఒక పదం.. రెండు అర్థాలు



భాషలో చాలా చిత్రాలు, మర్మాలు ఉంటాయి. ప్రతి భాషలో కూడా కొన్ని పదాలకు రెండు మూడు అర్థాలు ఉండటం మనం చూస్తాం. తెలుగులో కూడా అంతే. అలాంటి కొన్ని పదాలు ఇక్కడ చూడండి.

చుక్క = నక్షత్రం, ముగింపు చిహ్నం
వాక్యాలు
- ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి.
- ఇక ఆ గొడవకు చుక్క (ఫుల్‌స్టాప్) పెట్టడం మంచిది.

అడుగు = ప్రశ్నించు, కాలి పరిమాణం
వాక్యాలు
- తీసుకున్న అప్పు తిరిగి ఇమ్మని అతణ్ని అడుగు.
- స్కూల్ నుంచి ఇంటికి రెండు అడుగుల దూరమే.

తెలుపు = చెప్పటం, రంగు
వాక్యాలు
- సీత తన మనసులోని మాట రాముడికి తెలుపుకొంది.
- తెల్లగా ఉండేవన్నీ పాలు కాదు.

ధర = ఖరీదు, భూమి
వాక్యాలు
- కొత్త బట్టల ఖరీదు చాలా ఎక్కువ.
- సాధన చేస్తే ఈ ధర(భూమి) మీద పనులు సమకూరుతాయి.

పాదం = కాలు, పద్యంలోని ఒక భాగం
వాక్యాలు
- వామనుడు మూడో పాదం ఎత్తి బలి చక్రవర్తిని పాతాళానికి అణిచాడు.
- కవి తన పద్యంలోని రెండో పాదం చదివి వినిపించాడు.

దళం = గుంపు, ఆకు
వాక్యాలు
- వారంతా ఒక దళంలా కలిసి పనికి వెళ్లారు.
- రుక్మిణి ఒక తులసీదళంతో కృష్ణుణ్ని తూచింది.

బిజినెస్ రీల్

పాలీగాన్ ల్యాబ్స్‌తో జియో ప్లాట్‌ఫామ్స్ జట్టు

న్యూఢిల్లీ: దేశీయంగా వెబ్3 టెక్నాలజీ విభాగంలోకి ప్రవేశించే దిశగా పాలీగాన్ ల్యాబ్స్‌తో జియో ప్లాట్‌ఫామ్స్ (జేపీఎల్) జట్టుకట్టింది. ఈ ఒప్పందం ప్రకారం తమ ప్రస్తుత అప్లికేషన్లు, సర్వీసుల్లో కొన్నింటికి వెబ్3 సామర్థ్యాలను జియో ప్లాట్‌ఫామ్స్ జోడించనుంది. వెబ్3తో అపరిమితమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు, యూజర్లకు అసమానమైన డిజిటల్ అనుభూతిని అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడగలదని జేపీఎల్ సీఈవో కిరణ్ థామస్ తెలిపారు. ఏదైనా టెక్నాలజీ ప్లాట్‌ఫాంను సురక్షితంగా వినియోగించుకునే విధంగా బ్లాక్‌చెయిన్ సాంకేతికతతో వెబ్3 టెక్నాలజీ రూపొందింది.

తప్పుడు డిడక్షన్ క్లెయిమ్‌లతో రూ. 1,070 కోట్ల విత్‌డ్రా

ఆదాయపు పన్ను విభాగం సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: గతేడాది ఆఖరు నాటికి తప్పుడు పన్ను మినహాయింపు క్లెయిమ్‌లతో 90,000 మంది వేతన జీవులు దాదాపు రూ. 1,070 కోట్ల మొత్తాన్ని విత్‌డ్రా చేసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరిలో ప్రైవేట్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు కూడా ఉన్నట్లు వివరించాయి. 80ఈ, 80జీ, 80జీజీబీ, 80జీజీసీ తదితర సెక్షన్ల కింద పలువురు వ్యక్తులు తమ రిటర్నుల్లో (ఐటీఆర్) బోగస్ డిడక్షన్లను క్లెయిమ్ చేసినట్లు ఆదాయపు పన్ను విభాగం సర్వేలో తేలిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇలా క్లెయిమ్ చేసిన ఉద్యోగులను, వారు పని చేస్తున్న సంస్థలను సంప్రదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు వివరించాయి. ఐటీఆర్‌లలో తప్పుడు వివరాలు పొందుపరిస్తే ఎదురయ్యే పరిణామాలపై, దిద్దుబాటు చర్యలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నాయి.

ఆస్ట్రోష్యూర్ 6 మిలియన్ డాలర్ల సమీకరణ

న్యూఢిల్లీ: మాజీ ఫెమినా మిస్ ఇండియా వన్యా మిశ్రా సారథ్యంలోని ఆధ్యాత్మిక టెక్ సంస్థ ఆస్ట్రోష్యూర్.ఏఐ తాజాగా 6 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 52 కోట్లు) సమీకరించింది. నెట్‌మెడ్స్ వ్యవస్థాపకుడు ప్రదీప్ దాధా తదితరులు ఇన్వెస్ట్ చేశారు. ప్రీమియం మోడల్ కింద రియల్–టైమ్‌లో సేవలు అందిస్తున్నట్లు వన్యా మిశ్రా తెలిపారు. యూజర్ల చార్జీల ద్వారా కాకుండా ప్రకటనతో ఆదాయం సమకూర్చుకుంటున్నామన్నారు.

బోర్డు సమావేశాలు

కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, డీసీఎం శ్రీరాం, నెట్‌వెబ్ టెక్నాలజీస్, కెన్ ఫిన్ హోమ్స్, చెన్నై పెట్రో, సిగాచీ ఇండస్ట్రీస్, హిటాచీ ఎనర్జీ

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-1-2025	
విశాఖ	500-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	475-00
వరంగల్	477-00
రిటైల్ ధర	5.35

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BPCL	274.05	2.68
RELIANCE	1,300.00	2.65
COALINDIA	388.4	2.52
HINDALCO	616	2.22
NESTLEIND	2,216.95	2.2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,817.50	-5.75
AXISBANK	992	-4.43
SHRIRAMFIN	526.5	-3.71
KOTAKBANK	1,759.05	-2.58
WIPRO	281.7	-2.2

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,764
ఎన్ఎస్ఈ	86,331
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,70,705
ఎఫ్ఐఐ	- 3,318
డీఐఐ	+ 2,573

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	77.54	$ 77.85
బ్రెంట్	81.03	$ 81.29



హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్

హ్యుండై మోటార్ ఇండియా క్రెటా ఎలక్ట్రిక్‌ను విడుదల చేసింది. పరిచయ ఆఫర్‌లో ధర రూ.17.99 లక్షలు ఉంది. ఆరు వేరియంట్లలో లభిస్తుంది. ఒకసారి చార్జింగ్‌తో 42 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 390 కిలోమీటర్లు, 51.4 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 473 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది.

కియా ఈవీ6 అప్‌గ్రేడెడ్ వర్షన్

దక్షిణ కొరియాకు చెందిన వాహన తయారీ సంస్థ కియా తాజాగా ఈవీ6 అప్‌గ్రేడెడ్ వర్షన్‌ను పరిచయం చేసింది. 84 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 650 కిలోమీటర్లకుపైగా పరుగెడుతుందని కంపెనీ ప్రకటించింది. 350 కిలోవాట్ ఫాస్ట్ చార్జర్‌తో 10 నుంచి 80 శాతం చార్జింగ్ 18 నిముషాల్లో అవుతుంది. ఇప్పటి వరకు ఈ మోడల్‌కు 77.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ వాడారు.



బీఎండబ్ల్యు మేడిన్ ఇండియా ఈవీ



జర్మనీ లగ్జరీ కార్ల తయారీలో ఉన్న బీఎండబ్ల్యు భారత్‌లో తయారైన ఎలక్ట్రిక్ వెహికిల్ ఐఎక్స్1 లాంగ్ వీల్ బేస్ ఆల్ ఎలక్ట్రిక్‌ను విడుదల చేసింది. ధర రూ.49 లక్షలు. 66.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 531 కిలోమీటర్లు పరుగెడుతుంది.





హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త మోడళ్లు

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో వేదికగా నాలుగు ద్విచక్ర వాహన మోడళ్లను ఆవిష్కరించింది. ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, ఎక్స్‌ప్లస్ 210 పేరుతో రెండు మోటార్స్ బైకులు లాంచ్ చేసింది. స్కూటర్ల పోర్ట్‌ఫోలియోలో ఎక్స్‌మ్ 125, ఎక్స్‌మ్ 160 రెండు సరికొత్త వేరియంట్లను అందుబాటులోకి తెచ్చింది. కొత్త ఆవిష్కరణలతో ప్రీమియం బ్రాండ్లు ఎక్స్‌ట్రీం, ఎక్స్‌ప్లస్‌లు మరింత బలోపేతమయ్యాయని కంపెనీ సీఈఓ నిరంజన్ తెలిపారు. వీటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి డెలివరీ ఉంటుంది.

మైబహ్ కొత్త ఈవీ



మెర్సిడెస్ బెంజ్ భారత్‌లో లగ్జరీ ఎలక్ట్రిక్ ఈక్యూఎస్ మైబహ్ ఎస్‌యూవీ 680 నైట్ సిరీస్‌ను విడుదల చేసింది. ధర రూ.2.63 కోట్లు. గరిష్ట వేగం 210 కిలోమీటర్లు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 4.4 సెకన్లలో చేరుకుంటుంది. మైబహ్ జీఎల్ఎస్ 600 నైట్ సిరీస్‌లో కొత్త వేరియంట్‌ను రూ.3.71 కోట్ల ధరతో ప్రవేశపెట్టింది. అలాగే సీఎల్ఏ క్లాస్ ఎలక్ట్రిక్ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది.



బీఎండబ్ల్యూ మినీ కూపర్







భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో టాటా మోటార్స్ పలు కొత్త మోడళ్లను ప్రదర్శించింది. వీటిలో హ్యారియర్ ఈవీ, అవిన్యా ఎక్స్ కాన్సెప్ట్, టాటా సియర్రా ఎస్‌వీ, టాటా ఇంట్రా వాహనాలున్నాయి.


త్వరలో ఈ-కామర్స్ ఎగుమతుల హబ్ కార్యకలాపాలు



న్యూఢిల్లీ: దేశీయంగా తొలి ఈ-కామర్స్ ఎగుమతుల హబ్ ఈ ఏడాది మార్చి నుంచి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి తెలిపారు. ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేసేందుకు అయిదు సంస్థలకు అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఢిల్లీలో లాజిస్టిక్స్ అగ్రిగేటర్ షిప్‌రాకెట్, ఎయిర్ కార్గో హ్యాండ్లింగ్ సంస్థ కార్గో సర్వీస్ సెంటర్; బెంగళూరులో డీహెచ్ఎల్, లెక్స్‌షిప్; ముంబైలో గ్లోగ్లోకల్ ఈ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ హబ్‌ల నిర్వహణ విధి విధానాలను రూపొందించడంపై వాణిజ్య, ఆదాయ విభాగాలు, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) కలిసి పని చేస్తున్నాయని సారంగి చెప్పారు. గేట్‌వే పోర్టుల్లో కస్టమ్స్ పరిశీలన నుంచి మినహాయింపులు, రిటర్నుల కోసం సులభతరమైన రీఇంపోర్ట్ పాలసీ మొదలైన ఫీచర్లు ఈ హబ్‌లలో ఉంటాయి. ఈ-కామర్స్ ఎగుమతులను పెంచుకోవడంపై భారత్ మరింతగా దృష్టి పెడుతున్న నేపథ్యంలో వీటి ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం భారత్ ఈ-కామర్స్ ఎగుమతులు 5 బిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి వీటిని 100 బిలియన్ డాలర్లకు పెంచుకునే సామర్థ్యాలు ఉన్నాయనే అంచనాలు నెలకొన్నాయి.

రూపాయి స్థిరీకరణకు ఆర్‌బీఐ చర్యలు

విదేశీ లావాదేవీల్లో దేశీ కరెన్సీ ప్రోత్సాహానికి చర్యలు



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్టం 86.70ని చూసిన నేపథ్యంలో, దేశీయ కరెన్సీ ఒడిదుడుకుల నివారణ, స్థిరీకరణ లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక చొరవలకు శ్రీకారం చుట్టింది. విదేశీ లావాదేవీల్లో రూపాయి వినియోగం ప్రోత్సాహం లక్ష్యంగా కీలక చర్యలను ప్రకటించింది. సరిహద్దు వాణిజ్య లావాదేవీల్లో భారత రూపాయి అలాగే స్థానిక, జాతీయ కరెన్సీల వినియోగాన్ని ప్రోత్సహించడానికి సంబంధిత నిబంధనలను సరళీకృతం చేసింది. రూపాయిలో పలు దేశాలతో వాణిజ్య లావాదేవీలను నిర్వహించడం, తద్వారా డాలర్ల డిమాండ్‌ను తగ్గించడం, రూపాయి విలువ స్థిరీకరణ ఆర్‌బీఐ నిర్ణయాల ప్రధాన లక్ష్యాలు.

సెంట్రల్ బ్యాంకులతో ఎంఓయూలు....

భారతీయ రూపాయితో సహా స్థానిక కరెన్సీలలో సరిహద్దు లావాదేవీలను ప్రోత్సహించడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా, మాల్దీవుల సెంట్రల్ బ్యాంకులతో రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే అవగాహన ఒప్పందం (ఎంఓయూ)లపై సంతకం చేసింది. వాణిజ్య లావాదేవీల కోసం భారత రూపాయిని ప్రోత్సహించడానికి 2022 జూలైలో ప్రత్యేక రూపాయి వోస్ట్రో ఖాతా (ఎస్ఆర్‌వీఏ) సౌలభ్యాన్ని ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. అనేక విదేశీ బ్యాంకులు భారతదేశంలోని బ్యాంకులతో ఎస్ఆర్‌వీఏలను ప్రారంభించాయి. ఎస్ఆర్‌వీ ఖాతాల లావాదేవీల విషయంలో తాజాగా మరింత సరళతర నిబంధనలను ఆర్‌బీఐ తీసుకువచ్చింది. సరళీకృత ఫెమా నిబంధనల ప్రకారం, భారతదేశం వెలుపల నివసించే వ్యక్తులు ప్రత్యేక నాన్-రెసిడెంట్ రూపాయి ఖాతా, ఎస్ఆర్‌వీఏల్లోని బ్యాలెన్స్‌లను ఉపయోగించి ఇతర నాన్-రెసిడెంట్‌లతో విశ్వసనీయ లావాదేవీలను నిర్వహించడానికి వీలవుతుంది. భారతీయ ఎగుమతిదారులు వాణిజ్య లావాదేవీల సెటిల్‌మెంట్ కోసం విదేశాలలో ఏదైనా విదేశీ కరెన్సీలో ఖాతాలను తెరవగలరని కూడా ఆర్‌బీఐ తెలిపింది. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్వీకరించడం, ఈ ఆదాయాన్ని దిగుమతుల కోసం చెల్లించడం వంటి కార్యకలాపాలను నిర్వహించవచ్చు.

టెక్ మహీంద్రా లాభం హైజంప్

క్యూ3లో రూ. 983 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సొల్యూషన్ల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 93 శాతం దూసుకెళ్లి రూ. 983 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో ప్రతికూలతల కారణంగా కేవలం రూ. 510 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ2లో సాధించిన రూ. 1,250 కోట్లతో పోలిస్తే నికర లాభం తగ్గింది. కాగా.. మొత్తం ఆదాయం నామమాత్రంగా 1 శాతమే పుంజుకుని రూ. 13,286 కోట్లకు చేరింది. నిర్వహణ లాభ మార్జిన్లు 5.4 శాతం నుంచి 10.2 శాతానికి మెరుగుపడ్డాయి. అయితే రెండేళ్లలో ఇవి 15 శాతానికి బలపడగలవని కంపెనీ సీఈవో, ఎండీ మోహిత్ జోషీ పేర్కొన్నారు. ఈ కాలంలో ప్రధానంగా టెలికం, తయారీ రంగాల నుంచి74.5 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లు అందుకున్నట్లు సీఎఫ్‌వో రోహిత్ ఆనంద్ వెల్లడించారు.

ఈ షేరు 2% క్షీణించి రూ. 1,659 వద్ద ముగిసింది.

వచ్చే రెండేళ్లూ 6.7 శాతం వృద్ధి

ప్రపంచ బ్యాంక్

వాషింగ్టన్: భారత్ ఎకానమీ వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2025-26, 2026-27) 6.7 శాతం వృద్ధి సాధిస్తుందని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక పేర్కొంది. దక్షిణాసియా వృద్ధికి సంబంధించి బహుళజాతి సంస్థ ఒక నివేదిక విడుదల చేస్తూ, 2025-26లో దక్షిణాసియా వృద్ధి అంచనా 6.2 శాతంగా పేర్కొంది. సేవలు, తయారీ రంగాలు పటిష్ట వృద్ధిని నమోదుచేసుకుంటాయని పేర్కొంది. 2024-25లో వృద్ధి రేటును 6.5 శాతంగా సంస్థ అంచనా వేసింది.



అంచనాలకన్నా నెమ్మది: ఐఎంఎఫ్

వాషింగ్టన్: భారత్ వృద్ధి వేగం అంచనాలకన్నా తక్కువగా ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. పారిశ్రామిక క్రియాశీలత మందగమనలో ఉందని తన తాజా వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్‌లో పేర్కొంది. 2026 వరకూ దేశం 6.5 శాతం వృద్ధి రేటును కొనసాగిస్తుందని తెలిపింది. ఇక 2025, 2026లో ప్రపంచ వృద్ధి రేటు 3.3 శాతంగా ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2000-2019 మధ్య సగటు 3.7 శాతంకన్నా ఇది తక్కువ కావడం గమనార్హం. ప్రపంచ ద్రవ్యోల్బణం 2025లో 4.2 శాతం, 2026లో 3.5 శాతం ఉంటుందని సంస్థ అంచనా వేసింది.




అంతర్జాతీయ అనిశ్చితిలోనూ భారత్ పురోగతి:డబ్ల్యూఈఎఫ్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆర్థికవేత్తలలో అధికశాతం మంది 2025లో బలహీన ప్రపంచ ఆర్థిక పరిస్థితులు నెలకొంటాయని భావిస్తున్నారు. అయితే కొంత మందగమన సంకేతాలు ఉన్నప్పటికీ, భారతదేశం బలమైన వృద్ధిని కొనసాగించే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు విడుదలైన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్(డబ్ల్యూఈఎఫ్) చీఫ్ ఎకనమిస్ట్ అవుట్‌లుక్‌లో కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. సర్వేలో అభిప్రాయం వ్యక్తం చేసిన ఆర్థికవేత్తలో 56 శాతం 2025లో ప్రపంచ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉంటాయని భావిస్తున్నారు. కేవలం 17 శాతం మెరుగుదల ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2025లో భారత్, అమెరికాలు మాత్రం చక్కటి పురోగతి సాధిస్తాయని అంచనా. యూరోప్ ఎకానమీ బలహీనంగా ఉంటుందని సర్వేలో పాల్గొన్న వారిలో 74 శాతం మంది అభిప్రాయడ్డారు. చైనా వృద్ధిపై కూడా అనుమానాలే వ్యక్తం మయ్యాయి.

2026 నాటికి 4వ అతిపెద్ద ఎకానమీగా భారత్

పీహెచ్‌డీసీసీఐ

న్యూఢిల్లీ: భారత్ 2026 నాటికి ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పరిశ్రమల సంఘం- పీహెచ్‌డీసీసీఐ అంచనా వేసింది. మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ ఎకానమీ 6.8 శాతంగా నమోదవుతుందని విశ్లేషించింది. ఇది ఆర్‌బీఐ, ప్రభుత్వ అంచనాలకన్నా అధికంగా ఉండడం గమనార్హం. ఇక ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.7 శాతంగా ఉంటుందని అంచనాకు వచ్చింది.




అమెరికా, చైనా, జర్మనీ, జపాన్‌ల తర్వాత భారత్ ప్రస్తుతం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1 వతేదీన లోక్‌సభలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను సమర్పించనున్న నేపథ్యంలో పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు హేమంత్ జైన్ చేసిన ఒక ప్రకటనలో కొన్ని ముఖ్యాంశాలు...

- ప్రస్తుతం రూ.15 లక్షల పైన ఉన్న ఆదాయానికి 30 శాతం పన్ను రేటు వర్తిస్తోంది. అయితే ఈ స్థాయి పన్ను రేటును రూ.40 లక్షల పైన ఉన్నవారికి మాత్రమే వర్తింపజేయాలి.
- ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.10 లక్షలకు పెంచాలి.

సాక్షి ప్లస్
శనివారం 18-1-2025

మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టోర్నీలో భాగంగా ఈరోజు జరిగే ఆరు మ్యాచ్‌ల్లో స్కాట్లాండ్‌తో ఆస్ట్రేలియా (ఉదయం గం. 8 నుంచి); ఐర్లాండ్‌తో ఇంగ్లండ్ (ఉదయం గం. 8 నుంచి); సమోవాతో నైజీరియా (ఉదయం గం. 8 నుంచి); నేపాల్‌తో బంగ్లాదేశ్ (ఉదయం గం. 8 నుంచి); అమెరికాతో పాకిస్తాన్ (మధ్యాహ్నం గం. 12 నుంచి); దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ (మధ్యాహ్నం గం. 12 నుంచి) తలపడతాయి.

రెండేళ్ల క్రితం నిర్వహించిన ఐసీసీ మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన యువ భారత్... ట్రోఫీ నిలబెట్టుకునేందుకు సిద్ధమైంది. మహిళల క్రికెట్‌కు మరింత తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి నేటి నుంచి తెరలేవనుండగా... రేపు జరగనున్న తొలి పోరులో వెస్టిండీస్‌తో యువ భారత్ తలపడనుంది. షఫాలీ వర్మ, రిచా ఘోష్ వంటి సీనియర్ స్థాయిలో ఆడిన ప్లేయర్లతో బరిలోకి దిగి తొలిసారి విశ్వ విజేతగా నిలిచిన భారత్... ఈసారి కూడా ఆధిపత్యం కొనసాగించాలని చూస్తుంటే... తొలిసారి ట్రోఫీ చేజిక్కించుకోవాలని ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా తహతహలాడుతున్నాయి. 2023 వరల్డ్ కప్ జట్టులోనూ ఆడిన తెలుగు ప్లేయర్లు గొంగడి త్రిష, షబ్నమ్‌లపై ఈసారి భారీ అంచనాలు ఉన్నాయి.



యువ సమరం... నేడే ఆరంభం

నేటి నుంచి మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్
- మలేసియా వేదికగా రెండో వరల్డ్‌కప్
- డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో భారత్
- తొలి పోరులో రేపు వెస్టిండీస్‌తో 'ఢీ'
- స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ రెండో ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. మొత్తం 16 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్‌కు శనివారం తెరలేవనుంది. 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన తొలి వరల్డ్‌కప్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన భారత జట్టు ట్రోఫీ కైవసం చేసుకోగా... ఈసారి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న యంగ్ ఇండియా టైటిల్ నిలబెట్టుకుంటుందా చూడాలి.

ఫార్మాట్ ఎలా ఉందంటే...
మొత్తం 16 జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. వెస్టిండీస్, శ్రీలంక, ఆతిథ్య మలేసియాతో కలిసి భారత జట్టు గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగనుంది. ఒక్కో గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు (12) 'సూపర్ సిక్స్' దశకు చేరుకుంటాయి. ఈ 12 జట్లను 'సూపర్ సిక్స్'లో రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. గ్రూప్-1లో ఆరు జట్లు... గ్రూప్-2లో మరో ఆరు జట్లు ఉంటాయి. 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లు ముగిశాక గ్రూప్-1, గ్రూప్-2లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

సీనియర్ జట్టులోకి దారి...
సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్న ప్లేయర్లు ఈ టోర్నీలో రాణించి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాలని భావిస్తున్నారు. గత ఎడిషన్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై గెలిచిన షఫాలీ వర్మ సారథ్యంలోని టీమిండియా... ఈసారి కూడా అదే ఆధిపత్యం కనబర్చాలని చూస్తోంది. 2023 అండర్-19 ప్రపంచకప్‌లో రాణించడం ద్వారా టిటాస్ సాధు, శ్వేత సెహ్రావత్... ఆ తర్వాతి కాలంలో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు అదే బాటలో పయనించి మెరుగైన ప్రదర్శనతో ఈ ఏడాది భారత్‌లో జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోవాలని యంగ్ ప్లేయర్లు కసరత్తులు చేస్తున్నారు.

త్రిష రెండోసారి... గత ప్రపంచకప్ ఫైనల్లో భారత్ తరఫున అత్యధిక స్కోరర్‌గా నిలిచిన హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో ఆడనుంది. గత నెల మహిళల అండర్-19 ఆసియాకప్‌లో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించిన త్రిష... ఈసారి కూడా మెరుగైన ప్రదర్శన చేసి సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా సాగుతోంది. శనివారం స్కాట్లాండ్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్‌తో టోర్నీకి తెరలేవనుండగా... ఆదివారం జరగనున్న తమ తొలి పోరులో వెస్టిండీస్‌తో భారత జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. సమోవా, నైజీరియా, నేపాల్, మలేసియా జట్లు తొలిసారి ఐసీసీ టోర్నీలో ఆడనున్నాయి. ఈ టోర్నీలో ప్రధానంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల నుంచి యంగ్ ఇండియాకు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే ఇటీవల ఆసియాకప్ నెగ్గి మంచి జోరుమీదున్న అమ్మాయిలు కలసి కట్టుగా కదంతొక్కితే టైటిల్ నిలబెట్టుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు.

భారత మహిళల అండర్-19 టి20 క్రికెట్ జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానిక చల్కె, త్రిష, కమలిని, భవిక అహిరె, ఐశ్వరి అవసారె, మిథిలా, జోషిత, సోనమ్, పరుణిక, కేసరి ధ్రుతి, ఆయుషి శుక్లా, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

గ్రూప్‌ల వివరాలు

గ్రూప్ 'ఎ':	భారత్, మలేసియా, శ్రీలంక, వెస్టిండీస్
గ్రూప్ 'బి':	ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్తాన్, అమెరికా
గ్రూప్ 'సి':	న్యూజిలాండ్, నైజీరియా, సమోవా, దక్షిణాఫ్రికా
గ్రూప్ 'డి':	ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, నేపాల్, స్కాట్లాండ్





సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

క్వార్టర్ ఫైనల్లో పోరాడి ఓడిన సింధు

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుక్రవారం భారత అగ్రశ్రేణి క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సింగిల్స్ విభాగంలో భారత కథ ముగియగా... పురుషుల డబుల్స్ విభాగంలో మాజీ చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి ప్రవేశించి ఆశలు నిలబెట్టింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ప్రపంచ నాలుగో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జంగ్ (ఇండోనేసియా)తో జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 9-21, 21-19, 17-21తో ఓడిపోయింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 17-17 వద్ద సింధు వరుసగా నాలుగు పాయింట్లు చేజార్చుకొని ఓటమి ఖరారు చేసుకుంది. 'తీవ్రంగా పోరాడినా ఓడిపోయినందుకు బాధగా ఉంది. తొలి గేమ్‌లో తడబడి చాలా తప్పిదాలు చేశాను. చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని తదుపరి టోర్నీలో మరింత మెరుగైన ప్రదర్శన చేస్తాను' అని ఓటమి అనంతరం సింధు వ్యాఖ్యానించింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి (భారత్) 13-21, 19-21తో హాంగ్ యాంగ్ వెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో 2022 చాంపియన్ ద్వయం సాత్విక్-చిరాగ్ శెట్టి 21-10, 21-17తో జిన్ యోంగ్-కాంగ్ మిన్ హుక్ (దక్షిణ కొరియా) జంటపై గెలిచింది. ఈ విజయంతో సాత్విక్-చిరాగ్ వరుసగా మూడో టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. గతేడాది చైనా మాస్టర్స్ టోర్నీలో, ఈ ఏడాది మలేసియా సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ సెమీఫైనల్లో ఓడిపోయారు. నేడు జరిగే సెమీఫైనల్లో జె ఫె గో-నూరు జుద్దీన్ (మలేసియా)తో సాత్విక్-చిరాగ్ ఆడతారు.

జొకోవిచ్, సబలెంకా జోరు

వరుస సెట్‌లలో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం
- ఏడో సీడ్ పెగూలా అవుట్
- అల్‌కరాజ్, జ్వెరెవ్ ముందంజ

మెల్‌బోర్న్: 'హ్యాట్రిక్' టైటిల్ సాధించే దిశగా సబలెంకా... రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచే దిశగా జొకోవిచ్ మరో అడుగు ముందుకు వేశారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్).... పురుషుల సింగిల్స్‌లో 10 సార్లు విజేత జొకోవిచ్ (సెర్బియా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ సబలెంకా 7-6 (7/5), 6-4తో క్లారా టౌసన్ (డెన్మార్క్)పై గెలుపొందగా... ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో 26వ సీడ్ టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్)ను ఓడించాడు. క్లారాతో 2 గంటల 6 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకాకు గట్టిపోటీ ఎదురైనా కీలకదశలో ఆమె పైచేయి సాధించింది. మ్యాచ్‌లో ఒక్క ఏస్ కూడా కొట్టని సబలెంకా తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 39 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 29 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు క్లారా ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 33 అనవసర తప్పిదాలు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఒక్కో సెట్ కోల్పోయిన సెర్బియా దిగ్గజం జొకోవిచ్ మూడో మ్యాచ్‌లో మాత్రం వరుసగా మూడు సెట్‌లలో గెలుపొందడం విశేషం. మఖచ్‌తో 2 గంటల 22 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 28 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్...నెట్ వద్దకు 18 సార్లు వచ్చి 12 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన ఈ మాజీ చాంపియన్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)తో జొకోవిచ్; మిరా ఆంద్రీవా (రష్యా)తో సబలెంకా తలపడతారు.

పురుషుల సింగిల్స్ ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-2, 6-4, 6-7 (3/7), 6-2తో బోర్జెస్ (పోర్చుగల్)పై, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-3, 6-4, 6-4తో ఫియరెన్‌లే (బ్రిటన్)పై, 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 7-6 (7/2), 6-2, 6-0తో కార్‌బెలాస్ బేనా (స్పెయిన్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.





కోకో గాఫ్ సులువుగా...
మహిళల సింగిల్స్ విభాగంలో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... ఏడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) ఇంటిదారి పట్టింది. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో కోకో గాఫ్ 6-4, 6-2తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై నెగ్గగా... పెగూలా 6-7 (3/7), 1-6తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడిపోయింది. 11వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్), 27వ సీడ్ పావ్లీచెంకోవా (రష్యా), బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. బెన్‌చిచ్‌తో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో తొలి సెట్ కోల్పోయాక మాజీ చాంపియన్ నయోమి ఒసాకా (జపాన్) గాయం కారణంగా వైదొలిగింది.

పాకిస్తాన్ 143/4

ముల్తాన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 41.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. పొగమంచు కప్పేయడంతో ఆట నిర్ణీత సమయానికి ప్రారంభం కాకపోగా ... టాస్ గెలిచిన ఆతిథ్య పాకిస్తాన్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ నిర్ణయం తప్పని తెలిసేందుకు పాకిస్తాన్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. కెప్టెన్ షాన్ మసూద్ (11), మొహమ్మద్ హురైరా (6), బాబర్ ఆజమ్ (8), కమ్రాన్ గులామ్ (5) ఇలా ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టడంతో ఆ జట్టు ఒకదశలో 46 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సౌద్ షకీల్ (56 బ్యాటింగ్; 4 ఫోర్లు), మొహమ్మద్ రిజ్వాన్ (51 బ్యాటింగ్; 7 ఫోర్లు) అజేయ అర్ధశతకాలతో అదరగొట్టారు. విండీస్ బౌలింగ్ దాడిని ఎదుర్కొంటూ మొదట వికెట్ల పతనాన్ని అడ్డుకున్న ఈ జంట ఆ తర్వాత నిదానంగా పరుగులపై దృష్టి పెట్టింది. అబేధ్యమైన ఐదో వికెట్‌కు షకీల్, రిజ్వాన్ కలిసి 97 పరుగులు జోడించారు.



ఎంపీతో రింకూ పీ..పీ..డుం..డుం!

లోక్‌సభ సభ్యురాలు ప్రియా సరోజ్‌తో భారత క్రికెటర్ నిశ్చితార్థం!





న్యూఢిల్లీ: టీమిండియా ఆటగాడు రింకూ సింగ్ త్వరలో ఒక ఇంటివాడు కానున్నాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన ఈ యూపీ కుర్రాడు... భారీ హిట్టింగ్‌తో అభిమానుల మనసు గెలుచుకున్నాడు. భారత జట్టు తరఫున ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లు ఆడిన రింకూ సింగ్... జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజకీయ నాయకురాలు ప్రియా సరోజ్‌తో త్వరలో రింకూ ఏడడుగులు వేయనున్నట్లు సమాచారం. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ప్రియ ప్రస్తుతం లోక్‌సభ ఎంపీగా కొనసాగుతోంది. 25 ఏళ్ల వయసులోనే మచిలీషహర్ నియోజకవర్గం నుంచి ఆమె ఎంపీగా విజయం సాధించారు. ప్రియా తండ్రి తుఫానీ సరోజ్ గతంలో మూడు సార్లు ఎంపీగా పనిచేయడంతో పాటు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. నిశ్చితార్థం జరిగిందన్న వార్తలను రింకూ సింగ్ కుటుంబ సభ్యులు ఖండించగా... తుఫానీ సరోజ్ మాత్రం ఇరు కుటుంబాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు అంగీకరించారు. ఇప్పటి వరకు టీమిండియా తరఫున 30 టి20 మ్యాచ్‌లు ఆడిన రింకూ 507 పరుగులు చేశాడు.

ఖోఖో ప్రపంచకప్: సెమీస్‌లో భారత జట్లు

న్యూఢిల్లీ: స్వదేశంలో జరుగుతున్న తొలి ఖోఖో ప్రపంచకప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లాయి. దేశీయ క్రీడలో దుమ్మురేపుతున్న మన జట్లు క్వార్టర్స్‌లో అదే ఆధిపత్యం కనబర్చాయి. శుక్రవారం జరిగిన మహిళల క్వార్టర్ ఫైనల్లో భారత్ 109-16 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. వరుసగా ఐదో మ్యాచ్‌లో 100 పాయింట్లకు పైగా స్కోరు చేసిన మన అమ్మాయిలు... ఆట ఆరంభం నుంచే చెలరేగిపోయారు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస పాయింట్లతో ఉక్కిరిబిక్కిరి చేశారు. కెప్టెన్ ప్రియాంక ఇంగ్లె, నస్రిన్ షేక్, ప్రియాంక, రేష్మ రాథోడ్ సత్తా చాటారు. ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఉగాండా 71-26 పాయింట్ల తేడాతో న్యూజిలాండ్‌పై, దక్షిణాఫ్రికా 51-46 పాయింట్ల తేడాతో కెన్యాపై, నేపాల్ 103-8 పాయింట్ల తేడాతో ఇరాన్‌పై గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టాయి. శనివారం జరగనున్న సెమీఫైనల్స్‌లో ఉగాండాతో నేపాల్, దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతాయి.

పురుషుల క్వార్టర్ ఫైనల్లో భారత్ 100-40 పాయింట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. రామ్‌జీ కశ్యప్, ప్రతీక్, ఆదిత్య విజృంభించడంతో తొలి రౌండ్‌లోనే 58 పాయింట్లు సాధించిన భారత్... చివరి వరకు అదే జోరు కొనసాగించింది. రెండో రౌండ్‌లో తీవ్రంగా పోరాడిన శ్రీలంక ఓటమి అంతరాన్ని తగ్గించగలిగింది. ఇతర మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా 58-38తో ఇంగ్లండ్‌పై, నేపాల్ 67-18తో బంగ్లాదేశ్‌పై, ఇరాన్ 86-18తో కెన్యాపై గెలిచి సెమీస్‌కు చేరుకున్నాయి. నేడు జరగనున్న సెమీఫైనల్స్‌లో ఇరాన్‌తో నేపాల్, దక్షిణాఫ్రికాతో భారత్ తలపడతాయి.









26వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం శుక్రవారం కర్తవ్యపథ్‌లో మోటార్ సైకిళ్లపై ఒళ్లు గగుర్పొడిచే ప్రమాదకరమైన స్టంట్ రిహార్సల్స్ చేస్తున్న భారత ఆర్మీ జవాన్లు



కోల్‌కతాలోని దెసున్ ఆస్పత్రి రూఫ్‌టాప్ హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసుకుంది. దేశంలో ఈ సదుపాయం ఉన్న మొట్టమొదటి హాస్పిటల్‌గా నిలిచింది

పాక్ మహిళ.. యూపీలో ప్రభుత్వ టీచర్

- ఆమె సమర్పించినవన్నీ ఫోర్జరీ సర్టిఫికెట్లని వెల్లడి
- విధుల నుంచి తొలగించిన అధికారులు
- షుమైలా అరెస్టుకు పోలీసుల ప్రయత్నాలు

బరేలీ: పాకిస్తాన్‌కు చెందిన ఓ మహిళ ఫోర్జరీ పత్రాలు చూపి 2015లో ఏకంగా ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించింది. విచారణలో నిజాలు వెలుగు చూడటంతో అధికారులు ఆమెను తొలగించారు. అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. యూపీలో ఈ ఘటన వెలుగు చూసింది. షుమైలా ఖాన్ అనే మహిళ మాధోపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సహాయ టీచర్‌గా 2015లో జాయినయ్యారు. ఆ సమయంలో ఆమె రాంపూర్ జిల్లా సదర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ పేరుతో జారీ చేసిన నివాస ధ్రువీకరణ పత్రం సమర్పించారు. అనుమానం వచ్చిన అధికారులు విచారణ జరపగా అది ఫోర్జరీ చేసిన సర్టిఫికెట్ అని, ఆమె పాకిస్తాన్ దేశస్తురాలని తేలింది. ఉద్యోగం పొందేందుకు ఆమె సమర్పించినవన్నీ ఫోర్జరీ సర్టిఫికెట్లేనని కూడా వెల్లడైందని బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి భాను శంకర్ వెల్లడించారు. నివాస ధ్రువీకరణ పత్రాన్ని కూడా తప్పుడు సమాచారం ఆధారంగా జారీ అయినట్లు తెలిసి, తర్వాత రద్దు చేశారు. గతేడాది అక్టోబర్ 3న ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. విధుల్లో జాయినైన తేదీ నుంచి ఇది వర్తించనుంది. అధికారులిచ్చిన ఫిర్యాదు మేరకు షుమైలా ఖాన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఫతేహ్‌గంజ్(వెస్ట్) అదనపు ఎస్పీ ముకేశ్ చంద్ర మిశ్రా శుక్రవారం వివరించారు. ఆమెను అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బెంగళూరులో అమెరికా కాన్సులేట్ ప్రారంభం

శివాజీనగర: బెంగళూరులో శుక్రవారం ప్రారంభమైన అమెరికా కాన్సులేట్ కార్యాలయం కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారింది. స్థానిక జేడబ్ల్యూ మారియెట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ల సమక్షంలో భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి కాన్సులేట్ ప్రారంభాన్ని ప్రకటించారు. విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ మాట్లాడుతూ తనకు కర్ణాటకతో విడదీయరాని అనుబంధముందని చెప్పారు. అనంతరం కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ మాట్లాడారు. 'ఎస్ఎం కృష్ణ సీఎం, విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పటి నుంచి గత 24 ఏళ్లుగా కాన్సులేట్ కార్యాలయం కోసం ప్రయత్నిస్తున్నాం. ఆయనతోపాటు నేను కూడా ఉన్నాను'అని అన్నారు. దీనిపై కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య స్పందిస్తూ.. గతంలో ఎందరు ప్రయత్నించినప్పటికీ ప్రధానమంత్రి మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ స్వయంగా జోక్యం చేసుకున్న తర్వాతే కాన్సులేట్‌కు మార్గం సుగమమైందంటూ ఎదురుదాడికి దిగారు. తాను కూడా అప్పటి అమెరికా రాయబారితో మాట్లాడినట్లు మాజీ సీఎం కుమారస్వామి సోషల్‌మీడియాలో అప్పటి ఫొటోలను పోస్ట్ చేశారు.

మర్డర్ మిస్టరీని ఛేదించిన సిగరెట్ పీక

ఎంత ప్రొఫెషనల్ నేరగాడైనా నేరానికి సంబంధించి ఏదో ఒక క్లూ వదులుతాడంటారు. అది నిజమేనని మరోసారి నిరూపించిన ఉదంతమిది. అప్పుడెప్పుడో 1984లో జరిగిన ఓ హత్య మిస్టరీని 2014లో ఛేదించారు. హంతకుడు తాగి పడేసిన సిగరెట్ పీకే అతని పీకకు చుట్టుకుంది. అత్యాధునికమైన డీఎన్ఏ ప్రొఫైలింగ్ మనవాన్ని పట్టించింది. 2021లో అతనికి శిక్ష పడింది.

బ్రిటన్‌లో గ్లాస్గోకు చెందిన 58 ఏళ్ల మేరీ మెక్ లాఫ్లిన్‌కు రెండు పెళ్లిళ్లయ్యాయి. మొత్తం 11 మంది పిల్లలున్నారు. వారు వేర్వేరు నగరాల్లో ఉండటంతో ఒక్కతే ఉంటోంది. కొడుకు మార్టిన్ కలెన్ (24) వారానికోసారి తల్లిదగ్గరకు వచ్చేవాడు. 1984 అక్టోబర్ 2న తల్లిని చూసేందుకు వచ్చినప్పుడు ఫ్లాట్ నుంచి భయంకరమైన వాసన వచ్చింది. లోపల మేరీ శవమై, మంచం మీద పడుంది. ఐదు రోజుల క్రితమే హత్యకు గురైనట్లు పోస్టుమార్టంలో తేలింది. సెప్టెంబర్ 26న ఆమె పబ్‌లో గడిపిందని, తర్వాత నడుచుకుంటూ ఇంటికెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. దారిలో ఆగి సిగరెట్ కొనుక్కుందని కూడా చెప్పారు. బూట్లు చేతబట్టుకుని నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను వెంబడించడం చూసినట్టు ఓ ట్యాక్సీ డ్రైవర్ వాంగ్మూలమిచ్చాడు. అయినా కేసు ఎటూ తేలలేదు. ఒకానొక దశలో ఆమె పిల్లలపైనా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఏడాది దర్యాప్తు తర్వాత కేసును మూసేశారు. తర్వాత మరో నాలుగుసార్లు దర్యాప్తు చేసినా లాభం లేకపోయింది. 30 ఏళ్ల తరువాత 2014లో ఈ హత్యకు సంబంధించిన సాక్ష్యాధారాలను మరోసారి సమీక్షించాల్సిందిగా స్కాటిష్ క్రైమ్ క్యాంపస్‌లో పనిచేస్తున్న జోవాన్ కొక్రాన్‌ను మేరీ కుమార్తె గినా మెక్ గావిన్ అడిగారు. 1984లో డీఎన్ఏ ప్రొఫైలింగ్ గురించి అంతగా తెలియకపోయినా అన్ని సాక్ష్యాలనూ భద్రపరిచారు. వాటిలోని మేరీ జుట్టు, గోరు వంటి వాటిని డీఎన్ఏ ప్రొఫైలింగ్ చేశారు. లివింగ్ రూమ్‌లో కాఫీ టేబుల్ మీది యాష్ ట్రేలోని ఉన్న సిగరెట్ పీక కీలక క్లూగా మారింది. పీకకు అంటిన డీఎన్ఏ గ్రాహం మెక్ గిల్ అనే నేరస్తుని డీఎన్ఏతో సరిపోలింది. అతను పలు లైంగిక నేరాల కేసుల్లో తీవ్ర శిక్షలు అనుభవిస్తున్నాడు. సరే, కేసు వీడింది కదా అనుకుంటే మరో చిక్కు వచ్చి పడింది. మేరీ హత్యకు గురైన సమయంలో మెక్ గిల్ ఖైదీగా ఉన్నట్టు రికార్డులు చూపించాయి. జైల్లో ఉంటే హత్య ఎలా చేయగలడా అని అధికారులు తల పట్టుకున్నారు. నేషనల్ రికార్డ్స్ ఆఫ్ స్కాట్లాండ్‌లో విచారించిన మీదట చిక్కు ముడి వీడింది. మేరీ హత్య జరిగిన సమయంలో మెక్ గిల్ ఐదు రోజులు పెరోల్‌పై బయట ఉన్నట్టు తేలింది. దాంతో 2019లో మెక్‌గిల్‌ను అరెస్టు చేశారు. దోషిగా నిర్ధారించి 2021లో 14 ఏళ్ల జైలు శిక్ష విధించారు. మేరీ హత్య సమయంలో మెక్‌గిల్‌కు 22 ఏళ్లు. 59 ఏళ్ల వయసులో అతనికి శిక్ష పడింది. ''తల్లి హంతకుడిని జీవితకాలంలో చూస్తామనుకోలేదు. ఆశే మమ్మల్ని నడిపించింది. మొత్తానికి ఉపశమనం కలిగింది''అని గినా అన్నారు.



మేరీ మెక్ లాఫ్లిన్ (ఫైల్)



దోషి మెక్ గిల్

– సాక్షి, నేషనల్ డెస్క్

40 మంది పాకిస్తానీల జల సమాధి

ఇస్లామాబాద్: వలసదారులతో కూడిన పడవ ఒకటి స్పెయిన్‌కు వెళ్తూ మొరాకో సమీపంలో నీట మునిగింది. ఈ దుర్ఘటనలో 40 మందికిపైగా పాకిస్తాన్ వాసులు జలసమాధి అయ్యారు. పాకిస్తానీయులు 66 మంది సహా మొత్తం 86 మంది వలసదారులతో కూడిన పడవొకటి జనవరి 2వ తేదీన మారిటానియా వీడిందని అధికారులు తెలిపారు. పడవలో సమస్య ఏర్పడటంతో గత 13 రోజులుగా ఎవరైనా రక్షిస్తారేమోనని అందులోని వారు ఆశగా ఎదురుచూశారని వారన్నారు. చివరికి మొరాకోలోని దాఖ్లా పోర్టు సమీపంలో అది నీట మునిగిపోయిందని వివరించారు. అయితే, ఈ ఘటనలో కనీసం 50 మంది చనిపోయారని వలసదారుల హక్కుల కోసం పోరాడే వాకింగ్ బోర్డర్స్ సంస్థ గురువారం పేర్కొంది. సల సమాధి అయిన వారిలో పాకిస్తానీలు 44 మంది ఉన్నారని ఆ సంస్థ సీఈవో హెలెనా మలెనో 'ఎక్స్'లో వెల్లడించారు. మిగతా వారిని రక్షించి దఖ్లాకు తరలించామన్నారు. ఘటనపై పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. దఖ్లాలో చిక్కుకుపోయిన వారికి అవసరమైన సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. హేయమైన మానవ అక్రమ రవాణాకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. గతేడాది డిసెంబర్ గ్రీస్ తీరంలో పడవ మునిగిన ఘటనలో ఐదుగురు పాకిస్తానీ వలసదారులు ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఇదే ప్రాంతంలో జరిగిన మరో విషాద ఘటనలో 262 మంది పాకిస్తాన్ వాసులు ప్రాణాలు కోల్పోయారు.

పుణే హైవేపై ప్రమాదం.. 9 మంది మృతి

పుణే: పుణే–నాసిక్ హైవేపై శుక్రవారం ఉదయం జరిగిన ఘోర దుర్ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. నారాయణ్‌గావ్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన టెంపో ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సుపైకి దూసుకెళ్లింది. ఘటనలో మినీ వ్యాన్‌లో ఉన్న తొమ్మిది మందీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేరు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పుణే రూరల్ ఎస్పీ పంకజ్ దేశ్‌ముఖ్ చెప్పారు.

ఉక్రెయిన్ యుద్ధంలో 12 మంది భారతీయుల మృతి

16 మంది గల్లంతు, తిరిగొచ్చిన 96 మంది: విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ యుద్ధంలో 12 మంది భారతీయులు రష్యా తరఫున పోరాడుతూ మృతి చెందారని విదేశాంగ శాఖ పేర్కొంది. ''16 మంది గల్లంతయ్యారు. 96 మంది క్షేమంగా తిరిగొచ్చారు''అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాకు తెలిపారు. 126 మంది భారతీయులు రష్యా తరఫున ఉక్రెయిన్‌లో యుద్ధం చేసినట్టు తేలింది. మృతులు, తిరిగొచ్చిన వారు పోను మిగతా 18 మందిలో 16 మంది ఆచూకీ తెలియడం లేదు. వారిని త్వరగా స్వదేశానికి రప్పించాలని రష్యాను కోరుతున్నాం''అని చెప్పారు. ''రష్యా తన సైన్యంలో చేర్చుకున్న కేరళకు టి.బి.బినిల్ బాబు మరణించాడు. బినిల్ మృతదేహాన్ని తీసుకురావడానికి రష్యా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. యుద్ధంలో గాయపడ్డ మరో భారతీయుడు మాస్కోలో చికిత్స పొందుతున్నాడు. కోలుకోగానే భారత్ తిరిగొస్తాడని భావిస్తున్నాం. మాస్కోలోని రాయబార కార్యాలయం వారి కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతోంది. అన్నిరకాల సహకారాలు అందిస్తున్నాం''అని విదేశాంగ శాఖ తెలిపింది.

ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్‌కు బిగ్ లాస్

రెండు అంతరిక్ష ప్రయోగాలు ఫెయిల్

వాషింగ్టన్: స్పేస్ ఎక్స్ సంస్థ అధినేత ఎలాన్ మస్క్, బ్లూ ఒరిజిన్, అమెజాన్ సంస్థల వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు పెద్ద నష్టమే వాటిల్లింది. ఈ ఇద్దరు టెక్నాలజీ దిగ్గజాలు చేపట్టిన రెండు ప్రయోగాలు విఫలమయ్యాయి. స్పేస్‌ఎక్స్ గురువారం ప్రయోగించిన స్టార్‌షిప్ రాకెట్ నింగిలో పేలిపోయింది. బూస్టర్ మాత్రం తిరిగొచ్చింది. మరోవైపు బ్లూ ఒరిజిన్ గురువారం ప్రయోగించిన న్యూ గ్లెన్ రాకెట్ సైతం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఈ రాకెట్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకున్నప్పటికీ తర్వాత ల్యాండింగ్ ప్రక్రియను పూర్తి చేయడంలో వైఫల్యం చెందింది. దాంతో ఈ ప్రయోగం ఢమాల్ అన్నట్లేనని నిపుణులు చెబుతున్నారు. బ్లూ ఒరిజిన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో జరగబోయే ప్రయోగాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతరిక్ష రంగంలో స్పేస్‌ఎక్స్‌తో బ్లూ ఒరిజిన్ పోటీ పడుతోంది. ఈ రంగంలో వాణిజ్య కార్యకలాపాలకు రెండు సంస్థలు తెరతీస్తున్నాయి.

ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్... హైకోర్టు ఉత్తర్వును నిలిపివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలు వ్యవహారం మరో మలుపు తిరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాన్ని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం అమలు చేయడం లేదు. దీంతో కొందరు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు దాఖలు చేశారు. ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ చేపట్టింది. తొలుత ఢిల్లీ ప్రభుత్వం తరఫున అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపించారు. విధానపరమైన అంశాల్లో హైకోర్టు జోక్యం చేసుకోవడం ఏమిటని అభ్యంతరం వ్యక్తంచేశారు. కేంద్రంతో ఒప్పందం చేసుకోవాలంటూ తమను బలవంతం చేయడం ఏమిటని పేర్కొన్నారు. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం మధ్య అధికారాల విభజనకు హైకోర్టు కొత్త అర్థం చెబుతోందని ఆక్షేపించారు. దీంతో సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఆయుష్మాన్ భారత్‌ను ఢిల్లీలో అమలు చేయడానికి ఆప్ సర్కారు ఇష్టపడడం లేదు. ఇప్పటికే అమల్లో ఉన్న ఆరోగ్య సంరక్షణ పథకాలకు దీనివల్ల విఘాతం కలుగుతుందని చెబుతోంది. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(పీఎం–జేఏవై) కింద 70 ఏళ్లు దాటిన వారికి ప్రతి ఏటా రూ.5 లక్షల దాకా నగదు రహిత హెల్త్ కవరేజీ లభిస్తుంది.

తప్పుడు ప్రకటనలతో యువతను మభ్యపెట్టింది

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ: ఉపాధి కల్పనపై తప్పుడు వివరాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దుర్మార్గపు విధానాలతో యువత ఉద్యోగావకాశాలను కేంద్రం లాగేసుకుంటోందన్నారు. 'ఒక వైపు ఉద్యోగావకాశాలు తగ్గుతుండగా తప్పుడు ప్రకటనలు, తప్పుడు డేటాతో యువతను మోసం చేయడం మోదీ ప్రభుత్వానికి అలవాటైంది. యువతలో 82 శాతం మంది ఈ ఏడాది ఉద్యోగ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. గతేడాది ఉద్యోగం దొరకడం కష్టమైందని వీరిలో 55 శాతం మంది చెప్పారు. 2025లో కొత్త ఉద్యోగం దొరుకుతుందని వీరిలో 37 శాతం మంది ఆశాభావంతో ఉన్నారు'అని శుక్రవారం ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. అర్హత, నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగం లభించడం పెను సవాల్‌గా మారిందని హ్యూమన్ రిసోర్సెస్(హెచ్ఆర్) నిపుణులు అభిప్రాయ పడుతున్నట్లు మరో సర్వేలో వెల్లడైందని ఖర్గే వివరించారు. నిజాలు ఇలా ఉండగా, మోదీ ప్రభుత్వం మాత్రం ఎలాంటి గణాంకాలు సేకరించకుండా, కేవలం గతంలోని డేటాను తారుమారు చేసి, ఉపాధి అవకాశాలపై యువతను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. మాఫియా ముఠాల ద్వారా పేపర్ లీకేజీల వంటి వాటితో మోసం చేస్తోందన్నారు. తప్పుడు విధానాలతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు మూతబడుతున్నాయన్నారు. నోట్ల రద్దు, తప్పుడు జీఎస్టీ, రిజర్వేషన్ల రద్దు వంటి విధానాలతోపాటు ఉద్యోగ ఖాళీలను ప్రభుత్వం ఏళ్లుగా భర్తీ చేయడం లేదని ఖర్గే ఆరోపించారు.

ప్రైవేట్ సంభాషణలు రికార్డు చేసి విడాకులు కోరుతారా?

పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: భార్యతో విడాకుల కోసం అడ్డదారులు తొక్కిన వ్యక్తిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భార్యతో కొన్నేళ్లపాటు జరిపిన ప్రైవేట్ సంభాషణలను మొబైల్ యాప్‌లో రికార్డు చేసి, వాటినే సాక్ష్యాలుగా చూపించి, విడాకులు కావాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తంచేసింది. భార్య నుంచి దూరంగా ఉంటున్నానని, తమకు విడాకులు మంజూరు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఇటీవల విచారణ చేపట్టారు. భార్యతో జరిగిన సంభాషణలను సంవత్సరాల తరబడి రికార్డు చేశాడంటే అతడు ఎలాంటి మనిషి? అని మండిపడ్డారు. గోప్యత హక్కులు, చట్టపరమైన నిబంధనల మధ్య సమతూకం సాధించడం చాలా కీలకమని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 18వ తేదీకి వాయిదా వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 పరిధిలో ఉన్న గోప్యత హక్కు, భారత సాక్ష్యాధారాల చట్టంలోని నిబంధనల మధ్య పరస్పర సంబంధానికి ఈ కేసు ఒక ఉదాహరణ అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. భారత సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 122 దంపతుల మధ్య జరిగిన ప్రైవేట్ సంభాషణలకు భద్రత కల్పిస్తుంది. భార్యగానీ, భర్త గానీ తమ జీవిత భాగస్వామితో జరిపిన సంభాషణను బహిర్గతం చేయడం చట్టవిరుద్ధం. వారిద్దరి మధ్య ఏదైనా వివాదం తలెత్తితే కోర్టులో సాక్ష్యంగా సమర్పించవచ్చు. డిజిటల్ యుగం ఇంకా రాని సమయంలో ఈ సెక్షన్ తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో సెక్షన్ 122కు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు. ఆడియో, వీడియో రికార్డులను సాక్ష్యంగా పరిగణించలేమని గతంలో ఓ హైకోర్టు తేల్చిచెప్పింది.



రోమ్‌లో 2 వేల ఏళ్ల నాటి బాత్ హౌస్

ఏసీ గదులు, ప్రైవేట్ బాత్ టబ్‌లు. విందుల కోసం ప్రత్యేకమైన, విలాసవంతమైన గదులు. సంపన్నుల ఇళ్లలో ఉండే విలాసాల గురించి తెలిసిందే. ఇప్పుడంటే సరే గానీ ఏకంగా 2 వేల ఏళ్ల కిందటే ఇలాంటి నిర్మాణాలున్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. పురాతన రోమన్ నగరమైన పోంపెయ్‌లో ఇలాంటివన్నీ ఉన్నట్టు తాజాగా తేలింది. 2 వేల ఏళ్ల కింద నిర్మించిన పెద్ద ప్రైవేట్ థర్మల్ కాంప్లెక్స్ ఒకటి తవ్వకాల్లో బయటపడింది. పోంపెయ్ పార్కు మధ్య ప్రాంతంలో బాత్ హౌస్‌లు బయటపడ్డాయి! నాటి పాలక వర్గ సభ్యులు విందుల కోసం 30 మంది సామర్థ్యమున్న విశాలమైన గదులను ఏర్పాటు చేసుకున్నారని పోంపెయ్ పురావస్తు పార్కు డైరెక్టర్ గాబ్రియేల్ జుచ్‌ట్రీగల్ తెలిపారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రోత్సహించడం, ఏకాభిప్రాయ సాధన తదితరాల కోసం సం సమావేశాలు, ఒప్పందాలు వంటివి ఇక్కడ జరిగేవని వెల్లడించారు. ఇటీవల ఇదే ప్రాంతంలో అప్పటి బేకరీ, లాండ్రీ షాప్, రెండు విల్లాలను కనుగొన్నారు. అప్పట్లో మౌంట్ వెసూవియస్ అగ్నిపర్వత బద్ధలవ్వడంతో దాని బూడిద కింద పోంపెయ్‌తో పాటు హెర్క్యులేనియం నగరాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇప్పుడవన్నీ తవ్వకల్లో బయట పడుతున్నాయి. నాటి ప్రమాదంలో మరణించిన వ్యక్తుల ఎముకలు కూడా పురావస్తు శాస్త్రవేత్తలకు లభించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

శ్వేతసౌధంపై దాడి కేసు... హైదరాబాదీకి 8 ఏళ్ల జైలు

- వాహనంతో వైట్‌హౌస్‌కికి దూసుకెళ్లిన వర్షిత్
- బారికేడ్లను ఢీకొట్టి, నాజీ జెండా ఎగరేసిన వైనం



సాయి వర్షిత్

వాషింగ్టన్: వైట్‌హౌస్‌పై దాడికి యత్నించిన కేసులో సాయి వర్షిత్ కందుల (20) అనే హైదరాబాదీకి అమెరికాలో ఎనిమిదేళ్ల జైలు శిక్ష పడింది. అతను 2023 మే2 2న అద్దె ట్రక్కుతో వైట్‌హౌస్‌పై దాడి చేసి కలకలం రేపడం తెలిసిందే. అమెరికా ప్రభుత్వాన్ని కూలదోసి నాజీ భావజాలంతో కూడిన నియంతృత్వాన్ని తేవడమే లక్ష్యంగా దాడికి పాల్పడ్డట్టు అమెరికా న్యాయ శాఖ ఆరోపించింది. ''అమెరికాలో నాజీ జర్మనీ భావజాలంతో కూడిన నియంతృత్వం తేవడం, దానికి తాను అధిపతి కావడం వర్షిత్ కల. అందుకు అవసరమైతే అమెరికా అధ్యక్షుడిని కూడా హతమార్చేవాడిని విచారణలో అంగీకరించాడు. అతని చర్యల వల్ల 4,322 డాలర్ల మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది''అని పేర్కొంది. ''దాడికోసం ఆర్నెల్ల పాటు ప్లాన్ చేశాడు. సాయుధ వాహనాలు, పెద్ద ట్రక్ అద్దె కోసం అనేక కంపెనీలను సంప్రదించాడు''అని ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తెలిపారు.

డాలస్‌లో ట్రక్కు అద్దెకు తీసుకుని...

హైదరాబాద్‌లోని చందానగర్‌లో జన్మించిన సాయి అమెరికా గ్రీన్‌కార్డ్ హోల్డర్. 2023 మే 22న మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి బిజినెస్ క్లాస్ విమానంలో డాలస్ విమానాశ్రయం చేరుకున్నాడు. సాయంత్రం 6.30కు ట్రక్కు అద్దెకు తీసుకుని వాషింగ్టన్ డీసీ వెళ్లాడు. రాత్రి 9.35 సమయంలో వైట్‌హౌస్ వాయవ్య దిశలో హెచ్ స్ట్రీట్ దగ్గరున్న ప్రెసిడెంట్స్ పార్కుకు రక్షణ కల్పించే అడ్డంకులను ఢీకొట్టాడు. తర్వాత వాహనంతో ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లాడు. దాంతో పాదచారులు పరుగులు తీశారు. రివర్స్ తీసుకుని మెటల్ బారికేడ్లను మరోసారి ఢీకొట్టాడు. వాహనం దిగి నాజీ స్వస్తిక్ జెండాను ఎగరవేశాడు. సీక్రెట్ సర్వీస్ అధికారులు ఘటనా స్థలంలోనే వర్షిత్‌ను అరెస్టు చేశారు.

అరుదైన ఒలింపిక్ స్వర్ణానికి రూ.5 కోట్లు



బోస్టన్: అమెరికా గడ్డపై 1904లో జరిగిన తొలి ఒలింపిక్స్ నాటి బంగారు పతకం శుక్రవారం వేలంలో దాదాపు రూ.5 కోట్లు పలికింది! దానిపై 'ఒలింపియాడ్, 1904'అని రాసుంది. ముందువైపు విజేత పుష్పగుచ్ఛం పట్టుకొని ఉండగా వెనకవైపు పురాతన గ్రీస్‌లో విజయానికి అధిదేవత నైక్, దేవతల రాజు జ్యూస్ ఉన్నారు. దీన్ని అమెరికన్ అథ్లెట్ ఫ్రెడ్‌షూల్‌కు ప్రదానం చేశారు. ఆ ఒలింపిక్స్‌లో అమెరికన్లు 96 ఈవెంట్లలో ఏకంగా 78 స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నేటి ఒలింపిక్స్ వెండిపై బంగారు పూత పూసిన పతకాలిస్తున్నారు. అప్పట్లో మాత్రం అచ్చమైన బంగారంతో చేసిన పతకాలే ఇచ్చేవారు. ఇలాంటి పతకాలు వేలానికి రావడం అసాధారణమని వేలం సంస్థ ఆర్ఆర్ ఆక్షన్ పేర్కొంది. 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతకంతో పాటు 1932, 1964, 1998 2012 ఒలింపిక్స్ పతకాలతో సహా వందలాది ఒలింపిక్ వస్తువులు వేలంలో అమ్మకానికి వచ్చాయి. ఒలింపిక్ స్మృతి చిహ్నాలకు ఎప్పటినుంచో మంచి ధర లభిస్తోంది. 2028 ఒలింపిక్స్ లాస్ ఏంజెలెస్‌లో జరగనున్నాయి. ఈ నగరం ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనుండటం 1932, 1984 తరువాత ఇది మూడోసారి.

మొట్టమొదటి దేశీయ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ దేశీయంగా రూపొందించుకున్న మొట్టమొదటి పరిశీలక ఉపగ్రహం పీఆర్ఎస్‌సీ–ఈవో1ను శుక్రవారం చైనాలోని జియూక్వాన్ శాటిలైట్ లాంఛ్ కేంద్రం నుంచి ప్రయోగించింది. పాక్ ఉపగ్రహంతోపాటు మరో రెండు శాటిలైట్లను లాంగ్ మార్చ్–2డీ క్యారియర్ రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. సహజ వనరుల అన్వేషణ, విపత్తుల హెచ్చరికలు, పట్టణ ప్రణాళిక, వ్యవసాయాభివృద్ధికి ఇది ఎంతో సాయంగా ఉంటుందని పాకిస్తాన్ స్పేస్ ఏజెన్సీ తెలిపింది. ఎలక్ట్రో ఆప్టికల్ సెన్సార్లను వినియోగించుకుని డేటాను, చిత్రాలను సేకరించనుందని వివరించింది.

మహా కుంభమేళాలో మౌని అమావాస్య ఎఫెక్ట్ హోటళ్లు.. లాడ్జీల ధరలకు రెక్కలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక పండుగ మహాకుంభ మేళాకు జన జాతర కొనసాగుతోంది. ప్రధానమైన మౌని అమావాస్య (పుష్య బహుళ అమావాస్య) సందర్భంగా 29న జరిగే షాహీ స్నానానికి (రాజ స్నానం) సుమారు 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే మౌని అమావాస్య వేళ ప్రయాగ్‌రాజ్ వచ్చే భక్తుల జేబులకు మాత్రం చిల్లు పడనుంది. ప్రైవేట్ టెంట్లు, హోటళ్లు, లాడ్జీలు మౌని అమావాస్య రోజున మూడు రెట్ల వరకు ఛార్జీలను పెంచాయి. ఇప్పటి వరకు రూ.6–7 వేలు ఉన్న హోటల్ అద్దె, ఇప్పుడు రూ.22 వేలకు పైగా పెరిగింది. కాగా ప్రైవేట్ టెంట్‌లో ప్రస్తుతం రూ.15 వేలు ఉన్న అద్దె, మౌని అమావాస్య రోజుకైతే రూ.45 వేలకు చేరింది. అదే ప్రత్యేక లగ్జరీ కాటేజీలో మూడు రాత్రులు బస చేయడం కోసం రూ. 2.40 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మరోవైపు డోమ్ సిటీలో కనీస అద్దె రోజుకు రూ.35 వేలు కాగా, మౌని అమావాస్య రోజు కోసం డోమ్ సిటీలో రోజుకు రూ. 91 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగతా వస్తు సామాగ్రి ధరలను కూడా విపరీతంగా పెంచేశారు.

సాక్షి ప్లస్
శనివారం | 18-1-2025

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించిన కమిషన్?

రాష్ట్రాల ఏర్పాటు

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ ఫజల్ అలీ కమిషన్

భాషాప్రయుక్త ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ప్రస్తావనకు వచ్చింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ కమిషన్‌ను నియమించింది. కె.ఎం.ఫణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రు సభ్యులుగా ఉన్న ఈ కమిషన్‌కు ఫజల్ అలీ నేతృత్వం వహించారు. 1955 సెప్టెంబర్‌లో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును ఫజల్ అలీ కమిషన్ సమర్థించింది. కానీ ఒక భాష-ఒక రాష్ట్రం అనే డిమాండ్‌ను తిరస్కరించింది.

ఫజల్ అలీ కమిషన్ ప్రతిపాదనలు..

- రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణలో దేశ ఐక్యతను, రక్షణను బలోపేతం చేసేలా చర్యలు ఉండాలి.
- భాష, సాంస్కృతికపరమైన సజాతీయత ఉండాలి.
- ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- జాతీయాభివృద్ధితోపాటు రాష్ట్రాల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్-ఎ, పార్ట్-బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్‌వ్యవస్థీకరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ - పెద్ద మనుషుల ఒప్పందం

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1948లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర సంస్థను స్థాపించారు. తెలుగు మాట్లాడే వారందరినీ కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనేది విశాలాంధ్ర ప్రధాన నినాదం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో నిర్ణయాన్ని హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి వదిలిపెట్టారు. హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో విశాలాంధ్ర ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, 103 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. 1956 ఫిబ్రవరి 20న తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన 8 మంది నాయకుల మధ్య ఢిల్లీలో ఒక ఒప్పందం కుదిరింది. దీన్నే 'పెద్ద మనుషుల ఒప్పందం' అంటారు. ఈ ఒప్పందంపై బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, జె.వి.నరసింగరావు, మర్రి చెన్నారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ, నీలం సంజీవరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న సంతకాలు చేశారు.

1956 తర్వాత ఏర్పాటైన రాష్ట్రాలు

గుజరాత్ (1 మే, 1960): బొంబాయి రాష్ట్రాన్ని విడగొట్టి గుజరాత్‌ను 15వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. బొంబాయి రాష్ట్రం పేరును మహారాష్ట్రగా మార్చారు.

నాగాలాండ్ (1 డిసెంబర్, 1963): అస్సాం రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి నాగా కొండ ప్రాంతాలు, ట్యూన్‌సాంగ్ ప్రాంతాలతో నాగాలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇది 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

హర్యానా(1 నవంబర్, 1966): పంజాబ్‌ను పునర్‌వ్యవస్థీకరించి హిందీ మాట్లాడే ప్రాంతాన్ని హర్యానా రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. షా కమిషన్ సూచన మేరకు చండీగఢ్‌ను పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చేశారు. దీంతోపాటు చండీగఢ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించారు.

హిమాచల్ ప్రదేశ్ (25 జనవరి, 1971): పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతమైన హిమాచల్‌కు రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 18వ రాష్ట్రం.

మణిపూర్ (21 జనవరి, 1972): ఈశాన్య రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన మణిపూర్‌ను 19వ రాష్ట్రంగా మార్చారు.

త్రిపుర (21 జనవరి, 1972): కేంద్రపాలిత ప్రాంతమైన త్రిపురను 20వ రాష్ట్రంగా మార్చారు.

మేఘాలయ (21 జనవరి, 1972): అస్సాంలో ఉపరాష్ట్రంగా ఉన్న మేఘాలయను పూర్తి రాష్ట్రంగా మార్చారు. 1969లో మేఘాలయకు ఉపరాష్ట్ర హోదా కల్పించారు.

సిక్కిం (16 మే, 1975): 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 1947 వరకు సిక్కిం ఛోగ్యాల్ రాజవంశ పాలనలో ఉండేది. 1974లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు అసోసియేట్ రాష్ట్ర పతిపత్తి కల్పించారు. 10వ షెడ్యూల్‌లో నూతన ప్రకరణ 2ఎను చేర్చారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను సంపూర్ణ రాష్ట్రంగా గుర్తించారు. ఈ విధంగా సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పాటైంది. 1974లో



చేసిన 35వ రాజ్యాంగ సవరణను రద్దుచేశారు. ప్రకరణ 2ఎను, 10వ షెడ్యూల్‌లోని ప్రత్యేకతను తొలగించారు. ప్రకరణ 371ఎఫ్ ద్వారా సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక రక్షణ కల్పించారు.

మిజోరాం (20 ఫిబ్రవరి, 1987): కేంద్రపాలిత ప్రాంతమైన మిజోరాంకు 53వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 23వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987): 55వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన అరుణాచల్ ప్రదేశ్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదాను కల్పించారు. అరుణాచల్ ప్రదేశ్‌ను నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (ఎన్ఈఎఫ్ఏ) అని పిలిచేవారు.

గోవా (30 మే, 1987): 56వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన గోవాకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. 1961లో పోర్చుగీసువారు గోవాను భారతదేశానికి అప్పగించారు. గోవా, డయ్యూ, డామన్‌లను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం 1962లో 12వ రాజ్యాంగ సవరణ చేశారు.

ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000): మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి ఛత్తీస్‌గఢ్‌ను 26వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000): ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించారు. ఉత్తరాఖండ్ 27వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

జార్ఖండ్ (15 నవంబర్, 2000): బిహార్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి 28వ రాష్ట్రంగా జార్ఖండ్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్‌వ్యవస్థీకరించి 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

వివరణ: 1954లో ఫ్రెంచివారు పాండిచ్చేరిని భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా పాండిచ్చేరిలో 4 జిల్లాల(పాండిచ్చేరి, కరైకల్, మహే, యానాం)ను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు.

కేంద్రపాలిత ప్రాంతాలు- ఏర్పాట్లు

దాద్రానగర్ హవేలి: 1954 వరకు ఈ ప్రాంతం పోర్చుగీసు వారి ఆధీనంలో ఉండేది. 1961లో పదో రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు.

డామన్ - డయ్యూ: భారత ప్రభుత్వం 1961లో సైనిక చర్య ద్వారా ఈ ప్రాంతాలను పోర్చుగీసు వారి నుంచి స్వాధీనం చేసుకుంది. 12వ రాజ్యాంగ సవరణ ద్వారా 1962లో కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు. 1987లో గోవా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా కొనసాగించారు.

పాండిచ్చేరి: ఇది పుదుచ్చేరి, కరైకల్, మహే, యానాం అనే నాలుగు ప్రాంతాల కలయిక. 1964లో ఫ్రెంచివారు ఈ ప్రాంతాలను భారత్‌కు అప్పగించా రు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలకు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

చండీగఢ్: 1966లో పంజాబ్ పునర్‌వ్యవస్థీకరణ ద్వారా హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు - పాత పేర్లు - నూతన పేర్లు

సం.	పాత పేరు	కొత్తపేరు
1950	యునైటెడ్ ప్రావిన్స్	ఉత్తరప్రదేశ్
1956	ట్రావెన్‌కోర్	కొచ్చిన్ కేరళ
1959	మధ్యభారత్	మధ్యప్రదేశ్
1960	బొంబాయి	మహారాష్ట్ర
1968	మద్రాసు	తమిళనాడు
1973	మైసూరు	కర్ణాటక
1973	లక్కదీవి, మినికాయ్ అమిన్‌దీవి	లక్షదీవులు
2006	ఉత్తరాంచల్	ఉత్తరాఖండ్
2006	పాండిచ్చేరి	పుదుచ్చేరి
2007	అస్సాం	అసోం
2011	ఒరిస్సా	ఒడిశా
2011	పశ్చిమ బెంగాల్	పశ్చిమ బంగ

రాష్ట్రాలు - ప్రత్యేక హోదా

ప్రత్యేక హోదా - చరిత్ర: అయిదో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే పద్ధతిని 1969లో ప్రవేశపెట్టారు. మొదట్లో అస్సాం, నాగాలాండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక హోదా ఉండేది. తర్వాత అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా వర్తింపజేశారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రాతిపదిక: ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించేందుకు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అవి...

- పర్వత ప్రాంతాలు, రవాణాకు కష్టతరమైనవి
- తక్కువ జనసాంద్రత, అధిక గిరిజనులు ఉన్న ప్రాంతాలు
- సరైన మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాలు
- ఆర్థికంగా పటిష్టంగా లేని రాష్ట్రాలు
- విదేశాలతో సరిహద్దులు ఉండి, వ్యూహాత్మకంగా ప్రాధాన్యమున్న రాష్ట్రాలు.

ప్రత్యేక హోదాను నిర్ణయించేది: ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉన్న జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం(ప్రస్తుతం నీతి ఆయోగ్) సలహా మేరకు ప్రత్యేక హోదాపై నిర్ణయం తీసుకుంటారు. ప్రత్యేక హోదాకు నిధుల కేటాయింపులతో సంబంధం ఉండటం వల్ల కేంద్ర ఆర్థిక సంఘాన్ని కూడా సంప్రదించాలి.

ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రాంట్ల రూపంలో అందిస్తుంది.
- కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో 30 శాతం నిధులను తొలుత ఈ రాష్ట్రాలకు కేటాయిస్తారు. మిగతా వాటాను ఇతర రాష్ట్రాలకు ఇస్తారు.
- కేంద్ర ప్రభుత్వ పథకాల్లో 90 శాతం నిధులను గ్రాంట్ల రూపంలో, 10 శాతం నిధులను రుణంగా ఇస్తారు.
- పన్నుల్లో మినహాయింపు ఉంటుంది.
- రుణాలు చెల్లింపును వాయిదా వేయడం, పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తారు.

గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా

ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా ప్రకారం నిధులను కేటాయిస్తారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డి.ఆర్. గాడ్గిల్ 1969లో ఈ ప్రతిపాదన చేశారు. 1990లో ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ మరికొన్ని మార్పులు సూచించారు. అందుకే దీన్ని గాడ్గిల్-ముఖర్జీ ఫార్ములా అంటారు. దీనికి అనుగుణంగా జాతీయాభివృద్ధి మండలి నూతన పద్ధతిని నిర్ణయించింది. దీని ప్రకారం రాష్ట్రాలకు ఈ కింది అంశాల ఆధారంగా నిధులను కేటాయిస్తారు.

ప్రాతిపదిక	శాతం
జనాభా	60 శాతం
తలసరి ఆదాయం	25 శాతం
ఆర్థిక నిర్వహణ	7.5 శాతం
ప్రత్యేక సమస్యలు	7.5 శాతం
మొత్తం	100 శాతం

దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల కోసం జరుగుతున్న ఉద్యమాలు

అసోం	బోడోలాండ్, కర్బి, అంగ్లాంగ్
కర్ణాటక	కొడగు (కూర్గ్)
మహారాష్ట్ర	విదర్భ
గుజరాత్	సౌరాష్ట్ర
ఉత్తరప్రదేశ్	హరితప్రదేశ్, పశ్చిమ ప్రదేశ్, అవధ్ ప్రదేశ్, పూర్వాంచల్
మధ్యప్రదేశ్	వింధ్యప్రదేశ్, అవధ్
బిహార్, జార్ఖండ్	మిథిలాంచల్, కోసల్
కేరళ, కర్ణాటక సరిహద్దులో	తుళునాడు
పశ్చిమ బెంగాల్	గూర్ఖాలాండ్
ఒడిశా	కోసల్
జమ్మూ కశ్మీర్	లడక్
మేఘాలయ	గారోలాండ్
మణిపూర్	కుకీలాండ్

భారజల కర్మాగారం ఎక్కడ ఉంది?

రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రభుత్వ రంగ సంస్థలు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)

బీఈఎల్ మొదటి యూనిట్‌ను బెంగళూరులో 1954లో స్థాపించారు. ఇది రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. దీని 9వ యూనిట్‌ను 1986లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ రక్షణ శాఖకు అవసరమైన ఎలక్ట్రానిక్ అవసరాలను తీరుస్తోంది. దీనికి నవరత్న హోదా కల్పించారు.

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)

దేశంలో మొత్తం ఆరు బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో 1963లో బీహెచ్ఈఎల్‌ను స్థాపించారు. దేశంలోని అతిపెద్ద ఇంజినీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల్లో ఇదొకటి. ఇక్కడ టర్బైన్లు, జనరేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు తయారవుతాయి. ఇది థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. దీనికి మహారత్న హోదా ఉంది.

ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ (ఐడీపీఎల్)

ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అతిపెద్ద ఫార్మా రంగ సంస్థ. దీన్ని 1961లో ఢిల్లీలో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు ఐడీపీఎల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ యూనిట్‌ను 1967లో బాలానగర్‌లో స్థాపించారు. అత్యవసర, జీవనాధార మందుల తయారీలో స్వయం సమృద్ధి సాధనకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది.

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)

1967 ఏప్రిల్ 11న హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేశారు. ఇది అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థ చేపడుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల స్వయం సమృద్ధి సాధనలో కీలక పాత్ర పోషిస్తోంది.

దేశంలో తొలి డిజిటల్ కంప్యూటర్‌ను ఈసీఐఎల్ రూపొందించింది. దేశంలో తొలి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, మొదటి న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నియంత్రణ పరికర వ్యవస్థలను, టిలివిజన్లను ఈ సంస్థ రూపొందించింది.

ప్రాగా టూల్స్

దీన్ని 1959లో హైదరాబాద్‌లో స్థాపించారు. యంత్రాల విడి పరికరాలు, కట్టర్లు, టూల్స్, గ్రైండర్లు,



థ్రెడ్ రోలింగ్ మిషన్లు మొదలైన వాటిని ఇది రూపొందిస్తోంది.

హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్)

హెచ్‌సీఎల్‌ను రంగారెడ్డి జిల్లాలో, పశ్చిమ బెంగాల్‌లోని రూప్ నారాయణ్‌పూర్‌లో స్థాపించారు. ఇది భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పని చేస్తోంది. హెచ్‌సీఎల్‌లో టెలికాం కేబుల్స్‌ను తయారు చేస్తున్నారు.

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)

భారత్‌లో హెచ్ఏఎల్‌కు ఆరు యూనిట్లు ఉన్నాయి. 1965లో రంగారెడ్డి జిల్లాలో హెచ్ఏఎల్ యూనిట్‌ను ప్రారంభించారు. దీనికి నవరత్న హోదా కల్పించారు. ఇందులో విమానయాన యంత్ర భాగాలను ఉత్పత్తి చేస్తున్నారు.

రేడియో అల్టీమీటర్ తయారీలో హెచ్ఏఎల్ హైదరాబాద్ డివిజన్‌ది కీలకపాత్ర. ఇది కమ్యూనికేషన్, నావిగేషన్లలో రక్షణ శాఖకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ)

దీని దక్షిణ ప్రాంత మండల ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇది గ్రామీణ ప్రాంత విద్యుదీకరణకు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీనికి నవరత్న హోదా ఉంది.

హిందుస్తాన్ మెషిన్ టూల్స్ లిమిటెడ్ (హెచ్ఎంటీ)

దేశంలో ఆరు హెచ్ఎంటీ పరిశ్రమలున్నాయి. వాటిలో ఒకటి రంగారెడ్డి జిల్లాలో ఉంది. ఈ పరిశ్రమలో గడియారాలు, బల్బులు, లేత్, బోర్, మిల్లింగ్ యంత్రాలు తయారవుతాయి.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)

ఇది భారత ప్రభుత్వ పరిపాలన నియంత్రణ, రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. దీన్ని 1970లో ప్రారంభించారు. ఈ పరిశ్రమలో క్షిపణులను రూపొందిస్తారు. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్, మెదక్ జిల్లాలోని భానూర్‌లో దీని తయారీ కేంద్రాలున్నాయి.

మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్

దీన్ని 1973లో రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించారు. పారిశ్రామికీకరణ వేగవంతమయ్యేందుకు తోడ్పడే లోహాలు, మిశ్రమ లోహాలు ముఖ్యంగా టైటానియం లాంటి లోహాల తయారీలో కీలక పాత్ర పోషిస్తోంది.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్‌డీఎల్)

దీన్ని 1962లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. భారత రక్షణ వ్యవస్థను పటిష్టపర్చడంలో ఈ కంపెనీది కీలకపాత్ర. క్షిపణి వ్యవస్థ రూపకల్పన, క్షిపణుల తయారీ ప్రయోగాల్లో ఇది కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ఆకాశ్, నాగ్, పృథ్వీ, అగ్ని తదితర క్షిపణులు భారత సైన్యాన్ని పటిష్టం చేశాయి.

ఇక్రిశాట్

రాష్ట్రంలో ఏర్పాటైన ఏకైక అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఇక్రిశాట్. దీన్ని 1972లో ఉమ్మడి మెదక్ జిల్లా పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేశారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో అర్ధశుష్క వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరిగే వంగడాలకు రూపకల్పన చేస్తోంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణనిస్తోంది. మెట్ట ప్రాంత వ్యవసాయ సాగుపై పరిశోధనలు చేస్తోంది. ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెమీ ఎరిడ్ ట్రోపిక్స్‌కు సంక్షిప్త రూపమే ఇక్రిశాట్.

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)

అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో మౌలాలీలో 1971లో దీన్ని ఏర్పాటు చేశారు. న్యూక్లియర్ ఫ్యూయల్ బండిల్స్, రియాక్టర్ కోర్ పదార్థాలను ఇది తయారు చేస్తోంది. యురేనియం ఇంధనం, జిర్కోనియం మిశ్రమ లోహ క్లాడింగ్స్‌ను రూపొందించింది.

భార జల కేంద్రం (హెవీ వాటర్ ప్లాంట్)

ఈ కేంద్రాన్ని ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఏర్పాటు చేశారు. దీనిలో డ్యూటీరియం ఆక్సైడ్ (D_2O) తయారు చేస్తున్నారు. అణు రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని స్థిరీకరించేందుకు భారజలాన్ని వాడతారు.

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)

ఇది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ప్రపంచస్థాయి ఆయుధాల తయారీలో, స్వదేశీ పరిజ్ఞానం ద్వారా సైన్యానికి కావాల్సిన ఆయుధ సంపత్తిలో స్వయం సమృద్ధి సాధనకు సాంకేతిక సహాయాన్ని అందిస్తోంది.

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ)

కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1958లో ఎన్ఎండీసీని ఏర్పాటు చేశారు. ముడి ఇనుము, రాగి, డోలమైట్, టంగ్‌స్టన్ తదితర ఖనిజాలను వెలికితీయడానికి, ముడి ఖనిజాలను వేరు చేయడానికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఈ సంస్థ అందిస్తోంది. ఖనిజ వనరులపై పరిశోధనా కార్యక్రమాలను చేపడుతోంది.

నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ

సికింద్రాబాద్‌లోని హకీంపేటలో ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలకు సెక్యూరిటీ నిర్వహణ, విపత్తు నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)

దీన్ని 1970లో సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురిలో ఏర్పాటు చేశారు. భద్రతా దళాలు, సైన్యంలో మేనేజ్‌మెంట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలను పెంచడం కోసం ఇది కృషి చేస్తోంది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌కు మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణనిచ్చే ఆసియాలోని ఏకైక సంస్థ ఇది.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

మెదక్ జిల్లాలోని ఎద్దుమైలారంలో 1987లో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ యుద్ధ ట్యాంకు(ఐసీవీ)లను తయారు చేస్తున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. భారజల కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) పటాన్‌చెరు 2) మణుగూరు
   3) రామగుండం 4) హైదరాబాద్
2. అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్) ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) మెదక్ 4) నల్లగొండ
3. తెలంగాణలో ఒక పరిశ్రమను మెగా పరిశ్రమగా గుర్తించాలంటే కనీసం ఎంత పెట్టుబడి పెట్టాలి?
   1) రూ. 250 కోట్లు 2) రూ. 200 కోట్లు
   3) రూ. 300 కోట్లు 4) రూ. 150 కోట్లు
4. ఇచ్చిన వాటిలో మహారత్న హోదా పొందిన సంస్థ?
   1) బీఈఎల్ 2) ఈసీఐఎల్
   3) ఐడీపీఎల్ 4) బీహెచ్ఈఎల్
5. ముల్కనూర్ మహిళా సహకార డైరీ ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) ఆదిలాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
6. ఇచ్చిన వాటిలో రక్షణ శాఖకు సంబంధించిన వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థ?
   1) బీడీఎల్ 2) ఈసీఐఎల్
   3) హెచ్ఏఎల్ 4) హెచ్‌సీఎల్
7. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఎక్కడ ఉంది?
   1) మణుగూరు 2) పాల్వంచ
   3) రామచంద్రాపురం 4) మౌలాలీ
8. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఎక్కడ ఉంది?
   1) రామగుండం 2) రామచంద్రాపురం
   3) గచ్చిబౌలి 4) కొత్తగూడెం
9. నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సంవత్సరం?
   1) 1970 2) 1963
   3) 1958 4) 1967
10. టెలివిజన్లను ఉత్పత్తి చేసే సంస్థ ఏది?
    1) ఎన్ఎఫ్‌సీ 2) బీడీఎల్
    3) ఈసీఐఎల్ 4) హెచ్‌సీఎల్

సమాధానాలు
1) 2; 2) 3; 3) 2; 4) 4; 5) 3; 6) 1; 7) 4; 8) 2; 9) 3; 10) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ చెన్నైలో 83 అప్రెంటిస్‌లు

చెన్నైలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. గ్రాడ్యుయేట్, డిప్లొమా, బీకాం అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 83.

పోస్టుల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-63, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్-10, బీకాం అప్రెంటిస్-10.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. దక్షిణ ప్రాంతీయ రాష్ట్రాలు(తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి)కు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు.

వయసు: 25 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.17,500, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,500, బీకాం అప్రెంటిస్‌లకు రూ.12,500.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, సీజీపీఏ స్కోరు ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఇంటర్వ్యూ తేదీలు: 20.01.2025, 21.01.2025, 22.01.2025.

ఇంటర్వ్యూ వేదిక: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), నందంబాక్కం, చెన్నై-600 089.

వెబ్‌సైట్: https://bel-india.in

యూసీఎస్ఎల్‌లో అప్రెంటిస్ ఖాళీలు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్).. పలు విభాగాల్లో గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులను కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 07

అప్రెంటిస్ వివరాలు: గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ (డిప్లొమా).

విభాగాలు: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్

అర్హతలు: ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు: 30.01.2025 నాటికి 18 ఏళ్లు ఉండాలి

వేతనం: నెలకు గ్రాడ్యుయేట్ పోస్టులకు రూ.12,000, టెక్నీషియన్ (డిప్లొమా) పోస్టులకు రూ.10,200

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, విద్యార్హతల ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తులకు చివరి తేదీ: 30.01.2025

వెబ్‌సైట్: ats.education.gov.in.

భారత బ్యాంకింగ్ వ్యవస్థకు అధిపతి.. ఆర్‌బీఐ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

బ్యాంకింగ్ రంగం

ఖాతాదారుల నుంచి డబ్బు స్వీకరించి భద్రపరచడం, వారికి అవసరానికి డబ్బు ఇవ్వడం, స్వీకరించిన ధరావతులకు కాలానుగుణంగా వడ్డీలు చెల్లించడం, అప్పులు ఇవ్వడం (వారి స్తోమతను బట్టి), తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించడం లేదా వసూలు చేయడం తదితర ద్రవ్య సంబంధ కార్యకలాపాలను నిర్వహించే వ్యవస్థను బ్యాంకింగ్ రంగంగా నిర్వచిస్తాం. బ్యాంకింగ్ వ్యవహారాలు నిర్వర్తించే సంస్థనే బ్యాంకుగా గుర్తిస్తాం. చెక్కులు, డ్రాఫ్టులు, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు లేదా ఒక స్థలం నుంచి మరో స్థలానికి ద్రవ్య బదలాయింపులు నిర్వహించడం ద్వారా ఇంకా మరెన్నో ద్రవ్య లావాదేవీలకు బ్యాంకులు ఆలవాలంగా ఉంటాయి. ద్రవ్య సేవల పరిశ్రమగా బ్యాంకును పేర్కొనవచ్చు. బ్యాంకులు లేనికాలంలో సామాన్యుడి నగదు లావాదేవీలు, రుణ అవసరాలను స్థానిక వడ్డీ వ్యాపారులు తీరుస్తుండేవారు. భారతదేశంలో మొదటి బ్యాంకును 1786లో 'ది జనరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' పేరుతో నెలకొల్పారు. ఈస్ట్ ఇండియా కంపెనీ 1809లో 'ది బ్యాంక్ ఆఫ్ బెంగాల్'ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఎన్నో ప్రెసిడెన్సీ బ్యాంకులు ఆవిర్భవించాయి. వీటన్నింటినీ బ్రిటిషర్లే నిర్వహించేవారు. స్వాతంత్ర్యానంతరం 1949లో భారత ప్రభుత్వం బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1965లో ఈ చట్టాన్ని సవరించింది. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు మొదటగా జాతీయ స్ఫూర్తితో 1953లో మొదలయ్యాయి. బ్రిటిష్ వారసత్వంగా వచ్చిన ఇంపీరియల్ బ్యాంక్‌ను.. 'భారతీయ స్టేట్ బ్యాంక్'గా మార్చి జాతీయం చేశారు. ఇందిరా గాంధీ హయాంలో 14 ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులను 1969 జూలై 19న జాతీయం చేశారు.

1980వ దశకం తర్వాత దశల వారీగా ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాల్సిన ఆవశ్యకత ఉందనే, ప్రభుత్వం తన పరిధిని తగ్గించుకోవడం అవసరం అనే ప్రతిపాదనలు వచ్చాయి. నరసింహన్ కమిటీ సిఫారసుల మేరకు 1993లో సవరించిన బ్యాంకుల క్రమబద్ధీకరణ చట్టం అమలైంది. ఈ చట్టం ద్వారా మరిన్ని ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులకు, పెట్టుబడులకు ద్వారాలు తెరిచినట్లైంది. ఈ దశను బ్యాంకింగ్ రంగంలో మూడో స్థాయి సంస్కరణగా చెప్పవచ్చు. ఇది విస్తృత స్థాయి స్థూల ఆర్థిక సరళీకరణ సంస్కరణల్లో భాగంగా గమనించవచ్చు. అంటే.. అన్ని రంగాలకు వర్తిస్తూ 1991-92ల్లో జరిగిన సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే బ్యాంకింగ్ సంస్కరణలను అర్థం చేసుకోవాలి. ఈ దశలోనే బ్యాంకింగ్ రంగం సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకుంది. బ్యాంకింగ్ రంగాన్ని కంప్యూటర్లతో అనుసంధానిస్తూ ఆన్‌లైన్ నగదు బదిలీలను, ప్లాస్టిక్ మనీ (క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు)ని ప్రవేశపెట్టారు.



ప్రస్తుతం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ నిర్మాణాన్ని కింది విధంగా పేర్కొనవచ్చు.

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
2. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు
ఇందులో పబ్లిక్ రంగ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఉంటాయి. పబ్లిక్ రంగ బ్యాంకుల్లో ఎస్‌బీఐ, దాని అనుబంధ బ్యాంకులు, ఇతర జాతీయ బ్యాంకులు ఉంటాయి.
3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్‌ఆర్‌బీలు)
4. విదేశీ బ్యాంకులు
5. షెడ్యూల్డ్ సహకార బ్యాంకులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంకింగ్ వ్యవస్థకు అధిపతి కేంద్ర బ్యాంకు. భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) మన కేంద్ర బ్యాంకు. 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం ద్వారా 1935 ఏప్రిల్ 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మొట్టమొదట ఇది వాటాదారుల బ్యాంకుగా రూ. 5 కోట్ల మూలధనంతో ఏర్పాటైంది. 1949 జనవరి 1న ఆర్‌బీఐని జాతీయం చేశారు. ఆర్‌బీఐకి గవర్నర్, నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. వీరితో పాటు ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఒక ప్రభుత్వ ప్రతినిధి, ప్రభుత్వంతో ప్రతిపాదితమైన వివిధ రంగాలను ప్రతిబింబించే పది మంది ప్రతినిధులు, స్థానిక బోర్డులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన డైరెక్టర్లు కలిసి సమగ్ర నిర్వహణ బాధ్యత పర్యవేక్షిస్తారు. ఈ స్థానిక బోర్డులు ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీ, చెన్నై ప్రధాన కేంద్రాలుగా పనిచేస్తాయి. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్.

ఆర్‌బీఐ లక్ష్యాలు- విధులు

కరెన్సీని క్రమబద్ధం చేయడం, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం, పటిష్ఠమైన ద్రవ్య విధానాన్ని అమలు పరుస్తూ పరపతి నియంత్రణ చేయడం, దేశంలోని వాణిజ్య బ్యాంకులకు మార్గదర్శిగా వ్యవహరించడం, దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యాలు. దీంతోపాటు కరెన్సీ నోట్ల జారీ గుత్తాధిపత్యం కూడా ఆర్‌బీఐదే. ఇది 2, 5, 10, 20, 50, 100, 500, 1000 రూపాయల కరెన్సీ నోట్లను జారీచేస్తుంది. ఒక రూపాయి నోట్లను మాత్రం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది.

అలాగే రిజర్వ్‌బ్యాంక్ కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకరుగా, ప్రతినిధిగా, సలహాదారుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వానికి బ్యాంకింగ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ద్రవ్య విధానాన్ని రూపొందించడం, ప్రభుత్వానికి సలహా ఇవ్వడమే కాకుండా అమలుపరిచే బాధ్యతను ఆర్‌బీఐ నిర్వహిస్తుంది. దీంతోపాటు బ్యాంకులకు బ్యాంకుగా వ్యవహరిస్తుంది అంటే.. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలను నియంత్రిస్తుంది, పర్యవేక్షిస్తుంది. వాణిజ్య బ్యాంకుల అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది. విదేశీ మారకంగా ఉపయోగించే బంగారం నిల్వలను, విదేశీ మారక ద్రవ్య నిల్వలను కూడా ఆర్‌బీఐ పరిరక్షిస్తుంది. వీటితోపాటు బ్యాంకింగ్ వ్యవస్థను అభివృద్ధి పరచడం, వ్యవసాయ పరపతిని ప్రోత్సహించడం, పారిశ్రామికాభివృద్ధికి పరపతిని అందించడం లాంటి అభివృద్ధిపరమైన విధులను కూడా భారతీయ రిజర్వ్‌బ్యాంక్ నిర్వహిస్తుంది.

షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు

వాణిజ్య బ్యాంకులు.. షెడ్యూల్‌లో ఉన్నవి, షెడ్యూల్డ్ కానివి అని రెండు రకాలు. రిజర్వు బ్యాంకు 1934వ చట్టంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు. ప్రైవేట్, పబ్లిక్ సెక్టారు బ్యాంకులు, విదేశీ బ్యాంకులు.. అన్నీ షెడ్యూల్డ్ బ్యాంకులుగానే పరిగణిస్తారు. కానీ సహకార బ్యాంకులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. సహకార బ్యాంకులు షెడ్యూల్డ్ బ్యాంకులు కావు. షెడ్యూల్‌లో లేని బ్యాంకులన్నీ షెడ్యూల్డేతర వాణిజ్య బ్యాంకులు.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (రీజినల్ రూరల్ బ్యాంక్స్) 1970లో స్థాపించారు. ఇవి వాణిజ్య బ్యాంకులు నిర్వహించే విధులన్నింటినీ నిర్వహిస్తాయి. వీటి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నీ భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. ప్రస్తుతం విలీన ప్రక్రియలో భాగంగా 25 గ్రామీణ బ్యాంకులను పదింటికి కుదించారు. మొత్తం దేశంలో ప్రస్తుతం 56 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

విదేశీ బ్యాంకులు

భారతదేశంలో విదేశీ బ్యాంకులు కొత్తగా వచ్చినవి కావు. బ్రిటిషర్ల పాలనకాలంలోనే విదేశీ బ్యాంకుల పరంపర ప్రారంభమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశీ బ్యాంకుల కార్యకలాపాలు తగ్గించారు. 1950లలో విదేశీ బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా వాటి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టం పరిధిలో పని చేస్తున్న విదేశీ బ్యాంకులకు స్వతహాగా తమ కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛను మన ప్రభుత్వం కల్పించలేదు. తర్వాత కాలంలో ప్రభుత్వం సరళీకరణ ప్రక్రియను చేపట్టి విదేశీ మారక క్రమబద్ధీకరణ చట్టాన్ని విదేశీ మారక నిర్వహణ చట్టంగా మార్చింది (ఫెరా చట్టం ఫెమాగా మారింది). ఆ చట్టంలో విదేశీ బ్యాంకులకు వెసులుబాటు కల్పించారు.

షెడ్యూల్డేతర బ్యాంకులు

1934లోని బ్యాంకింగ్ చట్టంలో రెండో షెడ్యూల్‌లో ప్రస్తావించని బ్యాంకులను షెడ్యూలేతర బ్యాంకులు అంటారు. వీటి ప్రాముఖ్యం అంతగా లేదు. అయితే షెడ్యూల్‌లో లేని బ్యాంకులు ప్రైవేట్ బ్యాంకులై కొన్ని లాభాపేక్ష కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయిలో వీటికి పెద్దగా ప్రాధాన్యం లేదు. ఇవి స్థానిక వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైనట్లుగా భావించవచ్చు.

సహకార బ్యాంకులు

ప్రభుత్వ ప్రోత్సాహంతో, కొంతభాగం మూలధన పెట్టుబడి చేకూర్చడంతో ఈ సహకార బ్యాంకులను స్థాపించారు. ఇవి లాభాపేక్ష లేకుండా సహకార సూత్రంపై ఆధారపడి పనిచేస్తాయి. సహకార బ్యాంకుల నిర్మాణం నాలుగు స్థాయిల్లో ఉంటుంది. కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా సహకార బ్యాంకులు విధులు నిర్వహిస్తాయి. జిల్లా సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోని గ్రామ ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తాయి.

బ్యాంకింగ్ రంగంలో ఉపయోగించే పదాలు..

ద్రవ్య విధానం, బ్యాంకింగ్ రంగంలో తరచూ ఉపయోగించే కొన్ని సాంకేతిక పారిభాషిక పదాల గురించి తెలుసుకుందాం..

బ్యాంకు రేటు

రిజర్వ్ బ్యాంకు ఇతర బ్యాంకులకు రుణ సదుపాయం కోసం ఏర్పరిచే కనీస వడ్డీ రేటు. నగదు నిల్వల నిష్పత్తి (క్యాష్ రిజర్వ్ రేషియో)బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నిర్దిష్ట నిధుల మొత్తం. ఆర్‌బీఐ సీఆర్‌ఆర్‌ను పెంచితే బ్యాంకుల వద్ద ఉండే ద్రవ్యం తగ్గిపోతుంది. షెడ్యూల్డ్ బ్యాంకులు కొంత నిర్దిష్ట ద్రవ్యాన్ని తప్పనిసరిగా ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీన్నే సీఆర్‌ఆర్ అంటారు. సీఆర్‌ఆర్, వడ్డీ రేట్లు మార్కెట్‌లో చలామణిలో ఉన్న ద్రవ్య ప్రవాహ వేగానికి అడ్డుకట్ట వేయడానికి లేదా గతిశీలత పెంచడానికి ఉపయోగపడతాయి.

స్టాట్యూటరీ లిక్విడిటీ రేషియో (ఎస్‌ఎల్‌ఆర్)

వాణిజ్య బ్యాంకులు తమ రోజూవారీ వ్యాపారంలో కాలానుగత రుణాలు, బంగారం, ధరావతులు లేదా సెక్యూరిటీస్.. అన్నీ ద్రవ్యత్వ సంపత్తిగా అంటే లిక్విడ్ అసెట్స్‌గా కలిగి ఉంటాయి. బిజినెస్ డే ముగిసే సరికి ప్రతి బ్యాంక్.. దాని రోజు వారీ నికర డిమాండ్, రుణాలు ద్రవ్యత్వ సంపత్తికి కనీస అనుపాతంలో ఉండేలా చూసుకోవాలి. ఈ కనీస అనుపాత రాశినే చట్టపర ద్రవ్యత్వ రాశి నిష్పత్తి (ఎస్‌ఎల్‌ఆర్)గా నిర్వచిస్తారు.

రెపో రేటు


వాణిజ్య బ్యాంకులకు ధరావతుల (సెక్యూరిటీస్) ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ స్వల్పకాలిక అప్పుగా ఇచ్చే మొత్తంపై వసూలు చేసే వడ్డీ రేటును రెపో రేటు అంటారు. ఇది ఆర్‌బీఐ సూచనల ప్రకారం మారుతూ ఉంటుంది.

రివర్స్ రెపో రేటు

వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకొనే అప్పుపై ఆర్‌బీఐ చెల్లించే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటు అంటారు. వ్యవస్థలో అధిక ద్రవ్యం ఉన్నప్పుడు ఆర్‌బీఐ రివర్స్ రెపో రేటును పెంచి బ్యాంకులు తమ అనుత్పాదక ద్రవ్యాన్ని ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేసేలా చేస్తుంది.

Number of messages used per person?

MODEL QUESTIONS



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be ______ it must be planned ______.
   1) affected…thoroughly
   2) affective…periodically
   3) executed…properly
   4) effective…systematically
   5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb ______.
   1) charged…blasts
   2) levied…plants
   3) claimed…attacks
   4) withdraw…pits
   5) involved…calls
13. She is very ______ to other people's feelings.
   1) sensible 2) sensibility
   3) sensation 4) sensitive
   5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
   1) pampering…appealing
   2) negligence…destruction
   3) attention…defeating
   4) care…appease
   5) love…developing
15. Market researches often segment the population on the ______ of age and ______ class.
   1) grade…economy
   2) rate…affluent
   3) unit…security
   4) track…wealthy
   5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.

B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.

C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."

D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.

E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.

F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are <u>concrete</u> seeking new ways of expanding our membership.
   1) evidence 2) fastly
   3) purposely 4) currently
   5) no correction required
22. Rumours that he <u>have flown</u> from the country were promptly scotched by his wife.
   1) had to flow 2) had been flew
   3) had fled
   4) had been flowing
   5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel <u>reservation</u> in the world.
   1) reserves 2) reserved
   3) reserve 4) reserving
   5) no correction required
24. Even <u>among the native</u> users of English, plain and direct language is regarded as a virtue in communication.
   1) between a native
   2) between an native
   3) among a native
   4) among nativity
   5) no correction required
25. Professional person at the work place frequently <u>dealing in material</u> which he must understand and also remember for future use.
   1) dealt with material
   2) deal in material
   3) deals with materials
   4) deal among materials
   5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon**. In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
   1) Philippines 2) Japan
   3) Australia 4) China
   5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
   1) more than the annual average SMS volume of countries in Europe, and even China
   2) more than the annual average SMS volume of countries in India, and even China
   3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
   4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
   5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
   1) emergency services
   2) fire services 3) mobile billing
   4) 108 services 5) counseling
29. Average number of messages used per person
   1) 10-12 messages a day
   2) 400 million text messages a day
   3) 100 text messages
   4) 500 messages
   5) 2000 messages per day
30. Lexicon means
   1) glossary 2) glossy
   3) lustrous 4) inventory
   5) catalog

Key

1) 4	2) 3	3) 2	4) 4
5) 4	6) 5	7) 2	8) 1
9) 1	10) 3	11) 4	12) 3
13) 4	14) 3	15) 5	16) 5
17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 3	23) 1	24) 5
25) 3	26) 2	27) 1	28) 3
29) 1	30) 1		